ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 4 సంచిక - 5 ఫిబ్రవరి 2023 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20



సాహితీస్రవంతి



ఫొటో - జామీ మాక్ ఆర్థర్ (యుకె)

## జీవన నైపుణ్యం



నిర్మాణ కార్మికుడు

ఫొటో - టి.వి. రమణ

సాహిత్య ప్రస్థానం
ఫిబ్రవరి 2023
సంపుటి : 4 సంచిక : 5

# ఈ దాడిని నిలువరించాలి!

'భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి, సమాచార స్వాతంత్ర్యంపై వేటు ఎప్పుడూ అనుమతించరానివి. 2021 ఐటి చట్టం సవరణ ముసాయిదాలో అంశాలు అందుకే ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రతిపక్షాలూ, మీడియా సంస్థలూ, పత్రికా యాజమాన్యాలు ఒక్క గొంతుతో సమాచార స్వాతంత్ర్యం మెడపై కత్తి లాంటి ఈ సవరణలను ఉపసంహరించుకోవాలని కోరుతున్నాయి. ఎడిటర్స్ గిల్డ్, న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అసోసియేషన్ (ఎన్‌బిడిఎ), ఇండియన్ న్యూస్ పేపర్స్ సొసైటీ, అనేక జర్నలిస్టుల సంఘాలు ఈ మేరకు ప్రకటనలు చేశాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) కాదన్న కంటెంటును తీసేసే అధికారం ఇవ్వవద్దంటున్నాయి. ఒత్తిడి, విమర్శలు పెరిగాక కేంద్ర ప్రభుత్వ ఐటి శాఖామంత్రి రాజీవ్ చంద్రశేఖర్ కొన్ని సన్నాయి నొక్కులతో కొన్ని వివరణలు ఇచ్చారు. ఈ విషయమై విడుదల చేసిన నిబంధనలు ఫిబ్రవరిలో సంబంధిత సంస్థలతో (స్టేక్‌హోల్డర్స్) చర్చలు జరిపిన తర్వాతే అమలులోకి తెస్తామన్నారు. కేవలం కేంద్ర ప్రభుత్వ విధానాలకు సంబంధించి ఆయా శాఖలతో నిర్ధారించుకున్నాకే తొలగించడం జరుగుతుందని వివరించారు,

ఈ సన్నాయి నొక్కులు ఎలా వున్నా దేశంలో ప్రస్తుత పరిస్థితి, ఆచరణను బట్టి చూస్తే నిస్సందేహంగా ప్రభుత్వం మరోసారి సోషల్ మీడియా పీక నొక్కడానికి సమాయత్తమవుతున్నదనేది స్పష్టం. కనీస పరిశీలన (స్క్రూటనీ) కూడా లేకుండా పిఐబి చెప్పిందే అమలు చేయాలనడం పీకనొక్కడమే! ప్రభుత్వంపై ఏ విధమైన విమర్శ వచ్చినా ఏదో ఒక పేరుతో అణచివేయవచ్చు. డిజిటల్ సంస్థలూ, ఇంటర్మీడియరీలు సర్కారు వత్తిడికి గురై తలవంచే పరిస్థితి దాపురిస్తుంది. అసలు ఇంత పెద్ద పరిణామం జరిగినా దేశంలో పత్రికలు, ఛానళ్లలో పెద్ద చర్చ లేకపోవడమే అందుకో నిదర్శనం.

బడా మీడియా మోడీకి లోబడిపోయిన నేపథ్యంలో సోషల్ మీడియానే ప్రత్యామ్నాయంగా వుంది. దాంట్లో అనేక అవాస్తవాలు అవాంఛనీయ ధోరణులు నిజమైనా అనేక వాస్తవాలు కూడా వెలుగుచూస్తున్నాయి. సోషల్ మీడియాలో పౌర చొరవకూ పాత్రికేయుల స్వతంత్ర పాత్రకూ చోటుంటొంది. తప్పొప్పులు సరిచేయాలంటే మీడియా సోషల్ మీడియాలో స్వీయ నియంత్రణా వ్యవస్థ ఏర్పాటు కావాలి గాని అధికార వర్గాలకు నిషేధాధికారాలు ఇవ్వడం అనర్థదాయకం. ఎమర్జన్సీలో విధించిన సెన్సార్‌ను మించిన స్వీయ సెన్సారింగ్ మీడియాలో సత్యాలను తొక్కిపడుతున్నదని ఇటీవల సాయినాథ్ వంటివారు హెచ్చరించారు. సుప్రీం కోర్టు అంతకుముందే హెచ్చరించింది. మోడీపై బిబిసి డాక్యుమెంటరీని అడ్డుకున్న తీరు మన కళ్లెదుటే చూస్తున్నాం. ఈ కొత్త నిబంధనలు రాజ్యాంగం 19(1)(ఎ) అధికరణంలోని ప్రాథమిక హక్కులకూ భావ ప్రకటనా స్వేచ్ఛకూ కూడా ముప్పు తెస్తాయి. అందుకే ప్రజాస్వామ్య ప్రియులెవరైనా ఇందుకు వ్యతిరేకంగా ఎలుగెత్తి పోరాడాలి. ■

ప్రధాన సంపాదకుడు
తెలకపల్లి రవి
వర్కింగ్ ఎడిటర్
సత్యాజీ

సంపాదకవర్గం
కె.సత్యరంజన్ ◆ కెంగార మోహన్ ◆ వొరప్రసాద్
◆ చీకటి దివాకర్ ◆ గనారా ◆ కుమార స్వామి
మేనేజర్ : కె.లక్ష్మయ్య

బొమ్మలు
తుంబలి శివాజి
చిదంబరం

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## కథలు


నీటి బరువు : పద్మావతి రాంభక్త ......... 5
పగిలిన కలశం : పుప్పాల కృష్ణమూర్తి .......18
అభయారణ్యం : గన్నవరపు నరసింహమూర్తి 33
పిచ్చి ముదిరింది! : బిబిటి తేజశ్విని ............ 40
కిట్టీ పార్టీ : అను : డా.వెన్నా వల్లభరావు 44


## కవితలు


నాతో నేను : ఈతకోట సుబ్బారావు ....... 9
ఫీనిక్స్ : సత్య భాస్కర్ ............... 12
పూల బతుకులు : దిలీప్.వి ..................... 13
దిక్సూచి : శాంతయోగి యోగానంద .. 14
కొన్ని పరిమళాలు : గవిడి శ్రీనివాస్ ........... 14
కలలో అమ్మ : పలమనేరు బాలాజీ ........... 17
దు:ఖపు మజిలీ : ఏటూరి నాగేంద్రరావు ......... 17
చెట్టు కళేబరం : చందులూరి నారాయణ రావు 21
అన్నపు నెలవంక : మహమూద్ ................ 21
మాట్లాడే మిత్రులు : కోటం చంద్రశేఖర్ ............ 23
'తెర'శాల : డా.కాళ్లకూరి శైలజ ....... 24
ఊరి గేటు : మేకల స్వప్న ............... 24
ఆకుజెండా కింద ... : సిరికి స్వామినాయుడు .... 32
రుబాయిలు : బి.గోవర్ధన రావు .......... 32
పచ్చకళ్ళ జోడు : మందరపు హైమవతి .... 36
తప్పిపోయిన గంగమ్మ : అడిగోపుల వెంకటరత్నం ... 52
నిప్పుల పద్యం : లక్ష్మి కందిమళ్ల ............ 55
నిరంతర : డాక్టర్ ఎన్.గోపి ........... 55
చరిత్ర సాక్షిగా ... : డా. పెరుగు రామకృష్ణ ..... 59
మనిషిగా మిగిలిపోతాను : భైరవ స్వర్ణకుమార్ .......... 59
వికాసం : గిరిప్రసాద్ చెలమల్లు .......... 63


## వ్యాసాలు


సమాజ మార్పే మార్క్సిస్టు సాహిత్య లక్ష్యం
– ఉషా ఎస్ డానీ .................. 10
పరిశోధకుల దృష్టిలో మన వేమన
– భమిడిపాటి గౌరీశంకర్ ........ 15
వస్తు బలమే కథా విజయం
– విహారి.............................. 22
తెలుగు కథ : శిల్ప ప్రయోగాలు – ప్రత్యేకతలు
– డా. విఆర్ రాసాని ............... 25
వశిష్ఠ రాసిన విశిష్ట కవిత్వం
– ఎ.రాజా హుస్సేన్ ................. 30
సాహితీ ప్రజ్ఞ ................................................. 37
రెప్ప వాల్చనీయని కవిత్వం
– పేపకాయల ప్రసాద్ .............. 38
ముఖాముఖి : పాట అప్పుడు రాగ ప్రాధాన్యం.. ఇప్పుడు తాళ ప్రాధాన్యం
– భువన చంద్ర .................... 41
మంత్రనగరి విచిత్రాలు .. కేరాఫ్ బావర్చి కథలు
– రోహిణి వంజారి ................. 48
వర్తమానం : 'ఫేక్' ఉత్తర్వులతో సోషల్ మీడియాపై కత్తి
– తెలకపల్లి రవి ...................... 50
జానపద గేయాల వర్తమానం .. విశ్లేషించిన పరిశోధన
– తిరునగరి శ్రీనివాస్ ........... 53
తాత్విక దార్శనికుడు పాలగుమ్మి పద్మరాజు
– గొల్లపల్లి వనజ .................. 56
నివాళి : ఆత్మగౌరవం ... ఆమెకు ఆభరణం .......... 60
సంజీవనీ లిపి ... వర్ణలిపి
– డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య 61
డైరీ ............................................................ 64



ISSN No: 2581 - 7477


**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**


:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



# నీటి బరువు

- పద్మావతి రాంభక్త
99663 07777

**క**ట్టుకున్న కొత్తింట్లో గఅహప్రవేశం ధూమ్‌ధామ్‌గా జరిగింది. ఇల్లంతా ఆయన టేస్ట్‌కి తగ్గట్టు దగ్గరుండి కట్టించు కున్నారు. వచ్చిన అతిధులందరికీ తన వెంట తీసుకెళ్ళి ప్రతి గది గర్వంగా చూపిస్తున్నారు. నేను ఆయనను కాస్త నీరసంగానే అనుసరిస్తున్నాను.

"అతిథులందరికీ మనం దగ్గరుండి ఇల్లు చూపించాలి విజయా. నీకు ఇంట్రెస్ట్ లేకపోయినా వచ్చినవారికి ఉంటుంది కదా. అలా ఏమీ పట్టనట్టు ఉండిపోకు. నాతో పాటు భార్యగా నువ్వు కూడా అంతటా ఉండాలి అర్థమైందా"

అది హుకుమో, అభ్యర్థనో నాకు పట్టుబడలేదు. అలాగే నంటూ తలూపాను. నాకైతే గదిగదిలో రెండువేల రూపాయల నోట్లు గోడలకు అతికించినట్టు కనబడింది. ఇంటి కోసం ఆయన డబ్బును మంచినీళ్ళలా ఖర్చుపెట్టారు. ఇదివరకులా మంచినీళ్ళలా అనకూడదేమో, ఎందుకంటే ఇప్పుడు నీళ్ళే అత్యంత విలువైనవి.

'సింపుల్‌గా హాయిగా ప్రశాంతంగా ఉండాలి జీవితం. మూడుపూట్లా ఎవరైనా తినేది అవే అన్నం ముద్దలు.. రాత్రయితే కంటి నిండా నిద్ర. మనిషికి కావలసింది ఇదే కదా. రోజంతా చెమట చిందించి కష్టపడేవాడు ఏ ఆరు బయటో ఆదమరచి నిద్రపోతాడు. అదే కోట్లకు పడగలెత్తిన వాడు పట్టుపరుపుల మీద నిద్ర రాక కొట్టుకుంటుంటాడు. డబ్బు వెనుక పరుగులు తీసేకొద్దీ నెమ్మది నెమ్మదిగా మనశ్శాంతి దూరమవుతుంది'

నా మనసులో ఎప్పుడూ ఇలాంటి ఆలోచనలు కదలాడు తుంటాయి. ఆయన తన గదికి ఉన్న అటాచ్డ్ బాత్రూమ్ అతిథు లకు చూపిస్తున్నారు. నేను కూడా అప్పుడే కాస్త పరిశీలనగా అన్నిటినీ చూస్తున్నాను.

"ఈ షవర్ చూశారా? లక్ష రూపాయలకు పైనే అయింది. దాని స్పెషాలిటీ ఏమిటంటే నీరు తుంపర తుంపరగా మన మీద పడుతుంది. సన్నని వానలో తడిసినట్టు అనిపిస్తుంది. దానికి గీజర్ కనెక్షన్ ఉండడంతో గోరువెచ్చని నీళ్ళలో అలా తడుస్తుంటే, ఎంతటి అలసటైనా ఇట్టే ఆవిరైపోతుంది"

తన పెదవులపై గర్వంతో కూడిన చిరునవ్వు మెరిసింది.

"మరి ఇది వాడడానికి వాటర్ ఫోర్స్‌గా రావాలి కదండీ" ఒకరడిగారు.

"అవును. దానికి కూడా బాగా ఖర్చు చేసి వేరే ఏర్పాటు చేశాను. ఇంకా వాటర్ సాఫెనర్ కూడా ఉంది. ఇంత చేసాక ఇవి లేకపోతే వేస్ట్ కదండీ" ఇంకా వివరంగా మా ఆయన చెప్తున్నారు.

"మరి నీళ్ళు ఎక్కువ ఖర్చు అవుతాయేమో" ఇందాకటాయన సందేహం.

"అవుతాయండీ మరి. ఒక స్నానానికి దాదాపు ఒక పెద్ద టాంక్ నీళ్ళు ఖర్చవుతాయి. కానీ మన ఆనందం కన్నా ఏదీ ఎక్కువ కాదు కదా. మునిసిపాలిటీ వాళ్ళ దగ్గర నా ఇన్‌ఫ్లుయన్స్ ఉపయోగించి పెద్ద కనెక్షన్ తీసుకున్నాను. నాకు సంప్ నుంచి

నీళ్ళు ఓవర్ హెడ్ టాంక్‌కు పంపింగ్‌కి మాత్రమే ఎలక్ట్రిసిటీకి ఖర్చవుతుంది. ఈ ఏరియాలో గ్రౌండ్ వాటర్ కాస్త అడుగంటిం ది కదా, అందుకే ఈ ఏర్పాట్లు"

తన తెలివితేటలను ప్రదర్శనకు పెట్టారు.

నాకు ఒకసారి గుండె గుభేల్‌మంది.

ఒకవైపు నీళ్ళు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే, డబ్బున్నవారు నీరంతా తమ సుఖాల కోసం ఇలా వృథా చేస్తున్నారు. గాలీ నీరూ కూడా సమస్తం ఉన్నవారికే సలాం కొడుతున్నాయా?

నా మనసు బాధగా మూలిగింది.

ఇలాంటి విషయాల్లో మా ఇద్దరికీ చాలా పెద్ద వాదనలవు తాయి. చివరకు నేనోడిపోతూనే ఉంటాను. ఆయనా నేనూ ఉ త్తర దక్షిణ ధృవాలం. ఆయన పూర్తిగా డబ్బు మనిషి. నేను ఏమీ చెయ్యలేక ఆయనతో పోరాడనూ లేక ఆయనకు తెలియ కుండా నా సేవింగ్స్‌లోంచి అవసరంలో ఉన్నవారికి సహాయం చేస్తుంటాను. ఏదైనా కొనుక్కోమని ఆయన ఇచ్చిన వాటిలో కొంత మొత్తం దాస్తుంటాను. నా పరిధిలో నేను చెయ్యగలిగేది అదే. ఆయన ఒక్క రూపాయి ఎవరికీ దానం చెయ్యరు సరికదా.. 'నా తెలివితేటలతో గడించినది నేనెందుకు ఎవడికో ఊరికే ఇవ్వాలి' అంటారు.

చిన్నగా మొదలు పెట్టిన వ్యాపారం ఆయనకు బాగా కలిసొచ్చి డబ్బు బాగానే వెనకేశారు. నెమ్మది నెమ్మదిగా విపరీతంగా బంగారం కొనడమే కాక స్థలం కొని ఇలా పెద్ద ఇల్లు కూడా కట్టారు. నీళ్ళ ప్రసక్తి రాగానే నా మనసులో గతం కదలాడడం మొదలైంది.

■■■

పొద్దున్న ఆరుగంటలకి నిద్ర లేచి ఇంటి వెనకాల ఉన్న రేకుల బాత్రూమ్‌లోకి వెళ్ళాను. చూస్తే ఇనప బక్కెట్లో చుక్క నీళ్ళు లేవు. బకెట్ బయటకు తెచ్చి సిమెంటు గోలెంలోంచి అడుగునున్న నీళ్ళు సొట్టపడ్డ చిన్న చెంబుతో బక్కెట్లోకి విసుక్కుంటూ తోడుకుని లోపలకు తీసుకెళ్ళాను. నేను బయటకు వచ్చేసరికి అమ్మ ప్లాస్టిక్ బక్కెట్లో నీళ్ళు మోసుకొస్తూ కనబడింది.

"ఏంటమ్మా గోలెంలో నీళ్ళు లేవు?" అన్నాను విసుగుతో కూడిన గారంతో.

"నిన్న సాయంకాలమే గోలెం నిండా నీళ్ళు పట్టి ఉంటాను. నాన్న, తమ్ముడు వాడినట్టున్నారు. అయినా గోలానికి చిన్న చిల్లేమైనా పడిందేమో కూడా చూడాలి. ఎన్ని నీళ్ళు తోడినా అవసరానికి ఉండట్లేదు. వేసవి వల్లేమో నూతిలో కూడా అడుక్కిపోయాయి" అంటూ అమ్మ నీళ్ళు గోలెంలో పోసి చెమట్లు చీరకొంగుతో తుడుచుకుంటూ ఖాళీ బకెట్ పట్టుకుని నూతికి వెళ్ళింది.

నాన్నకి ట్రాన్స్‌ఫరై ఈ ఊరు వచ్చాక మేము మొదట దిగిన ఇల్లది. అప్పుడప్పుడే నాకు ఊహ తెలియడం మొదలైంది. ఇంటివాళ్ళ వాటాకు ఆనుకున్న సందులో వెనకాలెక్కడో నుయ్యి ఉంటుంది. అమ్మ మూడు పూటలా నీళ్ళు తోడి అక్కడ నుంచి మోసుకొచ్చి గోలేలు నింపుతుంది. నాన్న ఉదయం బాత్రూమ్‌కు వెళ్ళినపుడో, స్నానానికి వెళ్ళినపుడో నీళ్ళు రెడీగా లేకపోతే అమ్మని తెగ తిట్టేవారు. అందుకే అమ్మ లేచీలేవగానే నీళ్ళు తోడడానికి పరుగులు తీసేది.

ఎంత ఓపికో అమ్మకి. మూడుపూట్లా నీళ్ళు తోడి గోలేలు నింపుతూనే ఉండేది. సెలవురోజైతే తమ్ముడు మూడుపూటలా స్నానం చేస్తాడు. ఒక స్నానానికి రెండు మూడు బకెట్లు అవగొడ తాడు. సెలవురోజు బయటకు వెళ్ళి ఆడుకుని వచ్చినపుడు మట్టి కొట్టుకుపోయిన చేతులు కాళ్ళు కడుక్కునే బదులు స్నానం చేసేనంటాడు.

ఒక్కోసారి మిట్ట మధ్యాహ్నమో, రాత్రి చీకటిపడ్డాకో నీళ్ళ కోసం పక్క వాటా వైపు వెడితే ఇంటివాళ్ళు విసుక్కున్నారని అమ్మ నాతో చెప్పింది. వాళ్ళు కునుకు తీసే సమయాల్లో అమ్మ నీళ్ళు తోడితే చిరాకు కలిగించేదిట. నీళ్ళు లేకపోతే ఇంట్లోవారు విసుక్కుంటారు. వెడితే ఇల్లుగలవారు విసుక్కుంటారు.

మరో ఇంటికి మారినపుడు పెరట్లో బాగా వెనకాల నుయ్యి ఉండేది. మూడు నాలుగు వాటాలు ఉండడంతో ఒకొక్కరే నీళ ్ళ తోడుకోవడానికి అవకాశం ఉండేది. ఆ నూతిపళ్ళెం ఇరుకుగా ఉండడంతో నీళ్ళు బయటకు రాకుండా జాగ్రత్తగా తోడిపోసేది అమ్మ. ఇంటి లోపల స్నానాల గది ఉండేది. గోలెంలో తోడి పోసిన నీళ్ళు మళ్ళీ ఇంట్లోకి మోయాల్సి వచ్చేది. మొత్తం మీద రెండో ఇంటిలో కూడా అమ్మకి నీళ్ళమోత తప్పింది కాదు.

అలా ప్రతి ఇంట్లో అమ్మ నీళ్ళు తోడుతూనే ఉండేది. వేసవి లో నూతిలో నీరు లోతుకి పోతుంటే అమ్మకి నీళ్ళు తోడడం మరింత కష్టమయ్యేది. చిన్నదాన్ని కావడంతో నాకు పని చాత నయ్యేది కాదు. నేను కాస్త పెద్దయ్యాక వీలైనపుడు సహాయం చేసేదాన్ని. కానీ అమ్మ నన్ను చదువుకోమంటూ పనులన్నీ తనే చేసేది. అమ్మ ఏ లోటూ లేనట్టు ఎప్పుడూ సంతోషంగానే కనబడేది. కానీ పెద్దయ్యేకొద్దీ నాకు కొన్ని విషయాలు అర్థమవడం మొదలైంది. అమ్మకి పనులు చెయ్యడం తప్ప ఇంట్లో మరే పెత్తనమూ లేదు. నాన్న అమ్మని ఏ విషయంలో సలహాలు అడగలేదు, సంప్రదించలేదు అంటే సబబేమో! అమ్మకి చదువు రాదని నాన్నకి లోకువ. కానీ నాన్న అమ్మకి చదువులేదని తెలిసే పెళ్ళి చేసుకున్నారు కదా. చదువు రాని తనను నాన్న

విపరీతంగా చులకన చేస్తున్నారని, ఆడపిల్లలు బాగా చదువుకోవాలని తరచూ అంటూ ఉండేది అమ్మ. 'ఉద్యోగం చేసినా చెయ్యకపోయినా ఆడదానికి చదువే ఆభరణం' అనేది.

ఆ ఇంటివారు అర్జంటుగా ఖాళీ చెయ్యమనడంతో నాలుగు వీధులవతల మరో ఇంటికి మారాల్సివచ్చింది. ఈ కొత్తింట్లో వీధి వాకిట్లో ఉండేది నుయ్యి. అమ్మ నీళ్ళు తోడి ఇంట్లోకి మోస్తుంటే బట్టలు తడిసి వంటికి అతుక్కుపోయేవి. అప్పటికి నేను కాస్త పెద్దదాన్ని కావడంతో అమ్మ కొన్ని విషయాలు అప్పుడప్పుడు నాతో పంచుకునేది.

"ఈ వీధి వాకిట్లో నుయ్యి నా చావుకొచ్చింది" అంది ఒక రోజు విసుక్కుంటూ.

"ఏమైందమ్మా?" అన్నాను.

"నీళ్ళు మోసేడప్పుడు బట్టలు తడిసి వంటికి అతుక్కుపోతున్నాయి, అదే చిరాగ్గా ఉంది" అంది దిగులుగా.

"అయితే ఏంటమ్మా?" అన్నాను.

కొంచెం తటపటాయిస్తూ ... "ఎవరితోనూ అనకు, అలాగైతేనే చెప్తాను" అంది. నేను అలాగేనన్నట్టు తలూపాక

"ఆ ఎదురింటి రామారావు, ఈ పక్కింటి శ్యాంబాబు నేను నీళ్ళు మోసినంతసేపు మిడిగుడ్లేసుకుని అదే పనిగా చూస్తున్నారు" అంది తల దించుకుని.

"పోనీ నేను సాయం చెయ్యనా" అన్నాను.

"పిల్లల తల్లినైన నన్నే వదలట్లేదు. ఇక నువ్వెందుకు. వద్దు వద్దు. వాళ్ళవి అసహ్యపు చూపులు" అంది.

వాళ్ళ చూపుల నుంచి తప్పించుకోవడానికి అమ్మ తెల్లవారు ఝామున నీళ్ళు తోడడానికి లేచేది. మెలకువ వస్తుందో రాదో అనే కంగారుకు సరిగ్గా నిద్ర కూడా పోయేది కాదు.

"నీకు ఉన్న ఇబ్బంది గురించి నాన్నకు చెప్పొచ్చు కదమ్మా" అన్నానొకసారి.

అమ్మ నిర్లిప్తంగా చిన్న నవ్వు నవ్వి ఊరుకుంది. ఆ నవ్వు వెనకాల ఉన్న ఎన్నో అర్థాలు, దుఃఖాలు నాకు పెళ్ళయ్యాకే కాస్త కాస్తగా అర్థమవడం మొదలయ్యాయి.

నీళ్ళమోత అమ్మకు కొనసాగుతూ ఉంది. ఈసారి అద్దింట్లో నుయ్యి లేదు, మునిసిపల్ కుళాయి ఉంది. అది ఐదు వాటాలు ఉన్న ఇల్లు కావడంతో, కుళాయిలో నీళ్ళు వచ్చే సమయానికి అమ్మ అక్కడ పడిగాపులు పడేది. వరుసగా అన్ని వాటాల వాళ్ళూ నీళ్ళు పట్టుకునేవారు. ఆ చివర వాటా దగ్గర నుంచి ఈ చివర వాటాకు అమ్మ నీళ్ళు మోసేది. నాకు కాలేజీ ఉండడం వల్ల సహాయం చెయ్యడం అసలు కుదిరేది కాదు.

"కావల్సి వచ్చినపుడు నీళ్ళు తోడి పోసుకోవడానికి నుయ్యి లేదు కదా, ప్చ్ .. కుళాయినీళ్ళ కోసం ఎదురుచూపులు, పడిగాపులు తప్పవు. దీని కన్నా నూతిలో ఎప్పటికప్పుడు నీళ్ళు తోడుకోవడమే సులువేమో" అని అమ్మ నా దగ్గర నిట్టూర్చేది.

నాకు పెళ్ళై వెళ్ళిపోయాక అమ్మ పోరగా పోరగా మొత్తానికి నాన్న ఒక సొంతిల్లు ఏర్పరిచారు. నగర సంస్కృతిలో సొంతిల్లంటే అపార్ట్ మెంట్లో ఒక ఫ్లాట్ అని అర్థం. నాన్నకున్న చిన్న బడ్జెట్‌కి నాలుగో అంతస్తులో ఒక ఫ్లాట్ కొనగలిగారు. అది వద్దని అమ్మ మొత్తుకుంది. ఎందుకంటే ఆ అపార్ట్‌మెంట్‌కి లిఫ్టు లేదు.

"ఇంకా వయసు మీద పడితే ఈ మెట్లన్నీ ఎలా ఎక్కి దిగగలం" అని అమ్మ వాదన.

"ఇంతకన్నా నా వల్ల కాదు. ఈ ఇల్లు కొనడానికే మూడు చెరువుల నీళ్ళు తాగాను" అన్నారు నాన్న.

అలాంటి వాదనల మధ్య గృహప్రవేశం జరిగిపోయింది. సొంతింట్లో చేరాక, అమ్మ గబగబా ఇంట్లో కుళాయిలన్నీ తిప్పి చూసి .. "ఇక నీళ్ళ కోసం తడుముకునే బాధ లేదు. కుళాయి తిప్పితే చాలు హాయిగా నీళ్ళు వచ్చేస్తాయి" అంది ఆనందంగా. పోనీలే అమ్మ సుఖపడింది అనుకున్నాను.

ఇరుగుపొరుగు ఫ్లాట్ల వారితో అమ్మకు బాగానే స్నేహం కుదిరింది. వండుకున్న కూరలు పచ్చళ్ళు ఇచ్చిపుచ్చుకోవడాలు వంటివి సాగేవి. పూజాపునస్కారాలకు, తాంబూలాలకు పిలవడానికి అపార్ట్‌మెంట్ అమ్మకు సౌకర్యంగా అనిపించేది. ఇదివరకు ఇలాంటి విషయాలకు నాలుగు వీధులు తిరగాల్సి వచ్చేది.

కొత్తింట్లో దిగిన ఏడాదికే తమ్ముడికి పెళ్ళి జరిగింది. కాస్త కాస్తగా ఇంట్లో మార్పు రావడం మొదలైంది. నేను పుట్టిన ఎన్నో ఏళ్ళకు వాడు కడుపున పడ్డాడని, వాడంటే అమ్మకు ఎంతో అపురూపం. అమ్మ తనకు ఎంత బాగా లేకపోయినా వాడు ఏదైనా అడిగితే చాలు, క్షణంలో వండి పెట్టేది. పొదుపుగా సంసారం నడుపుతూ, నాన్న పచారీ సామాన్లకు ఇచ్చిన డబ్బులు మిగిల్చి మరీ వాడికి నచ్చినవి కొని పెట్టేది.

వాడికి మాత్రం ఎంతసేపు తన సరదాలే ముఖ్యం. వాడెలా ఉన్నా, ఏం చేసినా ఇంట్లో అందరూ సర్దుకుపోవడం అలవాటైంది. వాడి భార్య మా ఎవరితోనూ సరిగ్గా కలిసేది కాదు. తన గదిలో తనుండడం, ఆకలేసినపుడు తన తిండి తను తినడం తప్ప మరేమీ చేసేదికాదు. కోడలికి నాన్న సరిగ్గా బంగారం పెట్టలేదని, తను పుస్తెలతాడు, ఒక జత గాజులు ఉంచుకుని, మిగిలిన బంగారమంతా చెరిపించి నగలు చేయించింది అమ్మ. అమ్మ అంతలాగా కొడుకునే కాదు కోడలినీ ప్రేమించేది.

"కోడలు నగలతో లక్ష్మీదేవిలా నట్టింట్లో తిరుగుతుంటే ఎంత కళ" అంటూ మురిసిపోయేది. "నీకు ఈ మిగిలిన బంగారం ఇస్తాలే" అంటూ నాతో మొహమాటంగా అనేది.

"అయ్యో పరవాలేదమ్మా. అయినా నేనడగలేదుగా" అన్నాను అమ్మ మంచితనానికి లోపల ముచ్చట పడుతూ.

కానీ, అమ్మ ఇలా ఉండడం నాన్నతో పాటు చుట్టుపక్కల వారికీ చుట్టాలకీ నచ్చేది కాదు. నాన్నగానీ ఇంకెవరైనాగానీ ఆ అమ్మాయి సరిగ్గా లేదని ఏమైనా గొణిగినా ... "పోనీలే వాళ్ళిద్దరూ సఖ్యంగా ఉంటే అంతే చాలు" అంటూ అమ్మ సమాధానపరచేది.

వంటపని, ఇంటిపని మొత్తమంతా అమ్మే చేసేది. ప్రతిదీ అమ్మే బాధ్యతగా చూసుకునేది. కోడలొచ్చిన వాళ్ళందరూ గడుసుగా అత్తరికం వెలగబెడుతుంటే, అమ్మ కోడలేం చేసినా అపురూపంగా చూసుకునేది.

"అమ్మా మరీ అంత మెతకతనం కూడదు. కొంచెం తెలివిగా ఉండు" అంటూ నేను తరచూ చెప్పినా... చిరునవ్వే సమాధానంగా ఇచ్చేది. అలాగని నాకు నా మరదలి మీద కోపతా పాలు ఏమీ లేవు. కానీ అమ్మకీ జీవితమంత అలసట తరువాత కాస్తైనా ఆటవిడుపు ఉండాలని నాకు లోపల ఉండేది.

ఇంతలో అమ్మ మీద మళ్ళీ నీటిపిడుగు పడింది. అమ్మా వాళ్ళ ప్రాంతంలో విపరీతమైన నీటిఎద్దడి మొదలైంది. తలా కాస్త డబ్బు వేసుకుని అపార్ట్‌మెంట్‌లోని వాళ్ళందరూ టాంకర్లతో నీళ్ళు కొనుక్కుని కింద సంపులోకి పోయించుకునే వారు. కింద అంతస్తులో వాళ్ళు ముందుగా నీళ్ళు పట్టేసు కోవడంతో అమ్మా వాళ్ళకి నీళ్ళు సరిగ్గా ఉండేవి కావు.

ఒకరోజు నేను వెళ్ళేసరికి అమ్మ సంపులోంచి నీళ్ళు తోడి మెట్ల మీద నుంచి పైకి మోస్తోంది. ఆ వయసులో అమ్మ పడే కష్టం చూసి నాకు కన్నీళ్ళు ఆగలేదు. నాకు అసహాయతతో వచ్చిన కోపంతో ... "తను ఏం చేస్తోందిట పైన? నువ్వెందు కమ్మా నీళ్ళు మోస్తున్నావు?" అన్నాను గట్టిగా.

"ఊరుకో, నేను పైకి మోస్తే తను గుమ్మంలో అందుకుని బాత్రూములోకి మోస్తోంది" అంది అమ్మ నెమ్మదిగా.

నీళ్ళబరువుతో అమ్మ అన్ని అంతస్తులు ఆ వయసులో ఎలా ఎక్కుతోందో నాకైతే మింగుడు పడలేదు. దుఃఖంతో పాటు కోపం కూడా తన్నుకొచ్చింది. అమ్మే ఈ విషయాల్లో కలుగజేసు కోవద్దని నన్ను ప్రాధేయపడింది. నేను ఆ రోజుకు అమ్మకు సాయం చేసాను కానీ అమ్మ పడ్డ కష్టం మాత్రం నా ఆలోచనల లోకి జొరబడి వేధిస్తూనే ఉంది.

నెల రోజుల తరువాత నేను పుట్టింటికి వెళ్ళేసరికి అమ్మానాన్న హాల్లో కూర్చుని ఉన్నారు. ముఖాలు కళతప్పి ఉన్నాయి. తరచి తరచి అమ్మని కారణమడిగాను.

"నేనూ నాన్న మొన్నొక రోజు ఉదయం ఒక ఫంక్షన్‌కి వెళ్ళి సాయంత్రం తిరిగివచ్చేసరికి వాడు పెళ్ళాన్ని తీసుకుని వేరే కాపురం పెట్టేసాడు" అని బావురుమంది.

"అదేమిటి మీతో వేరు కాపురం గురించి ఇంతకు ముందు ఎప్పుడైనా అన్నాడా మాటవరసకైనా" అన్నాను.

లేదని తలూపుతూ మళ్ళీ దుఃఖంతో బద్దలైంది.

"నేను ఏ రకంగానూ ఇబ్బంది పెట్టలేదు కదా. మరెందు కలా చేసాడు" అంది వెక్కుతూ.

ఏ సమాధానం చెప్పి సముదాయించగలను! అమ్మ అప్పటి నుంచి వాడి మీద దిగులుతో మంచం పట్టేసింది. ఏమీ తినదు తాగదు. అలా ఏదో బతిమాలితే నాలుగు మెతికులు కతికి కన్నీరు కారుస్తుంది. ఎంతమందితో కబురు పెట్టినా ఏనాడూ వాడు అమ్మను చూడడానికి రాలేదు. ఎదురుచూపులతో అస్థిపంజరమై మంచానికి అతుక్కుపోయింది అమ్మ.

■■■

"విజయా, ఇంజినీర్ గారి భార్యకు, మిగిలిన వారికి తాంబూలం ఇవ్వు. వాళ్ళు బయలుదేరుతున్నారు" అనడంతో ఆలోచనల నుంచి బయటపడి ఉలికిపడుతూ ఆయన వైపు చూసాను.

నన్ను పక్కకు పిలిచి "మనం కొన్న వెండి వస్తువులు తాంబూలంలో పెట్టి ఇవ్వు" అన్నారాయన కాస్త గొంతు తగ్గించి.

'అంటే వాళ్ళకి తప్ప మిగిలిన వారికి ఉత్త తాంబూలం మాత్రమే ఇవ్వమని' నాకు అర్థమైంది.

'మనుషుల అంతస్తుల బట్టి వారికి వచ్చే గౌరవం మారిపోతుంది. ఏమిటో ఈ అంతరాలు'

నా మనసు మళ్ళీ మూలిగింది.

మనకు తగ్గట్టు సున్నితంగా కాక వేరే రకంగా ఆలోచించే వారితో జీవితాంతం ప్రయాణించడం ఎంత కష్టంగా ఉంటుంది! ఒకొక్కరిది ఒకొక్క విషాదగాథ. ఎవరైనా ఏం తక్కువని అడిగితే ఏం చెప్పగలం? అన్నీ ఎక్కువే అనేసి మనసును తొక్కిపట్టి నవ్వేయడమే!

అసలు ఆడదంటేనే ఒక పెద్ద లోతైన దుఃఖబావి.

అమ్మ తన జీవితకాలపు నీటిబరువును మోయగలిగింది కానీ తన చివరాఖరు కన్నీటిబరువు మాత్రం మోయలేక పాపం నిశ్శబ్దంగా ఆకాశంలోకి వెళ్ళిపోయింది.

మరి నా నెత్తిన మోస్తున్న బరువుకు విముక్తి ఎప్పుడు?■


**సాహిత్యప్రస్థానం**

**చందాదారులుగా చేరండి ..**
**మీ మిత్రులను చేర్పించండి ..!**
**వివరాలకు 94900 99057 ను**
**సంప్రదించండి.**

# నాతో నేను ...



**నా**తో నేను మాట్లాడుకుంటాను
స్వగతం కాదు, సంవాదమూ కాదు
గాలి ప్రపంచంతో మాట్లాడినట్టు
పూవు ప్రపంచం కోసం పూచినట్టు
నాతో నేను మాట్లాడుకుంటాను
పుడమి వెతలన్నీ చెప్పుకుంటాను!

ఎవరికీ యేదీ పట్టనప్పుడు
ఒకరు మరొకరిని విన్పించుకోనప్పుడు
మనుషుల మధ్య దూరాలధిగమించాలని
మనిషి తనం పరిమళించాలని
నాతో నేను మాట్లాడుకుంటాను
కన్నీటి వెతలు పంచుకుంటాను!

వాళ్లకేం వాళ్లు మారాజులు
స్వార్ధం తూచుకొనే తరాజులు
వాళ్లకి వాళ్లతోడిదే లోకం
వాళ్ళ యిల్లే వాళ్లకో స్వర్గం
నరకాన్ని పట్టించుకోని వాళ్ళు
ఇళ్లచుట్టూ నిలువెత్తుగోడలుకట్టుకున్నవాళ్లు
అపశకునాలు ఇంట్లోకి ప్రవేశించకుండా
ఆల్సేషన్ శునకాలు పెంచుకున్న వాళ్లు
పరాయి స్వరం యేదీ విన్పించకుండా
చెవుల్లో ఇయర్ ఫోన్లు పెట్టుకున్న వాళ్లు
దగ్గర దూరాలని తగ్గించాలని
మనసుకు ఒంటరితనం అంటరాదని
నాతో నేను మాట్లాడుకుంటాను
గుండె గాయం విప్పుకుంటాను!

పడమటి ఆకాశంలో ఎగిరి వెళ్లిన పక్షులు
వొంటరి. గూట్లో ముదుసలి పావురాళ్ళు
బతుక్కి దూరంగా చావుకి దగ్గరగా
మాటలు మరచిన మౌన హృదయాలు
కళ్ళతో వత్తులతో నిరీక్షిస్తూ
పలకరింపుల పండగలు లేని వేళ
ప్రపంచ కుగ్రామ జాతరలో
తనను తాను వెతుక్కుంటున్న జనాభా

ప్రలోభాల మాయలో పడి
ఎక్కిన గుర్రం దిగని వాడితో
బంధం తెగిన మమతల ఖజానా
ఎటు చూస్తే అటు దైన్యం
అడుగేస్తే అంత శూన్యం
ఎవరికి వాడొక రాజై యెదిగి
ఎవడి జెండా వాడే మోసుకుంటూ
వంగివంగి తనకు తానే దండం పెట్టుకుంటూ
ఏకాకి తిరంగాలై ఎగురుతున్న వేళ
రుతు సంక్రమణం తప్పదని
మళ్లీ మళ్లీ వసంతం రాక తప్పదని
నాతో నేను మాట్లాడుకుంటాను
ఆత్మను విశ్వవ్యాప్తం చేస్తుంటాను! ■

- ఈతకోట సుబ్బారావు
94405 29785

గొప్ప కవిత్వం నేర్చుకోవడం సాధ్యమవుతుంది
కానీ, ప్రేమ నేర్చుకోవడం ఏమాత్రం సాధ్యంకాదు

– చలం



# సమాజ మార్పే మార్క్సిస్టు సాహిత్య లక్ష్యం

- ఉషా యెస్ డానీ

సమాజంలో దేనికీ ఒక అర్థమే వుండదు. ప్రతి దానికీ అనేక అర్థాలూ, నిర్వచనాలూ, దృక్పథాలూ వుంటాయి. కళాసాహిత్యాలు కూడా దీనికి మినహాయింపు కాదు. మనిషి ఆలోచనలు, భావాలు, సంస్కారాల నుంచి కళాసాహిత్యాలు పుడతాయనే అభిప్రాయం ఒకటుంది. కళాసాహిత్యాలు ఒక మహాత్యం అనే భావన కూడా బలంగా చెలామణిలో వుంది. స్వయంగా దేవుడే తమ చేత రచనలు చేయించాడని చెప్పుకున్న మహాకవులున్నారు.

కళాసాహిత్యాల విషయంలో మార్క్సిస్టుల దృక్పథం వేరు. వాళ్ళు సమాజాన్ని కళసాహిత్యాలకు పుట్టినిల్లుగా చూస్తారు. కళాసాహిత్యాలకే కాక సమస్త రంగాల్లో మనుషుల ఆలోచనలకు సమాజమే మూలం అనేది మార్క్సిస్టుల అభిప్రాయం. మరో మాటలో చెప్పాలంటే, మార్క్సిస్టుల సమాజ విమర్శ నుంచే మార్క్సిస్టుల కళాసాహిత్య పరామర్శ పుడుతుంది. సమాజ విమర్శలో రాజకీయ విమర్శ కూడా వుంటుంది గనుక మార్క్సిస్టు సాహిత్యంలోనూ రాజకీయ విమర్శ వుంటుంది. దైవాంశాన్నీ, మహాత్యాలను తొలగించి కళసాహిత్యాలను శుష్కంగా మారుస్తున్నారనే నింద ఎలాగూ మార్క్సిస్టు సాహిత్య కారుల మీద వుంది. మార్క్సిస్టు సాహిత్యకారులకు సౌందర్య శాస్త్రం (aesthetics) తెలీదు, సాహిత్యాన్ని రాజకీయాలతో కలుషితం చేస్తారు అనే విమర్శ కూడా వుంది. సౌందర్యశాస్త్రంలో కూడా వర్గ దృక్పథం వుంటుంది. శ్రమే జీవన సౌందర్యం అనేది మార్క్సిస్టు సాహిత్యకారుల ప్రమాణం. కష్టాలు, సవాళ్ళు, అణిచివేతల నుంచి బయటపడడానికి జీవులు చేసే కృషి కన్నా సౌందర్యం ప్రకృతిలోగానీ, సమాజంలోగానీ ఏముంటుందీ?

మార్క్సిస్టు సాహిత్యంలో మాత్రమే రాజకీయాలుంటాయా? ఇతర సాహిత్యాల్లో రాజకీయాలు వుండవా? అనేది తప్పనిసరిగా పరిశీలించాల్సిన అంశం. 'కళ కళ కోసమే' అనేది చాలా కాలం ఒక విలువగా కొనసాగింది. 'రాజ్యం రాజ్యం కోసమే' అనే రాచరిక నియంతృత్వం నుంచి పుట్టిన సిద్ధాంతం ఇది. ఆధునిక యుగంలో దీని మీద అనేక విమర్శలు వెల్లువెత్తాయి. 'ప్రభుత్వాలు ప్రజల కోసం' అనే కొత్త విలువలు వచ్చాయి. 'కళ కళ కోసమే' (లాటిన్‌లో Ars Gratia Artis) అనే విలువతో హాలీవుడ్‌లో మెట్రో గోల్డ్విన్ మేయర్ (ఎంజియం) అనే భారీ చలనచిత్ర నిర్మాణ సంస్థ 1924లో ఏర్పడింది. కళా విలువల గురించి అంత గొప్పగా మాట్లాడిన ఆ సంస్థే 'జేమ్స్ బాండ్' ఫ్రాంచైజీను నిర్మించింది. రెండో ప్రపంచ యుద్ధం తరువాత బ్రిటీష్ నవలాకారుడు ఇయాన్ లాంచెస్టర్ ఫ్లెమింగ్ 'జేమ్స్ బాండ్' పాత్రను సృష్టించాడు. బాండ్‌బీ బ్రిటీష్ సీక్రెట్ ఇంటెలిజెన్స్ సర్వీస్ (మీ16) ఏజెంటు. ప్రపంచ మార్కెట్లో అప్పట్లో బ్రిటన్, అమెరికాలతో పోటీపడుతున్న రష్యా, చైనా తదితర సోషలిస్టు దేశాల్ని అవహేళన చేయడం ఈ పాత్ర లక్ష్యం. 1991లో రష్యా పతనం తరువాత జేమ్స్ బాండ్ పాత్ర ముస్లిం- చమురు దేశాల్ని అవహేళన చేయడం మొదలెట్టింది. కళకళ కోసం నినాదంతో మొదలైన సంస్థ ఇంత పచ్చిగా అంతర్జాతీయ రాజకీయాల్ని చిత్రిస్తూ సినిమాలను తీసింది. ఎంజియం సంస్థ ప్రస్తుతం ఇ-కామర్స్ జెయింట్ అమెజాన్ ఆధీనంలో వుంది. కళకళ కోసం అనే నినాదం వెనుక కూడా రాజకీయార్థిక ప్రయోజనాలుంటాయని చెప్పడానికి ఈ ఉదాహరణ చాలు.

మార్క్సిస్టు సాహిత్యకారులు తమకు రాజకీయాలున్నాయని బాహాటంగా ప్రకటించడమేగాక కళాసాహిత్యాలకు రాజకీయాలు వుండాలని కూడా వాదిస్తారు. మరోమాటలో చెప్పాలంటే ... ఇతరులు చాటుగా చేసే పనిని మార్క్సిస్టులు బాహాటంగా చేస్తారు. చెప్పాల్సిందీ, చెయ్యాల్సిందీ చాటుగానా? బాహాటంగానా అనేది ఒక్కటే తేడా. మనుషుల సామాజిక, రాజకీయ, మేధో జీవిత ప్రక్రియలన్నింటినీ భౌతిక ఉత్పత్తి జీవన విధానం నిర్ణయిస్తుందననేది మార్క్సిస్టుల స్థూల అవగాహన. 'మనుషుల సామాజిక అస్తిత్వాన్ని వాళ్ళ చైతన్యం నిర్ణయించదు. అందుకు విరుద్ధంగా మనుషుల సామాజిక అస్తిత్వం వాళ్ళ చైతన్యాన్ని నిర్ణయిస్తుందని' ఒక సందర్భంలో కార్ల్ మార్క్స్ చాలా స్పష్టంగా ప్రకటించాడు. It is not the consciousness of men that determines their being, but on the contrary their social being, that determines their consciousness.

సామాజిక అస్తిత్వం (social being) అనే మాట చాలా విస్తృతమైనది. ఇందులో ఆర్థికం, సాంస్కృతికం, కులం, మతం, లింగం, వర్ణం, భాషా, ప్రాంతం వగైరాలు ఎన్నో వుంటాయి. కొందరు సామాజిక అస్తిత్వాన్ని కేవలం ఆర్థిక పునాదికే పరిమితం చేయడంవల్ల దాని విస్తృతికి గండిపడుతోంది. ఆర్థికేతర అణచివేతకు గురయ్యే సమూహాలు మార్క్సిస్టు సంస్థలకు దూరం కావడానికి ఇలాంటి సంకుచిత వాదాలు దోహదం చేస్తాయి. అన్ని రకాల దోపిడీ అణిచివేతల లక్ష్యం సారాంశంలో ఆర్థికమే కావొచ్చుగానీ దోపిడీ అణిచివేతలన్నీ ఆర్థిక రూపంలో మాత్రమే వుంటాయనడం సరి కాదు.

మార్క్సిస్టు కళాసాహిత్యాలు 19వ శతాబ్దం మధ్యలోనో, రష్యాలో సోషలిస్టు విప్లవం విజయవంతం అయిన తరువాతో మొదలయ్యాయనే అభిప్రాయం కూడా సరైనది కాదు. అణగారిన సమూహాలను విముక్తి చేసే ప్రణాళికను మార్క్స్ 1848లో ప్రచురించిన మాట నిజమేగానీ, సమాజంలో అనాదిగా రకరకాల రూపాల్లో అణిచివేత పీడనలు కొనసాగుతూ వున్నాయి. వాటిని ప్రతిఫలించే సాహిత్యం కూడా అనాదిగా వుంది. ఇప్పుడూ వుంది. కార్మికవర్గ సాహిత్యం తప్ప మరేదీ మార్క్సిస్టు సాహిత్యం కాదని ఎవరైనా అంటే వాళ్ళు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని మూర్ఖంగా బలహీనపరుస్తున్నారని అర్థం. దళిత, బహుజన, మైనారిటీ, ఆదివాసీ, స్త్రీవాద వగైరా అణగారిన సమూహాలు సాగించే ఉద్యమాలన్నీ విముక్తి పోరాటాలే! అవి సృష్టించే కళాసాహిత్యాలన్నీ విముక్తి సాహిత్యమే. టెక్నికల్‌గా మార్క్సిస్టు సాహిత్యమే.

మార్క్సిస్టు సాహిత్య సంఘాలు ఒక్కో చారిత్రక దశలో తమ నిర్ణీత కార్యక్రమాన్ని బట్టి ఒక్కో రకం సాహిత్య ప్రక్రియకో, ఒక్కో రకం సామాజిక అంశానికో అధిక ప్రాధాన్యం ఇస్తుంటాయి. అంత మాత్రాన ఇతర సాహిత్య ప్రక్రియలో, ఇతర సామాజిక అంశాలో అప్రధానమైనవి అయిపోవు. మార్క్సిస్టు దృక్పథం నుంచి సౌందర్యశాస్త్రాన్ని అభివృద్ధి చేసినవారి జాబితా చాలా పెద్దది. అనటోలి లూనచరస్కీ, జియోర్జీ ప్లెఖనొవ్, బెర్తొల్ట్ బ్రెక్ట్, ఆంటోనియో గ్రాంస్కీ, జియోర్జ్ లుకాక్స్ మొదలైనవారు వారిలో ప్రముఖులు. తెలుగులో రాచమల్లు రామచంద్రారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావు మార్క్సిస్టు సాహిత్య విమర్శను సాహిత్యరంగంలో వర్గపోరాటం స్థాయికి తీసుకుని వెళ్ళారు. ఆసక్తి వున్నవాళ్ళు వారి పుస్తకాలను విస్తారంగా అధ్యయనం చేయాలి. ఔత్సాహికులు మాత్రం ముందుగా కొన్ని మూల సూత్రాలను అయినా తెలుకోవడం ముఖ్యం.

మార్క్సిస్టు సమాజ విమర్శ, సాహిత్య పరామర్శ ఎలాంటి మార్మికతకు తావియ్యకుండా సూటిగా సరళంగా వుంటుంది. ఇందులో మూడే మూడు మెట్లున్నాయి.

**మొదటి మెట్టు :** సమాజాన్ని వున్నది వున్నట్టు నిజాయితీగా చూపెట్టాలి. సమాజంలో ఏ విభాగాన్ని ఏ అంశాన్ని తీసుకున్నా దాని యథాస్థితి కొందరికి ఆహ్లాదకరంగానూ మరికొందరికి భరించశక్యంగానూ వుంటుంది. వివాహ వ్యవస్థనే తీసుకోండి. ప్రపంచ దేశాల్లోని దాంపత్య వ్యవస్థల్లో భారత దాంపత్య వ్యవస్థ మహా గొప్పది అనంటే మన దేశంలో పురుషులకు ఎంతో ఆహ్లాదకరంగా వుంటుంది. కానీ, స్త్రీలకు దానికి విరుద్ధమైన అనుభవాలు వుండొొచ్చు. వాళ్ళు పై అభిప్రాయాన్ని తప్పక ఖండిస్తారు. సమాజంలో సమతుల్యత కోసమే కులవ్యవస్థ వుందని అంటే యజమాని కులాలకు ఎంతో ఆహ్లాదకరంగా వుంటుంది. కానీ శ్రామిక కులాల అనుభవాలు అందుకు విరుద్ధంగా వుండొచ్చు. వాళ్ళు పై అభిప్రాయాన్ని ఖండిస్తారు. మరే దేశంలోకన్నా భారతదేశంలో మత సహనం పరిఢవిల్లుతోంది అనంటే మెజారిటీ మత సమూహాలకు ఎంతో ఆహ్లాదకరంగా వుంటుంది. కానీ, మైనారిటీ మత సమూహాల అనుభవాలు అందుకు విరుద్ధంగా వుండొచ్చు. వాళ్ళు పై అభిప్రాయాన్ని తప్పక ఖండిస్తారు. ప్రతి అంశంలోని రెండు విరుద్ధ వాస్తవాలను సాహిత్యం నిజాయితీగా ప్రతిఫలించాలి.

**రెండో మెట్టు :** సమాజం ఇప్పుడు అలా ఎందుకు వున్నదో వివరించాలి. కళాసాహిత్యాలు కేవలం కొందరి ఆహ్లాదాన్నీ, మరికొందరికి ఆవేదనను చిత్రిస్తే సరిపోదు. కొందరికి సౌకర్యం ఎలా దక్కిందో ఇతరులకు ఆ దుస్థితి ఎందుకు దాపురించిందో వివరించాలి.

**మూడో మెట్టు :** సమాజంలోని అణగారిన సమూహాల జీవితాల్లో మార్పును ఎలా తేవచ్చో సూచించాలి. సమాజంలో వైవిధ్యాలు వుండొచ్చు. వైరుధ్యాలు వుండొచ్చు. శత్రు వైరుధ్యాలు వుండకూడదు. వాటిని తొలగిస్తే అణగారిన సమూహాల జీవితాల్లో మార్పు వచ్చి కొత్త సమాజం వారికి కూడా ఆహ్లాదకరంగా వుంటుంది.

కళాసాహిత్యాలు కాల్పానికంగా మాత్రమే వుండాలిగానీ వాస్తవికతతో వాటికేం పనీ? అనే వాళ్ళని అలా వుండనివ్వండి! సమాజాన్ని వున్నదున్నట్టు చిత్రించాలి అనే మార్క్సిస్టు సాహిత్య ఆదేశంతో మార్క్సిస్టేతరులకు కూడా పెద్దగా అభ్యంతరం వుండకపోవచ్చు. అయితే, సమాజం అలా ఎందుకు వున్నదో వివరించాలనే విషయంలో తగవు వుంటుంది. కవులు, రచయితలు భావుకులుగా వుండాలే తప్ప శాస్త్రపరిశోధకుల్లా వుండరాదనే గడుసరి వాదంతో వాళ్ళు సామాజిక వాస్తవిక వాదాన్ని ఎదుర్కొంటారు. ఇక సమాజాన్ని మార్చాలనే విషయంలో మాత్రం రెండు రకాల సాహిత్యాల మధ్య తగువు తీవ్రంగా వుంటుంది. సమాజాన్ని మార్చడానికీ, మార్చమని ఆదేశించడానికి కవులు, రచయితలు ఉపదేశకులా? నియంతలా? అని వాళ్లు విరుచుకుపడతారు. సమాజంలో మార్పును అడ్డుకోవడానికి వాళ్ళు కొంచెం గట్టిగానే నడుం బిగిస్తారు. ఇలాంటి సందర్భాల్లోనే సాహిత్యరంగంలో వర్గపోరాటం అవసరం అవుతుంది.

ఇతరుల వాదాలు ఎన్నివున్నా ఎలా వున్నా సమాజంలో అణగారిన సమూహాల జీవితాలను మెరుగ్గా మార్చడమే మార్క్సిస్టు కళా సాహిత్యాల లక్ష్యం. కార్ల్ మార్క్స్ చనిపోయినపుడు ఆయన సమాధి వద్ద ఒక కొటేషన్ రాయాల్సి వచ్చింది. మార్క్స్ జీవిత కాలంలో అనేక గ్రంథాలు ప్రచురించాడు. కొన్ని లక్షల వాక్యాలు రాశాడు. వాటన్నింటి నుంచి ఆయన భావాల్ని ప్రతిఫలించే ఒక వాక్యాన్ని ఏంగిల్స్ ఎంపిక చేశాడు. ఆ వాక్యం ఏమంటే ... : "తత్త్వవేత్తలు ప్రపంచాన్ని రకరకాలుగా వ్యాఖ్యానించడంతో సరిపెట్టారు. నిజానికి చెయ్యాల్సిందేమంటే ప్రపంచాన్ని మార్చడం.' (The philosophers have only interpreted the world, in various ways. The point, however, is to change it). సమాజాన్ని మార్చడమే మార్క్సిస్టు సాహిత్య లక్ష్యం.

■



## ఫీనిక్స్

**రా**త్రంతా గృహ హింసలో
కాలిపోయి, కరిగిపోయి
తన అస్తిత్వమే ప్రశ్నార్థకమైన ఆమె ...
పొద్దున్నే సూర్యోదయానికన్నా ముందే
ఫీనిక్స్ పక్షిలా మళ్లీ లేస్తుంది!
రాత్రి తాలూకు గాయాలను తడిమి చూసుకుని
మనసుకు వైద్యం చేసుకుని
కొంగు బిగించి భవిష్యత్తు మీద
ఆశ్చర్యకరమైన రీతిలో
అచంచల విశ్వాసాన్ని ప్రకటిస్తూ
గుమ్మం తలుపు తెరుస్తుంది!
ఇంటి ముందు కల్లాపి చల్లి
అందమైన ముగ్గులు వేస్తుంది
నేడు ఆ ముగ్గు
ఆమె ఎత్తిపట్టిన ఓ ధిక్కార పతాక!
తరతరాలుగా స్త్రీ జాతి
గృహ హింసపై సాగిస్తోన్న
సమరానికి ఆమె ఎంచుకున్న
ఓ సంప్రదాయ ప్రతీక!
భళ్ళున తెల్లారాక నిద్రలేచిన
ఆ మానవుడు, ఆ ముగ్గును చూసి
నిశ్చేష్టుడవుతాడు!
గడచిన రాత్రిని తలుచుకుని
సిగ్గుతో తల వంచుకుని
ఆమె ముందు ఓటమిని అంగీకరిస్తాడు!

**- సత్యభాస్కర్**
**98483 91638**

# పూల బతుకులు



నీ బతుకు, నా బతుకు, మనందరి బతుకు
ఈ పూల బతుకు తీరే చెల్లీ ...

మనకు, పూలకు
పుట్టడం, పూయడమే వేరు వేరు కానీ
పూల జీవితం, మన జీవితం ఒక్క తీరే!
శవాలపై బలవంతంగా ఉంచబడుతున్న పూలు
శవాల ముందు చిటికేస్తూ
విధిలేక ఆడుతున్న మన బతుకులు

గౌరవానికి పూలది, మనది ఒకటే
అవసరానికే పూలైనా, మనమైనా
అక్కర తీరిందా... ఇద్దరి బతుకు చెత్త బుట్టలోకే...!
నీ, నా, మన పేదలందరి బతుకులు
వడలి పోయిన పువ్వుల మాదిరే
వాటికింత జీవం రావాలంటే...
అక్షరాల నీళ్ళు చల్లాలసిందే!

చెల్లీ ...
నీవు ఇంట్లో ఉండి సదువుకుంటే
అమ్మొక్కతే అమ్మే కూరగాయలతో ఇల్లు గడువదు
నీవు పూలమ్ముకుంటూనే ఉంటే
రేపటి నీ బతుకు వెలుగదు
'దేశమెలిగిపోతుంది.. భేటీ బచావో.. భేటీ పడావో అని
గప్పాలు కొట్టేటోల్ల గల్లాలు పట్టి
నువ్విట్టా నాలుగు బజాట్ల వీధి లైట్లకింద
కూసోడానికి కారకులెవరని నిలదీయాలని ఉంది!

చెల్లీ ...
ఈ రాతిరి నిన్నిక్కడా ఇట్లా చూస్తుంటే
రేపటి పొద్దున ఉదయించడానికి
ఏ పడమటి కొండల మాటునో
కసరత్తులు చేస్తున్న సూర్యుణ్ణి చూసినట్టే ఉంది!
ఈ వీధి దీపాలు
మనకెక్కువ కాలం వెలుగివ్వ లేవు తల్లీ...
మనకు మనమే స్వయం ప్రకాశకమై వెలుగాలి!

పాడైన పూలుంటే పారెయ్యకు చెల్లీ
తెల్లారితే ...
జీవచ్ఛవమవుతున్న ఈ దేశపు
రాజ్యాంగం అమలు యాత్రొకటి పోతుంది
జాలితోనే దానిపై ఇన్ని చల్లడానికి పనికొస్తాయి

కుళ్ళిపోయిన పూలుంటే దాసి పెట్టు తల్లీ..
హంతకులే....
ఈ యాత్రలో మొసలి కన్నీటి ప్రసంగాలతో
పూలు చల్లించుకోవాలనుకుంటారు
వారి మొఖాలపై
చీత్కారంతో విసిరెయ్యడానికి పనికొస్తాయి!

చెల్లీ ...
నిండు రాజ్యాంగం మనందరకూ
బాకీ ఉన్నది ఇంకా ...

**(హన్మకొండలో రోడ్డుపై పూలమ్ముతూ చదువుకుంటున్న చెల్లెలిని చూసి ...)**



**- దిలీప్.వి**
**84640 30808**

## దిక్సూచి



పాఠాన్ననుసరించి
అడిగాను
'నీ దగ్గర టెడ్డీబీర్
బొమ్మ ఉందా'
అని
ముడుచుకునే
ఆకులా పిల్లవాడు
ఇంకా విశదంగా అడిగాను
'మెత్తటి ఎలుగుబంటి బొమ్మ' అని
ఒడిగి ఒడిగి జవాబు నీటిబొట్టులా రాలుతుందనుకుంటే
కన్నీటిబొట్టు రాలసాగింది!
ఆ అమాయకపు చూపుల్లో
చైతన్యానికి ఆలవాలమైన సముద్రాన్ని దర్శిస్తాను

వాళ్ళ దగ్గర దిక్సూచి వుంది,దార్శనికత కల్పిస్తాను
వృత్తలేఖిని వుంది, వృత్తం గీయడానికే కాదు
చిరిగిన పుస్తకాన్ని కుట్టడానికీ పనికొస్తుందని సూచిస్తాను
ఇంకా ఇక్కడ ప్రకృతికీ పీరియడ్ ప్లాన్ ఉంది
ఆయా పీరియడ్లలో ఋతువుల్ని బోధిస్తుంది

పిల్లల్లో సృజన రెక్కలు చాస్తే
ఈ ఆకాశం చాలదు
పూసలు దారం ఇస్తే
దండ గుచ్చి చూపిస్తారు
జివ్విన పెన్సిల్ పొట్టుతో చిత్రాలు చేస్తారు
చిత్తుకాగితాలు ఓరిగామి బొమ్మలవుతాయి

గోడ కోసం రాళ్ళు జోడిస్తారు
పెట్టే రాయి మీద రాయి
కట్టే ఎగుడుదిగుడు గోడ
అవి పరిణితి యొక్క ఎత్తుపల్లాలు
రాయి జారిపోకుండా సమయస్ఫూర్తి చెక్కరాళ్ళనందిస్తాను
మనిషి మనుగడలోకి వెళ్ళినపుడు
చిట్లించిన కష్టాల భృకుటికి
అక్షరాల సృజనాత్మక కొరముట్లు,
అనుభవాల,అనుభూతుల మార్కులు తోడు రావాలి.

**- శాంతయోగి యోగానంద**

## కొన్ని పరిమళాలు

నలుగురితో మాట్లాడుకోవటం
పక్షుల కిలకిల రావాలు వినటం
వనాలు పచ్చని తోరణాలు కట్టటం
మొగ్గలు వీడి గాలితో పలకరించటం
గాలి చేరి హృదయాలు వికసించటం
ఇసుక తెన్నెల్లో కూర్చుని
ఎగసే కెరటాల్ని చూడటం
చుట్టూ ఊగే దృశ్యాల్ని
కళ్ళల్లో వొంపుకోవటం ఆస్వాదించటం
నాలో సంచరించే కొన్ని పరిమళాలు ...

వెన్నెల కాంతుల్ని తొడుక్కోవటం
వర్షధారల్ని నింపుకోవటం
ఆశగా ఆకాశం వంకా హరివిల్లు వంకా
కొంచెం కొత్తగా చూపుల్ని ఆరేసుకోపటం
నాకింకా అలానే
ఆనందాలు పొద్దు పొడుస్తున్నాయి ...
దేహమంతా పరవశంతో
అనేక దీపాలుగా వెలుగుతుంది
చిన్ని కొండలనూ ఎక్కి
దృశ్యాల్ని నింపుకుంటాను
పిల్లకాల్వలో గెడ్డల్లో
చేపలు పట్టుకుంటాను
కొన్ని పరిమళాల్ని
నాతో అంటిపెట్టుకుంటాను!

**- గవిడి శ్రీనివాస్**
**70192 78368**





# విమర్శకుల దృష్టిలో మన వేమన

- భమిడిపాటి భవానీ శంకర్
94928 58395

'అంధకారమైన క్షీణయుగంలో జన్మించి, ఆ కాలపు దుర్నీతిని ఏకాకిగా ఎదిరించాడు వేమన. వేమన స్వరం కఠినంగా, వాక్కు పరుషంగా, విమర్శ కర్కశంగా ఉన్నందున అతడు కఠిన స్వభావుడని అర్థం చేసుకోకూడదు. వేమన సాధు స్వభావుడు. అనురాగ పూరితుడు, సహనశీలి' అంటారు ఆయన పద్యాల ఆధారంగా నార్ల వెంకటేశ్వరరావు. విగ్రహారాధనను వ్యతిరేకంచిన సాంఘిన విప్లవకారునిగా కూడా ప్రేమగా చూసారాయన. 'వేమన' ఆకర్షించని స్వదేశి, విదేశీ సాహితీ విమర్శకులు లేరనే చెప్పాలి. తెలుగులో వేమన జీవితం గురించి పరిశోధనలు చేసిన వారిలో వంగూరి సుబ్బారావు, వావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రి, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, బండారు తమ్మయ్య, ఆరుద్ర, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, వేమూరి విశ్వనాథశర్మ, కట్టమంచి రామలింగా రెడ్డి, త్రిపురనేని వెంకటేశ్వరరావు, ఎన్.గోపి తదితరులు ఉన్నారు. వారు ప్రసిద్ధమైన విశ్లేషణా రచనలను వెలువరించారు. బ్రౌన్ ద్వారా వేమన పద్యాలు 1839లో పుస్తక రూపంలో ప్రథమంగా వెలుగులోకి వచ్చాయి. ఆటవెలదులతో అద్భుతమైన కవిత్వం, అనంతమైన విలువైన సంగతులను ఇమిడ్చిన ప్రతిభాశాలి వేమన.

వేమన ప్రజాకవి. వేమనను తెలియని వారు, వానలో తడవని వారు దాదాపుగా తెలుగు లోకంలో లేరనే చెప్పాలి. వేమన 1652 – 1730 మధ్యకాలంలో జీవించాడని, కొండవీటి రెడ్డి రాజవంశానికి చెందిన వాడని చెప్పే కథనాలున్నాయి. సి.పి.బ్రౌన్ చెప్పిన ప్రకారం ఇతను జంగమ కులానికి చెందిన శివకవి. కడప మండలంలో చిన్న పల్లెలో మధ్య తరగతిలో జన్మించాడనే పరిశోధక కథనాలున్నాయి. అతని జీవితానికి చెందిన అంశాలున్న పద్యాలను ప్రముఖంగా ప్రస్తావించిన పరిశోధకులున్నారు. 'నందన సంవత్సరమున / పొందుగ కార్తీకమందు బున్నమి నాడీ/' 'ఊరు కొండవీడు వునికి పశ్చిమం వీధి/ మూక చింతపల్లె మొదటి వీడు' అనే పద్యాలు వల్ల ఆయనకు చెందిన జన్మ వృత్తాంత విషయాలు తెలుసుకోవచ్చని కొందరి పండితుల వాదన. బండారు తమ్మయ్య విశ్లేషణలకు హేతుబద్ధమని అంగీకరించారు ఆచార్య ఎన్.గోపి. వేమన కులం విషయంలో వైరుధ్య కథనాలున్నాయి. జాతీయ కవులను 'జాతి' కవులుగా ముద్రవేస్తున్న నేటి కాలంలో వేమన కులంపై స్పష్టత లేకపోవడం వల్ల ఏ కులం వారు కూడా 'వేమన' మాకులపోడని గట్టిగా చెప్పలేక పోతున్నారు.

వేమన జీవితం, ఆయన భోగి నుంచి యోగిగా మారిన వైనం గురించి అనేక కథనాలున్నాయి. బహుశా 'వేమన'పై ఇన్ని భిన్న దృక్కోణాలు ఉండడం వల్లే 'విదేశీ సాహితీకారులు, పరిశోధకులు ఆయన గురించి తెలుసు కోవాలనుకొన్నారు. లోతైన అధ్యయనాలు చేశారు. గ్రియర్సన్ అనే సాహిత్య పరిశోధకుడు వేమన 16వ శతాబ్దానికి చెందినవాడని నిర్ణయించాడు. భారతీయ భాషా సాహిత్యాల అధ్యయనానికి తన జీవితాన్ని అంకితం చేసిన ప్రముఖ విదేశీ విద్వాంసుడు జి.వి.గ్రియర్సన్ 'నేటి కవులందరిలో అత్యంత ప్రసిద్ధిని పొందిన కవి వేమన. వేమనకు ఆపాదించబడని సామెత కాని, సూక్తిగాని ఉండటం చాలా అరుదని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నార్లవారి మాట ఒకటి గుర్తు చేసుకోవాలి. వేమన పద్యాలకు సమానమైనదిగా చెప్పే పద్యాలు, చలామణి

అయినవి. ఆయన రాసిన వాటితో సమానంగా ఉన్నాయంటారు. సి.పి.బ్రౌన్ సహితం తను రచించిన పుస్తకం పీఠికలో 'నాకు లభించిన పద్యాలు మొత్తం 2,500. వీటిని పోల్చినప్పుడు సమానమైన పద్యాలు మొత్తం రెండు వేలకు కొంచెం మించి ఉన్నట్లు తేలింది' అని రాసుకున్నారు. బ్రౌన్ తరువాత డా॥జి.యు. షాప్, మేజర్ ఆర్.ఎం. మెక్ డోనాల్డ్ గ్రంథానికి వేమనపైన ప్రత్యేకమైన పరిశోధనలు చేశారు. అబేదుబాయ్ రచించిన గ్రంథానికి సంపాదకీయ వ్యాసం రాసిన పోప్ 'వేమన పద్యాల మాధుర్యాన్ని మించిన మరో కవిత లేదని' పేర్కొన్నారు. వేమన రచనలు విదేశీయుల్ని ఆకర్షించినంత గొప్పగా తెలుగు సాహిత్యమంతటిలో మరొక కవి రచనలు ఆకర్షించ లేదని చెప్పవచ్చునని మ్యాక్ డోనాల్డ్ అభిప్రాయం.

వేమన ప్రజాకవి. ఆయన తన రచనలను పండితుల కోసం రాయలేదు. తాను నిరంతరం సంచరిస్తున్న సమాజం, తనకు జరిగిన అవమానాలు, ఆస్వాదించిన ఆనందాలు, ఆర్థిక పరమైన కష్టాలు, నష్టాలు, ఆనాటి సమాజంలో ఆచారాలు, సంప్రదాయాల వెనుక ఒక వర్గపు స్వార్థం, మరో వర్గపు మౌఢ్యం, ప్రజల్లోని నిరక్షరాస్యత, అమాయకత్వం, అంటరానితం, మతాల పేరిట, విగ్రహారాధన పేరిట జరుగుతున్న దోపిడీ ... వంటివి ఆయనలో సమాజం పట్ల ఒక విధమైన జాలిని పెంచాయి. అతనిలో నిజాయితీని ప్రశ్నించాయి. నిలదీయమనే కోరిక పెంచాయి. ఈ కారణాల చేతనే ఆయన రచనలను పెక్కుమంది తిరస్కరించారని, ఆదరించలేదని, ఆయనను వెలివేసారంటారని నార్ల. దీనికి సంబంధించి ఒక దృష్టాంతాన్ని కూడా చెబుతారు. 1829లో కావలి వేంకటరామస్వామి గారు నూట ఎనిమిది మంది కవుల చరిత్రతో ఒక పుస్తకాన్ని రచించారు. వీరంతా దక్షిణ భారతదేశంలో ప్రాచీనార్వాచీన ప్రసిద్ధులు. వీరిలో నలభై ఏడుగురు తెలుగు కవులు. వీరిలో వేమనకు చోటివ్వలేదు. అందుకు అనేక కారణాలున్నాయనేది ఓ చారిత్రక సత్యం. వేమన నాటి వైవిధ్యభరిత మత, ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరమైన కారణాలు ఆయన జీవితం చుట్టూ పరుచుకున్నాయి. కనుకనే విదేశీయులు ఆయనను గురించి విస్తృత పరిశోధనలు చేశారు. 'తెలుగు ప్రజలు వేమన కవిత్వాన్ని అధికంగా అభిమానిస్తారని పాశ్చాత్యుడైన పోప్ పేర్కొన్నారు. వేమనలోని హేతువాదం, ఏకేశ్వరోపాసన, మొరటు పద ప్రయోగాలు ఛార్లెస్– ఇ–గోవర్‌ను ఆకట్టుకొని వేమనపై పద్య రచన చేశారు. ఇందుకు బ్రౌన్ రచనలే ఆధారమని కూడా అంగీకరించారు. సి.పి.బ్రౌన్ తనకు లభించిన పద్యాలను ఒక పద్ధతిలో వర్గీకరించారు. మొత్తం 5 భాగాలు పేర్చారు. మతం, నీతి, వ్యంగ్యం, తాత్వికం, ప్రకీర్ణం అని వింగడించారు.

వేమనను తనువంతా విస్తరింపచేసుకొన్న పాశ్చాత్యుడు క్యాంబెల్. ఆయన మద్రాస్ క్రిస్టియన్ కాలేజీ పత్రికలో 'నిశ్చయంగా వేమన ప్రజాకవి. ఆయన రాసింది పండితులకు కాదు. నిరక్షరాస్యులైన గ్రామీణ ప్రజలకు. వేమన ప్రసిద్ధికి కారణం ఆయన ప్రబోధాలు మాత్రమే కాదు; సరళము, శక్తిమంతమూ అయిన కవితా శైలి కూడా కారణమే' అని రాశారు. ఇది శతశాతం సత్యం. క్యాంబెల్ 'మేము వేమనను తప్ప వేరే దైవాన్ని పూజింపమని ఆయన మా ఇలవేల్పుగా పేర్కొన్న వ్యక్తిని సహితం కలుసుకున్నారట!

వేమనను గురించి పరిశోధన చేసిన ప్రథమాంధ్రుడు కె.వి.లక్ష్మణరావు. ఆంధ్రదేశంలో చారిత్రక, సాహిత్య పరిశోధనలకు కూడా ఆయనే మార్గదర్శి. ఆ తరువాత ఎందరో వేమనపైన శ్రద్ధ చూపారు. బ్రౌన్, క్యాంబెల్ తదితరుల బాటలో మరికొందరు పరిశోధించి, విశేష కోణాలను ఆవిష్కరించారు. వేమన పద్యాల్లోని మానవతాధర్మం, సర్వమానవ సమానత్వం, కులవివక్షలోని 'శూన్యత', 'నైతికత', మూఢ నమ్మకాల ఖండన వంటి విషయాలను ప్రస్తావించారు. తెలుగు పరిశోధకులు సహితం వేమనలోని నిజమైన తత్వసారాన్ని వెలుగులోకి తెచ్చారు. ఒక్కొక్కరు ఒక్కొక్క అంశాన్ని, కొందరు 'వేమన'ను సంపూర్ణంగా, సమగ్రంగా ఆవిష్కరించారు.

'ఇంటియాలిని విడిచి ఇల జారకాంతల
వెంటదిరుగువాడు వెర్రివాడు
పంటచేను విడిచి పరిగె ఏరినయట్లు
విశ్వదాభిరామ వినుర వేమ'

ఇంతకన్నా గొప్పగా నైతికతను గురించి ఎవరు చెప్పగలరు? 'పరుల బాధను తన బాధగా భావించేవాడు మానవుడు' అనే వేమన తిరుక్కురళ్, బసవేశ్వరుడు, కబీర్ వలే గొప్ప తాత్విక చింతనాపరుడంటారు నార్ల వెంకటేశ్వరరావు. ■

**ప్రజల చైతన్యంలో మనం నాటిన విత్తనాలు**
**మొలకెత్తకుండా ఎల్లకాలం ఉండబోవు**
**సామాజిక క్రమాన్ని శత్రువులు నేరాలతోను,**
**బలప్రయోగంతోను అణచివేయలేరు.**
**చరిత్ర మనది. ప్రజలే చరిత్ర నిర్మాతలు...**
**– సాల్వెడర్ అలెండీ**
**అమెరికా కుట్రలకు బలైన చిలీ అధ్యక్షుడు**

## కలలో అమ్మ

అబద్ధాలు కాని ఓటములు లేని
కలలే తోడుగా ఆగి ఆగి
మలుపులు తిరిగి తిరిగి
ముందు చూపుతో ప్రయాణాలన్నీ
వెనక్కు వెనక్కే ...

అనుకరణలు,అనుసరణలు
భయాలు, అనుమానాలు
ఉద్వేగాలు, దుఃఖాలు,
నవ్వులు ఉద్విగ్నతల మధ్యనే అంతా!

పసిపిల్లాడి పాలనోరులా
అపద్ధం చెప్పటం అస్సలు తెలియనట్టు
పెద్దవాళ్ళే లేరెక్కడా..
చనిపోయే ముందు వరకూ
లోకంలో అందరూ పసికూనలే!

వదిలి వచ్చేసాం వదిలి పెట్టేసాం
అయిపోయింది బూడిద చేసేసాం
అనుకోవడమే..
కట్టె కాలిపోయినా,
బూడిద గాల్లో కలసిపోయినా
ఏదీ ఎక్కడికీ పోదు
ఎవరూ దూరం కారు
లోపలి మనం చచ్చేంతవరకూ.

ఎందుకంటావెందుకు?
చిత్తడి తప్పని
చిరపుంజి కదా .. మనసు!

**- పలమనేరు బాలాజీ**
**94409 95010**





## దుఃఖపు మజిలీ

గమనించటం అంటే
చూడటం, వినటం అని.
కన్నీళ్లను తేలికగా తుడిచేసుకొంటున్నాను
కేవలం గమనించటం మాత్రమే తెలిసిన మనిషి
ఇప్పుడు ఎన్నో దుఃఖపు మజిలీలు మోస్తున్నాడు.

ఎదురయ్యే మరణాలకు
పెనుకేకలు లేవు
గుండెలు బాదుకోడాలు లేవు
ఆఖరిచూపులూ లేవు
భయం అంటే ఏమిటో తెలుస్తోంది
భూమికీ, ఆకాశానికీ మధ్య కదులుతున్నట్టు
ఏదో కొత్త ఆశ ప్రాణం పోసుకొంటుంది
చదువుకొన్న సామాజిక శాస్త్రాలు
మనిషి చుట్టూ వలయాలుగా తిరుగుతున్నాయి
ఫేస్ బుక్కుల్లో, వార్తాపత్రికల్లో
మరణించిన మృతుల పేర్లు చూస్తూ
స్పర్శలేని వాడ్నవుతున్నాను!
కన్నీళ్లను తేలికగా తుడిచేసుకొంటున్నాను.
సుఖసంతోషాల జాడకై ఎక్కడని వెతకను?
ఇప్పుడు మరణం
ఎండ కాసినంత సహజమని
ఎలా చెప్పను!

**- ఏటూరి నాగేంద్రరావు**
**74166 65323**



# పగిలిన కలశం

- పుప్పాల కృష్ణమూర్తి
99123 59345

**రా**త్రి తొమ్మిది కల్లా చింత్రియాలు చేరింది బస్సు. పల్లెలు, పంట పొలాలు, గట్లు, ఏనెక్కలు దాటుకుంటూ రెండు గంటలు ప్రయాణించి, నది ఒడ్డున దింపింది. కాస్త జంకుతోనే నేల మీద కాలుమోపాను. అసలే మావోయిస్టు గ్రామం. ఎన్నికల విధుల్లో భాగంగా సారా, డబ్బు అక్రమంగా సరఫరా కాకుండా చూసే చెప్పాష్టు డ్యూటీ. గతంలో మందు పాతరలో ఎనిమిది మంది పోలీసులు చనిపోయింది. ఈ ఊళ్లోనే, తరువాత రెండు ఎన్ కౌంటర్లు జరగడం ఐదుగురు మావోయిస్టులు చనిపోవడం – హరిభూషణ్ నదిలో దూకి ఉధృతంగా ప్రవహిస్తున్న ఏరును, తుపాకి గుండ్లకు అందకుండా ఈదుకుంటూ ఆవలి ఒడ్డుకు చేరుకుని అడవికి వెళ్లిపోవడం ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటారు గ్రామస్తులు.

ఎదురుగా కృష్ణమ్మ వడివడిగా ప్రవహిస్తోంది. పుప్పొడిలా వెన్నెల రాలుతోంది. తరంగాల మీద బల్లకట్టు డైనమో వెలుతురు పడి అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరిస్తోంది. ఆవలి ఒడ్డునున్న ఊళ్లో లైట్లు సన్నగా తీగలమీది గువ్వల్లా వరుసగా వెలుగులు చిమ్ము తున్నాయి. దూరంగా ఎడమవైపు నది నల్లటి గుట్టలమీంచి విసురుగా వచ్చిన గాలితెమ్మెర నన్ను చుట్టేసి చిట్టడవిలోకి వెళ్లిపోయింది. ఉత్తరం వైపున్న మొండి రాగిచెట్టు మీది గబ్బిలాలు బస్సు శబ్దానికి ఒక్కుమ్మడిగా లేచి, ఊరి వైపు రెక్కలు సాచుకుంటూ వెళ్లసాగాయి. చెట్టు మీద కోతులు కీచులాడుతూ పోట్లాడుకుంటున్న శబ్దం. పట్నవాసానికి అలవాటు పడ్డ నాకా ప్రకృతి ఎంతో రమణీయంగా, ఆహ్లాదకరంగా అనిపించింది.

దిగిన ప్రయాణికులు ఆరుగురు బల్లకట్టు వైపు వెళ్లసాగారు చేతి సంచులతో గబగబా దగ్గరకు వచ్చి రిపోర్ట్ కాగితాలు చేతిలో పెట్టి – 'నిల్ రిపోర్ట్ రాసి సంతకం పెట్టి రేపు రెవిన్యూ ఆఫీసులో ఇవ్వు. రాత్రి పడవ నడుపుతుండు గని నువ్వేమనకు. మన తిండి తిప్పలు, చూసేది వాళ్లే. పోలీసులు కూడా రోజుకింతని మాట్లాడుకుండు" అని రహస్యం చెప్పి 'ఇదిగో నీతో పాటు డ్యూటికి గ్రామ మోతాదు ఉన్నారు' అని వేలితో చూపి, "చూస్కో పెద్ద సారు ..." అని కారు వైపు హడావిడిగా వెళ్లిపోయాడు పోకల శ్రీను. తనది పగలు డ్యూటీ అగ్రికల్చర్ ఆఫీసులో సీనియర్ అస్టెంట్.

"సార్.. అన్నం తిన్నారా?" అడిగాడు గౌరవంగా ఉన్నూర్. అతన్ని పరీక్షగా చూశాను. ఐదడుగుల ఎత్తు. తెల్ల పంచె పైకి మడిచి కట్టాడు. ముతక బనీను పెద్ద డబ్బా జేబుతో తలకు పెద్ద దాకా రుమాలుంది. బస్తీ ముస్లింలా తలమీద టోపీ, పొడవాటి గడ్డం ఏవీ లేవు. వయసులోని అనుభవాలు అద్దినట్లు ముఖంపై ముడతలు కన్పిస్తున్నాయి. వృద్ధాప్యంతో మనిషి కాస్తా వంగాడు. వయసు డెబ్బయిపైన ఉంటాయనిపించింది. కానీ మనిషి ఆరోగ్యంగా, ముఖం నమ్రతగా అనిపించింది వెన్నెల వెలుగులో.

"తినే వచ్చా.. నువ్వు తిన్నావా?" అడిగాను మర్యాద కోసం.

"అయింది సార్.. పోలీసు రాజా సారే తినాలే బల్లకట్టోళ్లతో మాట్లాడుతుండు. మీరీ నవారు మంచంల పండుకోండి సార్. నేనీ చిన్నదాంట్లో ముదుసుకుంట. నా మనవడు ఇప్పుడే తెచ్చి ఏసిండు" అన్నాడు. నాకేసిన నవారు మంచం విశాలంగా వుంది. తనది చిన్నగా ఒక్క మనిషి మాత్రమే పడుకునేలా వుంది. నులకమంచం తెచ్చిన దుప్పట్లు పరిచాడు. దిండు అమర్చాడు. నేను బేగ్లోంచి దుప్పటి తీసి మంచంమీద వేసుకున్నా కప్పుకోడానికి.

యాంత్రిక బల్లకట్టు ఆవలి ఒడ్డుకు వెళ్లిపోయింది. దాని ఫోకస్ లైట్లు ఒడ్డు మీద పడి తంతెలు తంతెలుగా నీళ్లు కోసిన నాపరాళు కనబడుతున్నాయి. నది మీంచి వచ్చే చల్లటి గాలి హాయిగా అనిపించింది. నేను మంచం మీద కూర్చుని, తనను కూర్చోమని చేతితో సైగ చేశాను. కూర్చున్నాడు.

'చదువొచ్చా?' అడిగాను.

"గిరి బ ఐదొక చదివిన సారు. ఇంగ మా అయ్య ఎవుసం జేసెటోడు లేడని గొడ్లకు బెట్టిండు" చెప్పాడు. తన భాషలో ముస్లిం యాస లేదు. బహుశా ఎక్కువ తెలుగు మాట్లాడే కుటుంబాలతో కలిసి జీవించడం వల్ల కాబోలు, తెలంగాణ యాసే కనిపించింది.

"ఉన్నూరు ముఖంలోకి చూస్తూ నక్సలైట్ నాయకుడు హరిభూషణం మీ ఊరే కదా, అతను ఎందుకు విలేజ్ రెవిన్యూ ఆఫీసర్ నన్ను చంపాడు?" అడిగాను ఆసక్తిగా.

'ఆ సంగతా సార్. ఎప్పుడో ఇరవయ్యేళ్ల నాటి మాట. మా బజారే గదా సాంబయ్యది" అన్నాడు.

"సాంబయ్య ఎవరు?" అడిగాను ఆసక్తిగా.

"ఆ పిలగా తండ్రి సార్. పాపం సచ్చిపోయిండు. నిలువునా కుటుంబాన్ని ఆర్పిండు గదా మా సైదాగాడు. ఇల్లు పాడుబడ్డది. పొలం బీడు బడ్డది. పిలగాడ్ని పోలీసులు ఎప్పుడు సంపుతరో తెల్వది. ఏం బావుకుండు. వాడూ బోయిండు. నాకు అల్లుడి వర్సే సారూ.. వట్టి ముదనష్టపోడు. మీరన్న బూశనం మారు పేరు సార్. అసలు పేరు నాగయ్య. మా కళ్లముందు పెరిగిన పిలగాడు" అన్నాడు వివరణ ఇస్తూ.

"అట్లాగా? వాళ్ల కుటుంబాన్ని సైదా ఎందుకు ఆగం చేశాడు? విఆర్ఓను నాగయ్య ఎందుకు చంపాల్సొచ్చింది" అన్నాను ఆసక్తిగా ఉన్నూరు ముఖంలోకి చూస్తూ.

"పండుకుని మాట్లాడుకుందాం సార్. ఇప్పట్ల తెగే ముచ్చట గాదది." అన్నాడు. నేను మెల్లగా మంచం మీద వాలాను. తను రుమాలును చుట్టి, దిండులా పెట్టుకుని పడుకున్నాడు.

ఉన్నూరు ఆకాశంలోకి చూస్తూ, కండ్లముందు దృశ్యం కదలాడుతున్నట్లు చెప్పసాగాడు.

"సాంబయ్య తండ్రి వెంకయ్య కేవలం కుండలు చేసి అమ్ముకునే, మూడు ఎకరాల భూమి కొన్నాడు. సాంబయ్య ఎదిగే సరికి కుండలు కొనే దిక్కు లేదు. చేయడం మానేశాడు. తండ్రిచ్చిన భూమి చేసుకుంటూ, నాలుగు గేదెల్ని నాముల మేపుకునేటోడు. కేంద్రానికి పాలు పోస్తూ, వచ్చిన డబ్బులతో ఇద్దరు పిల్లల్ని ముద్దుగ చదివించుకునేటోడు. పిల్లలు మాంచి తెలివైనోళ్లు అమ్మాయికి దేవరకొండ స్కూ సీటొచ్చింది. పిలగాడికి సర్వేల్ల సీటొచ్చింది. తిండి, బట్ట మొత్తం గవురుమెంటే. సాంబయ్య అత్తగారి ఊరు రామాపురం. పాలేటి రామారావు అంటే మాంచి గురి. ఆయన ఈ ఏరియాలో మంచి లీడరు.

చెప్పానుగా సార్.. మీర్ సైదా నాకు వరసకు అల్లుడైతదని.. బాగా గరానా మడిసి. తెల్లటి చొక్కా వేసుకుని, పంచె చింగులు తొక్కుకుంట, రొమ్మిరుసుకుంట బజార్ల నడిసెటోడు. నేను రెవిన్యూ దస్త్రం, కవిశ కర్రకు తగిలించుకుని అతని వెనకాలే నడిసెటోడ్ని. ప్రతోడ్ని గెలికెటోడు. 'గుట్ట నరికినవు కేసుబెడతా. కాలవ కలుపుకున్నవ్ జైల్ల బెట్టిస్తా, శిస్తు గట్టలే అరకెడ్లు లక్కపోతా' అని కనపడ్తోన్న బెదిరించేటోడు. మాదిగ, మాలోళ్లనైతే అరే తురే అనే దబాయించెటోడు. వాడికి ఎదురు పడితే ఏం బంద మీదేస్తడోనని, సందులకు జారుకునేటోళ్లు రైతులు. అతడు గ్రామ రెవిన్యూ అధికారాయె.

దస్త్రాలు పెట్టుకోడానికి, రికార్డు రాసుకోడానికి, పై అధికారులొస్తే అరుసుకోడానికి చెన్న కేశవరావుగారి బిల్డింగు కిరాయికి తీసుకున్నం. వాళ్లు పిల్లల్ని చదివిచ్చుకోడానికని పట్నం ఎల్లిండ్రు. ఇల్లు ఒప్పజెప్పి రికార్డు పనుందని అక్కడ్నే పండెటోడు. ఆడికి మొగ దోస్తులు, సందకాడ ఆడదోస్తులు వచ్చెటోళ్లు. ఓనాడు పొద్దు పొద్దుగాల పాలు బోసి, ఆ డబ్బులు తీసుకొచ్చి విఆర్ఓ కిచ్చాడు సాంబయ్య.. శిస్తు కట్టటానికి మూడు వందల పాతిక . 'రశీదు తర్వాత ఇస్తాలే పో. ఇప్పుడు పుస్తకం లేదు' అని పంపించాడు సైద. రెండ్రోజుల తర్వాత వచ్చి అడిగాడు సాంబయ్య. 'నువ్వెప్పుడిచ్చినవు? అని అడ్డం తిరిగిండు. ఇచ్చానని మట్టిబట్టి ప్రమాణం జేసిండు. అయినా ఒప్పుకోలే. సాక్షం చూపించు అన్నడు. తను కట్టేప్పుడు నేను తప్ప ఎవరూ లేరు.

"అదేంది ఉన్నరు.. నువ్వు చెప్పలేదా" అడిగాడు.

"సాంబయ్య ముందు చెపితే, మా ఆఫీసర్ని తక్కువ జేసినట్లయిద్దని, నేను కామ్ ఉన్న. పొయ్యాక 'అన్నేలం గదా. నా ముందే కట్టిండు' అన్న.

"మొన్న తాశీల్దార్ దొరాకు వస్తే కోడ్ని కోసి, దావత్ జేసినందుకు వెయ్యి ఖర్చొచ్చింది. ఎవడు పెట్టుకోవాలె. నువ్వియ్యి ఆ డబ్బులు" అని నా మీద నోరు జేసుకుండు. నేనింక గమ్మునున్న..

సాంబయ్య వదిలి పెట్టలేదు. రామారావు గారి దగ్గరకు వెళ్లి చెప్పాడు. తను వచ్చి బెదిరించాడు. దీంతో చచ్చినట్లు రశీదు ఇచ్చాడు గుర్తు లేదని. అది మనసులో వుంది.

ఇంతలో పోస్టమాన్ జానయ్య రిటైర్ గావడంతో, ఆ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకొమ్మని పేపర్ల వచ్చింది. మొత్తం ఇరవై ఏడు మంది పిలగాళ్లు పెట్టుకున్నారు. పదో తరగతి మార్కుల మీద తీసుకునేది. జమానతుగ ఎకరం భూమి అడిగింరు. సాంబయ్య ఇద్దరు పిల్లలకు చెరో ఎకరం పెట్టిండు. సైదా పట్టాదారు పాసు పుస్తకాలు కూడా ఇచ్చిండు, ఫోటోలు పెట్టి. దరఖాస్తు ఎనకాల ఏం బెట్టాలో, ఆ కాగితాలన్నీ బెట్టి పంపింది సాంబయ్య బిడ్డ నాగజ్యోతి.

అందరికంటే ఎక్కువ మార్కులు వచ్చినయి పిల్లకు, ఐదొందల దాక. సూర్యపేట పాస్టల్ సూపరింటెండెంట్ ఆర్డరు పంపిండు. అమ్మాయికి ఉద్యోగం వచ్చింది. వాళ్ల కుటుంబంలో మొదటిసారి గవురుమెంట్ ఉజ్జోగం. యాటను కోసి పండగ జేసిండు. ఎంత జీతం సార్.. మూడు వేల చిల్లర.. ఊళ్లో కొలువు. పెద్ద పనుండదు. ముందు ముందు అదే పెరుగుద్దని ఆశ. మూడ్నెల్లు జేసింది. మా వోడు నాలుగో నెలకే ఉద్యోగం పోగొట్టిండు."

"అదెలా?" ఆశ్చర్యపోతూ అడిగాను.

"చెపుతా వినండి. మొగుడు వదిలేసిన పరిమి శారమ్మ మళ్లీ

పెళ్లి చేసుకోలే. ముందు చిన్న కిరాణం పెట్టుకుని, వెనక సారా అమ్ముకుంటూ బతుకుతుండేది. 'నిన్ను ఆబ్కారోళ్లకు పట్టిస్తా. జైలుకు పంపిస్తా' అని బెదిరిచ్చిండు. పాపం పొట్ట తిప్పలకు అమ్ముకుంటుందాయె. బూవి బట్ట లేదు. నీ ఇష్టం అని సైదాకు చెయ్యి అందిచ్చింది. ఆమె అన్నకు ఇద్దరు కొడుకులు .పెద్దోడు పంతులు. చిన్నోడు ముదాం అత్త కాడ్నే వుండి చదూకునేటోడు. ఆ పిలగాడికి డిగ్రీ అయింది గాని ఉజ్జోగం లేదు. అమ్మాయి తర్వాత వాడికే ఎక్కువ మార్కులున్నయి. ఆ పిల్ల ఉజ్జోగం పోగొట్టి, దాన్ని మీ ఓడికి ఇప్పిస్తానని భరోసా ఇచ్చిండు. ఉజ్జోగమంటే సదువుకున్నోడికి ఆశేగదా సారూ. అమ్మాయి పేరు మీద ఎలాంటి భూమి లేదు. కాబట్టి ఆమెను తీసేసి, తరువాత మార్కులున్న నాకే యియ్యాల్నని దరఖాస్తు పెట్టించిండు నర్సయ్యతోటి. కొన్ని డబ్బులు గూడ ముట్టజెప్పిండు. నాకన్ని తెలస్తయి పక్కనే ఉంటగదా ఆయన సూర్యపేట నించి వెంటనే తహశీల్దారు ఆఫీసుకి మనిషిని పంపి, రిపోట్ తెమ్మన్నడు. ఆ వచ్చినాయన మేళ్లచెర్వు తహశీల్దారును కలిసి, ఈ అమ్మాయి పేరు మీద భూముందా? లేదా ? అని అడిగిండు. పహణీలో కానీ, మార్పుల రిజిష్టర్లో కానీ అమ్మాయి పేరు ఎక్కలేదు. ఎక్కితినే లెక్క. నాగజ్యోతి పేరు మీద ఎటువంటి భూమి లేదని రాసి ఇచ్చిండు. దాన్ని దగ్గర బెట్టుకుని నర్సయ్యకు ఆర్డరిస్తూ, గతంలో ఎంపికైన నాగజ్యోతి ఆర్డరును రద్దు జేసిండు.

సాంబయ్య దిమ్మెరబోయిండు. ఇంటిల్లిపాదీ ఏడ్చింది. ఆ పహణిలో ఎక్కిచ్చి, ఆర్‌డిఓతో సంతకం చేయించాల్సిన పని విఆర్‌ఒదే కావాలనే ఎక్కిలేదు. కలక్టర్కు కంప్లెయింట్ పెట్టిండు సాంబయ్య, ఆయన కిందోళ్లకు పంపిం చేసి చేతులు దులుపుకున్నడు. తశీల్దార్ మెమో యిచ్చిండు. శిస్తు వసూళ్లు బిజీలో రాయలేక పోయిన .. అని సంజాయిషీ ఇచ్చుకున్నడు సైద. ఫైలు మూసేసింగ్రు. రామారావు గారి తమ్ముడు లాయరు. ఆయన్నెంట బెట్టుకుని హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చిండు. స్టే రాంగనే నర్సయ్యను తీసేసి, పక్కనున్న కిష్టాపురం పోస్ట్మెన్ సీతారెడ్డికి ఇంచార్జి ఒప్పజెప్పిండు. స్టేతో పాటు విఆర్‌ఓని, తశీల్దార్ని, పోస్టల్ సూపరింటెండెంట్ని ప్రతివాదులుగా జేర్చి కేసు వేసిండు.

ఉద్యోగం వచ్చినట్లే వచ్చి పాయె అని సైదా గాడిని సాపిచ్చి, సాపిచ్చి నింజిలికి తినక చచ్చిపోయింది సాంబయ్య భార్య బానమ్మ.

అప్పటికి అమ్మాయి డిగ్రీ సెకండియర్ సదుతుంది. ఏడాది లోపే ఇంట్లో శుభకార్యం జరగాలని పిల్లని బూదాడుల పంతులు నౌకరు జేసే పిలగాడికిచ్చి పెళ్లి జేసిండు సాంబయ్య .

ఇంక కోర్టుల సంగతంటే మీకు తెల్వందేముంది సారూ. లాయర్ ఫోన్ చేస్తడు. 'ఇదుగో రేపే టేబులే మీద కొస్తుంది కేసు . మీ అమ్మాయికి ఉద్యోగం అయినట్టే. ఉండంగుండంగ మస్తు పెరుగుద్ది జీతం' అని చెప్పడం, కోర్టు ఖర్చులకు ఇరవై వేలు తీసక రా అనడం. గేదెల్నమ్మి, బంగారం అమ్మి, తీసుకపోయిన డబ్బులు లాయర్ చేతిల పొయ్యడం. జడ్జి పెండ్లం సచ్చిందని ఓసారి, కొడుకును అమెరికా పంపిడానికి సెలవు పెట్టిండని మరోసారి చెప్పి ఉత్త చేతుల్తో పంపెటోడు. ఎకరం భూమి గూడా అమ్మి లాయర్ సేతుల బోసిండు.

మూడేళ్లు గట్లనే పంతి బిగువున తిరిగిండు. ఇంతల పిలగాడు హైద్రాబాద్ ఇంజనీరింగ్ కాలేజిల సీటొచ్చి చేరిండు. యూని యన్లల్ల తిరిగెటోడంట. తనూ బొయ్యెటోడు లాయర్ కాడికి లక్షల కేసులాయె. కోట్లల్ల పంచాదులాయె. గిది బుద్ద పంచాతాయె కోర్టుకి తీర్పు వచ్చింది లేదు. అమ్మాయికి మళ్లీ ఉజ్జోగం కుదిరింది లేదు. ఈ కతంతా నేను, సేనుకాడికి బోయినప్పుడు చెప్పి, కంట నీరు తీసేటోడు సాంబయ్య. మాయి పక్కపక్కన కాడిగెట్టే.

"చూసింరా నా దెబ్బ. కరణం పగెంతో, నా పట్వారి పగంత. సాంబయ్య సర్వం నాశనమై పోకుంటే సూడు. కోర్టు సంగతంటే ఇప్పట్లు తెగేదా? వాడు సచ్చి మళ్ల పుట్టాలె. ఉన్న రెండెకరాలు కూడా అమ్మాలె" అని ధీరాలు తీస్తూ రొమ్ము విరుచుకుంటూ, ఊల్లె తిరిగేటోడు సైదా. రచ్చబండ మీద కూర్చున్న రెడ్డి కాడికి బొయ్యి తన ప్రతాపం కతలు కతలుగ చెప్పెటోడు. వాడన్న మాటలు తెచ్చి సాంబయ్య చెవులు ఏసెటోళ్లు. "వున్న రెండెకరాలు గూడా పోద్దా ? ఇరుకున బడితినే..." అని నింజిలి బడ్డడు. గుండె జారి మడిసి కట్టె లెక్క . డబ్బు కర్సయితుండె, తీర్పు రాకపాయె అని బేజారైపోయిండు. హైద్రాబాద్ నించి బస్సుల వస్త వస్తనే మాదారం కాడ గుండాగి సచ్చిపోయిండు.

వార్త తెలిసి సైదా, మాలిపటేల్ అమృతారెడ్డి కలిసి దావత్ జేసుకుంరు. యూనివర్సిటీ నుంచి నాగయ్య వచ్చి, తండ్రి కర్మ కాండ జేసిండు. అతని పక్కన ఇద్దరు దోస్తులు గూడ వచ్చింది. దిన వారాలు పూర్తయినయి. బంధువులంతా ఎటోళ్లటు బోయింరు.

పొద్దున్నే ఆఫీసుకాడికి బోయిన తాళం బెట్టుంది. కానీ, గదిములకున్న బొక్కల్నించి రక్తం దార కట్టినట్టుంది. గండుసీమలు బారు కట్టినయి. అర్రే.. ఏందిరా అని కిటికి నెట్టి చూసిన.. ఏవుంది సైదా ఒళ్లంత రక్తం. అందర్నీ కేకేసి పిలిసిన తాళం పగలగొట్టింరు. రాత్రి ఎప్పుడు విఆర్ ఒ దగ్గరికి వచ్చిండో, ఇద్దరి మధ్య ఏం కలబిల జరిగిందో గాని, సైదా గుండెల్నించి తుపాకి గుండు దూసక పొయింది. సాంబయ్య ఇంటికెళ్లి చూస్తే తాళం బెట్టుంది. ఆ రాత్రే బట్టలు, పనికొచ్చే కాగితాలు తీసుకుని దోస్తులతోటి ఎల్లిపోయిండనుకున్నరు జనం. పోలీసులు, రెవిన్యూ వాళ్లొచ్చి పంచనామా జేసిండు. అదయిన అర్నెల్లకి మా పటేల్ని చేనికాడ్నే గాల్సిండు. ఆటెంక జరిగిన సంగతులన్నీ పేపర్లచ్చినయ్. మీకు ఎరకేగద సారూ .. పడుకుంటా." అని దుప్పటి ముఖంపైకి లాక్కున్నాడు.

నాకు నిద్ర పట్టలేదు. ఉద్యోగుల బాధ్యతారాహిత్యం గురించి, వ్యవస్థలోని లోపాల గురించి, పేదవాడికి జరిగే అన్యాయం గురించి ఆలోచిస్తూ, ఎప్పుడో తెల్లవారుజామున నిద్రపోయా. ■

# చెట్టు కళేబరం

ఏమైంది?
పది రోజుల క్రితమేగా
నవ్వుతూ కనిపించి
పిల్లలను, పెద్దలను ఒడిలో పెట్టుకుని
కాయలను కొసిరి తినిపిస్తూ
ఒద్దిగ్గా, ముచ్చటగా ఇంటికి కాపలాలా
ప్రతి ఒక్కరి చూపులకు గొడుగుగా
పెద్దముత్తదైవలా గూడులా నీడైన
పచ్చని కాంతుల జీవకళకు
ఇప్పుడేమైంది?

పొదుగ్గా, అందంగా, బొద్దుగా  ఉందని
ఎవరో అన్నారు
ఒకడెవడో  వచ్చి కొలతలని కొలుచుకున్నాడు
బారలేసి నేలతో ఏదో మాట్లాడాడు
ఆ మరునాడే
ఏ దిష్టి తగిలిందో ఏ విషం పాకిందో
ఏమి విందో.. ఏమి తిందో
ఉలుకు లేదు పలుకు లేదు ...

చేతులు వాలి తల ఒరిగి...రూపు మారి
నాలుక లేని మూగజీవిని
ఏ మూఢత్వం మింగేసిందో?

కొమ్మలకో రేటు, మొదలుకో రేటు కట్టి
నీడను, పచ్చదనాన్ని కోసురుగా
వేరును సహితం విలువకట్టిన
పచ్చకాగితాల కాటుకు
ఇరవై ఏళ్ళ గుండె చప్పుడు ఆగిపోయింది!

కళ కళ లాడిన ఆకులు
గాలికి గలగలమని దూరమై
ఆటలకు దర్జాగా నిలచిన కొమ్మలు
నడుములిరిగి వంట చెరుకలయ్యాయి
చెట్టు కళేబరంపై డబ్బు లుకలుకలతో
పచ్చదనం సమాధిగా
ఖాళీ స్థలం కన్నీటి మడుగయింది!

**- చందలూరి నారాయణరావు**

**97044 37247**



# అన్నపు నెలవంక

ఆ ఇంట్లోకి పోయినప్పుడంతా
అన్నం నిండిన కంచం అమ్మలా
నా ఎదురుగా కూర్చునేది
ఆప్యాయత అన్నం మెతుకులుగా కనబడేది
గొంతులోకి దిగే ప్రతి ముద్దలో అమ్మ
నా బాల్యపు చెక్కిలి మీద పెట్టిన ముద్దుల శబ్దం వినపడేది

వండి పెట్టింది నా స్నేహితుడి తల్లి చేతులు కదా
రుచిలో వంద వసంతాల ఆశీర్వాదం దొరికేది
అన్నం పరబ్రహ్మ స్వరూపం అని
తప్పుడు భాష్యం చెప్పారెవరో ...
అది నిజానికి అన్నం అమ్మ రూపం
అనంతమైన ప్రేమకు అసలైన అర్థం!

ఆత్మీయులు నిండిన ఇంట్లో అన్నం తింటున్నప్పుడు
అమ్మ జోల పాట మళ్ళీ వింటున్నట్టు ఉంటుంది

అందుకే
స్నేహితుడెవరు అన్నానికి పిలిచినా
అహం లేకుండా పోతాను
కడుపునిండా తిని వస్తాను
కడుపు తీపి రుచి చూసి వస్తాను
అన్నం పెట్టిన అమ్మపై
దండిగా మొహబ్బత్ కురిపించి వస్తాను

ఈ సారి ఆ కుటుంబం మొత్తాన్ని
రంజాన్‌కి దావత్ ఇస్తున్నా
ఆ అమ్మని మా అమ్మ పక్కన కూర్చోబెడుతున్నా
నెలవంక నింగిలో పొడవడమే తరువాయి!

**- మహమూద్**

**94410 27462**






# వస్తుబలమే కథావిజయం

- విహారి
98480 25600

దొండపాటి కృష్ణ ఈనాటి పత్రికా పాఠకులకు సుపరిచితమైన పేరు. ఆంధ్రజ్యోతి, ఈనాడు, సాక్షి, ప్రజాశక్తి, వెలుగు, వార్త, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, నవ తెలంగాణ, నమస్తే తెలంగాణ, విశాలాంధ్ర, సాహిత్య ప్రస్థానం, సాహితీకిరణం వంటి రెండు రాష్ట్రాల పత్రికల్లో వేగంగా, అధికంగా, బహుళంగా కథలు రాస్తూ అనతికాలంలోనే మంచిపేరు, ప్రాచుర్యం పొందిన కథకుడు. దీనికి కారణం కథారచన పట్ల అతనికి గల ఆరాధనాభావం. అలాంటిదే సామాజిక బాధ్యతా నిబద్ధత.

కృష్ణ అంటున్నాడు, "కథ సామాజిక ప్రయోజనం కలిగించేదిగా ఉండాలని నమ్ముతాను. అసభ్య పదజాలంగానీ, రెచ్చగొట్టే సంఘటనలుగానీ, తప్పుదోవ పట్టించే సందేశాలుగానీ ఉండకుండా చూసుకుంటాను. సామాజిక కథలు, మానవత్వపు కథలు, సందేశాత్మక కథలు, కుటుంబ కథలు రాయడమంటేనే ఇష్టం" అని!

ఈ స్టేట్మెంట్ అతని చిత్తశుద్ధికీ, సాహితీపరునిగా మాత్రమే గాక పౌరునిగా కూడా అతనికిగల ఆశయాల్ని, మానవీయ విలువల పరిరక్షణ పట్ల అతనికిగల నిర్మలమైన ప్రేమనీ వెల్లడిస్తున్నది. అదే ప్రేమ రచయితగా అతని రచనలలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. దీనిని బట్టి అతని కథారచనలోని మౌలిక వాంఛితాలు శుభ్రంగా, స్వచ్ఛంగా, ఆదరణీయంగా ఉన్నాయని మనం విశ్వసించవచ్చు!

కృష్ణ కథలలో పరిసరాల పరిశీలన కనిపిస్తుంది. జీవితాల ఆక్రందన వినిపిస్తుంది. జీవన విధానం ఆవిష్కరింపబడుతుంది. ఇది ప్రాథమికంగా ప్రతి రచయితకు ఉండవలసిన లక్షణం. ఇది పుష్కలంగా కృష్ణలో ఉంది.

కథకి శీర్షిక పెట్టడం ఒక గొప్ప కళ. కృష్ణ ఆ విషయంలో ఘనాపాటి. దాదాపు ప్రతి రచనకు సరైన పేరు నిర్ణయించడం అతని ప్రత్యేకత. కొన్ని కవితాత్మకంగా ఉండి ఆకట్టుకుంటాయి.

ఈ 'రాతిగుండెలో నీళ్ళు' కృష్ణ మొదటి కథాసంపుటి. ఇందులో 16 కథలున్నాయి. ఇప్పటివరకూ అతను చేసిన కథావరివస్యలో కొన్ని 'గట్టి గింజల' ప్రోవు ఇది! సమాజాన్నీ, మనిషినీ వివిధ పార్శ్వాల నుంచి చూసి, పరిశీలించి, అధ్యయనం చేసిన కృష్ణ గవేషణ నైశిత్యం ఈ కథల్లో ప్రతిఫలిస్తున్నది.

'నీళ్ళల్లో పడి కొట్టుకుంటున్న చీమను చూసి జాలిపడటం మానెయ్యాలి. దానికో ఆకును ఆసరాగా అందివ్వాలి. అప్పుడే అది బయటపడుతుంది. దాని దారి అది చూసుకుంటుంది' అన్న సందేశంతో ఒక ఆచరణాత్మక తత్వాన్ని ఆలోచనీయం చేస్తుంది మొదటి కథ 'మళ్ళీ చిగురించారు'. సాటివాడికి సాయపడటం ఇతివృత్తం. బిచ్చగాళ్ళను అసహ్యించుకోవటం ఏ సంస్కారానికి చిహ్నం? ఇదీ ప్రశ్న. కారుణ్యంతో కడుపు నింపడం ఇతివృత్తంగా సాగిన కథ 'యాచకురాలు'. అబలల ఆక్రోశం, పురుషాధిక్య సమాజంపట్ల నిరసన 'ఉరేసుకున్న మౌనం' కథలో మోగుతుంది. ఈతరం తరుణి తల్లి పక్షాన నిలిచి 'ఎంతో కాలం సాగదు' అని హెచ్చరించి, ఆ తండ్రిలో పరిణామానికి కారణమవుతుంది. మంచి కథ!

'మనం చేయాలనుకున్న గమ్యం తెలిసి, నడిచే దారి బాగోకపోతే, కొత్తదారిని సృష్టించుకుంటాం. అలా నడిచి నలుగురికి మంచి చేస్తానంటున్న' సూర్యం అంతరంగ చిత్రణ, అతనికి సహకార హస్తాన్నిచ్చిన మంచిమనిషి చక్రధర్‌ల కథ 'వెలుగు సూరీడు'. 'రాముడికి నలుగురు కొడుకులు, ఆరుగురు కూతుళ్ళు. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉ

న్నప్పుడు అతనికిచ్చిన ఐదు సెంట్లలో పెద్ద ఇల్లు కట్టి, పది మంది సంతానాన్ని నెట్టుకొచ్చాడు. ఒక వేపచెట్టును నాటి దాని విస్తరణనీ, ఎదుగుదలనీ చూసి పులకించిపోసాగాడు. భార్య గతించింది. పిల్లల నిరాదరణ. చెట్టు పేరు భీముడు. రోజూ వచ్చి చెట్టు మొదట్లో పడుకుని భార్య జ్ఞాపకాల్ని నెమరు వేసుకోవడం, ఆరోజు జరిగినవన్నీ చెప్పడం ఆయన దినచర్య. అలా చెట్టుకీ, మనిషికీ అనుబంధం 'రాముడు-భీముడు' కథ రాముడినీ, భీముడినీ విషాదాంతం చేసింది. ఆ చెట్టు, ఆ మనిషి చితికి ఉపయోగపడటం నిజంగా కన్నీరు పెట్టించే విషాదం! కథనాన్ని ఆర్ద్రంగా నడిపి, కల్పనాత్మక వాస్తవికతకు పట్టం కట్టాడు కృష్ణ. ఇదీ కథావిజయం. ప్రశంసల్ని పొంద టానికి తోడ్పడిన అనుభూతి సాంద్రత. 'దిష్టి' కథ మూఢ నమ్మకాలపై నిరసన కాగా, దీనికి వ్యత్యస్తంగా 'డబ్బులెవరికీ ఊరికే రావు' కథలో అయాచితంగా దొరికిన డబ్బు కలిగించిన అపరాధ భావన, అంతస్సంఘర్షణ అయి, ఆ డబ్బే భార్య అనారోగ్యానికి కారణమని నమ్మి, అది దొరికిన తిరుపతికి వెళ్లి తన మనోవేదనని పరిహరించుకుంటాడు కథలో ప్రధాన పాత్ర!

'రాతిగుండెలో నీళ్ళు' హిజ్రాలపట్ల సమాజం చూపులో రావలసిన మార్పుని ఆశిస్తూ, మానవీయ స్పర్శను అందిస్తుంది. 'కొత్త స్వరం', 'ఇది కదా సంతోషం' కుటుంబ, దాంపత్య బంధాల అనుబంధాల ప్రేరణకు స్ఫూర్తినిస్తాయి. 'గుంటనక్కలు' కథ ఈనాడి యువకుల పెడధోరణికీ, ప్రేమంటూ వెంటపడే వికృత చర్యలకు చుక్క పెట్టవలసిన ఆవశ్యకతని చాటుతుంది.

ఎంతో కష్టపడి, ఇష్టంతో కట్టుకున్న ఇంటిని అమ్మేద్దామను కున్నాడు గోవింద్. దానిపై మమకారాన్ని వీడలేని అర్చన, భర్త స్నేహితుడు వేదాంత్ సాయంతో అతని మనసు ఎలా మార్చిందో 'స్వర్గసీమ' కథలో చూస్తాం. ఇందులో వాట్సాప్ మెసేజ్ కథకే అందం తెచ్చింది. ప్రేమ విఫలమైతే జీవితాన్ని కోల్పోయినట్లు భావించే యువతకు మార్గదర్శిలా 'చైతన్య కిరణం' కథ కన్పిస్తుంది. లక్షల జీతం అందుకున్నాకే పెళ్లి చేసుకుందాం అనుకున్న ప్రధాన పాత్ర, కొలీగ్ ఉదయ్ దంపతుల మాటలతో తన జీవితాన్ని ఎలా మలుచుకున్నాడో 'ఊహల రెక్కలతో ఎగరనీయ్' కథ చెప్తుంది.

... ఇలా కృష్ణ కథలు వర్తమాన సామాజికత ఆశిస్తున్న అత్యవసర పరిష్కారాల్ని ధ్వనిస్తాయి. జీవితంలోని యథాతథ స్థితిని వర్ణించడం కాక, కారణాల్ని విశ్లేషిస్తాయి. అంతేగాక, ఆయా స్థితిగతుల మౌలికాంశాలు కలిగిస్తున్న జీవన వైరుధ్యాల్ని వ్యాఖ్యానిస్తాయి. వీటి ద్వారా పాఠకులకు కొత్త పాఠాలు అందుతాయి!

## మాట్లాడే మిత్రులు

**బడిలో** పెన్నుల్ని పోగొట్టుకున్నాను
పుస్తకాల్ని పోగొట్టుకున్నాను!
**బస్సుల్లో** పర్సుల్ని పోగొట్టుకున్నాను
టిఫిన్ బాక్సుల్ని పోగొట్టుకున్నాను!
దళారుల చేతుల్లో
ప్లాట్లని పోగొట్టుకున్నాను!
దయాదుల పోరులో
ఇళ్ళను పోగొట్టుకున్నాను!
**కానీ,** మాట్లాడే మిత్రుల్ని
అక్కున చేర్చుకునే అప్తుల్ని
పోగొట్టుకోలేదు!

**- కోటం చంద్రశేఖర్**

మంచి సృజనాత్మకతకు నిదర్శనంగా నిలిచింది వినూత్న పంథాలో అతని గురించి రాసుకున్న పరిచయ వాక్యాలు. ఈ కథాసంపుటికి ముందు మాట రాసిన లబ్ధప్రతిష్టులైన రచయితలు కొన్ని మంచి సూచనలు చేశారు. అందులో ముఖ్యమైన వాటినిక్కడ ఉటంకిస్తున్నాను.

"యువ కథారచయితగా ఎంతో భవిష్యత్తు ఉన్న దొండపాటి కృష్ణ కథానిర్మాణంలో కొన్ని మెళకువలు పాటిస్తే మరింత పదునెక్కుతాడు. వాక్యనిర్మాణంలో విలక్షణత చూపించాలి. వర్ణనలో జాగ్రత్తలు పాటించాలి. దిష్టి, గుంటనక్కలు, ఉరేసుకున్న మౌనం, ఉందిలే మంచి కాలం ముందుముందునా లాంటి కథల్ని ఇంకా సానబెడితే మంచి కథలుగా రూపొందేవి."

"ఎంత గొప్ప సంఘటన అయినా, ఉన్నది ఉన్నట్టుగా చెబితే – అది Statement of fact లేదా వార్తా పత్రికలోని సమాచారం ఔతుంది. కనక కథకుడికి కొంత కల్పనా చాతుర్యం వుండాలి. కథకి చక్కటి ఎత్తుగడ, ఆసక్తికరమైన ముగింపు ప్రాణం పోస్తాయి. అంతా చెప్పేయకుండా కొంత పాఠకుడి ఊహకి వదిలేయాలి. రాసే భాషలో జీవం ఉండాలి. ముఖ్యంగా కథ ఒక జీవిత సత్యాన్ని ఆవిష్కరిస్తూ, సందేశాత్మకంగా ఉండాలి. అప్పుడు పాఠకులు కథతోపాటు తామూ ప్రయాణం చేసి రచయితకు జేజేలు పలుకుతారు."

వాటిని అనుసరిస్తే భవిష్యత్‌లో కృష్ణ నుంచి మరిన్ని మంచి కథలను కచ్చితంగా ఆశించవచ్చు. కృష్ణ కథలు రచయితగా, సాహిత్య జీవిగా ఆయన వ్యక్తిత్వ చిహ్నాల్ని, నిష్కల్మష హృదయ దర్శనాన్ని మన ముందుంచుతున్నాయి. అదే పఠనానందం! ■

## 'తెర'శాల

ఇది జరుగుతున్న చరిత్ర
కొత్త యంత్రాలు చేతుల్ని, కాళ్ళనీ కట్టేస్తూ
రోజుకొకటిగా పెరుగుతుంటే
చిక్కటి రంగుల్ని విరజిమ్మే దీపాలు
చీకటి కన్నా నల్లని భయాన్ని పుట్టిస్తాయి
అంతా స్వీయాంగీకారంతోనే
జరుగుతోందని సమాచారం!

బంధించేవి లోహపు సంకెళ్లు కావు
లాగిన్,లాగ్ అవుట్ ఆప్షన్లు
కక్షి దారులు బాహాటంగా వాదించుకోక,
స్వేచ్ఛనీ, బాధ్యతనీ పణం పెట్టి ఆడుతున్న ఆట
గెలుపు నిర్ణయించే ధైర్యం ఎవ్వరికీ లేదు!

సంచలన వార్తల్లో పెల్లుబికిన మురికిని సైతం
ఇట్టే కడిగేసే మార్గాలున్నాయి
నీతుల చిట్టాకేముంది?
మార్చి, మరోపేరుతో మళ్లీ రాసుకోవొచ్చు.

మెదడు పొరలు పొరలుగా వీగిపోయి
'అవును', 'కాదు' అనే
రెండు పదాల్లోకి ఒదిగిపోతుంది
ఇవాల్టి ఔను, రేపు కాదౌతుంది.
ఇంకోసారి 'ఏదీ' కాదంటూ
అయోమయంతో బుర్ర గోక్కుంటుంది
ఏ ప్రశ్నకైనా అవే జవాబులు!

మాటలు సైగలుగా మారి
వేలి కొసలు నిలువునా ఉబ్బి
మనసు 'డిజిటల్ తెర'గా రూపాంతరం చెందుతుంది
మనిషి రంగుల ఈకలు దిద్దుకుని
గుర్తు పట్టలేని అవతార్‌గా మారిపోతాడు
దోపిడి చేస్తున్నది శ్రమనూ, భూమినీ కాదు,
మొత్తంగా భవితను.
మెదడు ఖాళీ చేసిన చోటును
చెప్పినదానికల్లా తల ఊపే
సేవక బుద్ధితో నింపే ప్రయత్నమిది
అర్థమయ్యే లోపు తియ్యగా అణగదొక్కే
కొత్త నర్తనశాల!

**- కాళ్లకూరి శైలజ**
**98854 01882**

## ఊరి గేటు

బస్సు దిగి నిల్చుంటే దారంతా కళ్ళల్లో నిలిచేది
పిల్ల బాట లెక్కుండే ఆ దారి
పసిపిల్ల నుంచి ముసలవ్వదాకా
అందరినీ రారమ్మని పిలిచేది
పిల్లనెత్తుకొని ఎల్లన్న బిందెనెత్తుకొని లక్ష్మమ్మ
బరువులెత్తుకొని .. కట్టెలమోపు మోసుకొని ఆరాల మధ్య
వచ్చేటోళ్లకు పోయేటోళ్లకు ఆ తోవే
బతుకు దారంతా ధారలా సాగేది!

రాళ్లున్నా ..రప్పలున్నా ముల్లున్నా .. కలుపు మొక్కలున్నా
ఆ దారిలో నడుస్తుంటే
కాలికి గుచ్చుకున్న ముల్లు తీసి లెక్క చేయక
వడివడిగా నడిచేవారు!
ఆడోళ్ళ ముచ్చట్లు మొగోళ్ళ ఊరి పంచాయతీలు
మాటల గుసగుసలు నవ్వుల పకపకలు
ఆ గతుకు రోడ్డుపైనే జీవితాలు వెల్లదీసేవి!

ఎడ్ల బండిమీద పల్లెపాట పాడుకుంటూ
సైకిల్ మీద కూని రాగ మెత్తుకుంటూ
బతుకు బండి సాఫీగా సాగేది
చీకట్లో నడిచొచ్చిన వెన్నెల నిండుగా నవ్వేది!

ఆ దారిలో బస్సులు నల్ల చూరుని చల్లుకుంటూ వొస్తుంటే
పిల్లలంతా గుమిగూడేవారు
రయ్ అంటూ బైకొచ్చి వాలగానే
కారొచ్చి హారన్ కొట్టగానే ఊరంతా తొంగి తొంగి చూసేవారు!

ఇప్పుడు దారంతా నల్లరంగు పూసుకుంది
పల్లె పట్నమైంది
ఆ అచ్చట్లు ముచ్చట్లు .. మంచి చెడ్డల ఆరాలు
ఆ దారి నల్లరంగులో మసకబారి పోయాయి
ఎడ్లబండి లాగా కదలని కాలంలోకి నెట్టబడ్డాయి!
ఊరంతా రంగు రంగుల
ఇల్లులతో కొత్త వన్నెలద్దుకుంది
రంగులే రంగులు
మనుషులలో.. మనసులలో
మారనిది ఆ దారే ..
ఒంటరి పోరాటం చేస్తున్నట్టు
మనుషుల మార్పుని చూసి
మౌన పోరాటంలో దాగుంది!
కొత్త గాలి వీచినట్టు
కొత్త కొత్త దారులెన్ని పుట్టుకొచ్చినా
పాత దారి జ్ఞాపకాలు దారి పొడుగునా వీస్తుంటాయి..
ఆ దారిన నడిచే వారి మనసుని తాకుతూనే ఉంటాయి!

**– మేకల స్వప్న**
**90522 21870**



# తెలుగు కథ

# శిల్ప ప్రయోగాలు - ప్రత్యేకతలు

- డా. వి.ఆర్.రాసాని

9848443610

**అ**ప్పుడెప్పుడో 'గేథ' అనే జర్మన్ రచయిత చేతులమీదుగా పురుడు పోసుకున్న కథ చెహోవ్, మొపాసా, టాల్‌స్టాయ్, గోర్కీ లాంటి రచయితల చేతుల్లో బలాన్ని పుంజుకుని ప్రపంచ సాహిత్యంలో ఒక ప్రధాన ప్రక్రియగా నిలచిపోయింది. మనగడ్డపై ఠాగూర్, ప్రేమ్‌చంద్, యశ్‌పాల్ లాంటి మేధావుల చేతుల్లో పరిఢవిల్లి ... బండారు అచ్చమాంబ, గురజాడ, శ్రీపాద, చలం వంటి వారి చేత తెలుగు ఆకారాన్ని దాల్చింది. రా.వి.శాస్త్రి, కొకు, మునిపల్లె రాజు, కేతు లాంటి వారి కలం నుంచి జాలువారే సిరా టానిక్‌తో పరిపుష్టిని పొందింది.

ఆ తర్వాతి తరంలో మధురాంతకం రాజారాం, కె.సభా, ముదిగొండ సుజాత, అల్లం రాజయ్య, స్వామి, రాసాని, పెద్దింటి అశోక్ లాంటి ఆధునికుల ఊహల్లో కొత్త కొత్త శిల్ప సౌందర్యాన్ని సంతరించుకుంది. నిజానికి దాదాపు ముప్పయి సంవత్సరాలనుంచీ ఆధునిక రచయితులు కథాప్రక్రియలో కొత్త కొత్త శిల్ప నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ శిల్ప ప్రయోగాలన్నీ ఒక ప్రత్యేకత కలిగివుండి మారుతున్న నేటి కాలానికనుగుణంగా కథా గమనాన్ని మార్చుతూ ముందుకు పరిగెత్తింపచేస్తున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికి పాతికేళ్ల ముందు నుంచి వచ్చిన కథల్లోని శిల్ప ప్రత్యేకతల్ని సోదా హరణంగా పరిశీలిద్దాం.

ఈ ఆధునికుల కథల్లో ప్రకృతిని మానవీకరించడం, మన ప్రాచీన జానపద సాంప్రదాయ శిల్పాన్ని వాడుకోవడం, ఆంగ్లభాషలో ఆల్టస్ హక్సలీ, జేమ్స్‌జాయిస్, శామ్యూల్ బెకెట్, గ్రాహంగ్రీన్, బెల్లో, కాఫ్కా, సార్త్రె వంటి వారు ప్రయోగించిన అసంబద్ధ శిల్పపద్ధతుల్ని వాడడం, మార్క్వెజ్ లాంటి వారు ప్రవేశపెట్టిన మ్యాజిక్ రియలజాన్ని అనుసరించడం, ఎపిక్ థియేటర్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన బెర్టోల్ట్ బ్రెష్ట్ సిద్ధాంత ప్రభావంతో కథలల్లడం, మారుతున్న లుక్ కల్చర్‌కు అనుగుణం గా కథానిర్మాణాన్ని దృశ్యాత్మకంగా చేయడం లాంటి కొత్త కొత్త ప్రయోగాలు వచ్చాయి.

ఒక సంక్లిష్టమైన శిల్ప నిర్మాణం కలిగిన కథ వి. చంద్ర శేఖరరావు రాసిన 'మాయ లాంతర్'. ఈ పేరు వినగానే మనకు 'అల్లావుద్దీన్ అద్భుత దీపం' గుర్తుకొస్తుంది. మాయలు మంత్రాలు వంటి అద్భుత చర్యల్ని చేయడం దీపం ద్వారా పుట్టే భూతం చేసే పని. అలాంటి అద్భుత చర్యల్ని చూపించేది. సినీ కెమెరా. అది సృష్టించే మాయాజాలమే 'మాయ లాంతర్', సినీ జగత్తుకు ప్రతీకగా వాడే సినీయంత్రం. మాలతి అనే ఒక దళిత అమ్మాయిని కామాంధులు అత్యాచారం చేసి చంపేసిన యథార్థ గాథను సినిమాగా తీసే ఘట్టాలు ఒక వైపు, నిజాన్ని కప్పిపుచ్చి, మసిపూసి మారేడుకాయ చేసి, అత్యాచార నిందను అమాయకుడైన ఒక టీచర్ పైన నెట్టేసే ఉదంతం మరోవైపు... మాలతి పాత్రను ధరించే మోహిని తన కెరీర్ కోసం దర్శకుడైన మనోహర్‌కు లొంగిపోవడం, విలెన్ రమేష్‌రావు పాత్ర దాష్టీకాన్ని, మనోహర్ నిజ కథని తారుమారు చేసి రచయితలను అవమానించడం వంటివన్నీ అటు యథార్థాన్ని, సినీమాయనీ పడుగూపేకలా అల్లి కథను ఒక సంక్లిష్ట నిర్మాణరూపంలోకి మార్చి నడుపుతాడు రచయిత. ఇదొక విశిష్టమైనశిల్పం.

జానపద కథాశిల్పంలో ఆధునిక కథను నడిపిన వారూ ఉన్నారు. వారిలో ముందుగా చెప్పుకోదగినవారు గోపిని కరుణాకర్. ఇండ్లలోని దీపాలు ఒక చోట చేరి కథలు చెప్పుకునే జానపద ధోరణితో ఆధునిక జీవితాన్ని ఆవిష్కరించడం అన్న ఊహతో 'దీపం చెప్పిన కథలు' రాశాడు కరుణాకర్. ఈ టెక్నిక్ మన ప్రాచీన సాహిత్యంలోని భేతాళ కథలు, సింహాసన ద్వాత్రింశిక కథల్లో వుండేదే. అవి ఫక్తు జానపద కథలు. ఆ టెక్నిక్‌తో గోపిని ఈ కథలు రాశాడు. ఉదాహరణకు ఉత్తీతమ పాట మునిమాపు వేళ ఓపాత పూరింటి దీగూడులో కూర్చున్న ప్రమిద దీపం, గోధూళి తెరను తొలగించుకుంటూ చెప్పిన ఈ కథ జాతి

జీవనగతిని రచయిత ఎంత గొప్పగా పట్టుకున్నాడో తెలియజేస్తుంది.

"రైతు కంటినుంచి కన్నీటి చుక్క నేల మింద పడగూడదు. పడిందా ఆనేల నేలే రాజుకి పుట్టగతులుండవు." అన్న ఉత్తీత మాటను తీసుకుని 'అలెగొరి' పద్ధతిలో అల్లిన కథ ఇది.

లోకమంతా నిద్దటి ఉయ్యాల్లో ఊగిపోతున్న అర్ధరాత్రి వేళ ఉత్తీత పాడుకునే శోకగీతం రూపంలోనే ఈ కథ సాగిపోతుంది. కథ ఆరంభం, అంతం ఈగీతం లైన్లతోనే వుంటుంది.

దేవలోకంలో దేవుని పూలతోటకు నీళ్ళు కట్టక శృంగారంలో మునిగిపోయి, ఆ వనం ఎండిపోవడానికి కారణమైన ఉత్తీతను, ఉత్తీతుడిని సంజీవినీ కొమ్మతో కొట్టి, భూలోకంలో ఉత్తీతపక్షుల్లా పుట్టండని శపించి సంజీవిని పుల్లను వాళ్ల ముఖాన కొడతాడు దేవుడు. ఆ విధంగా భూలోకంలో పుట్టిన ఉత్తీత దంపతులు రాళ్ళసీమలో గూడు కట్టుకున్న పిదప, ఆడ ఉత్తీత గుడ్లు పెడుతుంది. ఆ గుడ్ల ద్వారా మొదట సంజీవినీ పుల్లను కొట్టి రైతును, అతనికి సాయంగా కుమ్మర, కమ్మర, మంగలి, సాలెల్ని పుట్టిస్తుంది. వారి సంతానమే పెరిగి ఇండ్లు కట్టుకుని గ్రామాలు, పట్టణాలుగా పెరిగి రాజ్యమేర్పడు తుంది. దాన్ని ఏలడానికి రాజును సృష్టిస్తే ఆరాజు రైతును పన్ను కట్టలేదని నానా హింసలు పెట్టి, అతని మెడపైన కాడిమాను పెట్టి భూమి దున్నిస్తాడు. రైతు ఏడుపుని తెలుసుకున్న ఉత్తీత వచ్చి, 'నీ రాజ్యం కూలిపోయి నీ కోటలో జిల్లేళ్ళు మొలుస్తాయ'ని రాజును శపిస్తుంది. ఫలితంగా ఆరాజ్యం పరాయిగతమై, కోట బీడుబారిపోయి జిల్లేళ్ళు మొలుస్తాయి. పెద్ద దీపం చెప్పిన కథగా ఈ ఉత్తీత కథ నిర్మాణం ఒక విశిష్టమైన జానపద సాహిత్య సాంప్రదాయ శిల్పరూపంలో సాగింది.

మనిషి కూడా ప్రకృతిలో ఒక భాగమే, కానీ తెలివి మిరిపోయిన నరుడు చెట్టు, గుట్టలు, పుట్టలు, నదులు, సముద్రాలు, పశుపక్ష్యాదులవలె తానూ ప్రకృతిలో భాగంగా గాకుండా తనను తాను ప్రత్యేకమనుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్రాచీనకాలం నుంచీ కవులు మానవున్ని ప్రకృతీ కరించడం, ప్రకృతిని మానవీకరించడం జరుగుతూనే వుంది. ప్రకృతి లక్షణాలను మానవునిలోను, మానవుని లక్షణాలు ప్రకృతిలోనూ చొప్పించి కథలూ కావ్యాలు రాయడం చేస్తూనే వున్నారు. రామాయణంలో మారీచుడు, మాయలేడిగా మారడం, రామున్ని సేవించి శబరి పంపానదిగా మారడం, భారతంలో జింకలుగా మారి శృంగారంలో వుండి పాండురాజు చేత చంపబడిన రుషిదంపతుల వృత్తాంతం వంటివి మానవున్ని ప్రకృతీకరించడం కిందికి వస్తాయి. రామాయణంలో అహల్య రాయిగా మారిపోవడం కూడా అలాంటిదే. భారతంలో నలోపాఖ్యాన ఘట్టంలో హంస నలుడితో రాయబారం నడపడం, పంచతంత్రంలో పశుపక్ష్యాదులు మనుషుల్లా ప్రవర్తించడం వంటివన్నీ ప్రకృతిని మానవీకరించడం కిందికి వస్తాయి. దీన్నే 'అలెగొరి' అంటారు. తెలుగులో మొట్టమొదట ఈ అలెగొరి పద్ధతిలో కథ రాసినవాడు చలం. ఆ కథ పేరు ' ఓ పువ్వుపూసింది'. అడవిలోని ఒక మల్లెతీగకు పుట్టిన పువ్వుమొగ్గగా, ఆతర్వాత పుష్పించి, గింజలతో అంతరించి పోవడం అంతా తల్లి తీగె, బిడ్డ పువ్వుల మధ్య జరిగే సంభాషణలాగా కథ సాగిపోయి, అంతర్లీనంగా మానవ జీవితాన్ని ధ్వనింప చేయడమనేదే ఈకథ ప్రత్యేకత. అలా పైకి ఒక కథ నడిచినా, మరో వర్తమాన కథను ధ్వనింప చేయడమనేదే అలెగొరిలోని ప్రత్యేకత. గోపిని కరుణాకర్ ఉత్తీమ పాట కూడా ఈ కోవకు చెందిందే. పి.హరినాథరెడ్డి రాసిన 'రాయలసీమ-రాతిచేప' కథ కూడా అలెగొరి పద్ధతిలోనే సాగుతుంది. నేటి కరోనాను లాక్‌డౌన్లతో బాహుబలిగా భావించుకొని, ఆల్ప్స్ పర్వతాల సానువుల్లో ఆఫ్రికన్ ఏనుగు అధ్యక్షతన జరిగిన వన్యజీవుల సమావేశంలో కరోనా గురించీ, రాయలసీమ కరువు గురించి రాతిచేప గురించి చర్చ నడుస్తుంది.

ఒక జానపద కథను కథారంభంలో ఉటంకించి వర్తమాన సమాజాన్ని కథలో ఆవిష్కరించి, ఉత్తీత పాటలో లాగానే, అదే కథా ప్రసక్తితోనే కథను ముగించడం కూడా ఒక ప్రత్యేకమైన శిల్పంగా మనం చెప్పుకోవచ్చు. దానికి మంచి ఉదాహరణ మదిగొండ సుజాతారెడ్డి రాసిన 'నిశ్శబ్దం నిశ్శబ్దం' కథ. 'అనగనగా ఒక రాజకుమారి. ఆమెను రాక్షసుడెత్తు కొనిపోయి ఒక ఎత్తయిన ఒంటి స్తంభం మేడలో బందీ చేసివుంటాడు. రాజకుమారుడు వచ్చి రాక్షసున్ని చంపి చెర విడిపిస్తాడు చిన్నప్పుడు నాయనమ్మ చెప్పిన కథను సుకన్య గుర్తు చేసుకోవడంతో ప్రారంభమవుతుందీ కథ. ఆమె భర్త ఆదిత్య హైటెక్ సిటీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు. రాత్రీపగలూ ఒకటే ఆఫీసు పని. ఎప్పుడొచ్చినా ఇంట్లోనూ కంప్యూటర్ ముందే. ఆ ఇల్లే ఆమెకు ఒంటి స్తంభపు మేడై పోయింది. ఒక రోజు కొలీగ్స్‌ను, ఫ్రెండ్స్‌ని ఇంటికి డిన్నర్‌కు పిలుస్తాడు. భార్యను వారి ముందర కసురుకుంటాడు. వారు ఆమె ముందరే తాగి, ఆమె వంటకాలు తిని తెగమెచ్చుకుని నెక్స్ట్ ప్రాజెక్టు నీకే అని మాట ఇచ్చి వెళ్ళిపోతారు. మళ్ళీ రొటీన్ వర్క్. ఆమె జీవితమంతా ఒంటరితనమే, నిశ్శబ్దమే! అందుకే కథ చివర మళ్ళీ అదే అనగనగా రాకుమారి కథ సుకన్యకు గుర్తుకొస్తుంది. ఇలా జానపద కథను దృష్టాంతంగా తీసుకుని, ఆనాటి రాజుల కాలంలోను, ఈనాటి కంప్యూటర్ల కాలంలోను స్త్రీ జీవితం ఒకేలాగుందని, బానిస జీవితమేనని చెప్పడం ఈ కథలోని సారాంశం.

సీమ కథా రచయిత బండి నారాయణస్వామి శైలి చాలా విలక్షణమైంది. శిల్పపరంగా ఎన్నో ప్రయోగాలు చేశారు. మ్యాజిక్ రియలిజం స్టైల్లో రాసిన 'రంకె' కథ దీనికి మంచి ఉదాహరణ. వ్యవసాయం సాగక బోర్లు వేసి అప్పుల పాలై, అవి తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న రైతు వరదప్పను దేవలోకంలో స్వర్గానికి పంపే ఆస్కారమున్నా దేవభటులు అతన్ని పంపరు.

తాను చేసిన పాపమేమిటని ప్రశ్నిస్తే .. అతని కాంతి రూప ఆత్మను ఆకాశంలో ఏర్పడిన రంధ్రం గుండా భూలోకానికి పంపు తాడు దేవుడు. కాడిమాను భుజానేసుకుని మడకను భార్య లాగు తుంటే, కూతురు విత్తనం వేస్తుంటుంది కొడుకు స్కూలు మానేసి మడక మేడి పట్టుకోనుంటాడు. భార్య వీధివీధి తిరిగి పూలు, కూరగాయలు అమ్ముకుంటూ వేశ్యగృహం దగ్గరకి పోయి వస్తుం టుంది. కుటుంబం మరీ పేదరికంలోకి పడిపోయివుంటే చూసి భరించలేక .. 'నేను తప్పుచేశాను. తిరిగి భూలోకంలోకి పోతాన'ంటే దేవుడు సరేనంటాడు. అతని ఆత్మ యాగంటి బసవన్న లో ఆవహించి పైకిలేచి రంకెలు వేస్తూ, పదనాల్గు బసవన్నలుగా మారిపోయి మోసం చేసే వ్యాపారుల్ని, రాజకీయ నాయకుల్ని కుమ్మికుమ్మి వారి నోళ్ళలోనుంచీ నోట్లకట్టల్ని కక్కిస్తుంది. చివరికి దేవుని దయతో వరదప్ప ఆత్మ అతని ఇంటి ఆవుకు లేగ దూడగా పుడుతుంది. ఆ లేగదూడకు రాతి గిట్టలుంటాయి. వరదప్ప స్వర్గప్రయాణం, దేవదేవుని కృపతో అతను భూలోకానికి రావడం, తిరిగి తనయింటి ఆవు కడుపున దూడగా పుట్టడం అన్నీ అద్భుతాంశాలు. ఈ అద్భుతాంశాల టెక్నిక్‌తో వాస్తవాలను పాఠకు లకు తెలియజేయడం, ఆ సమస్యల పరిష్కారాన్నీ సూచించడం అంతా మ్యాజిక్ రియలిజం. అదే ఆ కథలోవున్న శిల్పవిశేషం. ఇలా రాయలసీమ కరువు జీవితాలను మ్యాజిక్ రియలిజం శిల్పంతో స్వామి రాసిన మరో కథ 'తెల్లదయ్యం'.

పాతన్న ఒక సన్నకారు రైతు. ఒకరోజు అతని ఎద్దులు, ఎద్దులబండి కనిపించవు. ఆ తర్వాత పెండ్లాం పుస్తీ మాయమై పోతుంది. ఇంట్లో వడ్లగింజలూ మాయమైపోతాయి. వాటిని వెతుక్కుంటూ వస్తే అతని లాగే మాయమైపోయిన సారెను వెతుక్కుంటూ కుమ్మరి తిప్పన్నా, గానుగ కనిపించని గాండ్ల వెంకటేశులు, తమ పని ముట్లయిన సమ్మెట, గడారుల్ని వెతుక్కుం టూ వడ్డె రాముడు, మగ్గాన్ని తారాడుతూ నేసేమునయ్య వస్తారు. పల్లెకు మాయరోగం వచ్చింది. అందరూ పనుల కోసం భూ స్వామి, పారిశ్రామికవేత్త, వ్యాపారి అయిన పెద్దిరెడ్డి అవసరాలు తీర్చే అల్పకూలీలుగా మారిపోతుంటారు. చివరికి తమ పేడదిబ్బ, మాయమైపోయి కరెంటోళ్ళు తిండిగింజల్ని కూడా లాక్కెళతారు. కొడుకు పెద్దిరెడ్డి ఫ్యాక్టరీలో కూలీగాను మారిపోతాడు. చివరికి భార్య పెట్టే అన్నం కూడా నోటికాడికి రాగానే మాయమైపోతుంది. అప్పులప్పులు అన్న శబ్దం చేసుకుంటూ గుర్రాలపైన బ్యాంకు వాళ్ళువస్తే పాతన్న పారిపోయి ఒక బండమీద కూలబడితే అతని ముత్తాత అస్తిపంజరం వచ్చి నీ కష్టాలు పోవాలంటే తిరగబడరా అని చెప్పేసి దేక్కుంటూ వెళ్ళిపోతుంది. అతను పిడికిలి బిగించి ఇంటికొస్తే ఇంట్లో ఏ వస్తువులూ వుండవు. మూలన ఒకవేట కొడవలి మాత్రమే వుంటుంది. దాన్ని చేతిలోకి తీసుకుని వీధిలోకి వస్తే... తెల్లదయ్యం కనిపిస్తుంది. అది అన్నింటిని మింగేసి పెద్దిరెడ్డిని తన చెప్పుచేతుల్లో వుంచుకుంటుంది. పెద్దిరెడ్డి డబ్బుల సంచుల్ని బండ్లకెత్తించి పట్నంలో కట్టే రెస్టారెంట్ కోసం తరలిస్తుంటాడు, ఆ తెల్లదెయ్యం పాలిచ్చే ఆవుల్నే గాకుండా వాటి పొదుగుల్ని సైతం కోసుకు తింటుంటుంది. కత్తిపైకెత్తి పాతన్న 'ఈ భూమి నాది' అంటాడు. పెద్దిరెడ్డి కూలీల చెమటల్ను గ్లాసుల్తో తాగి బండ్లను కదిలిస్తుంటే తరలిపోతున్న గ్రామ సంపదకు అడ్డుపడుతాడు పాతప్ప. అప్పుడే కొన్ని వందల కంతాలు పల్లెలో మొలకెత్తాయి. కుగ్రామం కావడం కాదు, కుగ్రామమే ప్రపంచం కావాలి అన్న రచయిత మాటతో కథ ముగుస్తుంది. ఈ కథలో తెల్లదయ్యం అంటే ప్రపంచీకరణ. ఈ ప్రపంచీకరణ ఫలితంగా అన్ని కోల్పోతున్నదెవరో మ్యాజిక్ రియలిజం శిల్పంతో అద్భుతంగా రాశారు స్వామి.

ఈ పద్ధతిలోనే రాసాని 'శిల్ప సంగీతం' కథ రాశారు. ఒక ఉద్యానవనంలో అందంగా చెక్కబడివున్న పాల రాతిశిల్పాన్ని చూసి ఒక వెన్నెల రాత్రిలో ఒక భావుకుడు ఈ విగ్రహం మనిషై పోతే ఎంత బాగుండునో అనుకుంటాడు. అది అతని కోరిక ప్రకారం మనిషైపోతుంది. ప్రతి అమావాస్య నాడూ జీవకళవున్న స్త్రీ శిల్పాల కైలాసంలో నృత్యం చేస్తాయనీ, ఒకరోజు నేను బాగా నర్తించినందుకు నీకేం కావాలో కోరుకో అన్నాడు శివుడనీ చెపుతుంది శిల్పసుందరి. నన్ను చెక్కిన శిల్పిని చూడాలనీ, అతనితో మాట్లాడాలనీ వరం కోరాను, శివుడు తథాస్తు అని, మరుజన్మ పొందిన శిల్పి నిన్నుకలుస్తాడు. కానీ కామంతో మీరు కలవాలనుకుంటే మళ్ళీ శిలగా మారిపోతావనీ కూడా చెప్పాడనీ చెబుతుంది. కొన్ని రోజులు చెట్టా పట్టాలేసుకుని తిరుగుతారు. కానీ ఒకరోజు ఆ భావుకుడు ఆమెను వాంఛించడంతో శిలగా మారిపోతుంది. ఇదొక మనోవిశ్లేషణాత్మక కథ.

ప్రసిద్ధ తెలంగాణా రచయిత పెద్దింటి అశోక్ కుమార్ 'కాగుబొత్త' అన్న కథలోను ఎక్కడో, ఎప్పుడో ఏ సారె మీదనో రూపుదాల్చిన కాగుబొత్త తన కష్టాలను గురించి తనకు తానే చెప్పుకునే శిల్పనైపుణ్యం వుంటుంది. ఇటీవల సుంకోజి దేవేంద్రాచారి వేరే రాష్ట్రానికి వలసలు వెళ్ళిన కార్మికులు కోవిడ్ లాకౌట్ కారణంగా తమ పల్లెకు తిరిగివస్తూ కడప జిల్లాలోని ఒంటిమిట్ట రామాలయానికి సమీపంలో వున్న ఒక పాతకాలపు మంటపంలో ఆగిన వారి గురించి ఒక కథ రాశాడు. ఆకథలో వాళ్ళ బాధను చూసి ఆ మంటపం వారికి సహాయం చేయలేని తన దురవస్థను గురించి తనకు తానే 'క్షమించండి' అని చెప్పుకుంటుంది, ఇవి ప్రకృతిని మానవీకరించిన కథను నడిపే విశిష్ట శిల్పరీతికి చెందినవి. ఈ కథ మ్యాజిక్ రియలిజం కథలకు ఆద్యుడైన ఆంగ్ల రచయిత జోర్జలూయీ బోర్హెస్ (Jorge Luise Borges). ఇతను రాసిన Colected man fiction అనేదే ఈ శిల్పరీతిలో వచ్చిన మొదటి రచన. ఆ తర్వాత ఈ రచనా విధానాన్ని బాగా వెలుగులోకి తెచ్చిన రచయిత గాబ్రియేల్ గార్షియా మార్క్వెజ్. ఇతను రాసిన వన్‌హండ్రెడ్ ఇయర్స్ ఆఫ్ సాలిట్యూడ్, ఆటమ్ ఆఫ్ ది పేట్రియార్ట్, లవ్ ఇన్ ది టైం ఆఫ్ కలరా వంటి రచనల్లో ఈ టెక్నిక్ ప్రయోగించారు. పైన పేర్కొన

మొదటి నవలకి 1912 నోబెల్ బహుమతి కూడా లభించింది. ఈ మ్యాజిక్ రియలిజం పద్ధతిలో తెలుగులో మొట్టమొదట సీనియర్ రచయిత మనిపల్లెరాజుకి కథలు రాశారు. ఈ పద్ధతిలో రాసిన కథల సంపుటి 'దివోస్వప్నాలతో ముఖాముఖి'కి కేంద్ర సాహిత్య పురస్కారం లభించింది.

ప్రపంచసాహిత్యంలో అసంబద్ధ లేదా అసంగత ( obsurd) సాహిత్యానిది కూడా ఒక ప్రకియ, దీనికి ఆద్యుడుజేమ్స్‌జాయిస్ (JEMS JOYCE) ఇతను రాసిన 'యులిసిస్' నవల అసంగత సాహిత్యానికి మొదటిది. ఈ దారిలో జీన్‌పాల్‌సార్త్రె, వర్జీనియా ఉల్ఫ్‌లాంటి వారు ప్రత్యేకంగా రచనలు చేశారు, వీటన్నింటిలోకి బాగా గుర్తుండిపోయేరచన శామ్యూల్ బకెట్ రాసిన 'వెయిటింగ్ ఫర్ గోడోట్ (watingfor Godot) అన్న నాటిక. ఈ పద్ధతిలో తెలుగులో మొట్టమొదట కథలు రాసిన వారు త్రిపుర. ఆయన రాసిన అసంగత కథల సంపుటి 'త్రిపుర కథలు'.

చెప్పదలచుకున్నది అంతర్లీనంగా, చాలా మార్మికంగా వుంచి, అసంబద్ధ సంఘటనలు కల్పించి కథనల్లడం ఈ శిల్పం లోని ప్రత్యేకత. ఈ అసంగత శిల్పంలో మార్మిక గాఢత పెరిగి పాఠకుడికి సులభంగా కథ అర్థంగాకపోవడం మూలాన ఈ శిల్పం గొప్ప ప్రయోగంగా నిలబడిందే గానీ దానికి పాఠకులు తక్కువే, ఆదరణా తక్కువే. దీనివల్లా వొరిగే ప్రయోజనమూ శూన్యమే. ఆ కారణంగా త్రిపుర తర్వాత ఈ పద్ధతిని పెద్దగా ఎవరూ అనుసరించలేదు. కానీ ఈమధ్య తుమ్మల రామకృష్ణ తెల్లకాకులు, నల్లకోతులు అన్న రెండు కథలతో అసంగతం వైపు దృష్టిసారించారు. తెల్లకాకులు కథలో హైదరాబాదులోని సెంట్రల్ యూనివర్శిటీ నేపథ్యంలో తెలంగాణా మూమెంట్‌ను ధ్వనింపచేశారు. అలాగే మానసిక విశ్లేషణతో వచ్చిన కథలు చాలా తక్కువ. నిజానికి ప్రతికథలోనూ, నవలలోను కాస్తంత మనస్తత్వ చిత్రణ వుంటుందికానీ ఫ్రాయిడ్, యుంగ్, అడ్లర్ లాంటి మానసిక వేత్తల సూత్రాలకనుగుణమంగా రాసిన రచనలు పెద్దగా లేవు. ఆంగ్లంలో మొదట ఆస్కార్‌వైల్డ్ 'ది పిక్చర్ ఆఫ్ డొరియన్‌గ్రే' అన్న నవల రాశాడు. దాని ప్రభావంతోనే తెలుగులో త్రిపురనేని గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర, రావిశాస్త్రి 'అల్పజీవి', బుచ్చిబాబు 'చివరికి మిగిలేది', జి.వి.కృష్ణారావు 'కీలుబొమ్మలు', 'అంపశయ్య నవీన్' అంపశయ్య', కాశీభట్ల వేణుగోపాల్ 'నేనూ–చీకటి', రాసాని 'స్వప్నజీవి' వంటి నవలలు వచ్చాయి. కాస్త మానసిక చిత్రణతో శ్రీశ్రీ 'చరమరాత్రి' కథలు రాసినా అవి పాఠకుల గుర్తింపునకు నోచుకోలేదు. ఆ తర్వాత వాటి జోలికి ఎవ్వరూపోలేదు, కానీ ఇటీవల వి.ఆర్.రాసాని రెండు కథలు రాశారు. అవి ఒకటి దెయ్యం, రెండోది గుండెగృహంలో నెత్తుటి దీపం. 'దెయ్యం' స్కిజో ఫ్రేనియా కాంప్లెక్స్‌కు సంబంధించిన కథ, కొన్ని ఏవో భ్రమల్ని కల్పించుకుని వాటినే నిజాలనుకొని మానసిక రోగిగా మారి పోవడాన్నే 'స్కిజోఫ్రేనియా' అంటారు. ఒక వ్యక్తి నిద్రంటే భయపడి పోతుంటాడు. ఎందుకంటే నిద్రపోతే చాలు. ఎవరో తనను వెంటాడుతున్నట్టు, చంపడానికి ప్రయత్నిస్తున్నట్టు కలలొస్తాయి. కలలో ఒక నల్లని ఆకారం గుండెలపైన కూర్చొని ఊపిరాడ నీయకుండా చేస్తుంటుంది. కలలోని విషయాలనే నిజాలనుకొని మానసిక విక్షిప్తికిలోనై ఇల్లొదిలి పారిపోతాడు. పాఠకున్ని సైతం భయానికి గురిచేసే వేగవంతమైన శైలీశిల్పం ఇందులో వుంటుంది.

కాస్త మాంత్రికవాదాన్ని, మరికాస్త అసంబద్ధ విధానాన్ని భాషలో పోస్ట్ మోడ్రనిజాన్ని చొప్పించి, పాఠకున్ని ఆశ్చర్యానికి గురిచేసే శిల్పనైపుణ్యంతో అల్లిన కథ ' గుండెగృహంలో నెత్తుటి దీపం' చిన్నప్పటినుంచీ ఒక వ్యకి గుండెలోకి ఎందరో వస్తుం టారు, పోతుంటారు. కొందరు మాత్రం తిష్ట వేసుకుంటే, మరికొందరు ఏం చేసినా పోని, గోడకు అతికించిన బొమ్మల్లా వుండిపోతారు. అతనికి వయసు రాగానే అతని సతీమణి అతని గుండెలో దూరి అక్కడున్న రక్తసింహాసనాన్ని అధిరోహించి, చేతిలో ప్రత్యక్షమయ్యే చీపురుకర్రతో కొట్టి కొట్టి తరిమేస్తుంది. ఆ విధంగా ఆ వ్యక్తి అక్కచెల్లెళ్లను, అన్నదమ్ముళ్ల ను, అయిన వారందరినీ తరిమేస్తుంది. ఎందరో స్నేహితుల్ని కట్టెతోకొట్టి తరిమేస్తుంది. కానీ అతని స్నేహితుడొకడు గుండె అరల్లోనే దాక్కొని తప్పించుకుంటాడు. అతని ఫొటో, తల్లిదండ్రుల చిత్రాలు గోడకు అతికించబడివుంటాయి. ఆమె గోకుడు పారతో గుండె గోడల్ని రాకిరాకీ ఆ బొమ్మల్ని తుడిచేయాలని చూస్తుంటే అతని గుండె కిటికీలు మూసుకుపోయి చివరకి తలుపూ మూసుకు పోతుంది. ఫలితంగా హార్ట్ అటాకొచ్చి, హాస్పిటల్లో బెడ్‌పైన అతను చేరిపోతాడు. అయినా అతన్ని కాపాడడానికీ, తిరిగి మనిషిగా చేయడానికి అతని గుండెలోకి జొరబడానికి స్నేహితుడు ప్రయత్నిస్తూనే వుంటాడు. ఇది స్నేహితుడి నోటి వెంట వచ్చే మధ్యమ పురుషలో సాగే కథ.

సాధారణంగా చాలా కథలు ప్రథమ పురుషలోను, అప్పు డప్పుడు ఉత్తమ పురుషలోను నడిచే కథలుగానే వుంటాయి. 'నువ్వు నువ్వు' అంటూ మధ్యమ పురుషలో సాగే కథలు చాలా అరుదైనవి. మధ్యమ పురుషలో కథలు రాయడం చాలా కష్టం. అలాంటి కష్టతరమైన మధ్యమ పురుషలో రాసాని కొన్ని కథలు రాయడం విశేషం. అలా రాసిన ఈ కథే గాకుండా 'నేను నిప్పు లాంటి మనిషి సుబ్బయ్యా, మూడు మనువులాయె, ముగ్గురితో సంసారమాయ. అయినా నేను నిప్పులాంటిదాన్ని అబ్బయ్యా. నిజం చెబుతావినుకోండి' అంటూ కల్లు తాగిన మత్తులో నాంచారి అనే ఎరుకలస్త్రీ తన జీవితం గురించి ఒక ప్రొలాంగ్ స్పీచ్‌లా చెప్పిన కథ 'నల్లపూసలు'. అదే శిల్పంతో సెజ్‌ల నేపథ్యంలో సెజ్‌ల పేరుతో తనభూమినీ ఆక్రమించుకుంటున్న సర్కారుతో పోట్లాడి తలపగిలి ఆస్పత్రికి చేరిన భర్తతో సిద్ధమున్నిమ్మ అనే రైతు మహిళ, అతని జీవిత కథను అతనికే చెబుతూ గానం చేయడం 'రియల్‌పార్క్' అన్న కథలో వున్న విశేషం. ఇదే విధంగా

రాసాని ఉత్తమ పురుషను, ప్రథమ పురుషనీ మేళవించి అల్లిన కథ 'అమ్మా! అమ్మా! నన్నుచంపేయవూ... తల్లి గర్భంలోని శిశువు మాట్లాడేదంతా ఉత్తమ పురుషలోను, ఆ శిశువుకు కాబోయే తల్లిదండ్రుల గురించిన అంశమంతా ప్రథమ పురుషలోనూ నడిపించారు. ఇలా రాసాని కథా నిర్మాణంలో చాలా ప్రయోగాలే చేశాడు. తన చిన్నప్పటి ఆటపాటల్ని, సంఘటల్ని ఆధారం చేసుకుని 'మావూరి కత'లు రాశారు. ఈ కథలన్నీ ఒక మనిషి మరొక మనిషితో ఆడుకోవడం అనే తాత్త్విక నేపథ్య శిల్పంతో చెక్కబడినవే.


ఈనాడు బుక్‌కల్చర్ పోయి లుక్‌కల్చర్ వచ్చేసింది. టీవీ సీరియల్స్‌కీ, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబు లాంటి సామాజిక మాధ్యమాలకు మనుషులు బాగా అలవాటు పడిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో కథారచనలోను దృశ్యాత్మకత పెంచితే గానీ మనుషుల్ని మళ్ళీ పుస్తకం వైపు లేదా సాహిత్యం వైపు మళ్లించడం సాధ్యంకాదు. ఆ నిజాన్ని తెలుసుకుని కథ అయినా నవల అయినా ఒక దృశ్యం చూస్తున్నట్టు అనిపించే విధంగా కథానిర్మాణశిల్పంలోను మార్పుచేసి రాసాని కొన్ని కథలు రాశాడు. నెత్తిమోపు గంగమ్మను మోసే ఒక కళాకారుడు తనకు భూస్వామివల్లా జరిగిన అన్యాయాన్ని వీరజాటీతో కొట్టుకుంటూ, గంగమ్మ చిందు వేసి నర్తిస్తూ కథను నడిపిస్తాడు వీరజాటీకథలో. మహితిలో ప్రదర్శింపబడిన నాటకరూపంలో ఈనాడు మనిషి హృదయం నుంచీ కనుమరుగైపోయిన మానవత్వాన్ని గురించి 'మనిషి పారిపోయాడు' కథలో చెబుతాడు. మఠాలలో, సన్యాసుల ఆశ్రమాల్లో జరిగే మోసాలను 'హత్య' అనే నాటక ప్రదర్శన రూపంలో కథను నడిపించారు. బుడిగె జంగం వాళ్ళు చెప్పే బుర్రకథను ఆధారం చేసుకుని 'పొగిడింపు' కథను, ఒక అనాథ పిల్లవాన్ని సాకి, చదివించి చార్టెడ్ అకౌంటెంటుగా మార్చిన ఒక హిజ్రాగురించి విరాటపర్వం హరికథ చెప్పే సంఘటనను చొప్పించి 'తృతీయవర్గం' కథగా చెక్కాడు రాసాని.

ప్రసిద్ధ జర్మనీ నాటక కర్త బెర్తాల్డ్ బ్రెహ్ట్ (Bertolt Brecht) కావ్య కళారంగం (Epic Theatre) అనే ఒక కొత్త సిద్ధాంతాన్ని తెచ్చారు. ప్రేక్షకులు నాటకం చూసేటప్పుడు అందులో లీనమైపోయి అదే నిజమనుకునే భ్రమలో పడిపోతారు, దాన్ని భగ్నం చేసి ప్రేక్షకున్ని పాసివ్‌స్పెక్టేటర్‌గా గాకుండా విమర్శనాత్మకంగా పరిశీలించడం జరిగి, ప్రేక్షకున్ని యాక్టివ్ స్పెక్టేటర్‌గా వుంచాలనేది ఎపిక్ థియేటర్ ప్రధాన లక్షణం. దీన్ని మొదట ప్రతిపాదించినవాడు ఇర్విన్‌పిస్‌కాటర్ (Erwin Piscator). ప్రేక్షకుడి తాదాత్మ్య స్థితిని భగ్నం చేసి భ్రాంతి నుంచి వేరు చేయాలి. అందుకోసం మధ్యమధ్యలో పాటలు, ప్రయోక్త వ్యాఖ్యానాలు, నిశ్చల స్థితులు, ఫిల్మ్ క్లిప్పింగులు వంటివి ప్రదర్శనలో తీసుకురావాలి. ఇలా తీసుకు వచ్చే విధానాలను అలియనేషన్స్, ఫ్రీజ్, హిస్టారిపికేషన్ అని మూడు విధాలుగా చెప్తారు. అందులో హిస్టారిఫికేషన్ అంటే ఒక చారిత్రక సంఘటనను ఉటంకిస్తూనే వర్తమానంలో కథ నడపడం. ఈ హిస్టారిఫికేషన్‌ని కథలోను చొప్పించి అద్భుతంగా కథ నడిపించిన వాడు కూడా రాసానియే. ఆ కథపేరు 'బుసీఫెలస్ నువ్వు అనాధవు కావు'.

తిరుపతి ప్రాంతాంలో ఒకప్పుడు గుర్రబ్బండి తోలుకుని సంసారం నడిపినవాడు మహబూబ్‌భాషా. అతని ఇంటి గుర్రం ఒక తెల్లటి మగ గుర్రాన్ని కంటుంది. అది చాలా అందంగా గంభీరంగా వుంటుంది. అందుకని దానికి అలెగ్జాండర్ గుర్రం పేరయిన 'బుసీఫెలస్' అని పేరు పెట్టి, అల్లారుముద్దుగా పెంచుతాడు. తాను 7వ తరగతి చదివే రోజుల్లో అలెగ్జాండర్ గురించిన పాఠ్యాంశంలో అలెగ్జాండర్ గుర్రంపైన కత్తిపట్టి వస్తున్నట్టున్న బొమ్మ అతనికి పదేపదే గుర్తుకు వస్తూ తన జీవితకథను నడిపిస్తుంది. అతను ముసలాడైనాక అదీ ముసలిదైపోయి కొడుకు నిరాదరణకు గురై దుర్భరావస్థకు చేరుకోవడం వుంటుంది. బ్రెహ్ట్ నాటక ప్రయోగమైన ఎపిక్‌థియేటర్లోని పాయింటును కథలో ప్రయోగించి రాసిన కథ తెలుగులో ఇదొకటేనని చెప్పవచ్చు. ఇదొక ప్రత్యేక శిల్పప్రయోగం.

గత పాతికేళ్ళ నుంచి వచ్చిన తెలుగు కథల్లో కనిపించిన కొత్త శిల్ప విశేషాలివి. వీటిలో ప్రధానంగా మ్యాజిక్ రియలిజం, అసంగత విధానం, దృశ్యాత్మక ప్రయోగం, ఎపిక్‌థియేటర్ ప్రయోగం వంటి వాటితో రాసిన ప్రత్యేక శిల్పప్రయోగాలు కనిపిస్తాయి. అయితే కథా ప్రక్రియను పరిపుష్టం చేస్తూ, కొత్త శిల్పనైపుణ్యంతో బలోపేతం చేసిన వారు ఎక్కువగా రాయలసీమ రచయితలే కావడం చెప్పుకోవలసిన అంశం. కరువు కాటకాలతో ఆర్థికంగా వెనుకబడిన రాయలసీమ సాహిత్యపరంగా అందరికంటే ముందే నడుస్తోందని చెప్పడానికి ఈ అంశాలు చాలా ఉపయోగ పడతాయి. ఇలాంటి ప్రయోగాత్మక శిల్పం వున్న కథలను ఎవరైనా ఒక సంకలనంగా తెచ్చి, వాటిని ఆంగ్లంలోకి అనువదించి ప్రపంచానికి అందిస్తే, తెలుగు కథ ప్రపంచ కథాసాహిత్యంలో దేనికీ తీసిపోదనీ, తెలుగు కథ ముందు స్థానంలోనే ఉంటుందనీ ఘంటాపథంగా చెప్పవచ్చు. ■

**పుస్తకాలునా మనస్సుకూ, హృదయానికీ**
**రెక్కలనిచ్చాయి.**
**నేను బురద నుంచి బయటపడటానికి ఎంతో తోడ్పడ్డాయి**
**పుస్తకాలు చదవకపోతే**
**నా చుట్టూవున్న మౌఢ్యంలోనూ, నీచంలోనూ**
**మునిగిపోయి వుండేవాడ్ని.**
**విశాలమైన ప్రపంచ దృశ్యాలను**
**పుస్తకాలు నా ముందు పరిచాయి**
**– మాక్సిం గోర్కీ**






# వశిష్ఠ రాసిన విశిష్ఠ కవిత్వం

- ఎ.రజాహుస్సేన్

**క**వి సోమేపల్లి వెంకటసుబ్బయ్య గారి కుమారుడు ఈ కవి. అంటే తండ్రికి కవిత్వ వారసుడు శ్రీ వశిష్ఠ సోమేపల్లి. వశిష్ఠ తొలి కవితా సంపుటి 'ఆకురాలినచప్పుడు'. సామాజిక రుగ్మతల్ని, తాడిత, పీడిత జనం బాధల్ని అర్థం చేసుకొని కలం పట్టాడు కనుకనే వశిష్ఠ కవిత్వంలో 'ఆకురాలిన చప్పుడు' వినిపిస్తుంది.

కాలం జెట్ స్పీడుకంటే వేగంగా దూసుకెళ్తోంది. మనిషి యంత్రుడైపోయాడు. మనిషి వాసనలేని సమాజంలో బతుకుతున్నాం. పరిస్థితి ఇలానే కొనసాగితే చివరకు ఏమవుతాం?

' కాలం జరిగాక తవ్విచూస్తే..
శిలగా మిగులుతానో
శిల్పమై ఎదురొస్తానో
శిలాజంగా దొరుకుతానో
ఇప్పటికైతే వట్టి మట్టి ముద్దను మాత్రమే' అంటాడు కవి.

కవిత్వాన్ని, సమాజాన్ని మాత్రమే కాదు, జీవితాన్నీ అర్థం చేసుకున్నాడు కనుకనే 'మనదికాని వో పరాయి క్షణాన్ని హత్తుకొని వ్యధపడటమే జీవితం' అంటూ తీర్మానించాడు.

' సమూహం నుండి వేరుపడడం కాకుండా,
వేరుపడీ పడలేకపోవడమా
అసలైన ఒంటరితనం!
ఎప్పటికప్పుడు
ఆ నిముషాన్ని ఆరనీయక పోవడమే కదా బతుకంటే" అంటాడు ఈ కవి వశిష్ఠ.

'స్పృహలేని మనుషులమా?' మనం.
'వాదాల్ని, మనిషితనాన్ని తూకమేస్తూ
ఫాస్ట్ ట్రాక్‌లో తీర్పులు విసరడానికి
స్పర్శలేని చట్టాలం కాదుగా
.......
తూచే రాళ్ళేవైనా గానీ
వాదమో.. ధర్మమో.. దూరమో
చెంపలపై పరుచుకున్న
ఉప్పునీటి సంద్రాలకన్నా బరువైనవా?
వాదాలనెంత మోసినా
మనిషి అసలు నిర్వచనం ఉద్వేగమే'!

మనిషి గురించి ఇంత లోతుగా చెప్పిన కవులు బహు అరుదు. ఈ కవి భావన సముద్రం కంటే విస్తృతమైంది. నేనీ మధ్య చదివిన కవిత్వంలో విశిష్టమైన కవిత్వం ఈ కవి వశిష్ఠది.

'అప్పటికే కొన్ని లక్షల ముక్కలైన ఓ బిందువు
కిటికీ చువ్వపై చింది మరిన్ని చినుకులైంది
అప్పటికే నిద్రపోవాల్సిన
ఓ ఒంటరి చెంపపై తుప్పరగా వాలింది
దుప్పట్లోకి చేరాక దూరాల్సిన జ్ఞాపకాలేవో
దుప్పటిలా కప్పేశాయి..
.......
ఎప్పటినుండో పాతుకున్న జీవితం
భుజాల కొమ్మలపై రెక్కల కలలు
పొగల్లా తిరిగే మనుషుల బతుకు వాసనలు'

సమాజంలో ఛిద్రమైన ఓ మానసిక స్థితిని చెప్పడానికి ఈ కవి వాడిన అలంకారాలు మేలిమి కవిత్వానికి ఆనవాళ్ళుగా చెప్పొచ్చు.

మనుషులు కులాలుగా,మతాలుగా, ప్రాంతాలుగా విడిపోయారు. ఒకరిపట్ల ఇంకొకరు విద్వేషం పెంచుకొని అసలు మనిషనే వాడే లేకుండా చేస్తున్నారు.

'నగరంలో విద్వేషపు వాన కురిసింది

మతం నిండిన మబ్బులు రక్తాన్ని రాల్చాయి
గుండెలు తెగిన వీధులు
మనుషుల దేహాల్ని మోస్తున్నాయి.
వెళుతూ వెళుతూ వాన
మనిషినీ తీసుకు వెళ్ళిపోయింది
శవాల్ని పంచుకుంటున్న మతాలు
మరిన్ని వానలకు
మనసులు చిలుకుతున్నాయి'

ఢిల్లీ మత ఘర్షణల నేపథ్యంలో లోకం విద్వేషపు దావానలంగా మారుతున్న సందర్భంలో మనుషుల కోసం కలగంటున్న ఈ కవి కల నిజంగా గొప్పది!

ఈ 'వేదన శిఖరం' చూడండి.

'భుజాన దేశాన్ని మోస్తున్నామంటూ
వాళ్ళెవరో వచ్చారు
నెపమంతా పేరు మీద తోసి
మా ఊరి బొడ్రాయికి మతాన్ని పులిమారు
చెమటపూసే దేహపు తోటల మధ్యన
మంటపెట్టి చలికాచుకునే దుష్ట ప్రణాళికది
ద్వేషమంతా దేశంపేరులో కుక్కి
దేశభక్త నిరూపణ సవాళ్ళు పొడిచిపోయారు!'

కవి ఎవరినుద్దేశించి రాశాడో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ అభినవ దేశభక్తులు మతాన్ని చిలికి ఓట్లు తీస్తున్నారు. ద్వేషమనే విషాన్ని గాల్లో కలుపుతున్నారు. జనాన్ని మతం పేర విడదీసి రాజకీయ ప్రయోజనాలను పొందుతున్నారు. 'భారత్ మాతాకి జై' అన్న నినాదాన్ని ఒక వర్గానికి పరిమితం చేసి చోద్యం చూస్తున్నారు. విద్వేషపు సేద్యం చేస్తున్నారు.

వేదన... వేదన... ఈ కవిత్వమంతా వేదనా భరితమే! తన కోసం కాదు సుమా.. దేశం కోసం, మనుషుల కోసం ఈ కవి వేదనా శకలమయ్యాడు. ఇంత బాధని గుండెలో మోస్తూ, గాయాన్ని సహిస్తూ, దు:ఖాన్ని భరిస్తూ సమాజంలో 'ఆకురాలిన చప్పుడు' విని కవిత్వం చేశాడీ కవి విశిష్ట వశిష్ఠ.

ఈ కవిత్వం నిండా అందమైన, ఆలోచింపజేసే పదచిత్రాలే. చదువుతుంటే రోమాలు నిక్కబొడుచుకుంటాయి. ఈ తరం వర్ధమాన కవులంతా ఈ కవిత్వాన్ని సిలబస్‌గా చదవాలి!

' పిడికిళ్ళుగా బిగియలేక
చప్పట్లుగానే మిగిలిపోయిన చేతులు' (ఇప్పటికైతే)
'మనదికాని ఓ పరాయి క్షణాన్ని
హత్తుకొని వ్యధపడటమే జీవితం'
' అప్పుడప్పుడూ ఏడ్వాలి
కొద్దిగా బరువుల్ని జార్చుకోవడానికే కాదు
జ్ఞాపకాల్ని ఇంకొంచెం మోయడానికి' (అప్పుడప్పుడూ..)
'మనిషి గుండెల్లో
ఏ క్రిమి జొరబడిందో ఏమో
దేశం గుండెకు పుండు పడింది' (గుండెకూ)
'మనుషులు పిట్ట కథలు చెప్పుకుంటున్నట్టే
పిట్టలూ మనుషుల కథలు చెప్పుకుంటాయి' (పిట్టకథ)
'పోతూ పోతూ
ఆకలికోసం కాని పోరు
అసలు యుద్ధమెలా అవుతుందంటూ
పిట్ట ఎగిరిపోయింది' (పిట్టకథ)
' అక్కర్లేని దీపం
అసహనాన్ని పుట్టించడం
నిద్రలనార్పటమే కాదు
కొన్ని జీవితాల్లో
చీకట్లనూ ముట్టిస్తుంది' (నిశికోసం)
'అవే గోడల మధ్యన
మరోసారి నెత్తురు స్రవిస్తున్న
రాజ్యాంగాక్షరాలు' (బాణలి)
'పిట్టకి గూట్లో గుడ్డు ప్రపంచమైంది
ప్రపంచమెగిరిపోయి
మళ్ళీ తనువు గొంతౌతోంది' (ఆమనిగీతం)
'ప్రతి విప్లవమూ ఎప్పటికప్పటికి శీతాకాలమే
మరో కొత్త విప్లవ వసంత పూతకువిత్తనమే' (ఆమనిగీతం)

గుండెతడి వున్న ప్రతి ఒక్కరూ తప్పక చదవాల్సిన కవిత్వం 'ఆకురాలిన చప్పుడు.' కవి వశిష్ఠకు ఇది తొలి కవితా సంపుటి అంటే నమ్మడం కాస్తంత కష్టమే. అంతగా అనుభవ సాంద్రతను నింపాడు కవి. తప్పక చదవండి. 128 పేజీలు, ధరరూ.120

ప్రతులకు : ఛాయా రిసోర్సెస్ సెంటర్, హైదరాబాద్.
ఫోన్: 98480 23384. ■

**అక్షరం**
**చిగురిస్తే శబ్దమౌతుంది..**
**తీగ సాగితే వాక్యమౌతుంది**
**పందిరంత విస్తరిస్తే గ్రంథమౌతుంది**
**సమస్త వాఙ్మయ సృష్టికి బీజరూపం అక్షరమే!**

**– డా. సి.నారాయణరెడ్డి**



## ఆకు జెండా కింద ...

**క**టువుదేలిన గుండె
గొడ్డలి భాష మాట్లాడుతోంది
ఖండితమై .. చెట్టు నెత్తురోడుతోంది!

పక్షి తన పాటలో ..
మాధుర్యాన్ని కోల్పోయింది
ఏడ్చీ ఏడ్చీ కన్నీరింకిన నది
ఎండిన చేప ముళ్లలాగుంది !

అదేమిటో ..
మట్టి పచ్చగా మొలకెత్తాల్సినచోట
మహానగరాలు చిగురిస్తున్నాయి !

రాతికొయ్యల ఆవాసాల మధ్య
రాలేపూలు – కన్నీళ్లు
భూగోళం – ఓ పక్షిగూడు
చెదరగొట్టేసాడు మనిషి !

ఇప్పుడు ..
గుప్పెడు మట్టికోసం
నేలంతా వెతుకులాడుతూ .. మనం
వేళ్లతోసహా కూలిపోతున్న
ఆకుపచ్చని దేహాల మధ్య ..
అవనతమయ్యే ఆకుజెండా కింద
అశ్రుగీతాన్ని ఆలపిస్తూ .. మనం!

**- సిరికి స్వామినాయుడు**
9494010330

## రుబాయిలు

1
విశాఖ ఉక్కును తుక్కుగా చూసారు
బతికే హక్కును ముక్కలు చేసారు
కాదేదీ అనర్హం ఇక్కడ అమ్ముకోడానికి!
కార్మిక కర్షకులే భావి చరిత్రను రాస్తారు

2
కలల అలలకు అలుపు రాదు
సదాశయాలకు ఓటమి వుండదు
కదిలితేనే క్రాంతిని చూస్తావు భాయి!
శ్రమ చైతన్యానికి ఎదురులేదు

3
మాకెందుకు ఈ వలస బతుకులు
ఎన్నటికీ మారని ఈ జీవితాలు
ఫలితమివ్వని పథకాలెందుకు భాయి!
నిలబడవు ప్రజలపక్షం లేని ప్రభుత్వాలు

4
సూర్యుణ్ణి చూసి గువ్వలు ఎగిరాయి
చంద్రుణ్ణి చూసి కలువలు విరిసాయి
ప్రకృతి అంటే మన మంచిని కోరే నేస్తం సోదరా!
భేదాలు తేడాలు ఈ మనుజుల దగ్గరేనోయి ...

5
వాళ్ళు క్రీడల్లో ప్రతిభను చూపుతారు
దేశానికి పలు పతకాలను అందిస్తారు
మన బిడ్డలను మనమే ముంచేద్దామా భాయి!
ఎవరు పడగ నీడన ఎదుగుతారు

6
ప్రేమకవితలు రాసి అదే ప్రేమనకు
వట్టిమాటలు చెప్పి అవే ఆశయాలకు
బతుకుదారిన భ్రమలెదురైనా భాయి!
రేపటి రోజొకటి వస్తుందని మరువకు

**- బి. గోవర్ధనరావు**
9441968930





# అభయారణ్యం

- గన్నవరపు
నరసింహామూర్తి
77520 20123

**ఉ**దయం పదిగంటలైంది. హేమంతం కావడంతో బయట వాతావరణం చల్లగా ఉంది. నేను ఆసమయంలో నా కార్లో హైకోర్టుకి బయలుదేరాను. బయట, కారులోపల ఏసి వల్ల వాతావరణం చల్లగా ఉన్నా నాకు ముఖం మీద చెమటలు పడతున్నాయి. దానికి కారణం ఆ రోజు నేను హైకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ యొక్క తీర్పు వచ్చే రాబోతోంది. అందువల్ల నాలో అంతర్లీనంగా అలజడి మొదలైంది. బహుశా అందుకే చెమటలు. ఈరోజు ఏం జరగబోతోంది తనకు.

నా ఆలోచనలు కారు కన్న వేగంగా పరిగెడుతునాయి.. ఏం జరుగుతుందీ రోజు.. తనకు అనకూలంగా తీర్పు వస్తుందా? వస్తే తనకే కాదు కొన్ని లక్షల మంది గిరిజనుల కది మంచి చేస్తుంది. వాళ్ళ ఉనికిని కాపాడుతుంది..–

ఒకవేళ వ్యతిరేకంగా వస్తే ... అప్పుడు పెట్టుబడీదారులు, వాళ్ళకి వత్తాసు పలికే ప్రభుత్వాలు రెచ్చిపోతాయి. ఇంక వాళ్ళకెదురుండదు. ఏవిధమైన ప్రజా వ్యతిరేక చట్టాలనైనా తెచ్చుకునే అవకాశం కలుగుతుంది. ఇంతకీ ఆ కేసేమిటి? తానేందుకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏకంగా హైకోర్టులో పిటీషన్ వేసాడు? ఆ చీకటి చట్టంలో ఏముంది? ఆలోచనలతో మెదడు వేడెక్కి పోతోంది. గతాన్ని గుర్తుకు తెస్తోంది.

■■■

ఏడాది క్రితం నేను దండ కారణ్య ప్రాంతంలోని తూర్పు కనుమలకి వెళ్ళాను. ఆ ప్రాంతమంతా పచ్చగా తివాసీ పరిచనట్లుంది. ఒక వైపు అంబరాన్ని చుంబించే గిరిశిఖరాలు, ఇంకో పక్క పచ్చటి లోయలు, మధ్యలో తలలోని పాపిడిలా వంపులు తిరిగే రోడ్డు... ప్రతి పది కిలోమీటర్లకు ఎత్తైన కొండ మీద నుంచి ఉరుకుతున్న పాలనురుగు లాంటి జలధారలు. మధ్య మధ్యలో ఎన్నో అడవి జంతువులు... ఒక దగ్గర మాకు చిరుత ఎదురైంది. నేను జీపు ఆపి ఫొటోలు తీసే సమయానికి అది మమ్మల్ని చూస్తూ లోయలోకి వెళ్ళి పోయింది. అలాగే ఎలుగుబంట్లు, లేళ్ళు, దుప్పెలు, అడవి నక్కలు, దుమ్మరు గుండ్లు.. ఇలా ఎన్నో ఎదురయ్యాయి. పచ్చటి అభయారణ్యం కాబట్టి అవి స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి. ఇంకో పక్క పచ్చటి అడవులు.. పొడవైన సిల్వర్ ఓక్, యూకలిప్టస్ చెట్లు... వాటి మీద ఎగురుతూ వేల వేల పక్షులు... కారు శబ్దాన్ని పక్షుల కిలకిలారావాలు మైమరిపిస్తున్నాయి. ఎర్రటి చిలకలు, ఆకుపచ్చటి రామచిలుకలు, తెల్ల కాకులు, గుడ్లగూబలు, తెల్లటి, నల్లటి పావురాలు, ఊర పిచ్చుకలు, గూడ కొంగలు, గెద్దలు, రాబందులు, డేగలు.. వీటి అరుపుల తో అరణ్యమంతా పులకించిపోతోంది. మధ్యలో నల్ల కోకిల కలకూజితాలు నేపధ్య సంగీతంలా వినిపిస్తున్నాయి.

మాతో వచ్చిన గైడు ఆ అడవిలో పది పులులు కూడా సంచరిస్తున్నట్లు చెప్పాడు. తెల్ల కాకులు, కలివికోడి, ఎర్ర

చిలుకలు ఆ అడవికి ప్రత్యేక అతిథులనీ చెప్పాడు. చిరుతలు తరచు రోడ్డు మీదకు వస్తుంటాయనీ, రోడ్డు పక్కన చెట్టు కింద నిద్రపోతున్న చిరుతను చూసి చెప్పాడు. కానీ ప్రభుత్వం చేసిన ఒక నల్ల చట్టం వల్ల త్వరలో ఈ జంతువులన్నీ మాయ మయ్యే ప్రమాదం ఉందనీ, అడవి నాశనం కాబోతోందని చెప్పాడు. అతని మాటలు నాకాశ్చర్యం కలిగించి, దాని వివరాలడిగాను.

"బాబూ! ఈ అడవిలో ఎర్రకొండల ప్రాంతంలో విపరీతంగా బాక్సైట్ గనులున్నాయనీ చాలా ఏళ్ల క్రితం మైనింగ్ శాఖ ప్రకటించింది. అప్పట్లో బాక్సైట్ తవ్వడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వబోతే ఈ మన్యంలో పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. బాక్సైట్ తవ్వకాలు గానీ మొదలైతే ఇక్కడి పచ్చటి అడవులు అంతరించిపోయే ప్రమాదముందనీ, దానివల్ల ఈ అడవిలో ఆవాసముంటున్న వేల జంతువులు పక్షులు కూడా నశించి పోతాయనీ ఉద్యమకారులు, గిరిజన నాయకులు, పర్యావరణవేత్తలు ఆందోళన వెలిబుచ్చాడు. ప్రఖ్యాత పక్షి శాస్త్రవేత్త సలీం అలీ వచ్చి ఆ తవ్వకాల వల్ల పక్షి జాతి మొత్తం అంతరించి పోతుందనీ, దానివల్ల ఈ తూర్పుకనుమల ప్రాంత పర్యావరణానికి పెనుముప్పు కలిగి ఇక్కడ కొండల్లో నివసిస్తున్న గిరిజన జాతి మొత్తం అనా రోగ్యాల పాలై తన ఉనికినే కోల్పోయే ప్రమాదం పొంచి ఉ ందనీ చెప్పాడు. ఆ తరువాత ఈ మన్యంలోని కొండల మీద ఉన్న సుమారు నూరు గిరిజన తండాల్లోని ప్రజలు 'తూర్పు కనుమలను కాపాడాలి, గిరిజన జాతిని రక్షించాలి' నినాదంతో ఉద్యమం మొదలెటారు. దాంతో మన్యం అంతా అట్టుడికి పోయింది. తూర్పు కనుమలు వాళ్ళ గర్జనలతో నినదించాయి. అప్పుడు ప్రభుత్వం మెట్టు దిగి ఆ చట్టాన్ని వెనక్కి తీసుకుంది". ఇది జరిగి పదిహేను సంవత్సరాలైంది. ఇప్పుడు మరలా ప్రభుత్వం ఆ ప్రమాదకర చట్టాన్ని తీసుకొస్తోంది. నెలరోజుల క్రితం ఆ చట్టం ఆమోదం పొందింది. ఈ ప్రాంతంలో త్వరలో బాక్సైట్ ఖనిజ తవ్వకాలు మొదలవుతాయి. ఇప్పుడు ప్రజలు మళ్ళీ వణికిపోతున్నారు." అని వివరంగా చెప్పాడు.

ఆ భయంకర నిజాలను విన్న తరువాత ఆ ఎర్ర కొండలను ఒకసారి చూడాలనిపించి అక్కడికి వెళ్ళాము. అప్పటికే అక్కడ ఆ ఖనిజాన్ని తవ్వడానికి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆరోజంతా ఆ కొండల మధ్య ఉన్న గిరిజన గ్రామాలకు వెళ్ళి ఆ ఖనిజం తవ్వకాల పట్ల వాళ్ళ అభిప్రాయాన్ని అడిగితే వాళ్లు ఆ తవ్వకాలు జరిగితే మన్యం అంతా ఎర్రబారిపోయి తాము అనారోగ్యాల పాలవుతా మనీ, తాము కొండలను వీడక తప్పని పరిస్థితి ఎదురయే ప్రమాదం ఉందనీ ఆందోళన వెలిబుచ్చారు. అక్కడికెళ్ళిన తరువాత నాకెందుకో ఆ ప్రాంతాన్ని సందర్శించడానికి మన సొప్పక ఇంటికి తిరిగి వచ్చేసాను. నేను యూనివర్శిటీలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాను కాబట్టి పర్యావరణం ప్రభావం గురించి నాకు బాగా తెలుసు.

ఇంటికి వచ్చిన తరువాత ఆ పచ్చటి దండకారణ్యాన్ని, తూర్పు కనుమలను, అక్కడ ఉన్న ఫ్లోరా ఫోనా అంటే వృక్ష, జంతు జాలాలు, పక్షులు, తర్వాత అక్కడ గిరిజనులు వాళ్ళ గురించి ఆలోచించడం మొదలు పెట్టాను. వాళ్లని ఎలా రక్షించాలో అర్థంకాక పదిరోజుల పాటు మథనం చెందాను.

చివరకు నా మిత్రుడి ద్వారా లాయర్ పరాశర్ దగ్గరికి అక్కడి పరిస్థితిని వివరించాను. అతను రెండు రోజులు ఆలోచించి "ఒక ప్రజా ప్రయోజన వాజ్యం వేసి ఆ చట్టాన్ని రద్దు చెయ్యమనీ కోర్టుని కోరవచ్చు అనీ చెప్పాడు. వెంటనే నేను ఆ లాయర్ ద్వారా ఆ పిల్‌ని హైకోర్టులో దాఖలు చేసాను. పదిహేను రోజుల తరువాత దాన్ని హైకోర్టు స్వీకరించి ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి అటవీశాఖకు, పర్యావరణ శాఖకు నోటీసులు జారీ చేసింది.

రెండు నెలలు వాదనలు జరిగాయి. మా లాయర్ పరాశర్ మన్యంలో బాక్సైట్ తవ్వకాలు జరిగితే తద్వారా అక్కడ నివసిస్తున్న గిరిజన జాతి ఉనికికి ప్రమాదం కలుగుతుందని వాదించాడు. అదీ కాక ఇది వరకు పది హేను సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఇదే చట్టాన్ని తెచ్చి వెనక్కి తీసుకుందనీ గుర్తు చేసి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ చట్టం గిరిజన ప్రజలకు మేలు చెయ్యదనీ, వెంటనే దాన్ని రద్దు చేయవలసిందిగా కోర్టు వారిని కోరుతూ వాదనలు ముగించాడు.

దానికి ప్రతిగా ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ వాదిస్తూ బాక్సైట్ తవ్వకాలు ఎన్నో రాష్ట్రాల్లో జరుగుతున్నాయనీ, దాని వల్ల ప్రభుత్వానికి రాబడి పెరిగి తద్వారా ప్రజలకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేబట్టే అవకాశం ప్రభుత్వాని కుంటుందనీ, వాదించాడు. గిరిజన ప్రాంతాలకు పర్యావరణం ముప్పు వస్తే వాళ్ళని పునరావాస కేంద్రాలకు అంటే మంచి ఊళ్ళను నిర్మించి అక్కడికి తరలిస్తామనీ చెప్పాడు. ఇదే వాదనలను బలపరుస్తూ కేంద్ర ప్రభుత్వం, పర్యావరణ మంత్రిత్వశాఖ కూడా ఎఫిడవిట్లు దాఖలు చేసాయి. కోర్టు వాదనలు ముగిసిన తరువాత తీర్పుని రిజర్వు చేసి ఈ రోజున ఆ తీర్పున వెలువరించబోతోంది.

అందుకే ఈరోజు నాకు ఆందోళన. ఇంతలో హైకోర్టు రావడంలో ఆలోచనల్లోంచి బయట పడ్డాను.

■■■

## సాహిత్య ప్రస్థానం జనవరి 2023 పురస్కారాలు

**సీకటి ఆకాశం**
కవితకి రూ.500
రచయిత : కంచరాన భుజంగరావు

**అక్రమ రవాణా**
కథకు రూ.500
రచయిత: నల్లపాటి సురేంద్ర

■■■

*కథకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం*
*కవితనికి డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం కింద ఈ రచయితలకు నగదు అందుతుంది.*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాల్లో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

**- ఎడిటర్**

11గంటలకి కోర్టు తన తీర్పుని వెలువరించింది. ప్రభుత్వం గిరిజనుల కోసం పునరావాస కేంద్రాలను నిర్మిస్తామన్న వాదనలతో తాము ఏకీభవిస్తున్నామనీ, అందువల్ల బాక్సైట్ ఖనిజ తవ్వకాలను అనుమతించే చట్టాన్ని రద్దు చెయ్యవలసిన అవసరం లేదనీ ప్రభుత్వం పర్యావరణానికి ముప్పు కలగకుండా చర్యలు చేపట్టి ఖనిజాన్ని తవ్వుకోవచ్చనీ తీర్పు చెప్పింది. ఆ తీర్పు నాకు చాలా నిరాశ కలిగించింది. రెండు నెలల నా పోరాటం వృథా అయినందుకు విచారం కలిగింది.

నెలరోజుల తరువాత ఆ తూర్పు కనుమల ప్రాంతానికి ప్రముఖ పర్యావరణ వేత్త సుమేధ వస్తున్నారన్న వార్త పేపరులో చదివాను. ఆరోజున నేను అక్కడికి వెళ్ళి సుమేధ మేడమ్‌ని గెస్ట్ హౌస్‌లో కలిసి నా కేసు గురించి చెప్పాను. అప్పుడే ఆమె ఆ ప్రాంతమంతా పర్యటించి గెస్ట్‌హౌస్‌కి వచ్చారు. ఆమె పెట్టబోయే విలేకరుల సమావేశం గురించి బయట పత్రికా, టీవి ఛానళ్ళ విలేఖర్లు ఎదురు చూస్తున్నారు.

ఆమె నేను చెప్పిన విషయాలు వినీ "మిస్టర్ శ్రీరామ్! మీ లాయర్ బాక్సైట్ తవ్వకాల వల్ల గిరిజనులకు ముప్పు కలుగుతుందనీ వాదించాడు. మన చట్టాలు మనుషులు కన్నా జంతు, వృక్షజాలానికి ఎక్కువ రక్షణ ఇస్తున్నాయి. అందుకని ఆ తవ్వకాల వల్ల పర్యావరణానికి ముప్పు కలిగి ఆ చుట్టు పక్కల వేలాది పశుపక్ష్యాదులు, జంతువులు, అడవులు నశించి పోతాయనీ వాదించి ఉంటే ఫలితం నీకు అనుకూలంగా వచ్చి ఉండేదని చెప్పింది.

నేను ఆమె మాటలకు ఆశ్చర్యపోయి "మేడం! అదేంటి మనుషుల కన్నా పక్షులు, జంతువులకు విలువెక్కువా? అని ప్రశ్నించాను.

ఆమె నవ్వుతూ "మనదేశం చట్టాలు అలా ఉన్నాయి. అంతే 140 కోట్లు జనాభా ఉన్న దేశం మనది. ఇక్కడ మనుషుల ప్రాణాలకు విలువుండదు. అదే జంతువులు, పక్షులైతే ప్రభుత్వాలు ఎన్నో కఠినమైన చట్టాలను చేసి వాటిని కాపాడుతున్నాయి. అందుకే ఎక్కడ చూసినా అభయారణ్యాలు, నేచర్ పార్కులు, ఈ దేశంలో పులులు సింహాల కోసం అభయారణ్యాలున్నాయి. కలివి కోడి, పాలపిట్ట లాంటి ఎప్పుడో అంతరించి పోయిన పక్షుల కోసం ప్రభుత్వం కోట్లను ఖర్చు పెడుతున్న దేశం మనది. ఈ విషయంలో మనం కోర్టులను తప్పు పట్టలేము. మన పర్యావరణ చట్టాలు అలా ఉన్నాయి. చట్టాల కనుగుణంగా కోర్టులు తీర్పుల నిస్తాయి. అలా అనీ పక్షులు, జంతువులకు నేను వ్యతిరేకిని కాను. అందువల్ల మీరు మళ్ళీ రివ్యూ పిటిషన్ వేసి నేను చెప్పినట్లు వాదనలు వినిపిస్తే గెలుపు మీదే." అని చెప్పిందావిడ.

■■■

నెల రోజుల తరువాత ఆమె చెప్పినట్లు గానే కోర్టులో ప్రత్యేక ధర్మాసనం ముందర నేను మళ్ళీ ఆ కేసుని అప్పీలు చేశాను. మళ్ళీ ఆ త్రిసభ్య ధర్మాసనం అందరికీ నోటీసులు జారీ చేసింది. మేము ఈ సారి ఆ తవ్వకాల వల్ల పర్యావరణానికి భారీగా ముప్పు కలుగుతుందనీ, తద్వారా పచ్చటి వేల చదరపు మైళ్ళ అడవులు నాశనం అవుతాయనీ, దానివల్ల అందులో ఆవాసం ఉంటున్న లక్షల పక్షులు, జంతువులు నాశనం అవుతాయనీ, కాబట్టి ఈ చట్టాన్ని రద్దు చెయ్యమని కోరాము. ఆ తరువాత ప్రభుత్వం కూడా తన వాదనలు వినిపించింది. నెలరోజుల తరువాత ఆ చట్టాన్ని రద్దు చేస్తూ కోర్టు త్రిసభ్య ధర్మాసనం నాకు అనుకూలంగా తీర్పునిచ్చింది.

■

# పచ్చరంగు కళ్ళజోడు

- మందరపు హైమవతి
94410 62732



**తూ**ర్పున బంగాళాఖాతం పడమర అరేబియా సముద్రం
దక్షిణాన హిందూ మహాసాగరం
మన దేశానికి ఎల్లలని చదువుకొన్నాను
ఇప్పుడు ఎటు చూసినా కన్నీటి కడలులే!
ఏనాడైతే మూడు అక్షరాల పదం
నా పేరు ముందు చేరిందో
ఆనాడే నా గుండె కొమ్మ మీద నుంచి
ఎగిరిపోయింది ఆనందం చిలక!

■■■

పగలంతా పనుల ఉక్కబోతలో
మగ్గిన చెమట కూపం దేహం
సాయంత్రం స్నానానంతరం
వర్షంలో తడిసిన వృక్షంలా
వీధిగుమ్మంలో ఎదురుచూపుల తోరణమైనప్పుడు
వాసక సజ్జికలా ఏ ప్రియుని కోసం నిరీక్షణా గానమంటూ
కొంగరెక్కల్లాంటి మనసుపై
పిట్టల రెట్టల మరకల మాటలు
చరవాణిలో మాటలాడిన వారి నెంబర్ల వెదుకులాట
మంత్రుల వెనకే నించునే అంగరక్షకుల్లా
మాట్లాడుతున్నంత సేపూ నిఘా
పెళ్లయిన కొత్తల్లో ప్రతిరోజూ
నా ఉద్యోగ స్థలంలో దింపుతుంటే
నా ఒడలిని చుట్టేసి, నా మనసును తడిపేసి
నాపై కురిసిన ప్రణయ మేఘమల్హారరాగమని
మురిసిపోయాను
శీతాకాలం ఎండలరేడు గోర్వెచ్చని కిరణాల కౌగిలిలో
పున్నమి రేయి వెన్నెల దొర చల్లదనంలో ఆదమరిచినా
పర పురుషుల పరిష్వంగంలో పరవశించానని
పచ్చరంగు కళ్ళజోడుతో చూస్తూ
పాదాల కింద గాజు ముక్కలను పరిచి
అవమానాల పల్లేళ్లను గుచ్చుతుంటే
ఈ దేశంలో ఆడపిల్లగా కన్ను తెరిచినందుకే
పచ్చుతాడే ఉరితాడై ఊపిరి బిగుసుకుంటున్న క్షణాలు
చిన్నప్పుడు అమ్మైనా ఒక మాట జారితే
తుపానులా విజృంభించే నేను
ఇప్పుడు నోరు నొక్కుకుపోయిన మూగ జీవిని
ప్రాణం మీదకు వచ్చినప్పుడు
పశువులైనా తెంచుకుంటాయి కట్టుకొయ్యను
చిన్నారి చీమలు సైతం స్వతంత్రంగా గాలి పీల్చుకుంటాయి
స్త్రీనైనందుకే సాంప్రదాయాల సంకెళ్లు తెంపుకోలేని బానిసను

■■■

వాన వెలిసాక తీగలపై అతికించిన
జల బిందువుల ముత్యాలు చూసినా
సాయంకాలం నీరెండలో చెట్ల ఆకులను వెలిగించే
రవి కిరణాల ఇంద్రధనస్సును చూసినా
ఎగిరి గంతులేసే నా మనసు లేడికూన ఇపుడు
దేనికీ చలించని కొయ్య దుంగ!

■■■

జమ్మిచెట్టుపై దాచిన పాండవుల ఆయుధాలు
అపాండవులకు క్రూరసర్పాలై కనిపించినట్లు
అమ్మగారింట్లో బహుమతులు, జ్ఞాపికలు
అత్తగారింట్లో పనికిమాలిన వస్తువులు
ఆడపిల్ల వ్యక్తిత్వమే కోల్పోతున్నా జీవితమే నశించినా
పురుషాహంకార పాతాలే వల్లెవేసే సమాజంలో
పరువు పద్యాలే మననం చేసుకునే కుటుంబ వ్యవస్థలో
సహచరుడే పగబట్టిన శత్రుసర్పం
పితృస్వామ్యం మాంత్రికుడి స్పర్శకే
స్పందనలు నశించి శిలగా ఘనీభవించినపుడు
అనుమానాల నిప్పు కణికల మీద
మనసు చిగురాకు మాడి మసైపోతుంటే
అస్తిత్వం కోల్పోయి
పాదరసంలో చిద్రుపలౌతున్న పసిడి తునకను! ■

## సాహితీ ప్రజ్ఞ

**నిర్వహణ : పిళ్లా కుమార స్వామి**

1. 'ఎందరో మహానుభావులు అందరికీ వందనములు' అన్న కవి ఎవరు?
 ఎ. త్యాగయ్య బి. అన్నమయ్య సి. క్షేత్రయ్య డి. మొల్ల
2. బాలరసాలసాల నవపల్లవ కోమల కావ్యకన్యకం... గూళలకిచ్చి యప్పుడుఉపు గూడు భుజించనని ధిక్కార స్వరం వినిపించిన కవి
 ఎ. ధూర్జటి బి. పోతన సి. వేమన డి. కవి చౌడప్ప
3. కందకు లేని దురద.... ఎందుకు ?
 ఎ. కత్తి పీటకు బి. చాకుకు సి. చేతులకు డి. మనకు
4. కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందిన విమర్శిని గ్రంథాన్ని రాసిన వారు
 ఎ. కొలకలూరి ఇనాక్ బి. పాపినేని శివశంకర్ సి. రాచపాళెం చంద్రశేఖర రెడ్డి డి.వేల్చేరు నారాయణరావు
5. గురజాడ రాసిన దిద్దుబాటు కథ దేనికి సంబంధించింది?
 ఎ. భార్యాభర్తల సంవాదం బి. భార్యపై భర్త అనుమానం సి. భర్తపై భార్య పెత్తనం డి. భర్తను భార్య సంస్కరించడం
6. నాగావళి కథలు సంకలనాన్ని ఏ సంస్థ ప్రచురించింది?
 ఎ. శ్రీకాకుళ సాహితి బి. సాహితీ స్రవంతి సి. స్నేహ కళా సాహితి డి. విశాలాంధ్ర సాహితీ సంస్థ
7. అమ్మ బోతే అడవి కొన బోతే ......
 ఎ. అగ్గవ బి.కొరివి సి. బెత్తెడు డి. అటక
8. కొంగు ...... అంటే సులభ సాధ్యం అని అర్థం.
 ఎ. బంగారం బి.వెండి సి. ముడి డి. కొట్టేయడం
9. 'రాజు జీవించె రాతి విగ్రహములు సుకవి జీవించె ప్రజలు నాల్కల యందు' అన్న కవి
 ఎ. శ్రీశ్రీ బి.తిలక్ సి. గుర్రం జాషువా డి. బోయి భీమన్న
10. చైతన్య స్రవంతి అన్నది సాహిత్యంలో ఒక .....
 ఎ. రచనాశిల్పం బి. కథ సి. ప్రక్రియ డి. విధానం
11. 'తృ....వ్వట బాబా తలపై బు....వ్వట జాబిల్లి వల్వ బూదట" అంటూ చాటు పద్యం చెప్పిన కవి
 ఎ. తెనాలి రామకృష్ణుడు బి. అల్లసాని పెద్దన సి. రామరాజు భూషణుడు డి. భట్టుమూర్తి
12. రామరాజ భూషణుడు రాసిన వసుచరిత్రకు ఆధారం
 ఎ.రామాయణం బి. మార్కండేయ పురాణం సి. మహాభారతం డి. గాథాసప్తశతి
13. పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా నవలా రచయిత
 ఎ. త్రిపురనేని గోపీచంద్ బి. త్రిపురనేని రామస్వామి చౌదరి సి. విశ్వనాథ సత్యనారాయణ డి. రావిశాస్త్రి
14. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల నిషేధం విధించిన నాటకం
 ఎ. కన్యాశుల్కం బి. చింతామణి సి. వర విక్రయం డి. రక్తకన్నీరు
15. 'గ్రాంథిక భాష పరిమిత ప్రయోజనము కలది. వ్యావహారిక భాష అపరిమిత ప్రయోజనము కలది' అన్నదెవరు?
 ఎ. గిడుగు రామమూర్తి బి. గురజాడ అప్పారావు సి. ద్వానా శాస్త్రి డి. కొడవటిగంటి
16. అతడు- ఆమె నవల రాసిన వారు
 ఎ. వాసిరెడ్డి సీతాదేవి బి.యద్దనపూడి సులోచనారాణి సి. డా.ఉప్పల లక్ష్మణరావు డి. కోడూరి కౌసల్యా దేవి
17. జేమ్స్ జాయిస్ రాసిన యులిసిస్ నవల ఏ శిల్ప పద్ధతిలో ఉంది?
 ఎ. ఉత్తమ పురుష బి. చైతన్య స్రవంతి సి. నాటకీయ డి. ప్రథమ పురుష
18. నా ఉచ్ఛ్వాసం కవనం, నా నిశ్వాసం గానం అన్న సినిమా కవి
 ఎ. సిరివెన్నెల బి. చంద్రబోస్ సి. వేటూరి సుందర రామమూర్తి డి.ఆత్రేయ

**జవాబులు :** **1. ఎ 2. బి 3. ఎ 4. ఎ 5. డి 6. ఎ 7. బి 8. ఎ 9. సి 10. ఎ 11. ఎ 12. సి 13. ఎ 14. బి 15. ఎ 16. సి 17. బి 18. ఎ**






# రెప్ప వాల్చనీయని కవిత్వం

- పేపకాయల ప్రసాద్
94907 12967

**సా**ధారణ జీవిత నేపథ్యమున్న వారు, సగటు మనిషి పట్ల సహానుభూతి కనబరిచగలిగిన వారు మాత్రమే సామాన్యుల వెతలను హృదయపూర్వకంగా చాటగలుగుతారు. ఆధునిక కవిత్వానికి వస్తువు సామాన్యుడి జీవితమే! a poem is the very image of life expressed in its eternal truth అని కవిత్వానికి షెల్లీ ఇచ్చిన నిర్వచనం. కవిత్వం వాస్తవాభివ్యక్తి రూపమై నిలవాలి. తిలక్ చెప్పినట్లు 'కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చేయాలి.' కవిత్వం అత్యాధునిక రూపాల్లో అతి నవ్యతను సంతరించుకుంటున్న ఈ రోజుల్లో – స్త్రీలెదుర్కొంటున్న ఇబ్బందులను, వివిధ విషయాల పట్ల తమకున్న భావాలను – స్పష్టంగా అక్షరీకరిస్తున్న వారిలో స్త్రీల సంఖ్య తక్కువే అయినప్పటికీ, వాసి గల కవిత్వాన్ని వెలువరిస్తున్న వారిలో కవయిత్రుల స్థానం గణనీయమైనదే.

అలాంటి కవయిత్రుల కోవలోనే... అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చేసే అనుభూతి కవిత్వం రాస్తూ, కథా రచయిత్రిగాను రాణిస్తున్నారు దొండపాటి నాగజ్యోతి శేఖర్. తనకు అనుభూతమైన జీవిత సత్యాలను అందమైన వచన కవితల హరిత వనాలుగా పూయిస్తున్న ఆధునిక తెలుగు కవయిత్రి, నాగజ్యోతి వృత్తి రీత్యా ఉపాధ్యాయిని. ఆమె కవితల తొలి సంపుటి 'రెప్ప వాల్చని స్వప్నం'. వివిధ పత్రికల్లో ముద్రితమైన 49 కవితలతో కూర్చిన ఓ మంచి పుస్తకమిది. ప్రముఖ కవి కీ.శే. అదృష్ట దీపక్ ఈ కవితా సంపుటికి ముందుమాట రాస్తూ.. 'మంచి కవిత్వం తనకు తానే రికమెండ్ చేసుకుంటుంది' అన్నారు. వారన్న మంచి కవిత్వాన్ని ఈ పుస్తకంలోని ప్రతి పుటలోనూ ఆస్వాదించవచ్చు.

పుస్తకం ప్రారంభంలో ఇచ్చిన 'అంతరంగ తరంగం'లో తన అభిమతాన్ని నాగజ్యోతి స్పష్టంగా ప్రకటించారు. కవిత్వమంటే వ్యక్తిత్వమని, మనని మనం సంస్కరించుకోనిదే అక్షరమవ్వడం అసాధ్యమని ఆమె అభిమతం. బాధితుల బతుకుల్లో అలుముకున్న చీకట్లను తరిమేసే కొన్ని వెన్నెళ్లు – దుష్టుల వల్ల బాధలు పడే బలహీనుల కన్నీళ్లు ఆమె కవిత్వంలోని పదాలు.

బాల్యాన్ని నెమలీకగా రూపించిన నాగజ్యోతికి బడి వయసులో ప్రకృతి పట్ల ఏర్పడిన ఆత్మీయభావమే ఆమెలో కవిత్వ స్పందనకు బీజావాపనం చేసింది. పర్యావరణం పట్ల విపరీతమైన ప్రేమను పెంచింది . అందుకేనేమో ప్రకృతితో ప్రత్యక్ష సంబంధం ఉన్న రైతులంటే అంత అభిమానం చూపారామె. 'నాలుగు చినుకుల్ని విదిలిస్తే – విస్తట్లో అన్నమై దర్శనమిచ్చి, ఐదు వేళ్ళను నోటికందించే మట్టిలో ప్రతిధ్వనించిన ఉద్యమ స్వరాన్ని ' ఎరుపెక్కిన మట్టి' కవితలో వినిపించారు. మెతుకు విలువ తెలియని ఈ జగతిలో మంది నోళ్ళకి ముద్ద అందించాలని తపించే ఆకుపచ్చటి మట్టి మనిషి ఈమె కవితల్లో ఆకాశమంత ఎత్తు సాక్షాత్కరిస్తాడు. 'సరైన ధరవరుడు దొరకని నిన్నూ, నన్నూ ఎత్తుకొని ఆకలి దేశంలో ఎంత దూరమని మోస్తాడు/ అప్పుల నిప్పులకు భయపడి ఏ దళారికని ఎదిగిన బిడ్డల్ని ధారపోస్తాడు' (సంతాప సభ) లాంటి పలు పంక్తుల్లో అనుభూతి స్ఫోరకాలైన పదచిత్రాల ద్వారా – వస్తువుకీ, వస్తువుని ధ్యానించే మనస్సుకీ మధ్య ఐక్యాన్ని చక్కగా సాధించారు కవయిత్రి. ఆత్మనివేదన రూపంలో మరికొన్ని కవితలు పాఠక హృదయాలకు హత్తుకునేలా చేస్తాయి.

'దేహమొక ఉండచుట్టిన కాగితమైన వేళ
ఏ తేట జ్ఞాపకాలను పుటలుగా పేర్చనూ?

ఏళ్లుగా ఏరులై పారుతున్న ఈ వేదనావర్ణాలను ఏ నవ్వుల ముఖచిత్రం కింద దాచనూ!' లాంటి పంక్తులు ఆమె కవితాభివ్యక్తి లోని గాఢతను చాటుతాయి. 'స్త్రీ హృదయపు లోతును మరొక స్త్రీ మాత్రమే బలంగా వ్యక్తీకరించగలదు' అనదగిన కవిత్వాన్ని రెండు వేల ఏళ్ల క్రితమే రాసిన 'ససిప్పహా' తదితర గాథా సప్తశతి కవయిత్రులు మొదలు ఈనాటి కవయిత్రుల వరకు సమాజాన్ని

, స్త్రీల ఆవేదనను ఆవిష్కరించడంలో కవుల కంటే భిన్నమైన , ప్రత్యేకమైన కోణం కవయిత్రులలో చూస్తాం. ఈ కవితా సంపుటి లో కూడ స్త్రీలే రాయగలిగిన కవిత్వాన్ని చాల సందర్భాల్లో చూడవచ్చు. నది ఆత్మలో స్త్రీని ఆవాహన చేసి – మహిళల స్వేచ్ఛ పై పురుషాహంకారం చూపుతున్న ఆధిపత్య ధోరణిని బీ స్త్రీల అస్తిత్వాన్ని, ఆశలను, ఆవేశాన్ని – లోకానికి వినబడనీయకుండా ఆంక్షల పిడుగులు కురిపిస్తున్న సంఘం దార్ష్టీకాన్ని ప్రతీకాత్మకంగా వర్ణించిన చక్కని కవిత 'దప్పిగొన్న నది'. యుద్ధం నాకేం కొత్త కాదు గాని భూమి నీది నాది అయినప్పుడు నేను మాత్రమే మొలకెత్తేందుకు పోరాడడమేమిటి? ఆకాశం నీది నాది అయినప్పుడు నేను మాత్రమే ఉదయించడానికి పెనుగులాడడమేమిటి? (అనివార్యం) అని పురుషాధిక్య సమాజానికి హితవు పలికారు. ఆమధ్య ఉవ్వెత్తున ఎగసిన 'మీ టూ'ఉద్యమాన్ని సైతం ఈ పుస్తకంలోని 'పోరాటశకపు ప్రసవం' కవితలో చూడవచ్చు. వివిధ పోటీల్లో బహుమతులు దక్కించు కున్న కవితలు, ఒకటి రెండు ఎలిజీలు కూడా ఈ సంపుటిలో కనిపిస్తాయి.

సమకాలీన సమాజంలో హేళనకు గురవుతున్న 'థర్డ్ జెండర్' పై రాసిన 'మూడవ ఆకాశం' కవితలోని 'నీది స్త్రీ పురుషులుగా విడిపోయిన భేద ప్రపంచం నాది ప్రకృతీ పరమేశ్వర సంగమ క్షేత్రం/ నీ పెదవంచులు మాత్రమే ఉచ్చరించే ఆకాశంలోని సగానికి అచ్చంగా సమానత్వ భాగమిచ్చే స్వచ్ఛపు మూడో ఆకాశం నేను' అనే వ్యక్తీకరణ అద్భుతం. దళితులు, బలహీనుల ఆవేదనను బలంగా చాటిన కవితలు 'లిపి చెరపబడ్డ భాష', ఆ ఒక్కటే.

'ఒకే ఆకాశాన్ని కప్పుకున్న వాళ్ళం. ఒకే మన్నులో కలిసేవాళ్లం. ఈ అసమానతల తక్కెడలో తూగడమేంటో తెలియక వేదనా తరంగమౌతుంటాను " అన్న కవయిత్రి మాటల్లో వెల్లడి అయ్యే ఆవేదనను " నిషేధించబడ్డ జీవిత పుస్తకాల్లో ఎవరూ స్పృశించని కొన్ని ఒంటరి అక్షరాలున్నాయి.

నువ్వు నేను ఎరుగని వెలివేతల బండల్ని మోస్తున్న ఎన్నో జీవన నౌకలున్నాయి "లి లాంటి కవితా పంక్తులలో చూడవచ్చు.

పేపర్ బాయ్ (వార్తల కావలి వ్యక్తి), అరణ్య గీతం – తదితర అంశాలపైన కూడ అర్థవంతమైన కవితలు రాసారామె.

పురిటిలోనే చిదిమివేయబడుతున్న నెత్తుటి గడలు, కన్నీటికి బలవుతున్న ఆడపిల్లలు, దళారికేతు గ్రస్తమై నాశనమౌతున్న రైతు చంద్రుడు, డొనేషన్ల రాహువుకు చిక్కిపోతున్న చదువుల సూర్యుడు పీడితులై అనుభవిస్తున్న వ్యథను చాటే కవిత 'ఇప్పుడో గ్రహణం కావాలి'.

తమ వికృత విన్యాసాలతో మానవత్వపు పుడమిని అంధకారంలోకి నెట్టేస్తున్న 'అహం, ధనం, వ్యామోహం' అనే అవాంఛిత గ్రహాల బారి నుండి కాపాడగల ఉన్నత ఆలోచనల స్థిర గ్రహణం ఇప్పుడు చాల అవసరమని అంటారు నాగజ్యోతి. 'కలల్ని పోగేసేందుకు బయలుదేరిన నాన్న కండువా ఏ కలతల్ని కట్ట కట్టుకు వొచ్చేదో ఉసూరంటూ ఆ వాలుకుర్చీ చేతుల్లో వాలిపోయేది' (నాన్న పడక్కుర్చీ)

బిడ్డల సుఖం కోసం ఎంత కష్టపడినా ఫలితం లేక – చాలీచాలని జీవితం లో వారికి సంతోషాన్నివ్వలేకపోతున్నానని దిగులు చెందే ఓ సగటు పేదతండ్రి ముఖాన్ని గుర్తు చేస్తాయి ఈ మాటలు. నాన్న రెక్కలు కొట్టుకుని కూడబెట్టిన రూకలతో అమ్మ మెడలో మెరిసిన పుస్తెలతాడు పై రాసిన 'పుస్తెల తాడు' కవిత నిరుపేద జీవితాల్లో దాగిన కష్టాలను పాఠకుల హృదయాలకు అనుభూతం చేసి, కన్నీరు పెట్టిస్తుంది. 'కాలేప్పుడు కూడ లేచి నిలబడే అహాన్ని శ్మశానపు వాకిటిలోనైనా పరిత్యజించనీ/ నా చితికి నిప్పెట్టే ముందు ఒక్క నిమిషం ఆగు/ చితికిన దేహంలో చిక్కిన తెల్లని ఆత్మ పావురాన్ని రెక్కలు విశాలంగా చాచి ఎగిరిపోనివ్వు' అనే అభివ్యక్తి ఈ కవయిత్రి సాధించిన పరిణతికి తార్కాణం.

అమ్మ ప్రేమను గూర్చి తెలిపే కవిత 'తల్లి వేరు' ఒకప్పుడు తెలుగు లోగిళ్లలో పొద్దున్నే సేవించే 'తరవాణి'ని ఈ కవితలో ప్రస్తావించిన కవయిత్రి అమ్మప్రేమతో పాటు మన సంప్రదాయ ఆహారపుటలవాట్ల తల్లివేరును కూడా స్మరించుకునేలా చేసారు. ఈ కవితా వనంలో ఉత్ప్రేక్షాలంకార లతలు నాటింది. 'రెప్పల చెట్లు, కళ్ల గూళ్లు, నిద్ర పిట్టలు, కలల నెమలీకలు, నర్తిస్తున్న పత్ర మయూరం, పెదవి తీరాలు, అమ్మ చెలిమె, అనుబంధాల మేకులు, చీకటి దుప్పటి, వలపు కౌముది లాంటి అసంఖ్యాకమైన రూపకాలు (Metaphors) ప్రయోగించి తన కవిత్వానికొక ప్రత్యేకతను సాధించుకున్నారామె. ఆమె కవితలో కనిపించే ఈ నవ్యతకు – జి.బి.ఆర్. కళాశాలలో చదువుకునే రోజుల్లో కట్ట కృష్ణారావు, రాధ (పెదబ్రహ్మదేవం) దంపతుల అంతేవాసిత్వంలో అధ్యయనం చేసిన సాహిత్యం, లభించిన ప్రోత్సాహమూ కారణాలై ఉంటాయి. ఆ కృతజ్ఞత తోనే కాబోలు వారిపై 'అతను – ఆమె' పేరుతో ఒక కవిత రాశారు నాగజ్యోతి.

ఇలాంటి పుస్తకాలను గురించి రెండు మాటలు రాయాల్సి వస్తే – 'కవిత్వాన్ని ప్రాచ్య పాశ్చాత్య దేశాల్లో విమర్శకులేమని నిర్వచించారా అని వెదుక్కుని, వారి అభిప్రాయాల చట్రాల్లో ఇప్పటి వాళ్ల కవిత్వాన్ని ఇమిడ్చి, వ్యాఖ్యానించటం సాధారణంగా చాలా మంది చేసే పని. ఆ అవసరం ఇక్కడ లేదు. నాగజ్యోతిది – హృదయ స్పందనకు అక్షరాలనే ప్రాణం పోసిన కవిత. అమ్మంటి కలను ఆహ్వానించి నాగజ్యోతి కన్న కవిత్వ స్వప్నం పాఠకులను కడదాకా ఎక్కడా రెప్ప వాల్చనీయదు. 'కొన్ని కలల్ని మేల్కొలిపినా, కొన్ని కళ్లను తడిపినా ధన్యురాలినే!' అని మనవి చేసారు 'అంతరంగ తరంగం' లో కవయిత్రి. రసాస్వాదన కలిగిన పాఠకుల హృదయాలను కదిపి, కనులను చెమర్చేలా చేసే శక్తి ఉన్న కవిత్వం ఇది. ఈ కవయిత్రి నుంచి మరిన్ని రచనలు వస్తాయని ఆశిద్దాం.

■

## చిన్న కథ



# పిచ్చి ముదిరింది ..!

- బి.బి.టి.సుందర తేజశ్విని
83095 14802

**త**రగతులు జరుగుతుండగా, ఓ అజ్ఞాత వ్యక్తి హఠాత్తుగా స్కూల్లోకి ప్రవేశించాడు. అప్పుడు ఒక క్లాసులో సైన్స్ పాఠం నడుస్తోంది.

"భూమి సూర్యుడి చుట్టూ తిరుగడం వల్ల రాత్రీ పగలు ఏర్పడుతున్నాయి." అని చెప్పారు సైన్సు మాస్టారు. ఆ అజ్ఞాత వ్యక్తి కోపంతో రగిలిపోయి "ఏయ్.. ఏం చెప్తున్నావు నువ్వు.. భూమి అంటే భూదేవి. ఆమె పరపురుషుడైన సూర్యుడి చుట్టూ తిరుగుతుందా.. మా పురాణాలను వక్రీకరిస్తావా? మా మాతను కించపరుస్తావా? వళ్ళు దగ్గర పెట్టుకొని పాఠం చెప్పు. భూమి సూర్యుడి చుట్టూ తిరగదు. సూర్యుడే మేరు పర్వతం చుట్టూ తిరుగుతాడు. తెలుసుకో.." అని ఆవేశంతో ఊగిపోయాడు. సైన్స్ మాస్టారు ఒక్కసారిగా ఉలిక్కిపడి, ఇతనెవరా అనుకుంటూ బయటకు వచ్చి చూసాడు.

ఇంతలో ఆ వ్యక్తి ఇంకో క్లాసుకి వెళ్ళాడు. అక్కడ "గంగానది తూర్పు దిశగా ప్రవహించి హుబ్లీ వద్ద సముద్రంలో కలుస్తుంది." అన్న సోషల్ మాస్టారి మాట విని అగ్గి మీద గుగ్గిలం అయ్యాడు.

"ఏంటీ ? పరమేశ్వరుని భార్య గంగాదేవి సముద్రంలోకి వెళ్తుందా? సముద్రుడు పర పురుషుడు. అంటే మా గంగమ్మ తల్లిపై అభాండాలు వేస్తావా? తప్పుడు కూతలు కూస్తావా? తన్నులు తింటావు. జాగ్రత్త!" అంటూ పెద్దపెద్దగా అరుస్తూ చూపుడు వేలు చూపిస్తూ ఏవేవో వార్నింగులు ఇచ్చి, ఇంకో క్లాసుకి వెళ్ళాడు. సోషల్ మాస్టారు కూడా మొదట షాక్ తిని తరువాత తేరుకొని బయటకు వచ్చారు. ఈ షాకింగ్ ఘటనకి బిత్తరపోయి ఉపాధ్యాయులందరూ క్లాసుల్లోంచి బయటకి వచ్చారు. "ఎవడు వీడు? ఉన్మాదిలా ఊగిపోతున్నాడు" అనుకుంటూ చూస్తున్నారు. "ఎవరితడు.. పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు?" అనుకుంటూ మరో పక్క విద్యార్థులూ భయభ్రాంతులై చూస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడికి ఏమీ అర్థం కాలేదు. ఇంతలో అటెండర్ పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"సార్ సార్.. ఎవరో పిచ్చివాడు పిచ్చాసుపత్రి నుంచి పారిపోయి ఊర్లోకి వచ్చాడంట. స్కూల్ గేట్లు తియ్యొద్దని తల్లిదండ్రులు ఫోన్లు మీద ఫోన్లు చేస్తున్నారు." అన్నాడు.

అప్పటికి అర్థమైంది అందరికీ.

"జాగ్రత్తగా ఉండండి. అతణ్ణి ఏమీ అనకండి.." అంటూ ప్రధానోపాధ్యాయుడు అందరినీ అలెర్ట్ చేశారు. ఆ వ్యక్తి తిన్నగా ఆఫీస్ రూమ్‌కి వెళ్లి హెడ్ మాస్టారి కుర్చీలో కూర్చుండిపోయాడు. ఉపాధ్యాయులు మెల్లగా నడుచుకుంటూ అతడి వెనకాలే వెళ్లి ఆఫీస్ రూమ్ బయట నుంచి చూస్తున్నారు.

"ఇక్కడ హెడ్ మాస్టరు ఎవరయ్యా?" అని అరిచాడు ఆ వ్యక్తి. హెడ్మాస్టరు కొంచెం భయపడుతూ ఎదురుగా నిల్చున్నారు. "మీ మాస్టార్లు పిల్లలకి తప్పుడు పాఠాలు చెప్తోంటే నువ్వేం చేస్తున్నావు." అని గద్దించాడు.

హెడ్ మాస్టారు వినయంగా చేతులు కట్టుకొని "మన్నించాలి. మాబోటి అజ్ఞానులకు అంతటి పెద్ద పెద్ద విషయాలు తెలియవు. ఇకనురఇ ఎలాంటి పొరపాట్లూ జరక్కుండా చూసుకుంటాను." అన్నారు. ఆ మాటతో ఆ వ్యక్తి ఈగో శాంతించింది. "ఊ ..." అన్నాడు గంభీరంగా.

"మీ వంటి వారు అప్పుడప్పుడు ఇలా వచ్చి చెప్తూ ఉంటే తెలుసుకుంటాము." అన్నారు హెచ్ఎం.

"అలాగే తప్పకుండా వస్తాను. ధర్మరక్షణే నా లక్ష్యం." అని అంటూ చుట్టూ ఉన్న గోడలని పరిశీలించి "ఇదేమిటీ? మన సంస్కృతికి, మన ధర్మానికి సంబంధించి ఒక్క ఫొటో కూడా స్కూల్లో లేదు. ఏం?" అని గద్దించాడు. "తప్పకుండా పెట్టిస్తానండి. మా తప్పుల్ని సరిదిద్ది మాకు ఎన్నో అమూల్యమైన విషయాలు తెలియజేసినందుకు కృతజ్ఞతలు. ఇంకా చాలా స్కూళ్లు ఉన్నాయి. మీరు అన్నిటికీ వెళ్లి ఇలాగే సరిచేయాలి. అప్పుడే ధర్మం వర్ధిల్లుతుంది." అని హెడ్మాస్టారు అనేసరికి అతడు సంతోషంగా తలపంకించుకుంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంటూ గబగబా గేట్లు తాళాలు వేయించారు.

చాకచక్యంగా వ్యవహరించి పిచ్చివాడిని బయటకు పంపేసిన హెడ్మాస్టారిని అందరూ అభినందించారు. "పాపం మతపిచ్చి ముదిరిపోయి పిచ్చివాడైపోయినట్టున్నాడు. ముందు ముందు ఇంకెందరు ఇలా తయారవుతారో. ఏంటో.." అని నిట్టూరుస్తూ ఉపాధ్యాయులు ఎవరి క్లాసుల్లోకి వారు వెళ్లిపోయారు. ■



# పాట ..
# ఒకప్పుడు రాగ ప్రాధాన్యం
# ఇప్పుడు తాళ ప్రాధాన్యం ...

**- ప్రముఖ సినీ గీత రచయిత భువనచంద్ర**

**'తెలుగు పాట వెయ్యేళ్ళు వర్ధిల్లాలి. తెలుగుదనం ఆ పాటల్లో పరిమళించాలి' అన్నారు ప్రముఖ కవి, సినీగేయ రచయిత భువనచంద్ర. కవి, రచయిత డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య 'సాహిత్య ప్రస్థానం' తరపున భువనచంద్రగారితో ముచ్చటించారు. ఆ ముఖా-ముఖి ఇదీ...**

**మీ బాల్యం విద్యాభ్యాసం గురించి క్లుప్తంగా చెప్పండి.**

నేను 1950 ఆగస్టు 17వ తేదీ కృష్ణాజిల్లా నూజివీడు దగ్గరున్న గుల్లపూడిలో పుట్టాను. నాకు రెండేళ్ళ వయసున్నప్పుడు మా కుటుంబం ఏలూరుకు దగ్గర ఉన్న చింతలపూడికి వచ్చి స్థిరపడింది. మా నాన్నగారు సుబ్రహ్మణ్యశర్మ గారు కరణీకం చేసేవారు. ఆయన గుల్లపూడికి ప్రెసిడెంటుగా ఉన్నారు. మా తల్లిగారు చంద్రమౌళీశ్వరిదేవి. గృహిణి. మా తల్లి గారు కూడా కొంతకాలం ప్రెసిడెంటుగా చేశారు. మేము ఎనిమిదిమంది సంతానం. నాకు ముగ్గురు అన్నలు, నలుగురు అక్కయ్యలు. అందరిలో నేనే ఆఖరువాణ్ణి. నా ప్రాథమిక విద్యాభ్యాసం సగం గొడ్లపాక, సగం బడిగా ఎలియా అనే మాస్టారు వద్ద సాగింది. తర్వాత ప్రవేశ పరీక్ష వ్రాసి చింతలపూడి హైస్కూలుకు మారి ఎస్ఎస్ఎల్సి వరకు చదివాను. తరువాత గవర్నమెంటు ఆర్ట్స్ కాలేజీ శ్రీకాకుళంలో పియుసి చదివాను. తరువాత హైదరాబాదు వెళ్ళి టైపు, షార్ట్హ్యాండ్ వంటివి నేర్చుకుంటూ ఉండగానే ఎయిర్ఫోర్సులో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరాక పంజాబ్ విశ్వవిద్యాలయంలో బి.ఏ చదువుతున్నప్పుడు, 1970-71 లో పాకిస్తాన్ యుద్ధం రావడంవల్ల ఫైనల్ పూర్తి చెయ్యలేక పోయాను. ఎయిర్ఫోర్సులో ఉంటూ ఎన్నో టెక్నికల్ డిప్లొమాలు చేశాను.

**మీ అసలు పేరు? కలంపేరు 'భువన చంద్ర'లోని అంతరార్థం చెప్పండి.**

నా అసలు పేరు ఊరకరణం శేషపూర్ణానంద ప్రభాకర పెద గురురాజు. పెదగురు రాజు అనేది మా తాతగారి పేరు. మా తాతగారు 110 సం.లు బతికారు. నాకు అదే పేరు పెట్టారు. మదరాసు వచ్చాక, సినిమాల్లో అవకాశాలకోసం ప్రయత్నిస్తున్నప్పుడు కొన్ని డిటెక్టివ్ నవలలు రాశాను. మా తల్లిగారైన చంద్రమౌళేశ్వరి దేవిలోని 'చంద్ర', నన్ను తల్లిలాగే పెంచిన పెంపుడు తల్లి భువనేశ్వరీ దేవిలోని 'భువన' కలిపి 'భువన చంద్ర'గా పెట్టుకున్నాను. నేను రాసిన ఐదు డిటెక్టివ్ నవలలూ ఆరోజుల్లో బాగా పాపులరయ్యాయి. తొలిపాట నుంచి భువన చంద్ర పేరుతోనే అందరికి పరిచయమయ్యాను.

**మీకు సినీ గీతాల పట్ల అభిరుచి ఎలా కలిగింది?**

చిన్నప్పటినుండి పాటలు పాడుకోవడం నాకు అలవాటు. చిన్నప్పుడు సరుకులు తెమ్మని డబ్బులిస్తే, మిగిలినవి దాచుకుని చింతలపూడిలో ఉన్న టూరింగ్ టాకీసుల్లో సినిమాలు చూస్తూ, ఆ సినిమాలలో పాటలు పదే పదే పాడుకొనే వాణ్ణి. సినిమా వాల్ పోస్టర్ల మీద మాటలు, పాటలు వ్రాసిన రచయితల పేర్ల ప్రక్కన ఒక చాక్పీసుతో నా పేరు వ్రాసుకునే వాణ్ణి. పాటలు-ఆత్రేయ, ఆ ప్రక్కన నా పేరు వ్రాసుకునే వాణ్ణి. నా అదృష్టం ఏమిటంటే నేను పాటల రచయితగా మారాక, 'నాకూ పెళ్ళాం కావాలి' సినిమాలో ఆత్రేయగారి పేరు ప్రక్కన నా పేరు వాల్ పోస్టర్లలో, తెరపై కూడా వచ్చింది. నేనా విషయం చెప్పినప్పుడు ఆత్రేయగారు చాలా సంతోషపడి 'నీ జీవితాన్ని నువ్వే నిర్ణయించుకున్నావు' అని ప్రశంసించారు.

**మీ తొలి సినీగీతం ఏది?**

నా తొలి పాట 1987 జనవరి 1న రికార్డయింది. సినిమా పేరు 'నాకూ పెళ్ళాం కావాలి'. పల్లవి 'వినోదాల విందురా! బాధలన్ని బందురా!' అనేది. ఆ సినిమాలోనే అదే బాణీలో 'నాకూ పెళ్ళాం కావాలి' అనే యింకో పాట కూడా రాసాను. ఒకటి సినిమాలమీద పాటైతే, ఇంకోటి సినిమా టైటిల్ సాంగు రాసాను.

చంద్రమోహన్, రాజేంద్రప్రసాద్, కల్పన నటించారు. దర్శకత్వం విజయ బాపినీడు గారు. సంగీతం సాలూరి వాసూరావు గారు. ఆ సినిమాకు జొన్నవిత్తుల, ఆత్రేయ సహ రచయితలు. మొదటి సినిమాకే వందరోజుల షీల్డు కూడా అందుకున్న మరపురాని సినిమా.

**మీరు ఎక్కువ డబ్బింగు చిత్రాలకు రాయడానికి కారణం?**

నేను దాదాపు ఒక మూడు వేల దాకా పాటలు రాసి ఉంటాను. వాటిలో మూడు, నాలుగు వందలలోపే డబ్బింగు పాటలు. మిగిలినవన్నీ డైరక్టుగా వచ్చిన సినిమా పాటలే. నాకంటే ముందు ఎంతోమంది శ్రీశ్రీ, అనిసెట్టి, పినిసెట్టి, రాజశ్రీ వంటి వాళ్ళు డబ్బింగు సినిమాలకు రాసారు. నేను చాలా డబ్బింగు పాటలు రాశాను. భారతీయుడులో అన్ని పాటలూ నావే. అలాగే ప్రేమదేశంలో కూడా.

**మిమ్మల్ని తొలిదశలో ప్రోత్సహించిన దర్శకులెవరు?**

నా స్నేహితుడైన గుత్తా రాం సురేష్, సినీ దర్శకులైన విజయ బాపినీడు గారికి పరిచయం చేశారు. బాపినీడు గారు నన్ను ఎంతో ప్రోత్సహించి తొలి సినిమా అవకాశం ఇచ్చారు. తర్వాత విక్టరీ మధుసూదనరావు గారు మొదలైనవారు ఎంతో ప్రోత్సహించారు. బాపినీడు గారు మదరాసు వదలి వెళ్ళొద్దని, నేనున్నానని చెప్పి అన్ని విధాలుగా ప్రోత్సహించిన మహానుభావుడు. ఈరోజు వరకూ నేను బిజీగానే పాటలు రాస్తున్నానంటే ఆయనే కారణం.

**స్వేచ్ఛగా గీతాలను రాయనీయకుండా సంగీత దర్శకులు 'ట్యూన్' ఇచ్చి రాయాలనడం ద్వారా సృజనాత్మకత దెబ్బ తినదా?**

సృజనాత్మకత కచ్చితంగా దెబ్బ తినదనే నా అభిప్రాయం. సినిమారంగమే సృజనాత్మకతమైన క్షేత్రం. ఈ రంగంలో ప్రతిదీ సృజనాత్మకతతోనే ఉండాలి. చాలామందిలో మీరు చెప్పిన అపోహ ఉంది. అది తప్పు. ఒక సన్నివేశపరమైన సందర్భం ఉంటే దానికి ట్యూన్ ఇవ్వడమనేది ఉండదు. సినిమా పరిభాషలో 'సాంగ్ ఫర్ సాంగ్' అనే సందర్భాలకు మ్యూజిక్ డైరెక్టరు ట్యూన్ ఇచ్చిన తర్వాత రాయడమే గొప్ప. అంటే బీట్ ఓరియంటెడ్ పాటలకు ట్యూన్ ప్రకారం లిరిక్ రాయడమే బావుంటుంది. మ్యూజిక్ డైరక్టర్లు సన్నివేశపరంగా మంచి ట్యూన్లే ఇస్తుంటారు. రచయిత ప్రతిభను బట్టి గీతం పండుతుంది.

**మీరు ఒక సినిమాకు సంభాషణలు కూడా సమకూర్చారట..**

అవును. ఆ సినిమా పేరు 'అలజడి.' దానికి దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ. ఈమధ్యనే కీర్తిశేషురాలైన బి.జయ దానికి కో-డైరక్టరు. చాలా మంచి వ్యక్తి.

**'బంగారు కోడిపెట్ట' వంటి శృంగార గీతాలను రచించే మీకు 'వాళ్ళు' వంటి ఆధ్యాత్మిక గ్రంథం రచించడం వెనుక ఉన్న నేపథ్యం ఏమిటి?**

'బంగారు కోడిపెట్ట, లక్స్ పాపా, వానావానా వెల్లువాయె, ప్రియ రాగాలే గుండెలోన' లాంటి పాటలు రాయడమనేది నా వృత్తిపరంగా చేసినది. పాట ఎలా రాస్తే ఆ సందర్భానికి, నాయికా నాయకులను బట్టి నప్పుతుంది అనేది అక్కడ చూసుకొని రాయడం నా వృత్తి బాధ్యత. నా ప్రవృత్తిపరంగా చెప్పాల్సి ఉంది. మనం ఎందుకు పుట్టాము? తల్లి కడుపులో ఉన్నప్పుడు మనం మతం, కులం, ఆడామగాలాంటి తేడాలేమీ తెలియకుండా పుట్టడం జరుగుతుంది. తర్వాత వంద సంవత్సరాలు భూమి మీద పెరిగి మరణిస్తాం. చనిపోయాక శవం అంటారు తప్ప ఇది ఫలానా కులానికి, లేక మతానికి సంబంధించిన శవం అని అనరు. వాడెంతవాడైనా 'బాడీ' అనే పిలుస్తారు. అంటే పుట్టక మునుపు ఏమీ లేదు. పోయిన తర్వాత కూడా ఏమీలేదు. ఈ మధ్యకాలమంతా ఒక నాటకంలాగా గడుస్తుంది. మనకు బాల్యం, కౌమారం, యౌవనం, వృద్ధాప్యమనే అవస్థలు మారిపోతూ ఉంటాయి. ఈ మధ్య కాలంలో కలిగే ఒక తృష్ణ ఏమిటంటే, అసలు నేను ఎవరు? ఎక్కడనుండి వస్తున్నాం? ఎక్కడకు వెళ్తున్నాం? ఈ ప్రశ్నలన్నీ నా చిన్నతనం నుంచీ నన్ను వెంటాడుతున్నవే! నేను చిన్నతనంలో ఉంటే ఇంట్లో ఉండేవాడిని, లేకపోతే మాకు దగ్గరగా ఉన్న విశ్వనాథాశ్రమంలో ఉండేవాడిని. అక్కడ పెద్దపెద్ద వాళ్ళు వేదాంత చర్చలు చేస్తూ ఉండేవారు. ఆ సమయంలో నాకనిపించినదేమంటే మనం మన ప్రమేయం లేకుండానే ఈ లోకంలోకి వచ్చాం. మనిషి పోయినప్పటికి మనిషి తాలూకు అనుభవం ఈ లోకంలో ఉండాలి. అందువల్ల నేను కలుసుకున్న మహాయోగులు చెప్పిన విషయాలను ఆ 'వాళ్ళు' గ్రంథస్తంలో నిక్షిప్తం చేశాను.

**మీకు కథలు, నవలలు, కవితలు, వ్యాసాలు అన్ని ప్రక్రియల్లోనూ అభినివేశం ఉంది. సినీ గీతాలు కాకుండా మీ మనసుకు నచ్చిన ప్రక్రియ ఏమిటి?**

సాహిత్యం మీద అభిరుచి, అభినివేశం, పట్టు ఉన్నట్లైతే అన్ని ప్రక్రియలూ చేపట్టవచ్చు. అన్ని ప్రక్రియలూ నాకు ఇష్టమైనవే!

**చరణాలంటూ లేకుండా అన్నీ పల్లవులలాగే ఉండే గీతాలకు మీరే ఆద్యుడు అంటారు. ఆ గీతాల గురించి క్లుప్తంగా చెప్పండి?**

నా వరకూ నేను ఒక జపనీస్ పాటను అనుసరించి రాసిన అలాంటి పాటను ఎస్.వి.కృష్ణారెడ్డి కంపోజ్ చేయించారు. దాన్లో ఉన్న మూడూ పల్లవులే. అలా చరణాలు లేకుండా నేను చాలా పాటలు రాసాను. పల్లవిలో ఉన్న మొదటి లైన్ మాత్రమే రిపీట్ అవుతూ ఉంటుంది. అయితే కొన్ని పాటలకు చరణాలు ఉండితీరాలి. ఉదాహరణకు 'సీతారాముల కల్యాణము చూతము రారండి' అనే పాటకు పల్లవి చరణాలు రెండూ ప్రాణసదృశమే కదా! సందర్భమూ.. సన్నివేశమూ.. అన్నీ దృష్టిలో పెట్టుకుని చేయాల్సిన ఒక గొప్ప ప్రయోగం పాట.

**గుమ్మడి రామలక్ష్మిగారు మీ గీతాలపై చేసిన పరిశోధనలో మీ గీతాల్లో కొన్ని పూర్వ కవుల స్ఫూర్తితో రాసినవి అన్న మాటపై మీ అభిప్రాయం?**

'కాళ్ళాగజ్జా కంకాణమ్మా' అనే పాట మనకు ఎవరు నేర్పారు? దాన్ని ఎన్ని రకాలుగా పాడుకుంటున్నాము చెప్పండి. అలాగే పూర్వకవుల స్ఫూర్తి తో పాటలను రాయడం, ఒక నూతన సౌందర్యాన్ని తేవడం వంటిదే!

**ఈనాడు వస్తున్న తెలుగు పాటల్లో తెలుగుకన్నా ఆంగ్లపదాలే ఎక్కువ ఉంటున్నాయి. ధమధమ ధ్వనుల మధ్య పాట వినిపించడంలేదన్న ప్రేక్షకుల విమర్శకు కారణం సంగీత దర్శకులా? గీత రచయితలా? గాయకులా?**

ఈ ముగ్గురూ కాదు. ఒకప్పుడు రాగప్రాధాన్యం ఉండేది. (నీలి మేఘాలలో పాటల లాంటివి) ఇప్పుడు ట్రెండ్ ఏమిటి? తాళ ప్రాధాన్యం, అంటే బీట్ ఓరియెంటెడ్ పాటలు. 'బంగారు కోడిపెట్ట' వంటి పాటలు. ఎందుకీ మార్పు అంటే విశ్వవ్యాప్తమైన మార్పు సంగీతంలో కూడా సంభవించింది. ఎప్పుడైతే హాలీవుడ్ సినిమాలు, ఆ పాటలు, రకరకాల విదేశీ వాయిద్యాలు, ట్యూన్లు వచ్చాయో అప్పుడు పాట తాళప్రాధాన్యమై కూర్చున్నది. పాటలో టెంపో కావాలి అంటే తాళప్రాధాన్యమై ఉండాలి. దేనికి ప్రజాదరణ ఉంటుందో అదే ప్రాచుర్యంలోకి వస్తుంది. ఇది ఏ ఒక్కరికో సంబంధించింది కాదు. సంగీతంలో వచ్చిన మార్పు అంతే!

**మీరు మొత్తం ఎన్ని సినిమాలకు రాశారు? ఎన్ని పాటలు రాసి ఉంటారు?**

కచ్చితమైన లెక్క అంటూ చెప్పలేను కానీ దాదాపు అన్ని భాషల్లో కలిపి మూడువేల పాటలు ఉంటాయి. సినిమాలు దాదాపు వెయ్యి-పన్నెండు వందలు ఉండొచ్చు.

**మీ 'అన్టోల్డ్ స్టోరీస్' కథాసంపుటిలో సినీ మాయాలోకంలోని డొల్లతనాన్ని బహిర్గతం చేశారు గదా? తదనంతర కాలంలో మీరేమైనా ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొన్నారా?**

మీకు ఒక విషయం స్పష్టం చెయ్యాలి. నేను ఆ కథల్లో సినిమాలోకంలోని డొల్లతనాన్ని నేను బయట పెట్టలేదు. అసలు సినిమా డొల్ల కానే కాదు. అలాగే మాయాలోకం కూడా కాదు. సినిమా రంగం ఎప్పుడూ గొప్పదే. దాన్లో తప్పులెన్నేంత గొప్పవాణ్ణి వాడిని కాదు నేను. ప్రతి రంగంలోనూ ప్లస్సులూ మైనసులూ ఉంటాయి. ఇక్కడ జనం ఏమనుకుంటారంటే ప్రతి ఒక్కరూ లక్షలు లక్షలు సంపాదిస్తున్నారు అనుకుంటారు. చిన్న చిన్న నటీనటులకు అంత ఎక్కువ రెమ్యూనరేషన్లు ఏమీ ఉండవు. కానీ చూసే వారికి అదో మెరుపుల లోకం. నేను చూసిన కొన్ని జీవితాల గురించి, ఇలా కూడా ఉంటుంది కదా... అని చెప్తూ.. ఈ రంగంలోకి వచ్చేముందు ఈ కష్టనష్టాలను తెలుసుకోవాలి. తొందరపడి ఉద్యోగాలు, వ్యాపారాలు వదలి ఏదో ఆవేశంతో రావద్దు అన్న సదుద్దేశంతో రాసిన కథలవి. ఇది తెలుగు పరిశ్రమ గురించి మాత్రమే కాదు. అన్ని భాషల్లో ఉన్న సినీ పరిశ్రమకు చెందినది. నేనెవరినీ ప్రత్యేకించి ఉద్దేశించి రాసినవి కాదు. అందువల్ల నాకేమీ ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురవలేదు.

**సినీరంగంలో అనేకమంది నటీనటులు, దర్శకులు వారసత్వంగా ప్రవేశిస్తున్నారు. గీతరచనలో మాత్రమే వారసత్వం లేదు. ఎందువల్లంటారు?**

సరదాగా చెప్పుకుంటే పండితుల పుత్రులంతా పండితులు కాలేరు. కానీ ఒక నటుడు వారి కుమారుణ్ణి వారి మార్గదర్శకత్వంతో నడిపిస్తూ, ఒక నటుణ్ణిగా చేసే అవకాశాలు ఎక్కువ. అలాగే లాయర్లు, డాక్టర్లు కూడా వారి సంతానాన్ని వెంట తీసుకుని వెళ్ళి శిక్షణ ఇస్తే వారి తండ్రి వృత్తివిద్యను స్వీకరించే అవకాశాలు చాలా ఎక్కువ. ఇక్కడ కూడా వందకు వంద శాతం విజయం సాధిస్తారని చెప్పడానికి వీల్లేదు. ఫలానా వాళ్ళ పిల్లలు అని ప్రేక్షకులు చూడరు. వారికి స్వతహాగా కొంత ప్రతిభ ఉంటేనే రాణిస్తారు. ఒక గాయకుడి కొడుకును గాయకుణ్ణి కానీ, రచయిత కొడుకుని రచయితగా కానీ చేయడం కష్టం. అవి బలవంతంగా రుద్దితే వచ్చేవి కాదు.

**ఘరానా మొగుడు సినిమాలో ఒక పాట వల్ల మీరు ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు ఎక్కడో చదివాను?**

నిజమే! 'ఏందిబే... ఎట్టాగా ఉంది ఒళ్ళు' అనే పాటకు చిరంజీవిగారి అభిమాని ఒకరు చాలా సీరియస్ అయ్యాడు. హీరోయిన్ చిరంజీవిని అలా అనడం ఆయనకు నచ్చలేదు. బెదిరింపులు, ఉత్తరాలు అన్నీ సాగాయి. చిరంజీవి గారు ఒక సినిపత్రికలో దానికి స్పందించి సమాధానంగా 'ఈ పాట గురించి నాకన్నీ తెలుసు. ఇది ఏ సందర్భంలో వస్తుందో అర్థం చేసుకోకుండా బెదిరించడం లాంటివి తప్పు. సినిమా చూసి మాట్లాడు' అని సలహా ఇచ్చాడు. ఆ తర్వాత సినిమా చూసిన ఆ అభిమానే పొంగిపోయి మహదానందపడ్డాడు.

**చివరిగా తెలుగు పాటకు ఉండాల్సిన లక్షణాల గురించి చెప్పండి?**

ఆరోజుల సంగతి వదిలేస్తే.. ప్రస్తుతం పాటల్లో సగమన్నా తెలుగు భాష ఉండాలి. పాటకు సరైన సన్నివేశం ఉండాలి. అలాగే ట్యూన్, గాయకుడు ఇవన్నీ సమపాళ్ళలో రంగరింపబడాలి. ఇవన్నీ సక్రమంగా సింక్రనైజ్ అవకపోతే ఎంతో అద్భుతమైన పాటలైనా హిట్ కావడం కష్టం. ఒక తెలుగు పాట తెలుగు పాట లాగే ఉండాలి. ఇప్పటికి దేవదాసులోని 'జగమే మాయ' పాట విన్నప్పుడు కలిగే అనుభూతి అందరికి తెలిసిందే. తాగుబోతులు ఈలోకంలో ఉన్నంతవరకూ ఆ పాట చిరంజీవి. అలాగే ఏ పెళ్ళి జరిగినా 'సీతారాముల కల్యాణము చూతము రారండీ' వింటూనే ఉంటాము కదా! సందర్భోచితంగా ఉండి తెలుగు పాట వెయ్యేళ్ళు వర్ధిల్లాలి. తెలుగుదనం ఆ పాటల్లో పరిమళించాలి. ■



# కిట్టీ పార్టీ

హిందీ మూలం :
**శరద్ ఉపాధ్యాయ్**
అనువాదం :
**డా. వెన్నా వల్లభరావు**
**94903 37978**

**స్మి**తకి ఏం చెయ్యాలో, ఏం చెయ్యకూడదో పాలుపోవడం లేదు. ఏమీ తోచని పరిస్థితి. క్షణంపాటు అది బాగానే ఉన్నట్టు అనిపిస్తోంది. మరుక్షణమే అసలు బాగుండలేదనిపిస్తోంది. దీని కంటే మునుపటి గెటప్పే బాగుందనిపిస్తుంది. ప్రతి విషయం మీదా చర్చించి గానీ ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారు.

ఇంట్లోని నలుగురు సభ్యులు డ్రాయింగ్ రూమ్‌లో కూర్చొని ఉన్నారు. భర్త మనిష్, భార్య స్మిత, కుమార్తె కోమల్, కుమారుడు సుమిత్. నలుగురూ కూర్చుని ఏదో విషయంపై అదే పనిగా చర్చిస్తున్నారు. బాగా ఆలోచించి, అందరికి నచ్చిన మంచి ప్రతిపాదననే ఎంచుకోవాలని వాళ్ళు అనుకుంటున్నారు. స్మిత అందరి నుంచి ప్రశంసలు అందుకోవాలనేదే కుటుంబ సభ్యులందరి కోరిక. లోకంలో ఆవిడ పేరు చిరస్థాయిగా నిలిచిపోవటానికి ఇప్పుడు స్మిత అయితే సైన్స్‌లో ఏ కొత్త ఆవిష్కరణా చేయబోవటం లేదు. అసలు విషయం ఏమిటంటే స్మిత వాళ్ళ ఇంట్లో కిట్టీ పార్టీ జరగబోతోంది. ఆవిడ తన పార్టీని, కిట్టీ పార్టీ గ్రూప్ సభ్యులందరి కంటే ఉత్తమంగా నిర్వహించాలనుకుంటోంది. పార్టీలో ప్రతి వస్తువూ ఇతరుల పార్టీల్లోకంటే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటోంది.

ఈ కిట్టీ పార్టీకోసం గత నెల రోజులుగా ఆవిడ ఏర్పాట్లు చేస్తూనే ఉంది. గ్రూప్ సభ్యులందరూ కూర్చునే డ్రాయింగ్ రూమ్, డైనింగ్ రూమ్‌ల డెకరేషన్ పైన ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టారు. తీవ్రంగా చర్చించిన మీదట షేడ్స్ సెలెక్ట్ చేసి కర్టెన్లు కుట్టించారు. డార్క్- లైట్ షేడ్స్ కాంబినేషన్‌తో తయారు చేయించిన కర్టెన్స్ వేసిన తర్వాత, సెలక్షన్ అందరికీ నచ్చుతుందా లేదా అని చర్చిస్తున్నారు. మిసెస్ త్రిపాఠి నిర్వహించిన అతి గొప్ప కిట్టీ కంటే తమ పార్టీ ఇంకెంతో గొప్పదిగా జరగాలని వాళ్ళ ప్రయత్నం. అందుకే కర్టెన్లతోపాటే సోఫా కవర్లు కూడా మార్చేశారు. దివాన్‌కి కూడా కొత్త షేడ్స్ గల కవర్లు కుట్టించారు. డ్రాయింగ్ రూమ్ లో కొన్ని షో పీస్‌లు పాతబడిపోయాయి. వాటి స్థానంలో కొత్తవి తెచ్చి అలంకరించారు. నిజానికి ఇక్కడే పెద్ద ఇబ్బంది ఉంది. ఇంట్లోఉన్న కొత్తవి, ఎంతో ప్రత్యేకమైన వస్తువుల్ని వదిలేసి, ముందు పాతవాటి పైనే దృష్టి సారిస్తారు "ఇది పాతదేగా, అప్పుడు మీరు జైపూర్ నుంచి తెప్పించారు, అదేగా!" అంటారు. అందుకే ఇప్పుడు పూర్తిగా మార్చాల్సివస్తోంది.

కిట్టీ పార్టీలోని ఇతర సభ్యురాళ్ళ కంటే తనే గొప్పదాన్ని అనిపించుకోవడం ఎట్లా అనే దాని గురించే గంభీరమైన చర్చ, తర్జన భర్జన జరుగుతోంది. ఈమధ్యే డైనింగ్ హాల్లో కూడా ఏసి పెట్టించారు. కిందటి నెలలోనే వేసవి ఎండలు ఎక్కువగా ఉండటం కారణం చేత మిస్ శర్మ ఏర్పాటుచేసిన కిట్టీ పార్టీలో ఏర్పాట్లన్నీ ఎక్కడివక్కడే ఆగిపోయాయి. ఎండలు కొత్త కర్టెన్లు, కొత్త క్రోకరీ, కొత్త కవర్లు- అన్నింటినీ ఉపయోగం లేకుండా చేసేశాయి. ఈ విషయంలో స్మిత ఏ విధమైన రిస్క్ తీసుకోదలుచుకోలేదు.

మనీష్ ఉన్నట్టుండి గడియారం వంక చూశాడు. "తొమ్మిది

కావస్తోంది" అన్నాడు.

"సరే ఇవ్వాళకి చేసింది చాలు. మిగితావి తర్వాత చూద్దాంలే. పదండి భోంచేద్దాం. నేను ఇప్పుడే రొట్టెలు కాల్చి సిద్ధం చేస్తాను" అంటూ స్మిత వంటింట్లోకి వెళ్ళబోతుండగా మనీష్ మొబైల్ రింగైంది. చూస్తే ఊరు నుంచి మనీష్ వాళ్ళ అన్నయ్య నుంచి ఆ ఫోన్. వాళ్ళు సొంత ఊళ్ళోనే ఉంటారు. అక్కడే వ్యవసాయం చేసుకుంటున్నారు.

"హలో.. చెప్పు అన్నయ్యా! ఏమిటి ఈ టైంలో ఫోన్ చేశావు?"

"ఏమీ లేదురా, అమ్మకి ఈమధ్య ఒంట్లో బాగుండటం లేదు. చాలా ఆందోళన పడుతోంది. భోజనం అరగటం లేదు. ఏమి తిన్నా వెంటనే వాంతి అయిపోతోంది."

"ఐతే త్రివేదీకి చూపించలేదా?"

త్రివేది ఊళ్ళోని ఆర్ ఎం పి డాక్టర్. ఊళ్ళోవాళ్ళకి అతనే వైద్యం చేస్తుంటాడు.

"చూపించాముర! మందులేవో ఇస్తున్నాడు. కానీ గుణం కనపడటంలేదు. నేను ఏమనుకుంటున్నానంటే, నువ్వు అమ్మని సిటీకి తీసుకెళ్ళి ఎవరైనా పెద్ద డాక్టరుకి చూపిస్తే ఫలితముం టుంది. నువ్వు సరే అంటే రేపో ఎల్లుండో అమ్మను వెంటబెట్టు కుని వస్తాను, ఏమంటావు?"

మనీష్‌కి అకస్మాత్తుగా మిన్ను విరిగి మీద పడ్డట్టయింది, "అన్నయ్యా! నేనిప్పుడు ఒక ముఖ్యమైన మీటింగ్‌లో ఉన్నాను. రేపు ఉదయం మాట్లాడతాను. నేను మళ్ళీ ఫోన్ చేస్తాను" అని ఫోన్ కట్టేశాడు.

మనీష్ పరిస్థితికి, స్మిత పరిస్థితికీ పెద్ద వ్యత్యాసం ఏమీ లేదు. బావగారు అటునుంచి మాట్లాడిన మాటలు వినకపోయి నప్పటికీ ఇంట్లో తుపాను రాబోతుందని ఆమె ఇట్టే గ్రహించింది.

ఇక మనీష్ అమ్మ అనారోగ్యం విషయం భార్యకి చెప్పాడో లేదో మండిపడింది. "ఇక ఆవిడ ఇక్కడికి రావటమొక్కటే తక్కువ. ఎవ్వరూ ఇతరుల ఇబ్బందులు పట్టించుకోరు. అందరికీ మీరొక్కళ్ళే కనపడతారు దేవదూతలాగా. అమ్మ బాధ్యత మీ ఒక్కళ్ళదేనా ఏమిటి? అన్ని ఇక్కట్లూ మనమీదే వచ్చి పడతాయి" అంది.

పిల్లలు కూడా అకస్మాత్తుగా ఏర్పడబోయే ఈ ఆటంకానికి నిరుత్సాహపడ్డారు. "ఇప్పుడు నాన్నమ్మ ఇక్కడికి వస్తే కిట్టీ పార్టీ ఏమౌతుంది? ఇప్పటికే అన్నిటినీ కొత్తగా డెకరేట్ చేశాము. నాన్నమ్మని ఇంట్లో ఎక్కడ ఎడ్జెస్ట్ చేస్తాం?" సందేహం వెళ్ళబుచ్చారు.

"మీరు రావద్దని చెప్పెయ్యండి. ఎలా చెపుతారో మీ ఇష్టం" తెగేసి చెప్పేసింది స్మిత.

"అలాగేలే, కానీ అలా ఎలా చెప్పగలం? ఏదన్నా ఉపాయం ఆలోచించాలి. నేను ముఖ్యమైన మీటింగ్‌లో ఉన్నానని ముందే చెప్పాగా! రేపు ఉదయం మాట్లాడతాను. ఏదో ఒక ఐడియా తడుతుందిలే."

"ఆలోచించండి. లేకపోతే ఆ ముసలావిడ పెట్టే బేడ వేసుకొని దిగిపోతుంది. ఇక ఆ తర్వాత చేసేదేమీ ఉండదు. మీరు ఏ ఉపాయం ఆలోచిస్తారో నాకు తెలీదు. కరాఖండిగా కుదరదని చెప్పెయ్యండి. మనం మాత్రమే గుత్తకు తీసుకున్నా మా ఏమిటి?"

"ఇక నువ్వు ఆపుతావా" మనీష్ కోపగించుకున్నాడు, "పద్ధతి లేకుండా అలా సూటిగా ఎలా చెప్పగలం?"

"ఏం? చెపితే తప్పేముంది? మీ తమ్ముడు కూడా ఇదే ఊళ్లో ఉన్నాడుగా. ఆయన గారి పెళ్ళాం వాళ్ళింటికి రావొద్దని ముఖం మీదే చెప్పేస్తుంది. సుఖంగానే ఉందిగా! కేవలం మీ నలుగురే కూర్చుని ఆవిడ విషయాలు నిర్ణయించేస్తారు. దానివల్ల జరిగేదేముంది? ఇక్కడ మన నెత్తినే వచ్చి పడుతోంది ఏ మిడిమేళం వచ్చినా. మీరు మంచి పోస్ట్‌లో ఉన్నారు గాబట్టి మిమ్మల్నే ట్రీట్‌మెంట్ చేయించమంటారు, తెలిసిందేగా! అక్కడ మీ ఊర్లోవాళ్ళకి ఎవరూ వైద్యమే చేయట్లేదా?"

స్మిత కళ్లల్లో ఉన్నట్టుండి కన్నీళ్లు పొంగుకొచ్చాయి.

నలుగురు మళ్లీ హాల్లోనే కూర్చునిపోయారు. స్మిత కూడా వంట విషయం మర్చిపోయింది. అత్తగారిని ఊళ్లో నుంచి సిటీకి రాకుండా చెయ్యటానికి ఏదైనా ఉపాయం కోసం సతమతమౌతున్నారు. కిట్టీ పార్టీ గురించి స్మిత ఎంత వర్రీ అవుతోందంటే ఆమె ఊళ్ళో ఉన్న తోడికోడలితో నేరుగా తానే ఫోన్లో మాట్లాడి అత్తగారిని తమవద్దకి ససేమిరా పంపొద్దని చెప్పటానికి సిద్ధంగా ఉంది. భర్తతో "మీరు ఫోన్ చేసి నాకివ్వండి, నేను వద్దని చెప్పేస్తాను" అంది.

కానీ మనీష్, పిల్లలు ఎలాంటి ఉపాయం ఆలోచించాలని చూస్తున్నారంటే తల్లి ఊరినుంచి వాళ్ళ దగ్గరికి రానూ రాకూడదు, దానివల్ల తమకి ఎటువంటి చెడ్డమాటా రాకూడదు. అంటే పాము చావనూ చావాలి, కానీ కర్ర మాత్రం విరగకూడదు.

రాత్రి 11 గంటలయింది. ఇంకా ఏ ఉపాయం తట్టలేదు. చివరికి ఒకటే చెప్పాలను కున్నారు. ప్రస్తుతానికి మనీషే వాళ్ళ అన్నయ్యకి ఫోన్ చేసి "ఒక నాలుగు రోజులు ఆగండి. నేను గవర్నమెంట్ పని మీద జైపూర్ వెళ్ళాలి, చాలా అర్జెంట్" అని చెప్పేటట్టు ఒక ఆలోచన వచ్చింది.

జైపూర్ వెళ్తున్నానని చెబితే ఏదో సాకు చెప్పినట్టుట్టుంది. దానిలో రిస్క్ కూడా చాలా ఉంది. ఇప్పుడు అదే చెప్పినా,

వాళ్ళ అన్నయ్య తల్లిని తీసుకొని ఇక్కడికి రావొచ్చు.' నువ్వు డాక్టర్‌కి చెప్పివెళ్ళు, నేను వెళ్లి అమ్మను చూపిస్తాను' అంటే ఏం చేయగలం? తల్లి ఒక్కసారి ఇక్కడికి వచ్చిందంటే, ఇక వెళ్లే ప్రసక్తే ఉండదు. అంటే, అన్నిటికంటే పెద్ద సమస్య ఇక కిట్టీ పార్టీ సంగతి గోవిందా!

తెల్లవారింది. భార్యా భర్తలు నిద్ర లేవగానే మళ్ళీ చర్చ ప్రారంభమైంది. ఏం చేయాలి? ఏం చేయకూడదు? ఇద్దరూ మాట్లాడుకోసాగారు. పిల్లలు ఇంకా నిద్ర లేవలేదు.

"నాకు ఒక ఐడియా వచ్చింది. స్మిత కూడా జోధ్పూర్ వెళ్లాల్సి ఉంది. అక్కడ వాళ్ళ తమ్ముడిది ఏదో ప్రాబ్లం ఉంది. అందుకని నేను కూడా జైపూర్ మీటింగ్ పూర్తి చేసుకొని అక్కడికి వెళ్దామని అనుకుంటున్నానని చెపుతాను" అన్నాడు మనిష్.

తన 'తమ్ముడు–ప్రాబ్లం' అనగానే స్మిత చిరాకు పడింది. "మీకు మతి గానీ పోయిందా? తమ్ముడికి ఏదో ప్రాబ్లం ఉ ందని చెప్పి కొత్త తమాషా మొదలెట్ట దలుచుకున్నారా ఏమిటి?" అంది.

"అయితే నువ్వే చెప్పరాదు ఏం చెప్పమంటావో! మీ అమ్మా నాన్నల ఆరోగ్యం బాగోలేదనమంటావా? ఇప్పుడు ఏదో ఒక నెపం వెతకాలి కదా!"

"మా పెద్దక్కయ్య కొడుక్కి పెళ్లి సంబంధం వచ్చింది, మాట్లాడాల్సిఉంది అని చెబుదాం."

ఇద్దరికీ ఈ విషయం ఆమోదయోగ్యంగా అనిపించింది. అదే చెబుదామనుకున్నారు. ఇంతలో పిల్లలు కూడా నిద్ర లేచారు.

కోమల్ వచ్చి వాళ్ళ పక్కన కూర్చుంది.

"డాడీ! ఏమైనా ఐడియా వచ్చిందా?"

స్మిత తనకు తోచిన కొత్త ఐడియా కూతురికి చెప్పింది. అప్పటికి సుమిత్ కూడా వచ్చి అక్కడ కూర్చున్నాడు.

"డాడీ! స్కీమ్ అయితే బాగానే ఉంది. కానీ ఒక్క పని చేయండి. మీరనుకున్నట్టే చెప్పండి. దానితో పాటే ఆ ఊరుకి 9–10 కిలోమీటర్ల దూరంలో ఉన్న సుల్తాన్‌పూర్‌లో గవర్న మెంట్ హాస్పిటల్ ఉంది. అక్కడి డాక్టర్లకు ఎవరితోనైనా చెప్పించండి. అలా అయితే జాగ్రత్తగా వైద్యం చేస్తారు. అన్నీ ముందుగానే ఫిక్స్ చేసుకుని అప్పుడు పెదనాన్న గారికి ఫోన్ చేయండి."

సలహా విని స్మిత సంతోషించింది. ఆ పని చేయటం మనీష్ కి పెద్ద కష్టమేమీ కాదు. వెంటనే అయిన సుల్తాన్పూర్‌లో ఎవరికో ఫోన్ చేసి అక్కడి డాక్టర్‌కు చెప్పించారు. ఇక అన్నగారికి తెలియజేయటం మాత్రమే మిగిలి ఉంది.

మనీష్ మొబైల్ తీసుకొని అన్నగారికి ఫోన్ చేయ బోయాడు. వెంటనే స్మిత ఆయన్ని వారించి "ఫోన్ చేసి నాకివ్వండి. నేను మాట్లాడతాను. మీరు ఏం మాట్లాడతారో ఏమో! వేసిన స్కీమ్ అంతా తారుమారు అవుతుంది" అంది.

మనీష్ వాళ్ల అన్నగారు ఫోన్ ఎత్తారు.

"బావ గారూ! నమస్కారం. నేను స్మితని మాట్లాడు తున్నాను. అత్తయ్య గారి ఆరోగ్యం ఇప్పుడు ఎలా ఉంది?"

అటునుండి బావ గారు ఏదో చెప్పారు. దానికి స్మిత "బావ గారూ! ఈ మధ్యఈయన కూడా చాలా టెన్షన్‌గా ఉంటున్నారు. ఈయన కమిషనర్ ఊపిరాడనివ్వడం లేదు. కొంచెం కూడా తీరిక ఉండటం లేదు. రాత్రిళ్ళు పొద్దుపోయేవరకు ఏవో మీటింగ్స్ ఉంటున్నాయి. ఇప్పుడు ఒక అర్జెంట్ మీటింగ్ కోసం జైపూర్ రమ్మన్నారు. నేను కూడా అనుకోకుండా ఉ న్నట్టుండి జోధ్పూర్ వెళ్లాల్సి వచ్చింది. మా నాన్న గారు ఏదో అర్జెంట్ పని ఉంది, వెంటనే రమ్మన్నారు."

"అత్తయ్య గారి గురించి మీరు దిగులు పడొద్దు. మీ తమ్ముడు సుల్తాన్‌పూర్ గవర్నమెంట్ హాస్పిటల్‌లోని డాక్టర్‌తో మాట్లాడారు. 'మీరేమీ ఆందోళన పడవద్దు, మేం చూసు కుంటాం' అన్నారు అక్కడి డాక్టర్. మీరు అత్తయ్యగారిని సుల్తాన్ పూర్ తీసుకెళ్లి చూపించండి. డాక్టర్ గారు చాలా అనుభవజ్ఞుడు. సిటీ నుంచే అక్కడికి వచ్చారు. అయినా బావగారూ! అత్తయ్యగారికా వృద్ధాప్యం వచ్చేసింది. ప్రతి చిన్న దానికి ఇక్కడ పరిగెత్తుకుంటూ వస్తే ఎలా? ఇక్కడ కూడా ఆయన ఎన్నో చిక్కులతో సతమతమవుతూ ఉంటారు. అత్తయ్యా గారికి ఈ వయసులో ఎక్కువ ఇబ్బంది కలగజేయకూడదు. కేవలం మందులు ఇప్పించండి. ఇక మిగిలింది అంటారా? భగవంతుడి మీద భారం వెయ్యటమే" చెప్పి ఫోన్ పెట్టేసింది.

తన అన్నయ్యతో స్మిత మాట్లాడిన తీరుకి మనీష్ మనసు కొంచెం నొచ్చుకుంది. కానీ మళ్ళీ వెంటనే అందరూ కలిసి కిట్టి పార్టీ ఏర్పాట్లలో నిమగ్నమైపోయారు.

ఇప్పుడే ఆ సమస్య నుంచి బయట పడి మళ్ళీ కిట్టీ పార్టీ మెనూ గురించి చర్చించటం మొదలెట్టారు. మెనూలో ఏ చిన్న లోపం జరిగినా అదే పెద్ద విషయంగా మారిపోతుంది. ఎక్కువ ఐటమ్స్ రిపీట్ అవ్వటమూ బాగుండదు. కొత్త ఐటమ్సే మరీ ఎక్కువైనా విమర్శకు దారి తియ్యొచ్చు. ప్రతి ఐటెం గురించి చర్చించి చాలా జాగ్రత్తగా మెనూ సెట్ చేశారు. మూడవ రోజే కిట్టీ.

అన్ని విషయాలూ నిర్ణయమైపోయాయి, అయినా స్మితకి విశ్రాంతి ఎక్కడ? సాయంత్రం ఉన్నట్టుండి తమ ఇంట్లోని టీ కోస్టర్ సెట్ పాతబడి పోయిందని జ్ఞాపకమొచ్చింది.

వెంటనే పరుగెత్తి బజారుకు వెళ్ళి కొత్తది పట్టుకొచ్చింది. 15-20 పెన్నులు కావాల్సి ఉంది. త్వరగా వెళ్ళి ఒకే రకమైన పెన్నులు తెమ్మని సుమిత్‌ని పరుగు పెట్టించింది.

మనీషేమో పేపర్ వాణ్ణి రోజూ వేసే పేపర్లతో పాటు మూడు-నాలుగు ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు ఆరోజు ఎక్స్ట్రా వెయ్యమని చెప్పాడు. కొంచెం ఇంప్రెషన్ బాగుంటుందని అతని ఆలోచన. ఆ మూడు రోజుల్లో ఎన్నో ఏర్పాట్లు చేశారు. ఎన్నో కొత్తవి సమకూర్చారు. కానీ తల్లికి ఎలా ఉందని మాత్రం మనీష్ ఒక్కసారి కూడా తెలుసుకోలేదు. స్మితకి జబ్బుతో ఉన్న అత్తగారు ఎలా ఉన్నారో అన్న ధ్యాసే లేదు.

మధ్యలో ఒకసారి మనీష్ వాళ్ళ అన్నగారు ఫోన్ చేశారు కూడా. కానీ మనీష్ ఫోన్ ఎత్తలేదు. బావగారు ఫోన్ చేస్తే ఎత్తవద్దని స్మిత కరాఖండిగా చెప్పింది మరి!

ఆ రోజే స్మిత వాళ్ళింట్లో కిట్టీ పార్టీ.

తెల్లవారిన దగ్గర నుంచే ఇంట్లో హడావుడి మొదలైంది. పొద్దున్నే ఇల్లు శుభ్రం చేసే పని పూర్తిచేశారు. మసాలా వడల కోసం శెనగపప్పు నానబెట్టారు. బజారు నుంచి స్వీట్స్ తెప్పించి ఫ్రిజ్‌లో పెట్టారు. ఐస్‌క్రీమ్, కూల్ డ్రింక్స్ ఏర్పాట్లు కూడా జరిగాయి. స్మిత పాయసం చాలా బాగా చేస్తుంది. 5 లీటర్ల పాలు తీసుకురమ్మని సుమిత్‌ని బజారు పంపించింది. కోవా ముందే తెప్పించి ఉంచారు.

అన్ని ఏర్పాట్లు చాలా బాగా జరుగుతున్నందుకు స్మిత మనసు ఆనందంతో పరవశించిపోతోంది. ఆమె మనీష్ చెయ్యి పట్టుకుని "థేంక్యూ! మీ సహకారం లేకపోతే ఇదంతా సాధ్యమయ్యేది కాదు. మీ మనసెంత మంచిది మనీష్! నేను మీచేత ఎంతో ఖర్చుపెట్టించాను. కొత్త ఏసీలు, కొత్త కర్టెన్లు, కొత్త సోఫా కవర్లు, కొత్త బెడ్ షీట్స్, ఇంకా ఎన్నో... అడిగింది లేదనకుండా తెప్పించారు. నేను సుమిత్‌కి కూడా చెపుతూ ఉన్నాను ఇలా ఉంటేనే అది కుటుంబం.

సుమిత్! మీ నాన్నగారు చూడు ఎంత కేర్ తీసుకుంటారో కుటుంబం అంటే. తర్వాత నువ్వు కూడా ఇలాగే పట్టించుకోవాలి!" అంది.

మనీష్ నవ్వుకుని బెడ్ రూమ్‌లోకి వెళ్ళాడు. అప్పుడే ఉన్నట్టుండి మొబైల్ రింగైంది. స్మిత ఫోన్ వైపు చూసింది. కాల్ బావగారి నుంచి. ఆమె తీయలేదు. చాలాసేపు రింగైంది. ఆగగానే మళ్ళీ రింగైంది. మూడవసారి కూడా రింగవ్వటంతో స్మిత చాలా కోపంగా ఫోన్ ఎత్తింది.

ఆమె నోరు తెరవకముందే అటునుంచి ఏడుస్తున్న బావగారి స్వరం వినిపించింది, "అమ్మా స్మితా! అమ్మ ఇక లేదు. మీరు ఎక్కడున్నా వెంటనే రండి."

"ఏమంటున్నారు బావ గారూ? ఎప్పుడు జరిగింది?"

ఇప్పుడేనమ్మా పది నిముషాల క్రితమే చనిపోయింది. మూడు రోజుల నుంచి ఏమీ బాగుండటం లేదు. డాక్టర్లు లాభం లేదని చెప్పేశారు. మనీష్‌కి ఫోన్ కూడా చేశాను, బహుశా వాడు ఏదో మీటింగ్‌లో ఉండుంటాడు. మీరు కొంచెం ఫ్రీ అయితే అమ్మకి సిటీలో వైద్యం చేయిస్తే కోలుకుంటుంది అనుకున్నాను, కానీ ఇలా జరగాలని ఉంటే ఎవరు మాత్రం ఏమి చెయ్యగలరు? మీరు త్వరగా వచ్చెయ్యండి. సాయంత్రం పొద్దుపోయేలోపే దహన సంస్కారాలు అయిపోవాలి. అసలే పల్లెటూరు కదా!"

మొబైల్ పదే పదే మోగిన శబ్దం విని మనీష్ గదిలోనుంచి బయటకు వచ్చాడు.

"ఎక్కడనుంచి ఫోన్? అంతా బాగానే ఉందా? కిట్టీ పార్టీ ఏర్పాట్లలో ఏ లోటూ రాలేదుగా!"

స్మిత ఎక్కి ఎక్కి ఏడుస్తూ "బావగారు చేశారు, అత్తయ్య గారు ఇక లేరండీ"

"ఏమిటి? ఎప్పుడు?" ఉన్నపళాన కూలబడ్డాడు మనీష్. కళ్ళముందున్న లోకమంతా తిరిగిపోతున్నట్టు అనిపించిందతనికి.

"ఇవ్వాళే, ఇప్పుడే.. పది నిముషాల క్రితమే"

వాళ్ళంతా మాట పలుకు లేకుండా కూర్చొనిపోయారు.

నిశ్శబ్దం ఆ ముగ్గురి మధ్య ఆవహించింది.

అకస్మాత్తుగా తలుపు తెరుచుకుంది. సుమిత్ సంచి చేత్తో పట్టుకుని లోనికి వచ్చాడు. "అమ్మా! గోల్డ్ మిల్క్ తీసుకొచ్చాను, ఇక్కడెక్కడా లేవు. డెయిరీకి వెళ్ళాల్సి వచ్చింది. ఇప్పుడిక నీ కిట్టీ పార్టీకి ప్రశంసలే ప్రశంసలు."

అతను అమ్మ-నాన్న కోమల్ వైపు చూశాడు. వాళ్ళ ముఖాలు కాంతి విహీనంగా ఉండటం గమనించి కంగారు పడ్డాడు, "నాన్నా ఏమయింది? మమ్మీ ఏమయింది? అందరూ బాగానే ఉన్నారా?"

డాడీ మమ్మీ ఏం చెపుతారు?

చెప్పటానికి ఇంకేమి మిగిలి ఉంది గాబట్టి! ■

**నిజం ఒక ఆయుధం**
**ఉపయోగించాల్సిన సమయంలో తడబడితే**
**అది మనల్నే వధిస్తుంది**

**- సుభాష్ చంద్రబోస్**






# మంత్రనగరి విచిత్రాలు 'కేరాఫ్ బావర్చి' కథలు

- రోహిణి వంజారి

97059 72222

మీరెప్పుడైనా ఇంట్లో కూర్చుని ఇరానీ హొటల్లో ఉండే మసాలా టీ రుచిని ఆస్వాదించారా? వెండితెరపై వెలిగిపోవాలని కలలుకంటూ మీ పక్కింటి అబ్బాయో, ఎదురింటి అమ్మాయో హైదరాబాద్ రైలెక్కడం చూశారా? హైదరాబాద్ సుల్తాన్ బజార్‌లో రంగురంగుల గాజులు చేసే గలగలలు విన్నారా? గణపతి కాంప్లెక్స్ దగ్గర, కృష్ణానగర్ ఇరుకు గల్లీల్లో పోగేసుకున్న ఆశయాలు, పోగొట్టుకున్న కళలను, కలలను చూశారా? ఇవన్నీ పరిచయం కావాలంటే– హైదరాబాద్‌లో పేరుమోసిన 'బావర్చి' హొటల్‌కి వెళ్లాల్సిందే! ఇప్పటికిప్పుడు ఎలా పోగలమని భావించక్కర్లేదు. మంత్రనగరి లో విహరింపచేసే 'కేరాఫ్ బావర్చి' కథలు చదివితే చాలు.

యువ కథకుడు చరణ్ పరిమి ... పత్రికల్లో చిత్రకారునిగా చాలామందికి తెలుసు. తను గీచే ప్రతి చిత్రం తనకి ఓ కథ చెపుతుందేమో! అందుకే కథలు రాయకుండా ఉ ండలేకపోయాడు. ఈ కథల్లోని ప్రతి సంభాషణ, ప్రతి సన్నివేశం మన కళ్ళ ముందు ఓ విజువల్ ఎఫెక్ట్‌ని ఇస్తుంది. కృష్ణానగర్, అన్నపూర్ణ, పద్మాలయా, సారథి లాంటి స్టూడియోల చుట్టూ తిరిగే ఆత్మల జీవితానుభవాలను కాచి వడబోసినట్లు కనబడతాయి ఇందులోని కొన్ని కథలు. సినీ స్క్రీన్ ప్లేకి దగ్గరగా ఉన్నట్లు కాసేపు భ్రమింపచేస్తుంది వీరి శైలి. అలాగని ఇవన్నీ సినిమా కథలు కావు. చిన్న చిన్న సంభాషణలతో, లోతైన భావాలతో, అద్భుతమైన టైమింగ్తో రాశారు. మొత్తం 12 కథలు ఉన్నాయి ఈ సంపుటిలో. దేనికదే ప్రత్యేకం. ప్రతి కథకి రచయిత అద్దిన రంగులు మనకి సప్తవర్ణాల్లో కనిపిస్తాయి. ఇది మొదటి కథల సంపుటి అయినా మనకు అలా అనిపించదు.

తను రాసిన కథకి స్పందన కోసం ఎదురు చూస్తున్న విశ్వక్ అనే యువ రచయితకి ఓ పాఠకురాలి నుంచి ఫోన్ రావడం, తర్వాత వారిద్దరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణల్లో భర్తను కోల్పోయి, చీకటి అలముకున్న ఆమె జీవితంలో తిరిగి రంగులు ఎలా నింపాడో ఆ రచయిత 'కాలింగ్... సప్తవర్ణం' కథ మనల్ని మెస్మరైజ్ చేస్తుంది. దూరమైన ప్రేమ తాలుకు జ్ఞాపకాలను మనసు పొరల్లో ఉంచి, తనని తాను ప్రేమించుకుంటూ, జీవితాన్ని ఎలా వర్ణమయం చేసుకోవచ్చో విశ్వక్ పాత్ర చెబుతుంది. ఆ మాటలు ఓ ఒంటరి మనసును ఎలా సేదదీర్చాయో.. బతుకు అంటే బహుమానం అని తెలుసుకుని ఆమె ఎలా మారుతుందో ఈ కథ చెబుతోంది.

'డబ్బు సృష్టించేదే ఆర్ట్. సృష్టించేందుకే ఆర్ట్', 'పరిస్థితులు జ్ఞానానికి పరిమితులు విధిస్తాయి' కంపెనీలో బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేయడంకోసం నిద్రలేని రాత్రులు గడిపి, తను గీసిన పోస్టర్‌ని కాదని, మరో బ్రాండెడ్ కంపెనీ నుంచి వచ్చిన ఆర్టిస్ట్‌తో పనిచేయించుకోవడంతో, నిరాశకు గురైన ఓ ఆర్టిస్ట్ కథ 'అన్ ఆర్టిస్ట్ బయోగ్రఫీ'. ఆర్టిస్టుగా తన జ్ఞానం, సృజన తనకు బతుకుతెరువుని చూపించలేకపోయాయని వ్యథ చెందే చెర్రీ అనే ఆర్టిస్ట్ స్వగతం ఈ కథ. కృష్ణానగర్లో ఆర్టిస్టుల కామన్ అడ్డా ఆ ఇరానీ కేఫ్. అక్కడ ఆశయాలు, ఆశలు, గతం తాలూకు అనుభవాలు, భవిష్యత్ ప్రణాళికలు.. అన్నీ సినిమాల గురించే. డైరెక్టర్ కావాలని కలలు కనే యువకుడు, హీరోయిన్ కావాలని ఆశపడే అమ్మాయి, రచయితగా తన సత్తా నిరూపించుకోవాలని కోరికతో వచ్చిన స్క్రీన్ ప్లే రైటర్.. ఒకరేమిటి, పొద్దునంతా సినిమా ఆఫీసుల చుట్టూ అవకాశాలకోసం తిరిగి, సాయంత్రానికి ఆశనో, నిరాశానో, భరోసానో, చీదరింపునో నెత్తికెత్తుకుని, బావర్చి కేఫ్‌కి వచ్చి నాలుగు చుక్కల మసాలా టీని నాలుక మీద చల్లుకుని కాసింత విశ్రాంతి, ఓదార్పు కోరుకుంటూ హొటల్ బల్లల మీద కూర్చుంటారు. అక్కడే ఓ మూల ఉన్న బల్ల మీద ఓ నజీర్

లాంటి తోడేళ్ళు, నక్కలు వలవేసి కాచుకొని ఉంటాయి. వెండి తెర మీద వెలుగులు చిమ్మాలని ఆశతో వచ్చిన తారకలు వెండితెర మీద కనిపించక, అర్ధరాత్రి కృష్ణానగర్లో షాపుల మెట్ల మీద తళుక్కుమంటారు. వాళ్లకు రోడ్డే పానుపు అవుతుంది. వారి వెనుక నజీర్ లాంటి తోడేళ్ళు ఉంటాయి. అలా మిగిలిపోయే అనేకానేక బతుకుల్లోని విషాదం 'కేరాఫ్ బావర్చి' కథలో కనిపిస్తుంది.

తన తండ్రిని హీరోగా భావించి, తన తండ్రి చేసే పని మీద విపరీతమైన ఇష్టాన్ని పెంచుకున్న ఓ బుడ్డోడు. కొడుకు తను గీసే బొమ్మల పట్ల ఆసక్తి పెంచుకుంటుంటే, తనకి అచ్చిరాని, అన్నం పెట్టని కళని కొడుకు అనుసరించడం ఇష్టం లేక, వాడి మెడలో టాయ్ స్టెతస్కోప్ వేసి, తన పెయింటింగ్ షాప్‌ని తీసేసి, ఆ బుడ్డోడి కళలను, కలను మొగ్గలోనే తుంచేస్తాడు ఆ తండ్రి A Day Dream కథలో. కొన్నేళ్ళ తర్వాత ఆ ఇంట్లో కార్పొరేట్ జీతగాడు పుట్టాడు. కాబోయే రవివర్మ అంతరించాడు అంటూ కథని ముగిస్తూ చిత్రకారుల జీవితాల్లోని చీకటి రంగులని మన మనసుల మీద కుమ్మరిస్తాడు రచయిత.

రీతూ.. ఓ కళాకారిణి. ఫొటోగ్రఫీలో అత్యున్నత శిఖరాలు అందుకోవాలని ఆమె ఆశయం, కల, జీవిత లక్ష్యం. ఆమె ఆశయపు పాలపొంగు మీద అడుగడుగునా నీళ్ళు చిలకరించే భర్త. దాంతో తన ప్రతిభ మీద తనకే అపనమ్మకం. ముందుకు సాగలేని బేలతనం. పుట్టుకతో అంధుడైనా, తన మనో నేత్రాలతో రంగుల ప్రపంచాన్ని చూడగలిగే మిత్రుడు అవినాష్ ఇచ్చిన ప్రోత్సాహం ఆమెలోని బేలతనాన్ని పోగొడుతుంది. అంతవరకూ మోసిన భయాన్ని దూరంగా విసిరేసి లక్ష్యంవైపు అడుగులు వేస్తుంది. ఆమె తీసిన అవినాష్ దంపతుల ఫొటో ఆమె కీర్తికి ప్రతీకలా చాలాచోట్ల కనబడుతుంది. భయం, బేలతనం మీద ఉన్న అపోహలు, రకరకాల షేడ్స్‌ని 'ఛాయా చిత్రం' కథలో మనం తెలుసుకోవచ్చు.

దెయ్యం లాంటి ఒంటరితనం నుంచి బైట పడడానికి సుశీలమ్మ తనలో శక్తులు ఉన్నాయని, అందరి సమస్యలకు పరిష్కారం తన వద్ద ఉందని ఊర్లో అందరిని నమ్మించి, తన చుట్టూ తిరిగేలా చేసుకుంటుంది. ఆ లోగుట్టు తెలుసుకున్న శాంత ఆమెని అనుసరిస్తుంది. ఈ ఒంటరి మహిళల దీనగాధని 'వెదుకులాట' కథ ప్రతిభావంతంగా రికార్డు చేసింది.

ప్రేమించబడడం తన హక్కు అనుకున్న ఓ యువకుడు, తనను ప్రేమించే అమ్మాయి పట్ల నిర్లక్ష్యం వహించడం, అతని ప్రేమ కోసం ఎదురు చూసి చూసి చివరకు ఇంట్లో వాళ్ళు, చర్చిలో ఫాదర్ చేసిన బలవంతపు బోధనలు, అతని ప్రేమ రాహిత్యం ఆమెని నన్‌గా మారిస్తే, చివరాఖరికి ప్రేమ విలువ తెలుసుకున్న అతను ఆమె కోసం రావడం ఒక జీవితకాలపు ఆలస్యం అయింది అతనికి. ఒకప్పటి బ్యూలా కాదు ఆమె ఇప్పుడు. ఏ భావం పలికించలేని కళ్ళు ఆమెవి ఇప్పుడు. ప్రేమ, జాలి, భక్తి అన్నింటికీ అతనిదగ్గర ఒకటే అర్థం. అది మనసు పాడే విరహగీతం. అది అతను చేజేతులా చేసుకున్నది. 'మనో గీతం – కొన్ని అధ్యాయాలు' కథలో ప్రేమ, విరహం, భక్తి, సేవ, త్యాగం, నిర్లక్ష్యం, పశ్చాత్తాపం.. మరి కొన్ని సంవేదనలు కలగలిసిన పెద్ద కథ ఇది. దిశా సంఘటన నేపథ్యంలో రాసిన కథ 'మాయాపులి'. దిశ ఘటనపై దేశంలో అందరూ స్పందించారు. ఆ తర్వాత అటువంటి సంఘటనలే చాలా జరిగాయి. అప్పుడు అంతగా స్పందన రాలేదు. బాధితులకు న్యాయం జరగడంలోని లోటుపాట్లను విమర్శనాత్మక దృష్టితో, సెలెక్టివ్ జస్టిస్ ఇచ్చే చట్టం పులిగా మారడం.. ఊహాత్మకంగా సరికొత్త పంథాలో సాగిన కథ ఇది.

ఇంకా ఇందులో 'బహుముఖాలు'లో బిడ్డ ప్రేమకు, భవిష్యత్ కోసం తన ప్రేమను త్యాగం చేసుకునే ఓ తల్లి కనిపిస్తుంది. 'వింగ్స్ అండ్ షాడోస్'లో తనలో ఉన్న గొప్ప డాన్సర్‌ని తన నిర్లక్ష్యం, చెడు అలవాట్లు, సరైన లక్ష్యం లేకుండా జీవితాన్ని తెగిన గాలిపటంలా చేసుకున్న జాక్సన్, తనను ప్రేమించిన అమ్మాయిని కూడా పోగొట్టుకుని, తన పతనానికి తనే కారణం' అని తెలుసుకోవడంతో కథ ముగుస్తుంది.

ఈ కథల్లోని పాత్రల పట్ల రచయితకు చాలా ప్రేమ. అందుకే చాలావరకు వాటి జీవితాల్లోని ఆటుపోట్లను చూపిస్తూ చివరకు ఆశాభావ ముగింపు ఇచ్చాడు. కొన్ని కథల్లో మాత్రం పాత్రల పట్ల కాస్త కఠినంగా ఉండడం తప్పలేదు. కథలు చదువుతుంటే, పాత్రలు మన కాళ్ళ ముందే తిరుగాడుతున్నట్లు ఉంటుంది. ఇక వాక్య నిర్మాణంలో, సంభాషణల్లో అతి వేగం కనిపించడం లోపం కాదు కానీ, సన్నివేశాల వెంట పాఠకులు పరిగెత్తుకుంటూ వేగాన్ని అందుకోవాల్సివస్తుంది.

హైదరాబాద్ నగర జీవితాలకు నిలువెత్తు దర్పణం ఈ 'కేరాఫ్ బావర్చి' కథల సంపుటి. సర్రియలిజం, ఇంప్రెషనిజం, రియలిజం తెలిసిన బహుచాతుర్య చిత్రకారుడు ఈ కథకుడు. ఆ సృజన మనకు ఈ కథల నిండా కనిపిస్తుంది. ఇది అన్వీక్షికి ప్రచురణ. ■



# 'ఫేక్' ఉత్తర్వులతో సోషల్ మీడియాపై కత్తి

- తెలకపల్లి రవి

**ఓ**డ ఎక్కేవరకూ ఓడ మల్లయ్య అన్న పెద్దమనుషులు ఓడ దిగాక ఏమంటారో ఆ సామెత తెలిసిన తెలుగువాళ్లకు బాగా తెలుసు. ప్రధాని నరేంద్ర మోడి సర్కారు విధానం అచ్చంగా ఆ సామెతకు నకలుగా తయారైంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా మూడు పర్యాయాలు ఎన్నికైన మోడీ ప్రధాని అభ్యర్థిగా ప్రచారంలోకి రావడానికి సోషల్ మీడియాను సోపానంగా వాడుకున్నారు. కార్పొరేట్ల సాయంతో వేలాది మంది యువతను వినియోగించి అహోరాత్రులు ఆయన ఘనతను హోరెత్తించారు. ఉత్తుత్తి ఫొటోలు సృష్టించారు. పాత చరిత్రను మార్చి కొత్త ఇమేజి తేవడానికి తంటాలు పడ్డారు. ఆఖరుకు నరేంద్ర మోడీ బిజెపి కార్యాలయం తుడుస్తున్న ఫొటో, ఛాయ్‌వాలా కథ, చదువుకున్న పట్టాలు ఏవీ నిజమని నిరూపించుకోలేకపోయారు. ఈ పట్టాను గురించిన సమాచారం ఇవ్వవలసిందిగా సంబంధిత సంస్థను ఆదేశించినందుకు తెలుగువాడైన జాతీయ సమాచార హక్కు కమిషనర్ డా.మాడభూషి శ్రీధర్‌ను తప్పించారు కూడా. బిజెపి, ఆరెస్సెస్ మార్కు అసత్య కథనాలు, కట్టుకథలు తట్టుకోలేక వార్తాసంస్థలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవల్సి వచ్చింది. ప్రత్యేక పరిశోధకులను నియమించి నిరూపించవలసి వచ్చింది. ఇదిగో ఈ ఫోటోను మార్ఫింగ్ చేసి కొత్తది తయారు చేశారని లేదంటే అబద్ధాలతో లేని కథ వండివార్చారని సోదాహరణలతో ఎన్నో కథనాలు బయటపెట్టాయి. కొన్నిసార్లు ఈ పరిశోధన తీవ్ర ఇరకాటంలో పెట్టింది. తమ నిజస్వరూపం బయట పెట్టిన వారిపై కక్ష సాధింపులకూ వేధింపులకూ పాల్పడింది. ఆల్ట్ మీడియా అనే సంస్థ ఇందులో విశేషమైన కృషి చేసింది గనక ఆ సంస్థ అధినేతలలో ఒకరైన మహమ్మద్ జుబేర్‌ను జైలుపాలు చేసింది. సరిగ్గా ఇప్పుడు ఆ అనుభవాన్నే మోడీ సర్కారు మరోవైపు నుంచి ప్రయోగించడానికి సిద్ధమైంది. ఫేక్ న్యూస్ ప్రసారం చేస్తే సహించేది లేదని బెదిరించడమే గాక ఏది నిజం, ఏది ఫేక్ అని నిర్ధారించే అధికారం తన చేతుల్లోకి తీసుకుంటున్నది. విమర్శనా స్వేచ్ఛకు, వాస్తవాల వెల్లడికి సాధనాలుగా వుండాల్సిన మీడియా, సోషల్ మీడియాలను నియంత్రించేందుకు కొత్త చట్టాలు బిగిస్తున్నది.

**ఏమిటీ సవరణ?**

సోషల్ మీడియా ఇంతగా విస్తరించక ముందు ఇన్ఫర్మేషన్ చట్టం-2000 పని చేస్తూ వచ్చింది. ఈ చట్టంలో సెక్షన్ 69(1) కింద ఏదైనా సంస్థ లేదా మీడియా ప్లాట్‌ఫారమ్ ప్రకటించిన వార్త దేశానికి హానికరమైనదని, ఉద్రేకాలు పెంచుతుందని భావిస్తే పోలీసులు కేసు పెట్టొచ్చు. మారిన పరిస్థితుల్లో ఆ చట్టం సరిపోలేదని 2019లో ఫేక్ వార్తల అదుపునకు పిఐబి కమిటీ వేశారు. 2021లో కొత్త సవరణ తీసుకొచ్చారు. వాటి ప్రకారం బనాయించిన అనేక కేసులు సుప్రీం కోర్టు ముందు విచారణలో వున్నాయి. చాలాసార్లు అత్యున్నత న్యాయమూర్తులే వీటిపై విమర్శలు చేశారు. కేంద్రం తన వైఖరి చెప్పాలని తాఖీదులిచ్చారు. కేంద్రం ఆరు నెలల గడువు కోరింది. ఈ కాలంలో ఆ ఆంక్షలు అమలులో వుండవని సుప్రీం ప్రకటించింది. మరోవైపు 2021 సమాచార సాంకేతిక పరిజ్ఞానం నిబంధనల సవరణ ముసాయిదా తీసుకొచ్చింది. దాంతో వ్యూహాత్మకంగా కేంద్రం కొత్త ఎత్తు ఎత్తింది. ఆ ప్రకారం పిఐబి నియమించే ఫేక్‌వార్తల నియంత్రణ కమిటీ లేదా ప్రభుత్వం అందుకోసం నియమించే మరేదైనా కమిటీకి ఏకపక్ష నిషేధ అధికారం కల్పించారు. ఆన్‌లైన్ గేమింగ్‌ను నిరోధించడానికి ఈ చట్టం తెచ్చామని పైకి చెబుతున్నారు గాని నచ్చని అంశాల ప్రచురణలను తొక్కిపట్టడం కోసం అంతకన్నా తీవ్రమైన అంశం జోడించారు. సోషల్ మీడియా వేదికలలో అంటే యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, ఓటిటి వంటి వాటిలో వచ్చిన

వార్తా కథనాలు (కంటెంట్) అవాస్తవమైతే వాటిని తొలగించే అధికారం పిఐబికి వుంటుందని ఆ సవరణలో ప్రతిపాదించారు. వాటిని తీసేయవలసిందిగా ఆదేశిస్తే మధ్యంతర వ్యవస్థలైన అగ్రిగేటర్లు (అంటే వాటిని నిర్వహించే యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, ఓటిటి సంస్థలు) అమలు చేయవలసి వుంటుంది. బూటకపు కథనాలు తొలగిస్తే మంచిదే కదా అని ఎవరికైనా అనిపించవచ్చు. కానీ అసలు సమస్య అక్కడే ఉత్పన్నమవుతుంది. ఏది నిజమో ఏది బూటకమో నిర్ణయించేది ఎవరు? వాటికి కొలబద్దలేమిటి?

**గత అనుభవాలేమిటి?**

గతంలో నియమితమైన పిఐబి కమిటీ అనుభవం తీసుకుంటే చాలా దారుణంగా వుంది. అనేకసార్లు ఈ కమిటీ కొన్ని వార్తలు బూటకమని (ఫేక్) ప్రకటించింది. కాని ఈ ప్రకటనలే బూటకమయ్యాయి. సంఘపరివార్ లేదా ప్రభుత్వం విడుదల చేసే ఫేక్‌లు తేల్చడానికి సోషల్ మీడియాలో కొందరు కృషి చేస్తూ వచ్చారు. ఉదాహరణకు 2020 డిసెంబరులో కేంద్ర నిఘా విభాగం (ఐబి) తరపున విడుదలైన నియామకాలకు సంబంధించిన అడ్వర్టయిజ్‌మెంట్ బూటకమని గొప్పగా ప్రకటించింది. తర్వాత చూస్తే అది అధికారికంగా ఇచ్చిందేనని తేలింది. పిఐబి తన ట్వీట్‌నే తొలగించుకోవాల్సి వచ్చింది. ఇక పరివార్ దుష్ప్రచారాలకు లోటే లేదు. కరోనా సమయంలో ఆర్ణబ్ గోస్వామి వంటి వారు వలస కార్మికులు తరలిపోతున్న ఫొటోను మసీదు బ్యాక్‌గ్రౌండ్‌తో ఇవ్వడం ఎంత కలవరం కలిగించిందో గుర్తుండే వుంటుంది. కరోనా కాలంలో ఢిల్లీలోని తబ్లిగీ జమాయత్ మర్కజ్ సంస్థలో ఏం జరిగింది? ఈ విషయంలో అప్పట్లో ప్రధానితో సహా చేసిన ప్రకటనలు ఎలా ఉన్నాయి? మతాల మధ్య చిచ్చు పెట్టడానికి తప్పుడు కథనాలు వదలడంపై చివరకు సుప్రీం కోర్టు కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. హత్రాస్ ఘటనలోనూ బూటకపు చిత్రాలు వచ్చాయి. నిజమైన ఫొటోలు, మార్ఫింగ్ ఫొటోలు పక్కపక్కనే చాలాసార్లు ప్రచురితమయ్యాయి. (ఇలాంటి దారుణమైన అనుభవాలు తెలుగు రాష్ట్రాల్లోనూ ఉన్నాయి. వాటిలోకి వెళితే ఎవరు ఏమిటి అన్నది మరో వివాదమవుతుంది) విచిత్రమేమంటే పిఐబి ఏర్పాటు చేసిన కమిటీ పరివార్ ప్రచారాల జోలికి పోయిందే లేదు. వారు వెల్లడించిన, ఖండించిన కథనాల్లో నూటికి తొంభై ప్రతిపక్షాలకు సంబంధించినవే. రాహుల్ గాంధీ యాత్ర సందర్భంలో ఫొటోలు లేదా ప్రకటనలు, ఇతర ప్రతిపక్షాలు లేదా మీడియా సంస్థలు కథనాలు సమాచారాలపైనే ఎక్కడలేని కేంద్రీకరణ చూపించడం అనుభవంలో చూశాం. పిఐబి అనేది మౌలికంగా ప్రభుత్వ విధానాలను లేదా కృషిని ప్రజలకు మీడియాకు తెలియజేయడానికి ఉద్దేశించిన సంస్థ. ఆ సంస్థ ప్రచారంలో పెట్టే విడుదల చేసే ప్రకటనలు ఎంతవరకూ నిజమని తేల్చవలసిన బాధ్యత మీడియా పైన సోషల్ మీడియా పైన ఇంకా ప్రతిపక్షాలు ప్రజా సంస్థల పైన వుంటుంది. దీన్ని అటూ ఇటూ తిప్పి తక్కిన వారిపై నిఘా వేసి కంటెంటు తొలగించే అధికారాలివ్వడం తలకిందులు తర్కం. ఉదాహరణకు ఇటీవల ప్రధాని విశాఖ పర్యటనకు వచ్చినపుడు జరిగిన కార్యక్రమాల్లో తొంభై శాతం శంకుస్థాపనలు మాత్రమే! ఆ విషయం గట్టిగా చెబితే పిఐబి దాడి చేస్తుంది. ఎందుకంటే ఆ శంకుస్థాపనలు అంచనాల మొత్తంవారు అభివృద్ధి కింద చూపిస్తుంటారు. 'ఊరి' సైనిక కేంద్రంపై దాడి, పాకిస్తాన్‌పై సర్జికల్ స్ట్రయిక్స్ వంటి వాటిపై విపరీత ప్రచారం జరుగుతుంది. వాటికి సంబంధించిన నిజానిజాలు అడిగితే దేశభద్రతకు ముప్పంటారు. ఇంకా చెబితే దేశద్రోహం ముద్ర వేస్తారు. భారత్– చైనా సరిహద్దులలో పరిస్థితిపై ఏవో కథనాలు వస్తాయి. పూర్తి వివరాలు అడిగితే దాటేస్తారు. ప్రత్యారోపణలు చేస్తారు. ఇలాంటి అనేక సందర్భాలు చూశాం. అసలు పరిశోధనాత్మక జర్నలిజంలో జరగాల్సిందే అది. మోడీ ప్రభుత్వం క్రమంగా ఆ విధమైన పరిశోధనాత్మక జర్నలిస్టులనే వేటాడి ద్రోహుల జాబితాలో చేర్చింది. సర్వాధికారాలు పిఐబికి కట్టబెట్టే కొత్త నిబంధనలు వస్తే గనక ఏలినవారు చెప్పే అసత్య కథనాలు, లేనిపోని గొప్పలే జనానికి వార్తలవుతాయి. ప్రశ్నించడం పరిశోధించి రాయడం అపరాధమవుతుంది. పిఐబి వాటిని తొలగించాలని ఆదేశిస్తుంది. అంటే ఏ ప్రభుత్వ నిర్వాకాలనూ నిజాలనూ మీడియాలో సోషల్ మీడియాలో నిగ్గు తేల్చడం జరగాలో అదే తీర్పరిగా, నియంత్రణ కర్తగా మారిపోతుంది. విడుదల చేసిన ముసాయిదాలో దానిపై నిర్దిష్టమైన కొలబద్దలు కూడా లేవు.

**తస్మాత్ జాగ్రత్త !**

ఈ కారణంగానే ప్రతిపక్షాలూ, మీడియా సంస్థలూ పత్రికా యాజమాన్యాలు, ముక్తకంఠంతో ఒక్క గొంతుతో సమాచార స్వాతంత్ర్యం మెడపై కత్తి లాంటి ఈ సవరణలను ఉపసంహరించుకోవాలని కోరుతున్నాయి. ఎడిటర్స్ గిల్డ్, న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అసోసియేషన్ (ఎన్‌బిడిఎ), ది ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్), అనేక జర్నలిస్టుల సంఘాలు ఈ మేరకు సవివరమైన సోదాహరణమైన ప్రకటనలు చేశాయి. ఒత్తిడి, విమర్శలు పెరిగాక కేంద్ర ప్రభుత్వ ఐటి శాఖామంత్రి రాజీవ్ చంద్రశేఖర్ కొన్ని సన్నాయి నొక్కులతో కొన్ని వివరణలు ఇచ్చారు. ఈ విషయమై విడుదల చేసిన నిబంధనలపై ఫిబ్రవరిలో సంబంధిత సంస్థలతో (స్టేక్‌హోల్డర్స్) చర్చలు జరిపిన తర్వాతే అమలులోకి తెస్తామన్నారు. ఇవి

కేవలం కేంద్ర ప్రభుత్వ విధానాలకు సంబంధించి మాత్రమే జరుగుతుందని ఆయా శాఖలతో నిర్ధారించుకున్నాకే వాటిని తొలగించడం జరుగుతుందని వివరించారు. ఈ సన్నాయి నొక్కులు ఎలా వున్నా దేశంలో ప్రస్తుత పరిస్థితి, ఆచరణను బట్టి చూస్తే నిస్సందేహంగా మోడీ ప్రభుత్వం మరోసారి సోషల్ మీడియా పీక నొక్కడానికి సమాయత్తం అవుతున్నదనేది స్పష్టం. కనీస పరిశీలన (స్క్రూటినీ) కూడా లేకుండా పిఐబి చెప్పిందే అమలు చేయవలసి వుంటుందని ఎన్‌డిబిఎ తన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వంపై ఏ విధమైన విమర్శ వచ్చినా ఏదో ఒక పేరుతో అణచివేయవచ్చు. పైగా డిజిటల్ సంస్థలూ, ఇంటర్మీడియరీలు సర్కారు ఒత్తిడికి గురై తల వంచే పరిస్థితి దాపురిస్తుంది. అసలు ఇంత పెద్ద పరిణామం జరిగినా దేశంలో మీడియా సంస్థలైన పత్రికలు, ఛానళ్లలో పెద్దగా చర్చ లేకపోవడమే అందుకు నిదర్శనం.

బడా మీడియా మోడీకి లోబడిపోయిన నేపథ్యంలో సోషల్ మీడియానే ప్రత్యామ్నాయంగా వుంది. దాంట్లో అనేక అవాస్తవాలు, అవాంఛనీయ ధోరణులు నిజమైనా అనేక వాస్తవాలు కూడా వెలుగు చూస్తున్నాయి. పైగా సోషల్ మీడియాలో పౌర చొరవకూ పాత్రికేయుల స్వతంత్ర పాత్రకూ చోటుంటోంది. తప్పొప్పులు సరిచేయాలంటే మీడియా, సోషల్ మీడియాలో స్వీయ నియంత్రణా వ్యవస్థ ఏర్పాటు కావాలి గాని అధికార వర్గాలకు నిషేధాధికారాలు ఇవ్వడం అనర్థదాయకం. ఎమర్జన్సీలో విధించిన సెన్సార్‌ను మించిన స్వీయ సెన్సారింగ్ మీడియాలో సత్యాలను తొక్కి పడుతున్నదని ఇప్పటికే సాయినాథ్ వంటి వారు హెచ్చరించారు. ఈ సమయంలో మోడీపై బిబిసి డాక్యుమెంటరీని అడ్డుకున్న తీరు తాజాగా మన కళ్లెదుటే వుంది. ఈ కొత్త నిబంధనలు వాటన్నిటినీ హరించి వేయడమే గాక రాజ్యాంగం 19(1)(ఎ) అధికరణంలోని ప్రాథమిక హక్కులకూ భావ ప్రకటనా స్వేచ్ఛకూ ముప్పు తెస్తాయి. అందుకే ప్రజాస్వామ్య ప్రియులెవరైనా ఇందుకు వ్యతిరేకంగా ఎలుగెత్తి పోరాడాలి. ■

**"21వ శతాబ్దంలో నిరక్షరాస్యుడు అంటే**
**చదవడం, రాయడం రానివాడు కాదు.**
**గుణపాఠాలను నేర్చుకోవడానికి,**
**తప్పులను సరిదిద్దుకోవడానికి,**
**సరైన మార్గంలో పయనించడానికి సిద్ధపడని వాడు"**
**– అమెరికా రచయిత ఆల్విన్ టోఫ్లర్**

# తప్పిపోయిన గంగమ్మ

పల్లవింపులు పూలతో పరవశించిన ప్రకృతికి
వివశమై వసంత ఋతువు సెలవంది
ప్రచండ ప్రౌఢతై గ్రీష్మం నేలపై వాలి
మేఘాల్ని మింగి నింగిని ఆక్రమించింది!
ఎండకు భయపడిన నీరు
భూమిలో దిగి దాగింది
భయపడని నీళ్ళు ఆవిరై ఆకసాన హాజరైంది
జలాశయాలు ముకుళించాయి
చెరువుల పాదాలు పగిలి నడకలు ఆగాయి
శరీరానికి నీళ్ళందక చెట్లవేళ్ళు
నేలను అర్థిస్తున్నాయి !

ఎడారిని కప్పుకున్న నేల వొళ్ళు కాలి
పచ్చిక బయళ్ళను వెతుకుతూంది
ఎండిన గొంతుల్ని తడపడానికి
మైళ్ళ దూరాన మడుగు నీళ్ళు
బిందెలై నడచివస్తున్నాయి
పచ్చని ఆకులు ఎండుటాకులై
తనువు చాలిస్తున్నాయి
మయసభలో రారాజు భ్రమలా
నడచి వస్తున్న దాహార్తుల్ని
ఎండమావులు కవ్విస్తున్నాయి
ఆరుతడి కరువై చేతికొచ్చిన పంట చేజారే ప్రమాదమైంది
నీటితీరం దొరకని కొంగలు
దొంగజపం కోసం వలస వెళ్ళాయి!
ఎండిన పంట కాలవ చూసి
నోరెండిన దుక్కిటెద్దులు
మోరెత్తి ఇంటిముఖం పట్టాయి
ఇంటింటా ఉసూరుమంటూ
ఎసర్లు ఎదురు చూస్తున్నాయి
మండుతున్న అరికాళ్ళను చూసి
అశక్తురాలై భూదేవి నొచ్చుకుంది
గొంతెండిన కాకి ఉబికి వచ్చే నీటికోసం
కడవలో రాతిపిక్కలు వేస్తూంది
ఆచ్ఛాదన లేని కార్మికుడి
శరీరం వుడికి వెన్నుపై స్వేదం
జీవనదిలా పారుతూంది!
తప్పిపోయిన గంగమ్మను వెతుకుతూ
భగీరథుడు బాటసారై పయనం
ఉరుములు మెరుపులు నేపథ్యమై
నేనున్నానంటూ వర్షఋతువు ఎదురైంది! ■

- ఆదిత్యోస్తుల వెంకటరత్నం
98482 52946




# జానపద గేయాల వర్తమానం విశ్లేషించిన పరిశోధన



- తిరునగరి శ్రీనివాస్


84660 53933

**వ**ర్తమాన సమాచార ప్రపంచంలో లెక్కలేనన్ని సాంకేతిక ప్రచార అస్త్రాలు కన్పిస్తాయి. పత్రికలు, రేడియో, టీవీ వంటి ప్రచార సాధనాలు అంతగా అభివృద్ధి చెందని కాలంలో పాటే బలమైన ప్రసార ప్రచార సాధనమైంది. జానపద గేయం తొలినాళ్లలో జనావసరాలను తీర్చే వినోద, విజ్ఞాన రూపంలోని ప్రచార సాధనంగా పేరొందింది. జానపద గీతాన్నే తన ఊపిరిగా చేసుకొని పాటలు రాసి పాడి ప్రజలకు అందించడమే కాకుండా కష్టపడి ఉన్నత చదువులు చదివి అవే పాటలపై విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధనలు చేసిన కవి, గాయకుడు డాక్టర్ బోనాల ప్రకాశ్. బైండ్ల కథపై ఎంఫిల్ చేసి ఆ కళారూపంలోని ప్రాధాన్యతను పరిశోధనాత్మకంగా ప్రకాశ్ విశదపరిచారు. ప్రచార సాధనాలుగా జానపద గేయాలు అన్న అంశంపై పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి ఆచార్య తలారి జయామనోహర్ పర్యవేక్షణలో పిహెచ్‌డి చేసి ప్రకాశ్ డాక్టరేట్ డిగ్రీని పొందారు. జానపద సాహిత్యంపై విశ్వవిద్యాలయ స్థాయిలలో వచ్చిన పరిశోధనలలో దీపకళిక వంటిదన్న ప్రశంసను ఆచార్య జయధీర్ తిరుమలరావు వంటి పరిశోధక ప్రసిద్ధుల నుండి ప్రకాశ్ గ్రంథం పొందింది.

వాగ్రూపమైన జానపద కళల్లో జానపద సంగీతం ఒక విభాగం. Folk Songs అనే ఆంగ్ల పదానికి సమానంగా తెలుగులో జానపద గేయాలు అనే పదాన్ని సాహిత్య పరిశోధకులు ఉపయోగించారు. జానపద గేయాలను కథా సహితాలు, కథా రహితాలు అన్న రెండు విభాగాలుగా వర్గీకరించారు. కథా సహిత గేయాలు జానపద గేయగాథలుగా, కథా రహిత గేయాలుగా ప్రజల్లో ప్రాచుర్యం పొందాయి. ఇటువంటి అనేక జానపద గేయాల్ని ఈ సిద్ధాంత వ్యాసంలో ప్రకాశ్ పొందుపరిచి విపులంగా చర్చించి విస్తృతంగా విశ్లేషించారు. జానపద గేయాల నిర్వచనాలు, ప్రాచీన, శాసన సాహిత్యాలలో వాటి ప్రసక్తి, సాహిత్య మూలాంశాలు, పుట్టు పూర్వోత్తరాలు, లక్షణాలు, సంగీతాభివృద్ధి, వర్గీకరణ, వాద్యాలు, వివిధ ప్రాంతాలలో కనిపించే వైరుధ్యాలను కూలంకుశంగా చర్చించారు. జానపద సంగీతాన్ని, గీతాన్ని ప్రచార సాధనంగా వాడుకున్న సంస్థలు, ప్రదర్శనాబృందాలను గురించి పొందుపరిచారు. జానపద సంగీత బాణీల విశ్లేషణను లోతుగా కొనసాగింది. ప్రముఖ జానపద కళాకారిణి గూడ లక్ష్మమ్మ, ఒగ్గు కథాకళాకారుడు చుక్క సత్తయ్య, ప్రజాకవి, గాయకుడు గద్దర్‌తో జరిపిన ఇంటర్వ్యూలతో పాటు విలువైన ఛాయ చిత్రాలు, ప్రామాణికమైన ఆధార గ్రంథాలను ఈ సిద్ధాంత వ్యాసంలో పేర్కొనడం ద్వారా పరిశోధన అంశ ప్రత్యేకత ద్విగుణీకృతమైంది.

సామూహిక గానం, అజ్ఞాత కర్తృత్వం అన్న లక్షణాలను జానపద గేయాలకు సంబంధించి చెప్పుకుంటాం. జానపదులు గేయాన్ని ఒంటరిగా పాడినా, సామూహికంగా పాడినా దానిని తమదిగానే తలచుకుని పదాలను మార్చడమే కాకుండా కొత్త వాటిని ఎప్పటికప్పుడు చేరుస్తుంటారు. ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి, ఒకరి నుండి మరొకరికి పాట చేరుకునేప్పుడు బాణీలో కూడా మార్పులు, చేర్పులు అనివార్యంగా కన్పిస్తాయి. మూల జానపద సృజనకు చేసే మార్పులలో ప్రయోజనౌచిత్యం ఇటీవలి కాలంలో ఎక్కువగా కన్పిస్తున్నది. ఈ సిద్ధాంత గ్రంథం ద్వారా మార్పులతో

వచ్చిన కొత్త గేయ రూపాలకు మూలాలు జానపద సాహిత్యంలో ఉన్నాయన్న వాదాన్ని బలంగా ప్రకాశ్ వినిపించారు. ప్రచారం కోసం ఇతివృత్తాలను కొత్తగా జోడిస్తే ప్రజలు అచ్చమైన జానపదంగా అప్పటికప్పుడే వాటిని గుర్తించకపోవచ్చునన్న అభిప్రాయాన్ని ప్రకటించారు. జానపద సాహిత్యం ప్రభుత్వ పథకాల ప్రచారం, వ్యాపార, రాజకీయ అవసరాలు, ప్రజా ఉద్యమాలకు ఎంతో తోడ్పడింది. లిఖిత సాహిత్యానికి దక్కిన అత్యంత ఆదరణ మౌఖిక జానపద సాహిత్యానికి దక్కకపోవడం విచారమన్న విషయాన్ని ప్రకాశ్ పరిశోధనాత్మకంగా ఎత్తిచూపారు. జానపద కళారూపాలు, సంగీత వాద్యాలపై అధ్యయనంతో కూడిన పరిశోధన ఆశించిన మేరకు జరగలేదని జానపద విజ్ఞాన ప్రదర్శనా అవకాశాల లేమి ఎంతో ఉందని నిర్ధారించారు. జానపదులతోనే శిష్ట సాహిత్యానికి ప్రచారం దక్కిందని, ముఖ్యంగా వేమన, పాల్కురికి సోమన వంటి కవుల రచనలను జానపదులే విస్తృతంగా ప్రచారం చేశారన్న ప్రస్తావన ఈ సిద్ధాంత గ్రంథంలో ఉంది. అనువర్తిత ప్రక్రియ అని లిఖిత రచయితలు జానపద సాహిత్యాన్ని తమ భావాలకు అనుగుణంగా మార్చుకున్నారని ఆలోచించాల్సిన ప్రతిపాదనను ప్రకాశ్ పాఠకుల ముందుంచారు. జానపద సాహిత్యానికి మార్పు చేర్పులతో రూపొందించిన రచనను అనువర్తితం అని, దీనినే అనువర్తిత జానపదంగా సూచించారు. జానపదుల సాహిత్యంలో విశ్వాసాలు, నమ్మకాలు, బృంద భావనలు ఉంటాయని రూఢీ చేశారు. పాడడం, వినడం, చూడడం అన్న రీతుల్లో జానపద సాహిత్యంలోని ప్రక్రియలను వివరించారు. గేయాలలో భావాన్ని బట్టి రాగం ఉంటుందని సామూహికంగా జరిగే సంక్రమణంగా జానపద గేయాలను విశ్లేషించి చూపారు. పునరావృత్తి జానపద సృష్టికి ప్రతీకగా నిలిచిన లక్షణమని సూత్రీకరించారు. పాటలోని పాదాలను సంగీత ప్రమాణంగా స్వీకరించడం, పాదంలోని సాహిత్యాంశాన్ని పల్లవిగా విడదీసి పాడడం, సంకేత ధ్వనులు, ఊత పదాలు పునరుక్తమైనప్పుడు పాదం చివరి భాగం సామూహికంగా ఆలపింపబడుతుందని శ్రామిక నృత్య గేయాలను ఉదాహరణలుగా నిలిపారు. ప్రకృతి ఆరాధన, నమ్మకాలు, ఆత్మనివేదన, పూజలు, పునస్కారాలు వంటివి ఎలా భాగమయ్యాయో అన్న విషయాన్ని వెల్లడించారు. శ్రమైక జీవులకు ఆట – పాటలను ప్రకృతి అందించిన వరంగా చూపారు. శ్రామిక గేయాలే జానపద గేయాలు అని ప్రతి పనికి పాట ఎలా పుట్టిందో వివరించారు. మౌఖిక ప్రసారం ప్రాధాన్యతనువిస్పష్టం చేశారు. అప్రయత్నంగా జరిగే పరిమిత స్వర ప్రసారం గురించి తిశ్ర, చతురస్ర, ఖండ, మిశ్ర గతులలో చేసే పనిని, లయ, సంగీత నిర్మాణం గురించి విశదీకరించారు. పాట ఆద్యంతం ఒకే గతిలో సాగడం పని వేగాన్ని బట్టి పాట పాడే వేగం పెరగడం వంటి వాటిని ప్రస్తావించారు. మౌఖిక, సామూహిక ప్రచారాలలో గానానుకూలత గల సహజ, సరళ, సుందరశైలీ గీతాలను ఉదాహరించి వాటిలోని జన సామాన్య పరిచిత స్థానిక వస్తువులను వెల్లడించారు. పరిణత స్వరూపం, నియమిత రూపం కలిగిన కవి లేని జానపద గేయానికి ఉన్న ప్రచార సాధన స్థాయిని విశ్లేషించారు. పౌరాణిక, చారిత్రక, మత సంబంధ, పారమార్థిక గేయాలు, స్త్రీల పాటలు, శ్రామిక గేయాలు, పిల్లల పాటలు, శృంగార గేయాలు, అద్భుత రసగేయాలు, కరుణా రసగేయాలు, హాస్యపు పాటలు, వేడుక పాటలు, వలపు పాటలు, పిల్లల పాటలు, బాంధవ్య గీతాలు, పని పాటలు, పారమార్థిక గేయాలు, కన్నీటి పాటలు వంటి వాటిని సేకరించిన సేకర్తలు, పరిశోధకుల కోణాలను తెలిపి ఆయా గీతాల విశిష్టతను వివరించారు. జానపద గేయం, అద్భుతమైన సంగీతంతో ప్రచార సాధనంగా అలరించడానికి తోడ్పడిన సంగీత వాద్యాల సమ్మేళనాన్ని కొనియాడారు. మట్టి వాద్యాలు, బుడిగెలు, చర్మ వాద్యాలు, డప్పు, మద్దెల, డోలక్, తబల, కురుమ డోలు, డమరుకం, నగారా, తంత్రీ వాద్యాలు, తంబూర, ఏక్‌తార, కిన్నెర వాద్యం, జమిడిక, గాలి వాద్యాలు, నాగస్వరం, శంకం, హార్మోనియం, లోహ వాద్యాలు, గంటలు, అందెలు, గజ్జలు, తాళాలు, కర్ర వాద్యాలు, కోలలు, చిరుతలు, కంజీర వంటి వాటి విశిష్టతను తెలిపారు. రకరకాల ఉద్యమ ఫలితంగా జానపద గేయం, సంగీతం ఎలాంటి మార్పులకు లోనైందో స్పష్టమైంది. ప్రపంచీకరణ ఫలితం వల్ల ఏర్పడ్డ పర్యవసానాలను కూడా తెలుపుతూ వచ్చి చేరిన గణనీయమైన మార్పులను ఈ పరిశోధన గుర్తించింది. మౌఖిక ప్రచారంలో ఇంకా బతికి బట్ట కడుతున్న జానపద గేయానికి పొత్తిళ్లుగా మారి జాగ్రత్తగా కాపాడిన జానపదులకు మనసారా మొక్కారు. వివిధ జానపద గీత కళా ప్రక్రియలైన, బుర్ర కథ, ఒగ్గు కథ, వీధి నాటకం వంటివి వివిధ సామాజిక మాధ్యమాలు, అనేక సంస్థల కార్యక్రమాలలో ఎలా అనువర్తితమయ్యాయో ఇందులో స్పష్టపరిచారు. ప్రజానాట్యమండలి మొదలుకొని అనేక సంస్థలు అనువర్తిత జానపద సంగీతాన్ని ప్రచార సాధనంగా వాడుకున్న తీరు వెల్లడైంది. ఇదే క్రమంలో ఈ సిద్ధాంత గ్రంథంలో ఎన్నో గీతాలను విశ్లేషించి చూపారు. ఆపర బండోడో – బండెంట నేనొస్తా/ నిలుపుర బండోడో – బండి మీద నేనొస్తా... వోలి వోలీల రంగ వోలీ సెమ్మకేలీల వోలి/ గుట్ట గుట్ట తిరిగినాడు వోలీ సెమ్మ కేలీల వోలీ...



## నిప్పుల పద్యం

**అ**క్కడంతా రాలిన
పావురాల రెక్కలు!
బెంగగా పదాలు కొన్ని అయితే –
వాడిగా గుచ్చుకునే వాక్యాలు కొన్ని !
సమూహాల్లో నిలవలేని తనం
అక్కడే ఆపకుండా అరుస్తున్న
అమాయకపు చిన్ని పావురం పిల్ల!

అక్కడక్కడే వాటికవే
దొర్లుతూ పదాలు కొన్ని
అప్పుడే కదూ–
మౌనాన్ని విదుల్చుకొని నువ్వు
ప్రవహించాలనుకుంటావు
నిప్పుల పద్యమై ....

**- లక్ష్మీ కందిమళ్ళ**

పల్లె పల్లెనా పల్లెర్లు మొలిసే/ పాలమూరులోన నా తెలంగాణ లోనా... బండెనక బండి కట్టి/ పదహారు బండ్లు గట్టి... పంట చేలు పండాలి/ మా కడుపు నిండాలి/ పేద సాద బతకాలి/ కూలినాలి దొరకాలి వంటి ఎన్నెన్నో గీతాలను విశ్లేషించారు. గతంలో వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించిన జానపద కళలకు, ఆధునిక ప్రచార మాధ్యమాల ప్రభావంతో ఉనికికే ప్రమాదం ఏర్పడిన తీవ్ర పరిస్థితిని చర్చించారు. గత కాలానికి ప్రతిధ్వనిగా నిలిచిన జానపద కళలు వర్తమానంలో కూడా ఇంకా శక్తివంతమైన గొంతుకేనని స్పష్టమైంది. మారుతున్న కాలమాన పరిస్థితుల్లో రూపు మారుతున్న జానపద కళల స్థితిగతిని ఈ పరిశోధన కళ్లకు కట్టినట్టు వెల్లడించింది. వృత్తి కళలకు, తరాలుగా జీవం పోసిన వృత్తి కళాకారులకు జీవితమే అత్యంత దుర్భరమైన దయనీయ పరిస్థితులను దృశ్యీకరించారు. జానపద కళల పరిరక్షణ అవసరాన్ని నొక్కి చెప్పింది ఈ వ్యాసం. గతాన్ని, వర్తమానాన్ని సూక్ష్మాతిసూక్ష్మంగా విశ్లేషించి చేసిన ఈ పరిశోధన ప్రకాశ్ ఎంతో ప్రణాళికతో జరిపిన బృహత్తర ప్రయత్నానికి నిదర్శనం. ■

## నిరంతర

**- డాక్టర్ ఎన్.గోపి**

**ఉ**త్సాహమంటే నాకెంతో ఉత్సాహం
అట్లా ఉండటం
సాధ్యం కాని సమయాల్లో కూడా
రకరకాల మూలల్లోంచి
దాన్ని చేదుకుంటాన్నేను ...

ఈసురోమని ఉండటం
నాకసలే ఇష్టం ఉండదు
ఏదైనా బాధ కలిగినా
నా కన్నా కష్టాల్లో ఉన్న వారిని
తలుచుకొని నిలబడతాను

ఒంటరితనం బావురుమన్నా నేను తొణకను
మిత్రులను తలుచుకుంటూ
ఆ ఖాళీని నింపుకుంటాను.

జ్ఞాపకాలెప్పుడూ తోడుగానే ఉంటాయి గాని
అస్తమానం వాటినే పట్టుకుని వేళ్లాడను
కొత్త జ్ఞాపకాలను సృష్టిస్తాను.
కరివేపాకును నలిపితే వస్తుందే వాసన
అలాంటి పరిమళంలా
పరిసరాల నిండా వ్యాపిస్తాను

నాకసలు తీరికే వుండదు
వస్తువుకూ ఘటనకూ మధ్య
దారాన్ని గుర్తిస్తాను
ఎంత దూరమైనా సరే
దారంతో కుట్టుకుంటూ వెళ్తాను.

పైగా నా పక్కన క్షణక్షణం
బోలెడంత కవిత్వం
దానివల్ల ప్రతి వస్తువూ
కొత్తగానే కనిపిస్తుంది నాకు ..
నిరంతర
నా వ్యక్తిత్వంలోని వరేణ్యం
అది నా చేతి లోని పాంచజన్యం
అనన్యం, అగణ్యం! ■



# తాత్విక దార్శనికుడు పాలగుమ్మి పద్మరాజు

- గొల్లపల్లి వనజ
పరిశోధక విద్యార్థి
95501 43497

తెలుగు సాహిత్యంలో కథా ప్రక్రియకు విశిష్టమైన స్థానం ఉంది. తెలుగు కథకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చిన కథకుడు పాలగుమ్మి పద్మరాజు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా తణుకు తాలూకాలోని తిరుపతిపురంలో 1915లో జూన్ 24వ తేదీన జన్మించారు. ఆయన రచించిన 'గాలివాన' కథ అంతర్జాతీయ కథల పోటీలో ఎంపికై, తెలుగు కథాసాహిత్యానికే కీర్తి తెచ్చిపెట్టింది. ఆనక అనేక భాషల్లోకి అనువాదమైంది. గాలివాన, మరో 17 కథలతో 1984లో 'గాలివాన' కథా సంపుటి వెలువడింది. ఈ కథా సంపుటికి 1985లో కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. న్యూయార్క్ లోని హెరాల్డ్ ట్రిబ్యూన్ 1956లో నిర్వహించిన అంతర్జాతీయ కథల పోటీలో గాలివాన రెండవ బహుమతిని పొందింది. 'గాలివాన' కథాసంపుటిలోని కథలు చాలా వరకు తాత్వికతను ప్రబోధిస్తూ, జీవిత పరమార్థాన్ని తెలియజేస్తాయి. ఫలశ్రుతి, గాలివాన, వాసనలేని పువ్వులు, వెండి సీసా వంటి కథలు తాత్విక దృక్పథంతో సాగుతాయి. ఆయన హేతువాద రచయిత.

'ఫలశ్రుతి' కథలో పారమిత (బౌద్ధ నామం) బౌద్ధ సిద్ధాంతాల సారం ఆకలించుకుని వాటిని తన రచనలో రూపకల్పన చేసిన బౌద్ధమతాచార్యుడు. తన జీవితాన్ని మొత్తం కళ కోసం అంకితం చేస్తాడు. తన ఇరవయ్యేళ్ళ వయసులో ఎంతోమంది కట్న కానుకలతో సహా తమ పిల్లల్ని ఇస్తామన్నా నవ్వి ఊరుకుంటాడు. మామ కూతురు రమాదేవిని పెళ్ళి చేసుకుంటావా? లేదా? అని తండ్రి గట్టిగా అడిగినప్పుడు కూడా రమాదేవి అంటే ఇష్టమున్నా ఆ ప్రశ్నకు సమాధానం రమాదేవికి పెళ్లయ్యే వరకు తేల్చుకోలేక పోతాడు. శిష్యులు ఏర్పాటు చేసిన తన షష్టిపూర్తి కార్యక్రమానికి హాజరవుతూ కోల్పోయిన, కరిగిపోయిన జీవితాన్ని పునఃస్మరించుకుని బాధపడతాడు. 'జీవితం గొప్పదా? కళ గొప్పదా?' అంటే– సందేహం ఏముంది, జీవితమే! కళంతా ఈ సత్యాన్నేగా నిరూపించేది. అయితే కళ కోసం జీవితాన్ని ధ్వంసం చేసుకోవడం ఎంత వెర్రితనం, ఎంత అవివేకం! జీవితం, అనుభవం, అదే అసలీ లోకంలోకంతకీ ప్రధానం. అన్ని కళలూ నశించిపోయినా జీవితం మిగలాలి' అనుకుంటూ తనలో తాను ఆవేదన చెందుతాడు.

ఒక బీభత్సమైన గాలివానలో బిక్షగత్తె పరిచయం ద్వారా జీవితంలో అసంతృప్తి గల రావు గారికి జీవిత పరమార్థం తెలియజేయడం *గాలివాన* కథలోని వస్తువు. ఈ కథలో రావుగారు ఒక వేదాంతి. వృత్తిపరంగా న్యాయవాది అయినా ప్రాక్టీసును కొడుకుకు అప్పచెప్పి ఆధ్యాత్మిక విషయాల గురించి, తాత్త్విక విషయాలను గురించి, నీతీ నియమాలను గురించి ఉపన్యాసాలను ఇవ్వడం వ్యాపకంగా పెట్టుకున్నాడు. 'ఆయన జీవితంలో కొన్ని నియమాలను పాటించాలని నిశ్చయించు కున్నారు. వాటిని అతిక్రమించకుండా వుండగల సాహసం ఆయనకు ఉంది. నీతి, నియమాలను గురించి ఆయనకు పిచ్చి పట్టలేదు. కాని మనిషి నడవడిని దిద్దడానికి కొన్ని నియమాలు ఉండి తీరాలన్నది ఆయన అభిప్రాయం'. రావుగారు జీవితంలో క్రమశిక్షణకు చాలా విలువ ఇచ్చే మనిషి. తన కుటుంబాన్ని కూడా క్రమశిక్షణలో పెట్టి తన ఆధీనంలో ఉంచుకుంటాడు. ఆ రోజు 'ఆస్తిక మహాసమాజము' ఆహ్వానం మేరకు 'సామ్యవాదము, రమ్య రసామోదము' అనే విషయం మీద ఉపన్యసించడానికి రైలులో బయలుదేరి వెళతాడు. ప్రయాణం మధ్యలో ఒక ముష్టిది రావు గారు ఉన్న పెట్టెలోకి ఎక్కి పొట్ట కూటికోసం భిక్షం ఎత్తుకుంటూ ఉంటుంది. రావు గారికి బిచ్చమెత్తుకోవడంపై అసలు సానుభూతి లేదు.

బిచ్చమెత్తడం తప్పని ఆయన నిశ్చితాభిప్రాయం. ఆ ముష్టిదాన్ని అసహ్యించుకుంటాడు. ఆ ముష్టిదే బీభత్సమైన గాలివానలో తనకు తోడవుతుంది. జీవిత పరమార్థం అంటే ఏమిటో నేర్పిన బిక్షగత్తె ఆ గాలివానకు బలైపోతుంది. ఆమె చనిపోవడాన్ని జీర్ణించుకోలేకపోతాడు. బిచ్చగత్తెను తనలోని ఒక భాగంగా ఆమె సాన్నిహిత్యాన్ని మరిచిపోలేని అనుభూతిగా అనుకుంటా డు. ఆమె జీవితాన్ని గురించి తెలుసుకున్న ఆయన ఆమె మీద దొంగ ముద్ర పడకూడదని... ఆమె డ్రాయరులో దొంగలించిన టికెట్టు డబ్బులను బిచ్చగత్తె చేతిలో నుంచి తీసి డ్రాలోనే పెట్టేస్తాడు. తన జేబులోంచి పర్సును ఆమె పక్కన ఉండనిచ్చి తనకు సంబంధించిందేదో ఒక చిహ్నంగా ఆమె శరీరంతో ఉండిపోవాలనుకుంటాడు. ఒక్క బిక్షగత్తె తప్ప రావుగారు నమ్ముకున్న నియమాలు, క్రమశిక్షణ ఇవేవీ ఆ గాలివాన రోజు రాత్రి ఉపయోగపడలేకపోతాయి.

'వాసనలేని పువ్వులు' కథలో రాజారావు తన సిద్ధాంతాలు, క్రమబద్ధత, దృక్పథాలను దాటి జీవిత సత్యాన్ని తెలుసు కోవడాన్ని చూడవచ్చు. ఈ కథలో రాజారావు ఒక సామ్యవాది. అలాగే వర్డ్స్‌వర్త్ అభిమాని. రాజారావు భార్య కమల అతి సాధారణమైన జీవనాన్ని కోరుకునేది. తన ఇంటి ఆవరణలోని రోజూ పూసే పువ్వులను కోసి పెట్టుకునేది. రాజారావు ఒక రోజు ఇంటి ఆవరణలోని పూల మొక్కలను చూస్తాడు. వాటిని కోసి వాసన చూస్తాడు. ఆ పువ్వులు ఏ వాసనా రాకపోవడం అతనికి అన్యాయం అనిపిస్తుంది. వాసన అనే సంపదను అన్ని పువ్వులు సమంగా పంచుకోవడం న్యాయమని అతని మనసులోని అభిప్రాయం. రాజారావు తన సంస్కృతి, తన అభిరుచి, తన ఆదర్శాలు అనే వాసనలను కమలకు అబ్బించాలనుకుంటాడు. కానీ ఆమెలో ఏ వాసనా ఉండదు. అతను వాటి గురించి చెప్తున్నంత సేపూ ముఖం చిట్లించి విని విని ఆవులించేది. దాంతో రాజారావు ఆమెను అసహ్యించుకుంటాడు. హింసించేవాడు కూడా. ఒక రకంగా రాజారావు వల్లనే కమలకు మూర్ఛ వచ్చి చనిపోతుంది. ఆమె మరణాంతరం రాజారావు కమలను అర్థం చేసుకుని, ఆమెలోని ప్రాకృతిక శక్తిని తెలుసుకోవడం మొదలు పెడతాడు. మొదట్లో ప్రకృతి ప్రేమగల రాజారావు ప్రకృతిసిద్ధమైన వాటిని ఆహ్వా నించలేకపోతాడు. భార్య పోయాక జీవిత సారం తెలుసుకుని ఆమెనే ఆరాధిస్తూ ఉంటాడు.

'కొలవరాని దూరం' కథలో కథానాయిక పైలట్ ట్రైనర్ అయిన రాజా అనే అనే వ్యక్తిని ప్రేమించి పెళ్ళి చేసుకుంటు ంది. కొన్నాళ్ళకు భర్త పరాయి స్త్రీలతో సంబంధం పెట్టుకున్నాడని తెలిసి అడగలేక , అడిగి మళ్ళీ అలాంటి పని చెయ్యనని భర్తతో మాట తీసుకుని ఎప్పుడో మానేసిన డిగ్రీ పరీక్షలు పూర్తి చెయ్యడానికి బెనారస్ వెళ్ళిపోతుంది. భర్త హార్ట్ ఎటాక్ వచ్చి చనిపోయాడనే విషయం తెలుసు కుంటుంది. అప్పుడు భర్త మరణం కన్నా అతడి ప్రవర్తనే ఎక్కువగా బాధ పెడుతుంది. భర్త చనిపోయినందుకు ఏడుపుని నటించాల్సి వస్తుంది. ఇంట్లో పనిమనిషి తలుపులుతో తన భర్తతో సంబంధం ఉందని తెలుసుకుని 'ఏ ఎర్‌హూస్టెనో, ఏ టెలిఫోను ఆపరేటరో అయితే అర్థం చేసుకోవచ్చు. తలుపులా! అంత దిగజారిపోయాడా రాజా? కాదు, నన్ను దిగజార్చాడు తలుపులు స్థాయికి. తలుపుల్లాగే నేనూ ఒక ఆడదాన్ని. అతనికి సంబంధించినంతవరకు అంతే. అంటే, డబ్బు, హోదా, ఇల్లు, ఫర్నిచరూ, తోట, దొడ్డి, వీటిలో తలుపులుకి భాగం లేదు, నాకున్నట్టు. కానీ బెడ్ మీద మాత్రం, నేనెంతో తలుపులూ అంతే" అని బాధ పడుతుంది.

తలుపులు ... రాజా తనకు ఇచ్చిన నెక్లెస్ గిల్టు కాదని బంగారుదని తెలిసి డ్రెస్సింగ్ టేబుల్ మీద పెట్టి 'గిల్టుదని అబద్దవాడేడు రాజాబాబు. బంగారందని తెల్దు. రేత్తిరి అద్ద రేతిరి దాటింది. ఇంకెళ్ళి పోతానన్నా. దొడ్డి తలుపులు తనేసుకుంటానన్నాడు. ఇట్టా అందర్నీ అన్నాయం జేత్తాడని...." అని ఏడుస్తుంది తలుపులు. అనుకోకుండా కథానాయకురాలు చేతులు ఆమెను దగ్గరకు తీసుకుని ఓదార్చి 'బతికుండగా నన్ను తలుపులు స్థాయికి దించేసాడు. పోయాక తలుపుల్ని నా స్థాయికి తీసుకొచ్చాడు. మా ఇద్దరికీ, ఇంకెందరికో, దూరమైపోయాడు రాజా... కొలవరాని దూరం'' అని బాధపడుతుంది.

'హెడ్ మాష్టారు' కథలో ఒక ప్రధానోపాధ్యాయుడు మానవత్వం కలిగిన వ్యక్తిగా విద్యార్థులు చేసిన తప్పులను క్షమిస్తూ, విద్యార్థి ప్రగతికి బాటలు వేసి, విద్యార్థి భవిష్యత్తు లోనూ, వారి నడత, చేష్టలలోనూ ప్రతిబింబించడం కనిపిస్తుం ది. ఈ కథలో సుబ్బారావు తనను ఒక వ్యక్తిగా తీర్చిదిద్ది, పైలట్ వరకు ఎదగడానికి కారణం హెడ్ మాష్టారనే కృతజ్ఞతాభావం కలిగి ఉంటాడు. ఈ కథలో హెడ్ మాష్టారు మానవత్వంతో ఒక ఉపాధ్యాయుడుగా విద్యార్థిని జీవితాన్ని మంచిమార్గంలో ఎలా తీసుకెళ్ళాలో తెలిసిన విజ్ఞాని. తెలిసీ తెలియని వయసులో తన సహాధ్యాయి అయిన నాగమణిని జుట్టు పట్టి లాగగా ఆమె సుబ్బారావు మీద పడిపోతుంది. అతడు అనుకోకుండా ఆమెను రెండు చేతుల్తో పట్టుకుంటాడు. అది చూసిన హిందీ మాష్టారు, నాగమణి తండ్రి జనార్దన రావుకు చెప్పి.. హెడ్ మాష్టారుతో చెప్పి సుబ్బారావుని రస్టికేట్ చేయించమని అంటాడు. హెడ్ మాస్టారు అప్పటికి అలాగే

చేస్తానండి అని చెప్పి పంపుతాడు. కొన్ని రోజులకు వారి ఆవేశం తగ్గాక నాగమణి తండ్రితో సుబ్బారావు మీద రిపోర్టు పైకి పంపలేదనే చెప్పి 'నేను ఉపాధ్యాయుణ్ణి. తప్పుదారిలో పడ్డ కుర్రాళ్ళని మంచిదారికి మళ్ళించాలి. అంతేగాని వాళ్ళని సర్వనాశనం చెయ్యకూడదు. నేను వెంటనే రిపోర్టు రాసి ఉంటే ఈ పాటికి వాణ్ణి రస్టికేట్ చేసేసేవారు. వాడికి తగిన శిక్షే, నిజమే కాని వాడు ఇంక మంచి దారిలో పడడు. బరి తెగిస్తాడు. వాడింక ఏంచేసినా మన అదుపులో ఉండడు. రేప్పొద్దున నడి బజారులో మీ అమ్మాయిని పట్టుకుని అవమానపరచవచ్చు. మీరతన్ని జైల్లో పారేయించొచ్చు. కాని అమ్మాయి మీద ఏ తప్పూ చెయ్యకుండా, అన్యాయంగా మచ్చపడుతుంది. అధమం అల్లరవుతుంది. ఈసారి మనం ఉదారంగా క్షమించి వదిలేశామనుకోండి. వాడు మళ్ళీ ఇలాంటి పొరబాటు ఒక్క నాటికీ చెయ్యడు' అని నచ్చజెపుతాడు. హెడ్ మాష్టారు, జనార్ధనరావుల సంభాషణ విన్న సుబ్బారావు తాను చేసిన తప్పుకు నాగమణికి క్షమాపణ చెప్పి, తనను నిజంగా ఒక మనిషిని చేశానన్న సంతృప్తి అయినా మాష్టారికి మిగలాలని భావిస్తాడు. హెడ్ మాష్టారుకి కృతజ్ఞతగా బాగా చదివి స్కూల్ ఫైనల్ పాసవుతాడు. ఆ తరువాత సుబ్బారావులో హెడ్ మాష్టారు ఒక భాగమైపోతాడు. సుబ్బారావులో అసలు వ్యక్తి చేసే అవకతవకల్ని మాష్టారు అనే రెండో వ్యక్తి విమర్శించి, మన్నిస్తుంది.

'వెండి సీసా' కథలో మానవత్వానికి నిదర్శనం గోవిందన్ కుట్టి. అతడు ఇరవై ఏళ్ల క్రితం కేరళ నుంచి ఆంధ్రదేశం వచ్చి కొట్టు పెట్టుకుని సోడాలు, కిళ్ళీలు, అరటిపళ్ళు అమ్ముతుండేవాడు. ఎవరో కని పారేసిన బిడ్డని ఇంటికి తెచ్చుకుని పెంచుకుంటాడు. పెంటి అనే అమాయకురాలిని కన్నయ్య నాయుడు మోసం చేసి కడుపు చేసి వదిలేస్తే ఆమెను పద్ధతి ప్రకారం పెళ్ళి చేసుకుని ఆమెకు తోడుగా నిలుస్తాడు. కన్నయ్య నాయుడు గోవిందన్ కొట్టు ఎదురుగా పెద్ద కొట్టు పెట్టడంతో గోవిందన్ కుట్టికి బేరాలు తగ్గిపోతాయి. అందుకు గోవిందన్ కుట్టి ఒక సీసాలో నాణేలు పోసి, పావలా పెట్టి తన కొట్టులో ఏదైనా కొనుక్కుని, ఆ సీసాలోని నాణేలు ఎన్ని ఉన్నాయో చెప్తే ఆ సీసా మొత్తం వారికి ఇచ్చేస్తానని ఆఫర్ పెడతాడు. బూతప్ప అనే పేద మాల పిల్లవాడు వెండి సీసాలో ఎన్ని పావలాలు ఉన్నాయో చెప్తే ఆ సీసాను గెలుచుకుని చదువుకోవచ్చని ఆశపడి పావలా ఇచ్చి 'రెండొందల పదహైదు డెబ్బయి అయిదు పైసలు' అని చెప్పి వెండి సీసాను గెలుచుకుంటాడు. అది ఓర్వలేని జనం వెండిసీసాను పగలగొట్టి నేలపాలు చేస్తారు. గోవిందన్ కుట్టి చేసిన మంచి పనులను గుర్తించి, ప్రశంసించాల్సింది పోయి అతని ఇంటికి, కొట్టుకి మంట పెట్టి బూడిద చేస్తారు. రగులుతున్న మంటను చూస్తూ వేరే ఎక్కడికైనా వెళ్ళి బతుకుదాం అని చంటి పాపతో సహా ఐదుగుర్ని బయలుదేరమంటాడు. 'యాడికి? యాడికి పోయినా బతకనివ్వరు మన్ని' అంటుంది పెంటి. 'యాడో ఓ చోట బతకలేకపోం. భారత దేశం చాలా పెద్దది' అని చెప్పి బతుకు మీద ఆశతో ముందుకెళ్తాడు గోవిందన్ కుట్టి.

చిన్న చిన్న విషయాలకే విడాకులు తీసుకుంటున్న చదువుకున్న వాళ్ళు, డబ్బున్నకొంతమంది దంపతులకు 'కూలిజనం' కథలోని రత్తి, ముసలయ్య దంపతులు ఆదర్శవంతం. భార్య రత్తి పరాయి వాడితో సరసాలు ఆడటం చూసిన ముసలయ్య అప్పటికప్పుడే భార్యను దండించి, మందలించి మళ్ళీ సాయంత్రానికి కలసిపోయి జీవితాన్ని సజావుగా సాగిస్తారు. ఈ కథలో కథానాయకుడు రత్తిని ముసలయ్య కొట్టడం చూసి ఏమవుతుందో ఏమో అని భయపడతాడు. సాయంత్రానికి ఆ ఇద్దరూ అన్యోన్యంగా ఉండటం చూసి ప్రశాంతంగా నిద్రపోతాడు. ఈ కథలో కూలీల అతి సాధారణమైన జీవితాన్ని చిత్రించారు పద్మరాజు. కూలీలు ఉదయం నుండి సాయంత్రం వరకు సరదాగా పాటలు పాడుకుంటూ కష్టాన్ని మరచిపోయేవారు. శ్రమను మరచిపోవడానికి రాత్రి తాగేవారు. మరుసటిరోజు ఉదయం యథాప్రకారం పనిలో దిగిపోయి అతి సాధారణమైన జీవితాన్ని గడపటాన్ని కథానాయకుడు గ్రహిస్తాడు.

'కోర్టుపక్షి' కథలో పోలీసులు, కొంతమంది లాయర్లు అబద్ధపు సాక్షులతో అబద్ధం చెప్పించి దొంగలకు కఠిన శిక్షను విధించి, దొంగిలించిన వస్తువులను చాకచక్యంగా కాజేస్తున్న విషయాన్ని చెప్పారు. 'కుర్రతనమా? మానవ స్వభావమా?' కథలో మానవ స్వభావాన్ని గురించి పద్మరాజు మానవ స్వభావాన్ని చిత్రీకరించారు. స్వార్థపూరిత సమాజాన్ని ఎదిగే పిల్లలు నిస్వార్థంగా మార్చాలనేది 'దారితప్పిన బస్సు' కథలోని వస్తువు. ఇలా ఈ కథలలో పాలగుమ్మి పద్మరాజు తాత్విక అంశాలను, సమాజంలో జరుగుతున్న మోసాలు, అన్యాయాలు వంటి వాటిని గురించి వ్యక్తీకరించారు. సమసమాజాన్ని ఆశించిన పద్మరాజు గారి హృదయం కథలలో కనిపిస్తుంది. మూఢ నమ్మకాలు, కట్టుబాట్లు, నమ్మకాలు, క్రమబద్ధతలకు అతీతంగా జీవిత పరమార్థాన్ని పద్మరాజు తన కథల ద్వారా చాటిచెప్పారు. తెలుగు కథకు గొప్ప గౌరవమూ, గుర్తింపు తీసుకొచ్చిన పద్మరాజు 1983 ఫిబ్రవరి 17వ తేదీన కన్నుమూశారు.

■



## చరిత్ర సాక్షిగా ...

నదులన్నీ కలిసిన సరిగమల కలగూరగంప
నయాగరా ..
నయాగారాని జలపాతం అన్నదెవరు?
పడినా, లేచి పరుగెత్తే జీవనశైలికి ఆదర్శం
గాయమైనా పాలనవ్వుల సందేశం నయాగరా
మిట్టపల్లాలు, కష్టనష్టాలు, ఎగుడుదిగుడుల సాక్ష్యంగా
సరికొత్త జీవన సంగీతం వినిపిస్తుంది
వినే హృదయమే వుండాలి కాని
శతకోటి పక్షుల కిలకిలా రావాల దృశ్యం
చినుకు చినుకుగా కురిసిన ఆకాశం సృష్టించిన
స్వచ్ఛంద సమైక్య గర్జనా మహాకావ్యం అది
చావు పుటకల రహస్యం విప్పిచెప్పే ధర్మక్షేత్రం
ప్రాణదానం చేస్తూ అడుగులు కదపటం ఒక కళ
ఎన్ని పర్వతాలు, ఎన్నెన్ని శిఖరాలు అడ్డంగా నిలుచున్నా
నర్మగర్భంగా తప్పించుకుని నడవడం ఎవరు నేర్పారో!

పున్నమి రోజు తనూ వెన్నెలై దూకాలని
అమావాస్య చీకట్లో
పరచిన వెలుతురు దుప్పటై పోవాలని
కలలు నిజం చేసుకునే పరుసవేది తాకించిందెవరో!
కాలంలా ఆగని రహస్యం నయాగరా!
శతాబ్దాలు గడిచినా ఉడిగిపోని ఉత్సాహం
అదేనా కాలానికీ – నీకూ మధ్య స్నేహ ఒప్పందం
భూగోళం తిరుగుతున్నంత భీకర ధ్వనితో
శాంతి కాహళి వూదుతూ
నీ పయనం అజరామరం..!!

**- డాక్టర్ పెరుగు రామకృష్ణ**

**98492 30443**

## మనిషిగా మిగిలిపోతాను !

నా భయం పోసిన పురుడువి నువ్వు!
ఆ భయాన్నే కళ్లెం చేసి
నాపై స్వారీ చేస్తున్నావు !
వేయి పడగల నాగులా
విషం చిమ్ముతున్నావు
మత్తులా ఊగిస్తున్నావు
ఉచ్చులా మారి ఉసురు తీస్తున్నావు
కూటినీ గూటినీ కూర్చలేని నువ్వు ...
కాటికి పోయినా కనికరం చూపడం లేదు!

నా మెదడులో చేరావు .. నరాల్లో నిండావు ..
మనసును సైతం మాలిన్యం చేస్తున్నావు !
నన్నెవరితోనూ కలవనివ్వడం లేదు !
నా తిండిలో కలిసావు
నీ బట్టనే తొడగమన్నావు
నా ఇల్లెక్కి నా ఉనికిని వెక్కిరిస్తున్నావు !

చెదిరిన బాంధవ్యం వెనుక నువ్వున్నావు
తెగిపడ్డ మాంగల్యం వెనుకా నువ్వే !
చితికిన భవితవ్యం నీ పుణ్యం కాదా !

మానవత్వపు పరిమళాలు
వెల్లువెత్తాల్సిన చోట
మతోన్మాదపు మూర్ఖత్వంలో
నన్ను ముంచుతున్నావు !
నువు చూడని లోకం ఎక్కడుందో?
నువు చేరని కాలం ఎప్పుడొస్తుందో?

అప్పటిదాకా ...
నిన్ను ఎక్కడ కలిశానో
అక్కడే నన్ను వదిలెయ్ !
బతిపోతాను మనిషిగా మిగిలిపోతాను!

**- భైరవ స్వర్ణ కుమార్**

**83740 34514**





1936

2023

# ఆత్మగౌరవం .. ఆమెకు ఆభరణం ...

**రెం**డు దశాబ్దాల పాటు వెండితెరను ఏలిన అభినయ తార రాలిపోయింది! చలాకీ చిన్నదిగా, సత్యభామగా అభిమానుల మనుసులు దోచిన వన్నెల దొరసాని వెళ్లిపోయింది. ప్రజానాట్యమండలి వేదికపై ప్రభవించి, సినీరంగంలో విశేషంగా రాణించిన జమున (86) కన్నుమూశారు. కొద్దిరోజులుగా వృద్ధాప్య కారణాలతో అస్వస్థతతో ఉన్న ఆమె హైదరాబాదులోని తన నివాసంలో 27.1.2023 శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. అభిమానుల సందర్శనార్థం ఆమె భౌతిక కాయాన్ని ఫిలింనగర్ లోని ఫిలిం ఛాంబర్స్ అసోసియేషన్ భవనం వద్ద ఉంచారు. వందలాది మంది అశ్రునివాళుల మధ్య సాయంత్రం జూబ్లీ హిల్స్‌లోని మహాప్రస్థానానికి తరలించి, అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. కుమార్తె స్రవంతి తల్లి చితికి నిప్పంటించారు.


జమున మరణంతో ఒకనాటి మేటి తారల తరం ముగిసినట్టయింది. అందానికి, అభినయానికి, ఆత్మగౌరవానికి పెట్టింది పేరైన జమున ... దాదాపు 200 సినిమాల్లో నటించారు. అనేక సినిమాల్లో అపురూపమైన పాత్రలు పోషించి, ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. తన రీవికి, స్వభావానికి అనువుగా ఉన్న కథానాయిక పాత్రలనే పోషించాలని నియమం పెట్టుకున్న జమున ... వయసు పెరిగాక క్యారెక్టరు ఆర్టిస్టుగా అవకాశాలచ్చినా అంగీకరించలేదు.

జమున ... 1936 ఆగస్టు 30న నిప్పని శ్రీనివాసరావు, కౌసల్యాదేవి దంపతులకు హంపీలో జన్మించారు. సినిమాల్లోకి రాకముందు ఆమె పేరు జానాబాయి. సినిమా తెరపై సౌలభ్యంగా ఉంటుందని ఆ పేరును జమునగా మార్చారు. తండ్రి వ్యాపార రీత్యా.. గుంటూరు జిల్లా దుగ్గిరాలలో స్థిరపడ్డారు. జమున బాల్యమంతా అక్కడే గడిచింది. తల్లి దగ్గరే సంగీతం, హార్మోనియం నేర్చుకున్నారు. అప్పట్లో ప్రజానాట్యమండలి 'మాభూమి' తదితర నాటకాలను విస్తృతంగా ప్రదర్శించేది. చలాకీ జమునకు నటించటం అంటే ఇష్టం. ఆ ఇష్టాన్ని గమనించిన ప్రజానాట్య మండలి 'మాభూమి'లో కమల పాత్రకు ఆమెను ఎంపిక చేసింది. ఆవిధంగా ఆమె రంగస్థలానికి పరిచయమయ్యారు. అలవోకగా సంభాషణలు పలుకుతూ, చురుగ్గా నటిస్తున్న జమునను ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు గుర్తించి, మరింత మంచి నటిగా తీర్చిదిద్దారు. ఆయన 1953లో నిర్మించి, దర్శకత్వం వహించిన పుట్టిల్లు సినిమాలో అవకాశం ఇచ్చారు. అలా జమున వెండితెరకు పరిచయమయ్యారు. ఆ ప్రారంభ ఉత్సాహ ప్రోత్సాహాలను, ప్రజా నాట్యమండలిని ఆమె ఎప్పుడూ మర్చిపోలేదు. ప్రతి ఇంటర్వ్యూలోనూ ప్రజానాట్యమండలిని, డాక్టర్ గరికపాటిని గుర్తు చేసుకునేవారు. ప్రజానాట్యమండలి పునరుద్ధరణ సమయంలోనూ తన సహకారం అందించారు. 1965లో ప్రొఫెసర్ జూలూరి రమణారావుతో జమునకు వివాహం జరిగింది. వారికి కుమారుడు వంశీ, కుమార్తె స్రవంతి ఉన్నారు. రమణారావు తొమ్మిదేళ్ల క్రితం (2014 నవంబరు 10) గుండెపోటుతో మరణించారు.

రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, జగ్గయ్య వంటి అలనాటి అగ్రహీరోల సరసన జమున కథా నాయికగా నటించారు. శ్రీ కృష్ణ తులాభారం చిత్రంలోని సత్యభామ పాత్ర ఆమెకు బాగా పేరు తెచ్చింది. సత్యభామలోని సాహసం, చొరవ, పొగరు, అలక, ఉక్రోశం ... వంటి హావభావాల అభినయం జమునకే సాధ్యమని అందరూ అనుకునేంతగా ప్రసిద్ధి పొందారు. జమున తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో మొత్తం 198 సినిమాల్లో నటించారు. ఇందులో తెలుగు చిత్రాలు 145 కాగా, తమిళం 20, కన్నడం 7, హిందీ 10 చిత్రాలు. 1959 నుంచి సావిత్రితో పాటే వెండితెర వైభవాన్ని చూశారు.

1964లో విడుదలైన మూగ మనసులు సినిమాలకు గాను ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు అందుకున్నారు. 1968లో మరోసారి ఉత్తమ సహాయ నటిగా పురస్కారం పొందారు. మిలాన్ చిత్రంలో గౌరీ పాత్రకు బాలీవుడ్ ఫిల్మ్‌ఫేర్ లభించింది. 2008లో ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్నారు. చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చిన తొలితరం నాయిక జమున. నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఆహ్వానంతో 1980లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1989లో రాజమండ్రి నుంచి కాంగ్రెస్ ఎంపీగా గెలుపొందారు. 1991 ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. తరువాత ప్రత్యక్ష రాజకీయాలకు పూర్తిగా దూరమయ్యారు.

**సాహితీ స్రవంతి సంతాపం :** సీనియర్ నటి జమున మృతి పట్ల సాహితీ స్రవంతి తీవ్రసంతాపాన్ని ప్రకటించింది. ప్రజానాట్యమండలి ద్వారా నట జీవితాన్ని ప్రారంభించిన జమున ... ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం మెండుగా ఉన్న నటి అని సంస్థ గౌరవ అధ్యక్షులు తెలకపల్లి రవి, అధ్యక్షుడు కెంగార మోహన్ పేర్కొన్నారు. మరపురాని అనేక పాత్రలు పోషించి, ప్రేక్షకుల గుండెల్లో అభిమాన తారగా నిలిచిపోయారని నివాళ్లు అర్పించారు. ■




# సంజీవనీ లిపి .. వర్ణలిపి

- డాక్టర్ టేకుమళ్ళ వెంకటప్పయ్య
94904 40858

ప్రతి కవీ కలంతోనే కవితాసృజన చేస్తాడు. కానీ డా. పెరుగు రామకృష్ణ మాత్రం తన కలాన్ని సంజీవని పుల్లతో తయారు చేసుకున్నట్టు అనిపిస్తుంది. ఈమాట ఎందుకు అనాల్సి వచ్చిందంటే కవితలన్నీ సజీవంగా కళ్ళముందు నిలుస్తాయి. మనతో మాట్లాడతాయి. ఆప్యాయంగా కౌగలించుకుంటాయి. అన్యాయాల్ని ఎండగడతాయి. అక్రమాల్ని నిలదీస్తాయి. ప్రపంచీకరణ దుష్ఫలితాలను కళ్ళముందు సాక్షాత్కారం చేయిస్తాయి. సామాజిక 'స్థితి' గురించే కాక 'గతి' గురించి సైతం పూచీపడిన కవిత్వ సిద్ధాంతపరమైన భావజాలాన్ని హృదయాస్తమానం చేసే మానవీయ కవితలను సృజన చేస్తాడీ కవి.

ఆధునిక సాహిత్యారంభానంతరమే జీవితానికీ కవిత్వానికీ బింబ ప్రతిబింబ సంబంధం ఉంటుందన్న స్పృహ, చైతన్యం మనకు కలిగిందన్నది సత్యం. సామాజిక జీవితాన్ని విమర్శనాత్మకంగా ప్రతిబింబించాలన్న స్పృహ సాహిత్యానికి కలిగింది కూడా ఆధునిక సాహిత్యం వేళ్ళూనుకున్నాకే అనే మాటతో కూడా ఎవరికీ ఏ పేచీలేదనుకుంటాను. ఆధునిక జీవరసావేశ పదార్థమే ప్రధానంగా ఆధునిక కవిత్వమని విమర్శకులు ఈ ఆధునిక యుగారంభంలోనే చెప్పారు. ఆధునిక కవిత్వం బహుముఖీన మైనది అని విమర్శకులు అన్నారంటే దానర్థం అదొక నిర్దుష్టమైన స్వరూప స్వభావాలు లేనిదనే అర్థంలో అనుకోకూడదు. ఇది కాలవాచి కాదు కనుక ఆధునిక చేతనతో విలసిల్లే విశిష్ట లక్ష్య లక్షణ సమోపేతమైనదని అర్థం చేసుకోవలసి ఉంది.

ఈనాడు వచన కవిత్వాన్ని అద్భుతంగా ఆవిష్కరించి, కవులుగా పేరుతెచ్చుకుంటున్నవారిలో డా. పెరుగు రామకృష్ణ ఒకరు. వివిధ దేశాల కవిత్వాన్ని తెలుగులోకి తీసుకొచ్చారు. చండీదాస్ వంటి ప్రముఖ కవి కవిత్వాన్ని తెలుగులోకి అనువాదం చేసిన గ్రంథాన్ని, కేంద్ర సాహిత్య అకాడెమీ ప్రచురించింది. అలాగే తెలుగు కవిత్వాన్ని వివిధ దేశాల కవులకు రుచిపెట్టిన అంతర్జాతీయ కవిగా పేరు తెచ్చుకున్నారు. కవిత్వాన్ని 'వెన్నెల జలపాతంగా' పారించారు. 'నువ్వెళ్ళిపోయాక' అంటూ దీర్ఘ కవితలో విషాదభరితానుభవాన్ని మనముందుంచారు. ఫ్లెమింగో పక్షులతో మమేకమై వాటి భాష, ఘోష మనకు వినిపించారు. లఘుకవిత్వంతో నెల్లూరు ముంజల రుచి రసాత్మకంగా వర్ణించారు. 'పూలమ్మిన ఊరు' లో 'కాంతిదీపాలు' వెలిగించి, 'దూది పింజల వానలు' కురిపించారు. ఇప్పుడు సంజీవని కలంతో 'వర్ణలిపి' లిఖించి 30 స్వీయ కవితలను, 23 అనువాద కవితలను మనముందుంచారు. అనువాద కవితల్లో వివిధ దేశాల్లో ఉన్న గొప్పగొప్ప కవుల కవిత్వాన్ని మనకు దృశ్యమానం చేశారు.

వాటిలో ప్రథమంగా కొన్ని స్వీయ కవితలను చూద్దాం. 'బంజరును తాకి బంగరు మాగాణిగా/ మలిచే పరుసవేది చేతులు' అని, సరిహద్దుల్లో తుపాకీ పట్టి/ శత్రువును గీతకవతల తరిమినట్టు' అంటూ 'ప్రియమైన చేతులు' అనే కవితలో అద్వైతభావనతో హలం పట్టిన రైతును – గన్నుపట్టిన రౌతును కొనియాడారు. అలాంటి భావాల సమాహారమే 'దీపాల కళ్ళతో నిరీక్షణ' కూడా. గతకాలంలో సమాజంలో శ్రమజీవనులైన సామాజికులందరూ ఆహారోత్పత్తి కార్యక్రమంలో శ్రమోపశ్రమన సంజీవనిగా వ్యవసాయాన్ని ఆరాధించడం మనకు విదితమే! దేశరక్షణకు జవాన్ ఎంత ముఖ్యమో, దేశం ఆకలి తీర్చడంలో రైతుపాత్ర కూడా అంతే ముఖ్యంగా ఉంటుందన్న భావాన్ని 'తడిమీద గాయాల మొలకలెత్తకముందే/ ఆ చేతులు గెలవాలి' పొలాన్ని దున్నే చేతులనూ, శత్రువులను దునుమాడే చేతులను కాపాడుకోవల్సిన బాధ్యతను మనకు గుర్తు చేస్తూ ఒక దివ్య భావాన్ని పాఠకుల మనస్సుల్లో బలంగా నాటారు.

'జీవితమంటే జనన మరణాల జ్యోతిష్చక్రం కాదు/ జీవిత మంటే వాసంత సమీర వేణుగానం' అంటారు 'వర్ణలిపి' కవితలో. అలాగే 'మనిషే తెలుపు నలుపుల సంఘర్షణలో/ ఒక జాతి గొంతుమీద కాలైనాడు/ రంగు వివక్షలో బతుకును కాలరాస్తు న్నాడు' అంటాడు. సమాజమంటే అసంఖ్యాక మానవుల

సమాహారం. కానీ ప్రతి వ్యక్తీ విశిష్ట రూపరేఖా గుణ వాసనా భిన్నత్వంతో బతుకుతాడు. ఇంత భిన్నత్వం ద్యోతకమైనా, ఇందరినీ ఏకం చేసే జీవలక్షణం ఏమిటంటే మానవీయ రసగ్రహణానుభావ హృదయద్రవ్యం మాత్రమే! సర్వకర్మణ్యత్వాలకూ అవసరమైన ఆ చోదకశక్తి లోపిస్తే 'నేడు నీదైన కాలం రేపు మరొకది కావచ్చు' తస్మాత్ జాగ్రత్త! అంటున్నాడు కవి.

సింగమనేని నారాయణ నివాళిగా రాసిన కవిత 'శ్వేతపద్మం స్మృతిలో' 'రాయలేలిన రతనాలసీమలో/ కన్నీటి సేద్యాన్ని అక్షరాలకెత్తిన రచయిత' అని సంభావించారు. అలాగే రైతు కన్నీటిని ఫ్రేము కట్టి/ పాఠకశ్రేణి ముందు ప్రదర్శించిన కవి' అన్నారు. 'ఫ్రేము' అన్న ఆంగ్లపదంకన్నా 'పటం' అన్నపదం వాడితే ఇంకా బావుండేదేమో! అలాగే 'ఇనుపచెట్లు' అనే కవితలో 'మా చెట్టుకొమ్మల్లోని ఖాళీ గూళ్ళలో/ ఒక్క పిచ్చుకయినా కనిపించ లేదు/ పిచ్చుకలు కిచకిచల సంగీతాన్ని సృష్టిస్తేనే కదా/ చెట్లకి రోజూ పండుగ' అన్నాడు. చెట్లన్నీ ఇనుపచెట్లైపోయాయన్న ఆందోళన వ్యక్తం చేస్తారు. సెల్ టవర్ల ద్వారా వచ్చే రేడియేషనుకు ప్రకృతి నివ్వెరపోయి నిలబడిందని చూపించారు. ఇక్కడ ఆధునిక సామాజిక ఆవేదనా క్లేశాలే వస్తువుగా స్వీకరించారు. సామాజికుల నుభవించే అనంత ఆవేదనల నిశ్శబ్ద ఆక్రోశాలే కవిని ద్రష్టగా అనుకంపా హృదయునిగా నిలబెడతాయని నిరూపించారు.

'అంతిమ సేవల్లో!' కవితలో 'భుజాలపై శవాలు మోసిన/ ఆ నలుగురికీ నమస్కరిస్తున్నా!' అంటూ 'బతుకు బంధాలన్నీ క్షణంలో తెగిపోయి/ అనాధగా మిగిలిన పార్థివ దేహాల్ని/ స్వీయ చేతుల్తో స్పర్శించి, స్వయంగా అలంకరించి/ సరిహద్దు సైనికుడు భుజానికెత్తుకున్నట్టు/ ఎంత గర్వంగా భుజానికెత్తుకుంటారో?' అని ఆశ్చర్యానందాలను వ్యక్తపరచాడు కవి. బెంజమిన్ ఫ్రాంక్లిన్ "The only thing certain in life is dead and taxes" అంటాడు. జీవితంలో అత్యంత ఖచ్చితమైన విషయం ఏమిటంటే మనం ఏదో ఒకరోజు మృత్యువుతో కలవాలి. ఆరోజున ఆప్యాయంగా కవి చెప్పినట్లు 'స్పర్శించి, అలంకరించి భుజానికెత్తుకునే 'ఆ నలుగురు' కావాలి. లేకపోతే 'నగరాలు, పల్లెలు ప్రత్యక్ష శ్మశానాలయేవి/ జీవ నదుల తీరాల్లో ఇసుక దిబ్బలన్నీ సమాధులై అవతరించేవి' అనే సత్యాన్ని బహిర్గతం చేసిందీ కవిత. 'జీవితమిచట నిరావరణ నిరాభరణ నగ్నచ్ఛవి/ జీవితమిచట కామాతుర కంకాళ కరాళకేళి' అన్న బైరాగి కవితా వాక్యాలను గుర్తుచేస్తుందీ కవిత. అలాగే 'జ్వలిత దీపం' అన్న కవితలో కవి ఆంగ్ల సాంప్రదాయంగా ఆవిర్భవించిన 'బ్రేకప్' గురించి ఆవేదన వ్యక్తం చేస్తాడు. 'బ్రేకప్.. అన్న ఒక్క మాటతో/ సరస సంభాషణలు ఎప్పుడో తెగిపడ్డాయి' అంటూ 'ప్రేమది ఒక దివ్య భాష/ దానిదంతా ఒక మార్మిక కరచాలనం' అంటు న్నారు. 'జీవితానికి నిర్వచనం ఒక సర్దుబాటు అనే స్పృహ మరచి/ బతుకు అంచుమీద ఏకాంతాన్ని నాటుకోవడమేనా చివరివరకు?' అని తీవ్ర స్వరంతో ఆవేదన వెళ్ళగక్కారు. ప్రేమ, పెళ్ళి అనేవి చిన్నప్పుడు మనం ఆడుకున్న బొమ్మలాట కాదు. ఆట అయి పోగానే ఎవరింటికి వాళ్ళు వెళ్ళిపోవడానికి. దానికీ ఒక పవిత్రత ఉండాలంటాడు కవి. సమకాలీన ప్రభావం నుంచీ, కాలానుభవం నుంచీ ఏ ఉత్తమ కవీ పలాయనం చేయలేదని నిరూపిస్తూ, ఏదో ఒక స్థాయిలో, కవిత్వం తెలీకుండానే ఈ అనుసంధానతను ప్రదర్శిస్తూ ఉంటుందని మనకు నిరూపిస్తుంది.

అనువాద కవితల విషయానికొస్తే 'తోక కుక్కను ఊపుతుంది' అనే శీర్షికతో ప్రముఖ ఉక్రెయిన్ కవి లుడ్మిలా ఖెర్సోన్స్కీ రాసిన కవితకు, కేటీ ఫారిస్, ఇలియా కమిన్స్కీ చేసిన ఆంగ్ల కవితను కవి ఆంధ్రానుసరణ చేశారు. ఇదంతా ఒక అధివాస్తవికత (సర్రియలిజం) కవితలా అనిపించినా దీన్ని 'మ్యాజిక్ రియలిజం' అనికూడా అనుకోవచ్చు. వాస్తవాన్ని అటూ ఇటూ తారుమారు చేయడం అనే ప్రక్రియ. దీన్లో 'పార సమాధి త్రవ్వేవాడి మదిలో రంధ్రం చేస్తోంది' అనడం, 'తుంటి నర్తకిని ఊపుతోంది అనడం, 'తెడ్డు పడవలోని ప్రతి వ్యక్తిని నడుపుతుంది' అనడంతో కవితను ముగించారు. సంగీతానికిలాగే కవిత్వానికి కూడా ఓ హ్రస్వలిపి ఉంటుందని పెద్దలు చెప్తారు. సమర్ధుడైన కవి అమేయ భావ బంధురత్వాన్ని తనదైన శైలిలో హ్రస్వలిపితో నిక్షిప్తం చేస్తాడు. అనువాద కవితల్లో కవి నాడి, హృదయం సరిగా పట్టుకుని అనుశీలన చేయగలిగితేనే పండుతుంది. గత కొన్ని దశాబ్దాలుగా ఈ అనువాదాలు అద్భుతంగా పండిస్తూ అంతర్జాతీయ కవిగా పేరు తెచ్చుకున్న కవికి ఇలాంటివి అలవోకగా రాస్తాడనడంలో ఆశ్చర్యం ఏముంటుంది? అలాగే 'మార్గమధ్యంలో' అనే కవిత పాకిస్తాన్‌కు చెందిన మహమ్మద్ షానజర్ అనే కవి ఆంగ్లంలో రాసిన దాన్ని తెనిగించారు. ఇది ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధకాండను విశదీకరిస్తుంది. ఒక బాలుడు ఏమంటున్నాడో చూడండి. 'అమ్మా! ఎంత బాధగా ఉంది!/ మనం చిలుకల పంజరం విప్పలేదు/ అవి ఇప్పటికి అక్కడే ఉన్నాయి/ వాటికి ధాన్యం, నీరు ఎవరిస్తారు?' అంటూ కొనసాగిస్తూ 'అమ్మా! మా నాన్న ఎక్కడ?/ అతడు మనవెనకాలే వస్తున్నాడన్నావ్?' అంటాడు తన తల్లితో. ఆ తల్లి ఎంత బాధామయ పరిస్థితిని ఎదుర్కున్నదో అని హృదయం ఆర్ధ్రమౌతుంది. ఆ పసిపిల్లవానికి ఏమని సమాధానం ఇవ్వగలదు? ఎలా ఓదార్చగలదు? పిల్లవాడు తల్లి దుఃఖించడం గమనించి 'నేను ఆడిన నాఇల్లు మరియూ వీధులు/ పొగబారినా/ మనం అందులో మళ్ళీ వెలుగులు చూస్తామనే ఆశిస్తున్నాను!' అన్న బాలుడి ఆశావాద దృక్పథంతో ముగించారీ కవిత. అలాగే 'ఒక ఫాంటసీ' అనే కవిత ఇటీవల నోబుల్ బహుమతి పొందిన లూయిస్ ఎలిజబెత్ గ్లూక్ రాసిన ఆంగ్ల కవితకు అనువాదం. 'నేను మీకు తెలుపుతాను/ ప్రతిరోజూ ప్రజలు చస్తున్నారు...ఇది/ కేవలం ప్రారంభమే../ ప్రతిరోజూ అంత్యేష్టి స్థలాల్లో/ కొత్త విధవలు పుడుతున్నారు' అంటాడు కవి. ఇక్కడ ఒక్క విషయం చెప్పాలి. కవిత 'నేను' అంటూ ప్రారంభి ంచారు. ఆధునిక కవిత్వంలో 'నేను' అనే స్వీయాత్మక

సర్వనామాన్ని ప్రయోగించవచ్చా? అనే సంశయం గతంలో కొంత గందరగోళాన్ని రేపింది. ఈ 'నేను' స్వాత్మకానుభూతి అభివ్యక్తికైతే తప్పులేదు కాని, పరోత్మాకాభివ్యక్తి ప్రధానమైన సామాజిక వాస్తవికతా కవితలకు వాడడం నిషిద్ధమని కొందరు విమర్శకులు వాదించారు. ఇలాంటి వాదనలకు అంతర్జాతీయ కవులైన మాయ్ కోవిస్కీ, స్టీవెన్ స్పెండర్ వంటి వారి కవితలుగూడా నెల వయ్యాయి. ఇక్కడ 'నేను' సామూహిక అహాన్ని ప్రతిబింబిస్తుందే తప్ప వ్యక్తిగత అహానికి పరిమితం కాదు. కవి ఇక్కడ సమస్త ప్రజానీకం గురించి చెప్తున్నాడు కనుక 'నేను' వాడడం తప్పేమీ కాదు.

చివరిగా, మహాకవి షెల్లీ ఓడ్ టు లిబర్టీ అనే కావ్యంలో "Within the surface of times floating river/ Its wrinkled image lies, as when it lay/ Immovably unquiet, and forever/ It trembles, but cannot pass away!" అంటాడు. అంటే మహాకాల వాహినిలో తేలివచ్చిన అనేక స్మృతి తరంగాలు కలవర పరుస్తుంటాయి. అందులో కొన్నింటిని మాత్రమే సంగ్రహించ గలుగుతారు కవులు. కొన్ని అలవోకగా మనస్సు ఉపరితలం పైకి చేరి నర్తిస్తుంటాయి. గతానుభవ పరంపర యావత్తూ ఒక సంపదగా అందుకోవాలని ఎంత ప్రయత్నించినా అందదు. మానవానుభవసారం – సంకీర్ణమౌతుంది. కొస వెలుతురులు మాత్రమే ప్రదర్శించి అంతర్ధానమౌతుంది. అట్టి స్థితిలో కవిత్వ మొక్కటే కాంచన చేలమందిస్తుంది. ఇతరేతర సాహిత్య ప్రక్రియలెన్ని ఆవిర్భవించినా, కవిత్వావసరాన్ని కవిత్వం తప్ప వేరొక ప్రక్రియ తీర్చలేదన్నది సత్యం. డా.పెరుగు రామకృష్ణ కవిత్వం చదివితే, కవిత్వమే పాఠకుణ్ణి అంతర్ముఖీనుడిగా మార్చగలదనే విషయాన్ని మరోసారి రూఢి చేస్తుంది. కవిత్వంలో డా.రామకృష్ణ ఆదినుంచీ పెరుగుతూనే ఉన్నాడు. 'పెరుగు–పరుగు' కవిత్వంలోని అంతర్నిభిడంగా ప్రచలితమయ్యే సంగీత శృతులను అందుకోవడానికి యత్నించడమే పాఠకుడు చేయ వలసిన పని. ■

**'నాగలికి నా నమస్కారం' నానీల సంపుటిని గుంటూరులో జనవరి మూడోవారంలో ఆవిష్కరించారు. ప్రముఖ కవయిత్రి డా. చిల్లర భవానిదేవి పుస్తకాన్ని ఆవిష్కరించగా, కవి సోమేపల్లి వెంకటసుబ్బయ్యతో పాటు చలపాక ప్రకాష్, వి. నాగరాజ్యలక్ష్మి, ఎన్.వి. కృష్ణారావు, ఎస్ ఎం. సుభానీ పాల్గొన్నారు. గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.**

# వికాసం

**తో**టలో పూలు విరగపూసాయి
ఒక్కో పూవుది ఒక్కో పుట్టుక
ఒక్కో చరిత్ర ఒక్కో గాథ

గాథలు విందామని వెళ్ళా
అడుగులు తడబడుతున్నాయి
పూవు పూవుకి వైరుధ్యం
పూల భావాలు వెదజల్లుతుంటే
పరిమళాలతో తబ్బిబ్బై పోయాను

అన్ని పూలను తాకలేదు
తాకే కాలం లేదు అనడం కన్నా
చక్ర త్వరణం ఎక్కువని చెప్పాలేమో!
పూలు పూజ కోసం కాదు
పూలు వికాసం కోసమని!
కొందామని చేతిలోకి తీసుకోగానే
భగ్గున మండిపోయిన ధర!
పూలని చూస్తుంటే వదలాలని లేదు
జేబులో పైకం చాలక వదిలేసా!

ఎన్నడూ లేనిదిలా
మండుతుందేమని మీమాంసలో
సమకాలీన అంశాలు మదిలో మెదులుతుంటే
మూలం తెలిసింది
పూల సృష్టి కోసం ఎరువు వెల పెరిగేనని!

నాకు నచ్చిన ఆ పూలు
కలం పురిటి నొప్పుల్లో పురుడు పోసుకున్న
అక్షరాలు!
అచ్చుకో కాగితం కావాలి!
కలం పై పన్ను కాగితం పై పన్ను వెరసి
అక్షరం సామాన్యుని చేరనీయని కుట్ర

అబద్దాల జాతరలో
నిజం తూటాలా దిగాలంటే
ఇక గళాలే పిక్కటిల్లాలా!

**- గిరిప్రసాద్ చెలమల్లు**
**94933 88201**

## విశాఖలో వేమన పద్యాల పఠనం

ప్రజాకవి వేమన జన్మదిన వేడుకలు సందర్భంగా 21.1.2023 వ తేదీ ఉదయం విశాఖలోని కంచర పాలెం ఓల్డ్ ఐటీఐ విద్యార్థులతో వారి సభా మందిరంలో ప్రొఫెసర్ ఉమా దేవి అధ్యక్షతన ఒక పరిచయ కార్యక్రమం నిర్వహించారు. 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విశ్రాంత ఎస్పీ (కేంద్ర సిఐడి) సత్తి సునీల్ రెడ్డి ప్రధాన వక్తగా, పెంటకోట రామారావు, పొలమరసెట్టి ఫ్రాన్సిస్, ప్రొఫెసర్ ఆనంద శర్మ (సాహితీ స్రవంతి) వక్తలుగా పాల్గొని వేమన పద్యాలు – తాత్పర్యాలు విడమర్చి చెప్పారు. సభ ప్రారంభంలో ప్రొఫెసర్ ఉమ వక్తలను పరిచయం చేశారు. సునీల్ రెడ్డి యోగి వేమన పదాల గొప్పదనం వివరించారు. ఆనాటి సాంఘిక దురాచారాలు ఖండిస్తూ పండిత పామరులకు కూడా అర్థమయ్యేట్టు చిన్న చిన్న పద్యాలతో వేమన గొప్ప గొప్ప సందేశాలు ఇచ్చారని వివరించారు. పెంటకోట రామారావు, పొలమరశెట్టి ఫ్రాన్సిస్, ప్రొఫెసర్ ఆనంద శర్మ ... వేమన ప్రగతిశీల భావాలపై వివరించారు. తరువాత వేమన పద్యాలను చూడకుండా చెప్పిన విద్యార్థులందరికీ సునీల్ రెడ్డి బహుమతులు అందజేశారు.



వేమన పద్యాల ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరిస్తున్న సునీల్ రెడ్డి

**కదిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ...**

సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేమన జయంతిని నిర్వహించారు. సాహితీ స్రవంతి ఉపాధ్యక్షులు పిల్లా కుమారస్వామి మాట్లాడుతూ, వేమన సమాజంలోని మూఢ విశ్వాసాలను, సామాజిక రుగ్మతలను ఖండిస్తూ అనేక పద్యాలను చెప్పాడన్నారు. కులము చేత, విద్య చేత విర్రవీగువారు సంపద గలవాని బానిస కొడుకులని ఎద్దేవా చేశారని అన్నారు. నేడు మనువాదులు మతం పేర అనేక వైషమ్యాలను సమాజంలో పెంచుతున్నారని, వాటిని వేమన స్ఫూర్తితో అడ్డుకోవాలని అన్నారు. తెలుగు ఉపన్యాసకులు శ్రీనివాసులు మాట్లాడుతూ వేమన పద్యాలు ప్రజల నాల్కల పై కదలాడుతున్నాయన్నారు. బ్రౌన్ పరిశోధనల ఫలితంగా ఆయన పద్యాలు అనేక ప్రపంచ భాషల్లోకి అనువాదమయ్యాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ స్మిత మాట్లాడుతూ వేమన పద్యాలను ప్రతి విద్యార్థి నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు వేమన పద్యాలను గానం చేశారు. కళాశాల ఉపన్యాసకులు రమణ, అలీ, సుందరమోహన రెడ్డి పాల్గొన్నారు.



కదిరి : విద్యార్థులకు వేమన సాహిత్యం గురించి వివరిస్తున్న శ్రీనివాసులు

**తిరుపతిలో...**

వేమన జయంతి ఉత్సవాలు తిరుపతి పరిధిలోని పది ఉన్నత పాఠశాలల్లో జరిగింది. జనవరి 28న జరిగిన వేమన పద్యం – భావం పోటీలో బాలికల పాఠశాలలో 63 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నెమిలేటి కిట్టన్న, నడ్డి నారాయణ పర్యవేక్షించారు. బహుమతి ప్రదాన సభలో టెంకాయల దామోదరం, ఆకుల మల్లేశ్వరరావు, ఓట్ర ప్రకాష్‌రావు, జబ్బార్, విష్ణు వర్ధనం, రమాదేవి, మల్లవరం నాగార్జున, కృష్ణ స్వామి రాజు, ఇమామ్ తదితరులు మాట్లాడారు. వేమన పద్యాలు నేటికీ అనుసరణీయం అని అన్నారు.



తిరుపతి : విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న వెంకట రమణ

## 12 మంది తెలుగు వారికి పద్మ పురస్కారాలు

దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డులను కేంద్రం జనవరి 25న ప్రకటించింది. ప్రతి ఏటా రిపబ్లిక్ డేను పురస్కరించుకుని వివిధ రంగాల్లో విశేష ప్రతిభ చూపినవారికి ఈ అవార్డులు ఇవ్వడం ఆనవాయితీ. ఈ ఏడాది 106 మందికి పద్మ అవార్డులు ప్రకటించారు. అందులో 6 పద్మ విభూషణ్, 9 పద్మ భూషణ్, 91 పద్మశ్రీ అవార్డులు. తెలుగు రాష్ట్రాల నుంచి 12 మందికి పద్మ పురస్కారాలు వరించాయి. తెలంగాణ నుంచి ఇద్దరికి పద్మభూషణ్, ముగ్గురికి పద్మశ్రీ అవార్డులు దక్కాయి. ఏపీ నుంచి ఏడుగురిని పద్మశ్రీ అవార్డులకు ఎంపిక చేశారు. తెలంగాణ నుంచి చినజీయర్ స్వామి, కమలేశ్ డి పటేల్ పద్మభూషణ్ పురస్కారానికి ఎంపికయ్యారు. మోదడుగు విజయ్ గుప్తా (సైన్స్ అండ్ ఇంజినీరింగ్), హనుమంతరావు పసుపులేటి (మెడిసిన్), బి.రామకళష్టారెడ్డి (ఎడ్యుకేషన్)లకు పద్మశ్రీ ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి కళారంగంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, సీవీ రాజు, కోటా సచ్చిదానంద శాస్త్రిలను పద్మశ్రీ వరించింది. గణేశ్ నాగప్ప కఅష్ణరాజ నగరా, అబ్బారెడ్డి నాగేశ్వరరావులకు సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో పద్మశ్రీ వచ్చింది. సాహిత్యంలో ప్రకాశ్ చంద్రసూద్‌కు, సామాజిక సేవకుగాను సంకురాత్రి చంద్రశేఖర్‌కు పద్మశ్రీ పురస్కారం దక్కింది.

## 2020 తెలుగు వర్సిటీ సాహితీ పురస్కారాలు

తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2020 సంవత్సరానికి సాహితీ పురస్కారాలను ప్రకటించింది. పద్యకవితా ప్రక్రియలో కుంతీపురం కౌండిన్య తిలక్ (మహా పరిణయము), వచన కవితా ప్రక్రియలో అఫ్సర్ (ఇంటివైపు), బాలసాహిత్యంలో పుప్పాల కృష్ణమూర్తి' (వెన్నెల వాకిలి), కథానికా ప్రక్రియలో జి.వెంకట కృష్ణ (దేవరగట్టు), నవలా ప్రక్రియలో నేరెల్ల శ్రీనివాస్ గౌడ్ (దుల్దుమ్మ), సాహిత్య విమర్శలో సంగిశెట్టి శ్రీనివాస్ (దుర్భిణి), నాటక ప్రక్రియలో అద్దేపల్లి భరత్ కుమార్ (నవ్వించే నాటికలు), అనువాదంలో ఎ. ఎం. అయోధ్యారెడ్డి (ఏడవకు బిడ్డా), వచన రచన విభాగంలో పి.భాస్కరయోగి (హిందువుల పండుగలు), గేయ కవిత్వంలో వడ్డె ముద్దంగుల ఎల్లన్న (సబ్బండవాదం), రచయిత్రి ఉత్తమ గ్రంథం విభాగంలో మందరపు హైమవతి (నీలిగోరింట) గ్రంథాలు సాహితీ పురస్కారానికి ఎంపికయ్యాయని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ తెలియజేశారు. త్వరలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో జరిగే ప్రత్యేక ఉత్సవంలో పురస్కారాలు ప్రదానం చేస్తామని, ఒక్కొక్కరికి 20,116 ల నగదు అందజేసి సత్కరిస్తామని తెలిపారు.

## కాకినాడలో అద్దేపల్లి వర్ధంతి సభ

ప్రజాకవి, నిత్యసాహితీ సంచారి డా.అద్దేపల్లి రామ మోహనరావు 7వ వర్ధంతి సభ కాకినాడ గాంధీభవన్‌లో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన జనవరి 13వ తేదీన జరిగింది. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డా. జోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సభ్యులు అద్దేపల్లి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. గరికపాటి మాస్టారు అద్దేపల్లిపై రాసిన గేయాన్ని, అద్దేపల్లి రాసిన గజల్‌ను మేడిశెట్టి శ్రీరాములు గానం చేశారు. ఒకే వ్యక్తి కవి, పండితుడు, వక్త, గురువు, ప్రోత్సాహకుడు, స్నేహశీలి కావటం ఒక అరుదైన విషయమని, అద్దేపల్లి అలాంటి ఒక అరుదైన వ్యక్తి అని డా. కృష్ణబాబు అన్నారు.

ముఖ్యవక్త కెంగార మోహన్ ప్రపంచీకరణపై అద్దేపల్లికి సంబంధించిన రచనల్ని, ముఖ్యంగా వారి 'కాలంమీద సంతకం' అనే కవితా సంపుటిలోని అంశాలను విపులంగా సమీక్షించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, పసుమర్తి పద్మజవావాణి, కొత్త శివ, సాయి సత్యనారాయణ, సాహితీ స్రవంతి నగర అధ్యక్షులు మార్ని జానకిరామ చౌదరి అద్దేపల్లితో తమ అనుబంధాన్ని స్మరించుకొన్నారు. కార్యక్రమంలో గౌరినాయుడు, గరికపాటి మాస్టారు, అద్దేపల్లి ప్రభు, ఇంద్రగంటి, రామస్వామి, ఉండవల్లి, జ్యోతి, ఇందిర, ప్రభాకరవర్మ, సయ్యద్ సాలార్, కృష్ణారావు, చింతపల్లి సుబ్బారావు, డా.కొంపెల్ల, అశోక్ కుమార్, విష్ణు తదితర కవులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కెంగార మోహన్, వేదికపై గనారా, జోస్యుల కృష్ణబాబు



అద్దేపల్లి రామ్మోహనరావు చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న శివ, అద్దేపల్లి ప్రభు, జానకీరామ్ చౌదరి, మోహన్, కృష్ణబాబు, పద్మజారాణి, గనారా, మధునాపంతుల, ఇందిర, జ్యోతి తదితరులు

## తెలుగుజాతి గర్వించదగ్గ కవి 'అడిగోపుల'



తెలుగుజాతి గర్వించదగ్గ కవి అడిగోపులు అని వక్తలు అన్నారు. విశ్వశ్రీ సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశ మందిరంలో 24.1.2023వతేదీన అడిగోపుల వెంకటరత్నం 27వ కవితా సంపుటి కొత్త గాలి ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభకు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా, పుస్తకావిష్కర కర్తగా శ్వేత సంచాలకులు ఎ.ప్రశాంతి విచ్చేశారు. ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి పుస్తక సమీక్ష చేశారు. 'తెలుగులో గత 50 ఏళ్ల చరిత్ర రాయాలంటే అడిగోపుల 27 కవితా సంపుటాలు చాలు. ఆయన తెలుగుజాతి గర్వించదగ్గ కవి' అని అన్నారు. 'అడిగోపుల కవిత్వంలో ఎన్నో పీహెచ్ డీలు చేసేంత విషయ వస్తువు వుంటుంది. ఆయన నిరంతర కవి, ఆధునిక రసజ్ఞత తెలిసిన కవి. ఆయన కవిత్వంలో ప్రజల్ని కలిపే శక్తి వుంది. తెలుగులో ఉన్న అతి కొద్దిమంది సమగ్ర కవుల్లో ఆయనొకరు' అని పేర్కొన్నారు. డాక్టర్ గాలి గుణశేఖర్ నాయుడు మట్లాడుతూ– అడిగోపుల కవిత్వాన్ని చదువుతుంటే తమిళ కవి కన్న దాసన్ గుర్తుకొస్తాడని అన్నారు. డాక్టర్ పి.సి. వెంకటేశ్వర్లు కూడా మాట్లాడారు. చివరిగా అడిగోపుల తనకు చేసిన సన్మానానికి స్పందిస్తూ తన కవిత్వం ఎందరో కవి పండితుల నుంచి సామాన్యుల వరకు మన్నన పొందడం తనకు సంతృప్తిని ఇచ్చే విషయమని అన్నారు. ఇంకా జి. సుబ్రహ్మణ్యం, సురేందర్ రొద్ద, కలువగుంట రామ్మూర్తి, అడిగోపుల కవిత్వం గురించి ప్రసంగించారు. ఆకుల మల్లేశ్వర రావు, జయరామ్ ప్రసాద్, అంకమ నాయుడు, ఆముదాల మురళి, నెమిలేటి కిట్టన్న, ఆర్సికె రాజు, షణ్ముగం, టెంకాయల దామోదరం, ఆచార్య రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కథా సంపుటాలకు ఆహ్వానం

సాహితీ స్రవంతి కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శిగా, కవిగా, కథకుడుగా సాహిత్య వికాసానికి కఋషి చేసిన తెలుగు ఉపాధ్యాయుడు సంకటి మహేశ్వరయ్య. ఆయన స్మారక సాహిత్య పురస్కారాన్ని ఏటా ఇవ్వాలని సాహితీ స్రవంతి జిల్లా కమిటీ నిర్ణయించిన నేపథ్యంలో– 2022 సంవత్సరానికి గానూ కథాసంపుటాలను ఆహ్వానిస్తున్నాం. కథకులు 2022లో వెలువడిన తమ కథా సంపుటాలను 3 ప్రతులు పంపాలి. ఎంపికైన కథకులకు రూ.5000 నగదు, జ్ఞాపికతో సత్కారం ఉంటుంది. కథా సంపుటాలను 2023 మార్చి 15 లోగా 'కెంగార మోహన్, ఇ.నెం.43–238, ఫ్లాట్ నెం:102, ఎస్వీఆర్ ప్లాజా, రోడ్ నెం:8 ఎన్.ఆర్ పేట, కర్నూలు–518004' చిరునామాకు పంపాలి. వివరాలకు 9493375447 నెంబర్లో సంప్రదించొచ్చు. 27.04.2023న కర్నూల్లో జరిగే మహేశ్వరయ్య ద్వితీయ వర్ధంతి సభలో పురస్కార ప్రదానం ఉంటుంది.

## జయరాజు, కె శ్రీనివాస్‌లకు మఖ్దూమ్ పురస్కారం

హైదరాబాదు సిటీ కాలేజీ మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కార (2022, 2023) ప్రదానోత్సవ సభ మఖ్దూమ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 4 శనివారం ఉదయం 10.30 గంటలకు కళాశాల గ్రేట్ హాల్లో జరుగుతుంది. 2022 పురస్కారం జయరాజుకు, 2023 పురస్కారం కె.శ్రీనివాస్‌కు ప్రదానం చేస్తారు. పురస్కార గ్రహీతలకు ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపిక, రూ.10 వేల నగదు అందజేస్తారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.బాలభాస్కర్ అధ్యక్షతన జరిగే సభలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మీడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ, తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య తంగెడ కిషన్ రావు, డా.యాకూబ్ అతిథులుగా పాల్గొంటారు.

## 12న అరుణ్ సాగర్ స్మారక పురస్కార ప్రదానం

ప్రముఖ కవి, విలక్షణ జర్నలిస్టు అరుణ్ సాగర్ పేరిట ఇచ్చే పురస్కారాలను ఈ సంవత్సరం ప్రముఖ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, ప్రముఖ కవయిత్రి కుప్పిలి పద్మకు అందజేయనున్నారు. ఫిబ్రవరి 12వ తేదీ ఉదయం 10.30 గంటలకు భద్రాచలంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్లో నిర్వహించే కార్యక్రమంలో అవార్డుల ప్రదానం ఉంటుంది. అల్లం నారాయణ, తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు, జూలూరు గౌరీశంకర్, గోరటి వెంకన్న, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, ఘంటా చక్రపాణి, కె.శ్రీనివాస్, వర్ధెల్లి మురళి తదితరులు పాల్గొంటారు.

## డా. పుట్ల హేమలత స్మారక పురస్కారాలు

**2023** సంవత్సరానికి గానూ డా.పుట్ల హేమలత స్మారక పురస్కారం రచయిత్రి అరుణ గోగులమండ, జర్నలిస్ట్ తులసి చందులకు ప్రకటించారు. ఫిబ్రవరి 9న హేమలత వర్ధంతి సందర్భంగా ఈ పురస్కారాలు అందిస్తామని మనోజ్ఞ సాంస్కృతిక సాహిత్య వేదిక అధ్యక్షురాలు ఎండ్లూరి మానస తెలిపారు. రచయిత్రి పుట్ల హేమలత పేరు మీద 2019 నుంచి వివిధ రంగాల్లో కృషి చేస్తున్న మహిళలకు ఈ పురస్కారాలు ఇస్తున్నారు.

## 14వ జాతీయ స్థాయి 'సోమేపల్లి' చిన్న కథల పోటీ

రమ్యభారతి ఆధ్వర్యంలో ఈ ఏడాది కూడా సోమేపల్లి జాతీయ స్థాయి కథల పోటీ నిర్వహిస్తున్నాం. అత్యుత్తమ కథకు రూ.2500, ఉత్తమ కథకు రూ.1500, మంచి కథకు రూ.1000, ప్రత్యేక బహుమతులు రూ.500 చొప్పున ఇద్దరికి ఇవ్వనున్నాం. రచయితలు పంపే కథలు రాతలో రెండు నుంచి 4 పేజీలలోపు, డిటిపిలో అయితే 2 పేజీలు దాటరాదు. ఒకరు ఎన్ని కథలైనా పంపవచ్చు. హామీపత్రంపై మాత్రమే రచయిత వివరాలు పేర్కొనాలి. కథలను ఫిబ్రవరి 28వ తేదీలోపు రమ్యభారతి, పి.బి.నెం.5, 11–57/1–32, జె.ఆర్.కాంప్లెక్స్, రెండవ అంతస్తు, రజక వీధి, విజయవాడ–520001 (సెల్:9247475975) అనే చిరునామాకు పంపాలి.

**– చలపాక ప్రకాష్, సంపాదకుడు, రమ్యభారతి**

# శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి


జననం : 23.04.1891 మరణం : 25.02.1961



వడ్లగింజలు, అరికాళ్ళకింద మంటలు, కీలెరిగి వాత,
కలుపు మొక్కలు, గులాబీ అత్తరు వంటి వీరి కథలు సుప్రసిద్ధం.
వీరపూజ, మిథునామనురాగము,
శ్మశానవాటిక, అనాథ బాలిక, రక్షాబంధనము వంటి
రచనలు చేశారు. 'అనుభవాలూ-జ్ఞాపకాలు'
పేరుతో రాసిన స్వీయ చరిత్ర ప్రసిద్ధ పుస్తకం.

SAHITYA PRASTHANAM ■ SAMPUTI - 4 ■ SANCHIKA - 5 ■ KRISHNA ■ February 2023
RNI NO.APTEL/2004/18396 ■ Postal Regd. No.VJ/187/2023-25 PAGES : 68
Date of Posting : 1st & 2nd of Every Month ■ Date of Publication : 27.01.2023

# ఇది పునఃప్రస్థానం !



**ఫిబ్రవరి 21**న తెలుగు సాహిత్యంలోనూ, పుస్తక జగత్తులోనూ అపూర్వ ఘటన జరగనుంది. మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానం మార్మోగనుంది. మరో ప్రపంచం మహా ప్రపంచం ధరిత్రి నిండా నిండింది అన్న ఆయన వాక్యాలు నిజం కాబోతున్నాయి. తన పాటలు ప్రజలు పాడుకునే మంత్రాలు కావాలన్న మహాకవి ఆకాంక్ష ఫలించబోతున్నది.

## ఈ ఏడాది రెడ్‌బుక్స్ డే ఎంపిక మహాప్రస్థానం !
## ఎంత చక్కటి నిర్ణయం !

నవభావాలనూ, నవ్యభాషా ప్రయోగాలనూ తెలుగు కవిత్వంలో ప్రవేశపెట్టడమే కాదు, అందుకోసం పదసంపదనూ సృజించిన అపురూప కావ్యం, అక్షర ఫిరంగి అది. గతితార్కిక భౌతిక వాదాన్ని అంత సూటిగా సులువుగా అక్షరాలతో ఆవిష్కరించిన కావ్యం మనను 'పదండి ముందుకు' అని ఉద్యమాలకు ఉద్యుక్తులను చేస్తుంది. ఏడవకండేడవకండంటూ మనలో స్తబ్దతను తరిమికొట్టి సజీవం చేస్తుంది. నదీనదాలు, అడవులు, కొండలు, ఎడారులు మనకు అడ్డంకి కాదంటుంది. కనపడలేదా ఎర్రబావుటా నిగనిగలని నిగ్గదీస్తుంది! వికసించిన విద్యుత్తేజం మనలో నింపుతుంది. మానవుడా ... మానవుడా అని పలకరిస్తుంది. కాదేదీ కవితకనర్హం అని కలాన్ని కదం తొక్కిస్తుంది. పీడించే సాంఘిక ధర్మం ఇంకానా.. ఇకపై చెల్లదని ప్రకటిస్తుంది.

అందుకే మహాప్రస్థానం మన చరిత్రలో, మన భావాల్లో భాగం. తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమానికి అంకురార్పణ జరిగిన ఏడాదే అంటే – 1933లోనే శ్రీశ్రీ జయభేరి మోగించడం యాదృచ్ఛికం కానేకాదు. ఆ విధంగా ఇది దానికి తొంభయ్యవ వార్షికోత్సవం. ఆయన తొలి రచన ముద్రణ జరిగిన 1924కు ఇది శత వార్షికోత్సవం. ప్రతిఏటా జరిగే రెడ్‌బుక్స్ డే సందర్భంలో మనమంతా ఎక్కడికక్కడ మహాప్రస్థానం చదవడం ద్వారా దానికి జేజేలర్పిద్దాం.

## మీరెవరైనా కావచ్చు, ఎక్కడైనా వుండొచ్చు

మహాప్రస్థానం అభిమానులైతే – మంచి పుస్తకాలను ప్రోత్సహించాలనే పుస్తక ప్రియులైతే – చరిత్రలో నిలిచిపోయిన ఘన వారసత్వాన్ని మరోసారి చాటి, అభ్యుదయం అజేయమని ప్రకటించాలనుకుంటే –

**మహా ప్రస్థానం చేతిలోకి తీసుకోండి. మీకు నచ్చిన గేయం చదవండి. రికార్డు చేసి పంపండి.** లేదంటే ఫిబ్రవరి 21న మాతో గొంతు కలపండి. ఆ కావ్యంతో మీ అనుబంధం పంచుకోండి. ఆ కావ్యం తెలుగువారి సాంస్కృతిక జీవితంపై ప్రసరించిన మహత్తర ప్రభావాన్ని నిక్షిప్తం చేయండి. దీర్ఘశృతిలో, తీవ్ర ధ్వనితో విప్లవ శంఖం వినిపిస్తుందని హెచ్చరించండి.

మంచి కథైనా, కవిత్వమైనా, కావ్యమైనా సమాజ విముక్తికి దోవచూపడం, దోహదం చేయడం తప్పదని మహాప్రస్థానం సాక్షిగా మళ్లీమళ్లీ చాటండి. **ఇది పునఃప్రస్థానం !**